అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి : 35 సంచిక : 5 జూలై-ఆగస్టు 2012

వెల : రు. 20/- (293)

కా. గోరు మాధవరావుకు
అరుణారుణ జోహార్లు!

వాడి కలను కల్లలు చేయడానికి
మా అడవికి యుద్ధతంత్రాన్ని బోధిస్తున్నాం
మా పువ్వులకు పోరు పరిమళాలను అద్దుతున్నాం
మా పిట్టలకు ఎర్రజెండాలై ఎగరడం నేర్పుతున్నాం
రండి మీరూ చేతులు కలపండి
మట్టి పరిమళాలనూ,
పిల్లలనూ, పిట్టలనూ
కాపాడుకుందాం!

\- మిడ్కో

కా. బి.ఎస్.ఎ. సత్యనారాయణకు
అరుణారుణ జోహార్లు!

ప్రకటన :

రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను నిషేధించడం రాజ్యాంగ వ్యతిరేకం

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకించడం, విప్లవ జనతన సర్కార్‌కు సంఘీభావం ప్రకటించడం ప్రజాస్వామిక హక్కు...

విరసంకు ఆర్‌డిఎఫ్ భావజాలంతో పూర్తి ఏకీభావం ఉన్నది

రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్.డి.ఎఫ్) ను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించడం రాజ్యాంగ వ్యతిరేకం. సిపిఐ మావోయిస్టు పార్టీపైన, దాని అనుబంధ సంఘాల పైన నిషేధాన్ని కొనసాగిస్తూ ఈ నెల 9వ తేదీన ఆ జాబితాలో ఆర్‌డిఎఫ్‌ను కూడా చేర్చారు. నిషేధపు నోటిఫికేషన్‌లో - ఆర్‌డిఎఫ్ పోలీసు కూంబింగ్‌ను వ్యతిరేకిస్తోందని, మావోయిస్టు రాజకీయ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈ పనులు చేయడం ఎంత మాత్రం చట్ట వ్యతిరేకం కాదు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగమే. ఆదివాసులపై భారత ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ యుద్ధాన్ని వ్యతిరేకించాలని, మావోయిస్టుల నాయకత్వంలో దండకారణ్యంలో నిర్మాణమవుతున్న జనతన సర్కార్‌కు సంఘీభావం ప్రకటించాలని ఆర్‌డిఎఫ్ దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. ఇది రాజకీయ, భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగం. మావోయిస్టు ఉద్యమానికి మద్దతు కూడగట్టడాన్ని చట్టవ్యతిరేక చర్యగా చిత్రించి ఒక సంఘం మీద నిషేధం విధించడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం. ఆర్‌డిఎఫ్ వలె విరసం కూడా ప్రజలపై పాలకులు చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నది. విప్లవ జనతన సర్కార్‌కు మద్దతు ప్రకటిస్తున్నది. బహుళజాతి కంపెనీలకు ఆదివాసీ ప్రాంతాల్లోని సహజ వనరులను దోచి పెట్టడానికే అమెరికా కనుసన్నల్లో కేంద్రం గ్రీన్‌హంట్‌ను ప్రారంభించిందని, విధ్వంసకర సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాకు ప్రత్యామ్నాయంగా మావోయిస్టులు జనతన సర్కార్‌ను నిర్మిస్తున్నారనే ఆర్‌డిఎఫ్ రాజకీయ, తాత్విక విశ్వాసంతో విరసంకు పూర్తి ఏకీభావం ఉంది. దేశవ్యాప్తంగా ఎందరో ప్రజాస్వామికవాదులు, రచయితలు కూడా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తున్నారు. రాజకీయ విశ్వాసాలను, ప్రచారాన్ని నిషేధించలేమని న్యాయస్థానాలు చాలాసార్లు ప్రకటించాయి. అయినా ప్రభుత్వం నిషేధాలతో ప్రజల రాజకీయ స్వేచ్ఛను, సంఘాలు పెట్టుకునే హక్కును అడ్డుకోవడం దుర్మార్గం. తక్షణం ఈ నిషేధాన్ని ఎత్తివేయాలి. ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యపై ఉద్యమించాలని ప్రజాస్వామికవాదులకు విరసం పిలుపునిస్తోంది.

పి. వరలక్ష్మి

11 ఆగస్టు 2012 — విరసం రాష్ట్ర కార్యదర్శి

జూలై 5న ఆదివాసుల పోరాటాలకు మద్దతుగా గుంటూరులో విరసం సభ

వరంగల్ కలెక్టర్‌కు మెమోరాండం అందిస్తున్న ప్రజాసంఘాలు

విరసం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నెల్లూరులో సదస్సు



సభకు హాజరయినవారు

3 KLVA101M161

అరుణతార

సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

విరసం

293 సంపుటి : 35 ◆ సంచిక : 5 ◆ జూలై - ఆగష్టు, 2012

సంపాదకుడు

చలసాని ప్రసాద్

వర్కింగ్ ఎడిటర్

డి.వి. రామక్రిష్ణారావు

ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,

కార్బైడ్ కంపెనీ ఎదురుగా,

మౌలాలి, హైదరాబాద్ - 500040

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా

రచనలు పై చిరునామాకూ,

* ఇ-మెయిల్ ద్వారా

arunatara1977@gmail.com

కూ రచనలు పంపవచ్చు

సంపాదకవర్గం :

ఉజ్వల్

బాసిత్

కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామా

మేనేజర్

ఎస్. రవికుమార్

5-1307, దొరసానిపల్లె రోడ్,

ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360

సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా

పి. వరలక్ష్మి

5-1820, గీతాశ్రమం వీధి,

ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360

ఓ.టి.పి. అండ్ లే అవుట్

ఎస్. రాజు

కవర్ డిజైన్

శ్రీను

సృజనా గ్రాఫిక్స్, ప్రొద్దుటూరు

ఈ సంచిక వెల : రు. 20/-

సంపాదక రేఖ...

తత్వశాస్త్ర దృష్టితో చూసినప్పుడు సమాజాన్ని కాని, మానవ జీవితాన్నిగాని అర్థం చేసుకునే పద్ధతులు స్థూలంగా మూడు రకాలుగా ఉంటాయి. అవి ఒకటి, మనిషికిగాని, మనిషి చుట్టూగాని జరిగే మంచిచెడులను, లాభ నష్టాలను నిర్దేశించే శక్తులు మానవేతర శక్తులు (సూపర్ న్యాచురల్ ఫోర్సెస్)గా చూసే పద్ధతి. అంటే దేవుళ్ళు, దెయ్యాలు ఈ మంచి, చెడులకు కారణమని చూసే పద్ధతి. రెండు, మన జీవిత గమనాన్ని మంచి, చెడులను నిర్దేశించేది మానవాతీత శక్తులు (సూపర్ హ్యూమన్ ఫోర్సెస్) అని చూసే పద్ధతి. అంటే ఒక బుద్ధుడు, ఒక మార్క్స్, ఒక గాంధీ, ఒక నెహ్రూ, ఒక అంబేద్కర్‌లాంటి వారి వలన సమాజం మారుతుందని చూసే పద్ధతి. ఇక మూడవది. మానవ జీవితంలో, సమాజంలో జరిగే మంచి, చెడులకు, లాభ, నష్టాలకు కారణాలను మనిషిలోనూ, సమాజంలోనూ అన్వేషించడం. మనిషి చోదక శక్తిగా, చైతన్యపూర్వకంగా సమాజ మార్పుకు పూనుకోవడం. ఆ మార్పును తనలోనూ, తనచుట్టూ ఉన్న సమాజంలోనూ సాధించడం. అంటే దేవుళ్ళు, దెయ్యాలు లేక కారణజన్ములైన మహాపురుషులు వలన సమాజం మారుతుందని కాక ప్రజలే చరిత్ర నిర్మాతలని అర్థం చేసుకునే పద్ధతి. ఈ విషయాలు ఎందుకంటే, ప్రజలే చరిత్ర నిర్మాతలని విప్లవోద్యమం ఇచ్చిన జ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని, ఆ తత్వాన్ని జీర్ణించుకుని జీవితకాలం నిబద్ధతతో సమాజం మార్పుకు కృషి చేసిన కా. గోరు మాధవరావు, కా. బి.ఎస్.ఎ. సత్యనారాయణలను స్మరించుకునే సందర్భం కాబట్టి.

బి.ఎస్.ఎ. సత్యనారాయణ తన 72వ ఏట జూన్ 22న గుండెపోటుతో మరణించారు. ఆయన 1950 చివరిలో హైదరాబాద్‌కు వచ్చారు. ఆర్.ఎం.ఎస్‌కు మాతృ సంస్థ అయిన పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్స్ శాఖలో క్రియాశీలమైన ట్రేడ్ యూనియన్‌ను నిర్మించడంలో అసాధారణమైన కృషి చేశారు. ఆ తరువాత కాలంలో నక్సల్బరీ విప్లవోద్యమ రాజకీయాలకు ప్రభావితుడై విప్లవ రాజకీయాలవైపు వచ్చారు. విప్లవ విద్యార్థి యువజన సంఘాల కార్యకర్తలకు తత్వశాస్త్ర ఉపాధ్యాయుడుగా ఎంతో మందిని ఉత్తేజపరిచారు. కానూరి కుట్రకేసు నిందితుడుగా కొంతకాలం జైలులో ఉన్నారు. ఆ తరువాత కాలంలో న్యాయ శాస్త్రం అభ్యసించి న్యాయవాదిగా, పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తగా ఉంటూనే కార్మిక వర్గం కోసం అహర్నిశలు పని చేశారు. 'కార్మిక పథం', 'శ్రమ జీవి' పత్రికలను ఆయన అకుంఠిత దీక్షతో నిర్వహించారు. రాజకీయ ఖైదీల హక్కుల కోసం క్రియాశీలంగా ఉద్యమించారు. చివరి వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఆచరణలో ఉన్నారు.

కా. గోరు మాధవరావు తన 85వ ఏట 18 జూలై అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. ఆయన 1956లోనే కమ్యూనిస్టు పార్టీ సంబంధాల్లోకి వచ్చారు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు ప్రజల పక్షాన, ప్రజల కోసం పోరాడారు. జైలు శిక్షలు, నిర్బంధాలు అనుభవించారు. శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఆనాటి నుంచి తన చివరి ఊపిరిదాకా సమాజ మార్పు కోసం తనవంతు కృషి చేశారు.

ఇలా కా. గోరు మాధవరావు, కా. బి.ఎస్.ఎ. సత్యనారాయణలు ప్రజల కోసం పని చేయడంలో నక్సల్బరీ శ్రీకాకుళాల నుంచి నేటి ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక పోరాటాల దాకా తమదైన నిబద్ధతను, ఆచరణను నమూనాగా మనముందు ఉంచిపోయారు. వారు నమ్మిన ఆశయాలను ముందుకు తీసుకపోవడమే వారికి మనం ఇవ్వగల నిజమైన నివాళి...

ఈ సంచికలో...

సంపాదకీయం (5 - 7)
ఆపరేషన్ గ్రీన్‌హంట్ నేపథ్యంలో అక్రమ అరెస్టులు - **పాణి**

పాటలు / కవిత్వం (7 - 14)
తంగెళ్ళ సుదర్శనం పాటలు రెండు - సింగరేణి పువ్వువే నువ్వా మా శంకరన్న, లక్షింపేట దళితులకు అండగా ఉందాం; గోరు మాధవరావుకు లాల్‌సలాం - **దామరపల్లి నర్సింహారెడ్డి;** దళితులపై దాడులు ఎన్నాండ్లు - **ఉప్పెన;** భూమి ఎవడి సొత్తురా? - **ఎం.కె. కుమార్;** సాయుధ విప్లవ సాహిత్యకారుడు - **భూమి;** రాజ్యం ప్రజల మీద కుట్ర చేస్తుంది - **అశోక్;** శివుడో! శివసాగరుడా!! - **శిఖా - ఆకాష్;** భవిష్యత్‌పై విశ్వాసంతో - **సముద్రుడు;** ఆజాద్ స్మృతిలో - **అరుణ్**

సంస్మరణ (14)
చంద్రశ్రీకి నివాళి

కథ (15 - 21)
జీవన వేదం - **మంచికంటి**

కథ (22 - 24)
నేపాళ భూపాలుడు - **వెర్నన్ గొన్‌జాల్విస్**

కథ (25 - 31)
ముంజేతిని ఖండించినా... - **నల్లూరి రుక్మిణి**

సవరణ (32)
మే, జూన్ 2012 సంచికలో అచ్చయిన నల్లూరి రుక్మిణి కథ ప్రవాహం తిరోగమించదుకు సవరణ .

సంస్మరణ (33 - 34)
న్యాయం నిగ్గు తేలుస్తూనే - **వరవరరావు**

సంస్మరణ (35 - 36)
అరుదైన వ్యక్తిత్వానికి అరుణారుణ జోహార్లు! - **పి.వరలక్ష్మి**

వ్యాసం (37 - 43)
ఒక ఇస్మా - ఒక కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడి - **ఎన్.వి.ఎస్. నాగభూషణ్**

వ్యాసం (43 - 46)
కరచాలనం స్పర్శ కాదు' ఆత్మీయ పలకరింపు, ఉత్తేజ ప్రసారం! - **మిడ్కో**

రిపోర్టులు
ఆదివాసీలపై విరసం సభ **(46 - 47);** విరసం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సదస్సు**(47 - 48);** చిదంబరంను కేంద్రమంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలి - సి.ఆర్.పి.ఎఫ్ బలగాల్ని వెనక్కి పిలవాలి - **వరంగల్ ప్రజా సంఘాల డిమాండ్ (49 - 50)** - ప్రజలపై యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం! జనతన సర్కార్‌కి అండగా నిలబడుదాం! **(50 - 52)**

సీరియల్ (53 - 55)
గత సంచిక తరువాయి - నాలుగవ భాగం
సూర్యుడు - **కె.వి. కూర్మనాథ్**

లేఖ (55 - 55)
విరసం అభిప్రాయాలు మారుతున్నాయా?

పుస్తక పరిచయం సీరియల్ (56 - 57)
గత సంచిక తరువాయి - రెండవ అధ్యాయం - 8వ భాగం
గతితార్కిక భౌతిక వాదం - **ఐరా గొలోబిన్**
స్వేచ్ఛానువాదం : **కొడవటిగంటి రోహిణీ ప్రసాద్**

కరపత్రాలు
లక్షింపేట ప్రశ్నలకు సమాధానం ఎక్కడ? **(58 - 60);** అమరుల బంధు మిత్రుల సంఘం దశాబ్ది మహా సభలు - 18, 19 జూలై-2012, హైదరాబాదు - గ్రీన్‌హంట్ వ్యతిరేక చైతన్యంతో అమరులను స్మరించుకుందాం **(61 - 62);** చివరి ఊపిరిదాకా పోరాట ఎర్ర జెండాను దృఢంగా ఎత్తిపట్టిన కామ్రేడ్ గోరు మాధవరావుకు ఎర్రెర్రని జోహార్లు! **(62 - 63);** విప్లవోద్యమ అణచివేతలో భాగమే 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'లు! - **అనువాదం - అమన్ (64 - 65)**

విజ్ఞప్తి (66)
యుద్ధ వ్యతిరేక స్వరాలు -
ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా కొత్త శీర్షిక

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల	:	రు. 15
సంవత్సర చందా	:	రు. 160
జీవితచందా	:	రు. 1500

మేనేజర్ : ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్ : 9866021257
email : arunatara1977@gmail.com

2వ, 3వ కవర్‌ల డిజైన్ - ఆర్. భాగ్యలక్ష్మి

సంపాదకీయం

ఆపరేషన్ గ్రీన్‌హంట్ నేపథ్యంలో అక్రమ అరెస్టులు

- పాణి

గత కొద్ది కాలం సద్దుమణిగినట్టున్నా తిరిగి మళ్లీ ప్రజా సంఘాల బాధ్యుల, సభ్యుల అక్రమ అరెస్టుల పర్వం ముమ్మరమైంది. దేశ వ్యాప్తంగా విప్లవోద్యమం మీద ఇప్పుడు నడుస్తున్న నూతన నిర్బంధాన్ని గ్రీన్‌హంట్ యుద్ధంగా చూస్తున్నట్లే ఈ అక్రమ అరెస్టులను కూడా గ్రీన్‌హంట్ నేపథ్యంలో చూడాలి. ఈ అరెస్టులను పోలీసుల సాధారణ దౌష్ట్యంగా చూస్తే వీటి స్వభావం, రాజ్య ఉద్దేశం అర్థం కావు. గ్రీన్‌హంట్ వ్యతిరేక ప్రజాస్వామిక నిరసన స్వరాలను నొక్కివేయడానికే ఈ విడత అక్రమ కేసులు, అరెస్టులు సాగుతున్నాయి. ఈ రూపంలో నేరుగా గ్రీన్‌హంట్ తెలుగు సమాజంలోకి ప్రవేశించినట్లయింది. అయితే ఇది ఒకానొక రూపం మాత్రమే.

ప్రజాస్వామిక ఆందోళనలను, అసమ్మతిని అణిచివేయడం ప్రభుత్వంకు సదా అలవాటే. అందులో భాగంగా ఆలోచనాపరుల మీద, రచయితల మీద, పౌర ప్రజా సంఘాల మీద అక్రమ కేసులు పెట్టి, నిర్బంధించి జెయిలుపాలు చేస్తూనే వచ్చింది. ఇప్పటి అక్రమ కేసులు, అరెస్టులు ఏకంగా ప్రజలపై ఆలౌట్ వార్ ప్రకటించిన యుద్ధకాలానికి చెందినవి. ఈ యుద్ధంపట్ల సమాజంలో ఏమాత్రం అసమ్మతి వినిపించకుండా చూసుకోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమైపోయింది. గ్రీన్‌హంట్ గురించి మాట్లాడితే కేసులు పెడతాం, జెయిల్లో తోస్తాం జాగ్రత్త అనే హెచ్చరిక ఇందులో ఉంది.

మామూలుగా అయితే ఈ యుద్ధంపట్ల తెలుగు సమాజం నుంచి, సాహిత్య లోకం నుంచి తీవ్ర నిరసన రావాల్సి ఉండింది. కారణాలేమైనా ప్రభుత్వం అలాంటి తలనొప్పికి గురికానవసరం లేని వాతావరణం కొనసాగుతోంది. ఒక పక్క యుద్ధాన్ని, మరో పక్క నిశ్శబ్దాన్ని సమ తూకంలో నడపడంలో ప్రభుత్వం, వ్యవస్థ ఇప్పటికే చాలా విజయం సాధించాయి. కాకపోతే.. గ్రీన్‌హంట్ అనేది తెలుగు సమాజానికి దూరంగా ఎక్కడో జరుగుతున్నది గదా? అందువల్లే నిరసన వినిపించడం లేదని, నేరుగా మన సమాజ అనుభవంలోకి రాని దుర్మార్గాల పట్ల సహజంగానే నిరసన తక్కువగా ఉంటుందనే అభిప్రాయాలు కూడా ఉన్నట్లుంది.

ఇది కొంచెం విచిత్రమైన వాదనే. అంగీకరించడం కష్టం. ఎక్కువ ఉదాహరణలు చెప్పుకోనవసరం లేదుగాని, వియత్నాం యుద్ధాన్ని గుర్తు చేసుకుంటే చాలు. అంత దూరంలో జరుగుతున్న ప్రజా యుద్ధానికి తెలుగు మేధోలోకం ఎంత ప్రతిస్పందించింది ! సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వియత్నాం ప్రజలు చేస్తున్న పోరాటాన్ని మన పోరాటమని మనం అనుకోలేదా? అందు వల్లే అది న్యాయమని, అవసరమైనదని, మనందరిదనీ, మనమూ చేయాల్సిన పోరాటమనీ అనుకున్నాం. అందుకే దాని గురించి అంతగా పట్టించుకున్నాం. అమెరికా యుద్ధాన్ని తిప్పికొట్టిన వియత్నాం ప్రజల పోరాటానికి మనం సంఘీభావం అందించాం.

ఇప్పుడు మధ్య, తూర్పు భారతదేశాలపై భారత పాలకవర్గాలు, అమెరికా కలసి చేస్తున్న ఈ గ్రీన్‌హంట్ యుద్ధం వియత్నాం యుద్ధానికంటే దూరంలో జరుగుతున్నదా? గోదావరికి ఆ వైపున జరుగుతున్న ఈ యుద్ధానికి తీర ప్రాంత హద్దులు, సరిహద్దులు ఎందుకుంటాయి ? గ్రీన్‌హంట్ ఆపరేషన్ గోదావరికి ఈ వైపు ఖమ్మం, వరంగల్ జిల్లాలో కూడా ఎంత దుర్మార్గంగా సాగుతున్నదో విప్లవోద్యమ రచయితలు చాలా వివరిస్తున్నారు. కళింగాంధ్ర అంతా గ్రీన్‌హంట్ విధ్వంసమే. నేరుగా చత్తీస్‌గఢ్ నుంచి ఖమ్మం, వరంగల్ ఆదివాసీ ప్రాంతాలకేగాక, అక్కడి నుంచి నేరుగా హైదరాబాదు దాకా గ్రీన్‌హంట్ విస్తరించడంలో భాగమే పైన చెప్పిన అక్రమ కేసులు, అరెస్టులు.

ఇంత దగ్గరికి వచ్చేశాక కూడా ఇంకా గ్రీన్‌హంట్ దూరంగా ఎక్కడో జరుగుతున్నదని అనుకోవడం అమాయకత్వం కూడా కాదు. ఇంకా ఏదో. పైగా ప్రపంచీకరణ గురించి చాలా లోతైన అవగాహనను ప్రకటించుకుంటున్న తెలుగు సమాజంలోకి ఈ వైఖరి ఎట్లా వచ్చింది? దగ్గరా.. దూరమా అనే విషయం అటుంచినా, ప్రపంచీకరణ వంట గదుల్లోకి, పడకటింటిలోకి కూడా వచ్చేసిందని, మనిషి అదృశ్యమైపోతున్నాడని కవితాలాపన సాగే తెలుగు సాహిత్యలోకానికి అది నేరుగా ఒక రాజకీయార్థిక యుద్ధంగా కూడా ఇక్కడే, ఈ నేల మీదనే, మన మధ్యనే జరుగుతున్నదని తెలియకపోవడానికి కారణం ఏమిటి?

ప్రపంచీకరణ ఎంత దుర్మార్గమైన ఎత్తుగడ కాకపోతే సామ్రాజ్యవాదంలో భాగమైన ఒక కెరటంగా అది ముందుకు వచ్చి అసలు సామ్రాజ్యవాదమనే మాటను, పెట్టుబడి అనే మాటను మర్చిపోయేలా చేయగలిగింది? ఇదెంత విచిత్రమైన, అసంబద్ధమైన చైతన్యం. ప్రపంచీకరణ గురించి నిత్యం పాటలుపాడే, విశ్లేషించే, కవిత్వం, కథలు రాసే చాలా మందికి నేరుగా గ్రీన్‌హంట్ దాని పరమ విధ్వంసరూపమని స్ఫురించి ఉండాలి గదా? కానీ ఆ సోయే కలగలేదు. ప్రపంచీకరణ వ్యతిరేకత అనేది అతి నాజూకైన, ఆత్మికమైన, స్థానీయమైన ధోరణుల్లో సాగుతూ ఉంటే(ఇదీ చాలా అవసరమే), ఆ పక్కన నేరుగా ఆదివాసులు బహుళజాతి సంస్థల పెట్టుబడిని వ్యతిరేకిస్తూ సామ్రాజ్యవాదం మీద పోరాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో తమ శక్తి మేరకు వాళ్లకు సంఘీభావం ప్రకటిస్తున్న రచయితల మీద, పౌరహక్కుల సంఘాల మీద, ఇతర ప్రజాస్వామిక ఉద్యమ సంస్థల మీద ప్రభుత్వం ప్రజా భద్రతా చట్టాన్ని, యుఎపిఎను ప్రయోగిస్తోంది. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా చేస్తున్న ఈ యుద్ధాన్ని మేం అంగీకరించం అని నిరసన తెలుపుతున్నందుకు అప్రజాస్వామిక చట్టాల ఆసరాతో అక్రమ కేసులుపెట్టి జెయిళ్లలో తోయాలనుకుంటున్నది.

ఇంత దుర్మార్గం చేస్తూ కూడా కేవలం మావోయిస్టుల 'హింసా విధ్వంసాల'ను అరికట్టడానికి, శాంతిభద్రతలను పరిరక్షించడానికి ఈ యుద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం సమర్థించుకొని నమ్మబలకడానికి ప్రయత్నిస్తున్నది. ఈ యుద్ధం రేపొద్దున ప్రజలందరిపై యుద్ధంగా పరిణమించబోతోందనే సత్యాన్ని కూడా దాచేయగలిగింది. రాజ్యం నడుపుతున్న ఈ ఎత్తుగడకు సమాజమంతా గురైందని చెప్పడం కూడా అతి అంచనా అవుతుంది. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలు ఎట్లాగూ పోరాడుతూనే ఉన్నారు. వారి పక్షాన నిలబడ్డ శక్తులు కూడా ఉన్నాయి. కానీ మేధోలోకం మౌనముద్ర దాల్చడం వెనుక ఏమున్నది? యుద్ధం ఎందుకు వచ్చిందో, దాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ఇరు పక్షాల బలాబలాలు ఏమిటో, ప్రయోజనాలు ఏమిటో అర్థం చేసుకోవడంతోపాటు, దాని దాపునే ఉన్న మౌనాన్ని కూడా ఎంతో కొంత విశ్లేషించుకోవాల్సిందే.

మౌనంగా కనిపిస్తున్న స్తబ్ద చిత్రంలోనే కొన్ని ధిక్కారాలు కూడా ఉన్నాయని ముందే చెప్పుకున్నాం.. ఆదివాసులను ఈ యుద్ధంలోకి లాగిన రాజ్య స్వభావం తెలుసుకున్నవాళ్లు ఈ దండయాత్రను శక్తి వంచన లేకుండా ఎదిరిస్తూనే ఉన్నారు. ఈ నిరసన గళాలు దేశవ్యాప్తంగా వినిపిస్తు ఉన్నాయి. సమాజాన్ని విడి విడి ముక్కలుగా కాకుండా, సమగ్రంగా అర్థం చేసుకోగలిగినవాళ్లు, ముఖ్యంగా రాజ్యం, పెట్టుబడి, సామ్రాజ్యవాదాల చొరబాటు, దోపిడీ, యుద్ధోన్మాదాలను మొత్తంగా అర్థం చేసుకోగలిగిన చాలా మంది ప్రజాస్వామికవాదులు రాష్ట్రంలో, దేశంలో గ్రీన్‌హంట్‌ను ఎదిరించి మాట్లాడుతూ ఉన్నారు. ఇవాళ గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకించి గొంతెత్తి మాట్లాడటం అనేది సాహసోపేత వ్యక్తీకరణ. మన దగ్గరే జరుగుతున్న సంకుల సమరంలో న్యాయాన్యాయాలను తేల్చుకుని, న్యాయం పక్షాన నిలబడడం దృఢమైన అవగాహనకు గీటురాయి అవుతుంది. దూరంగా ఉన్న విషయాల గురించి మాట్లాడడంలో గొప్ప సౌకర్యం ఉంటుంది. ముఖ్యంగా మేధోరంగంలో అది మేలిమి పాండిత్యానికి నిదర్శనంగా ఉంటుంది. చాలా పొడవు చేతులను ప్రదర్శించుకున్నట్లవుతుంది. కానీ మన దగ్గర సుదీర్ఘకాలంగా జరుగుతున్న ఒక సంఘర్షణ కీలక ఘట్టానికి చేరుకున్నాక దాని గురించి మాట్లాడటానికి స్థిర చిత్తం కావాలి.

తెలుగు మేధో రంగంలో, సృజన రంగంలో ఇవి బాగా అడుగంటిపోయిన గడ్డు కాలంలో కూడా ఈ యుద్ధాన్ని క్రియాత్మకంగా వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామిక ధార ఇంకా కొనసాగుతున్నది. అందువల్లే గ్రీన్‌హంట్ ప్రారంభం కాగానే గ్రీన్‌హంట్ వ్యతిరేక కమిటీ ఏర్పడి కార్యక్రమాలు ప్రారంభించింది. అనేక ప్రజాసంఘాలు, కొందరు ప్రజాస్వామికవాదులు ఈ కమిటీ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగమవుతున్నారు. విడిగా కూడా భిన్న రూపాల్లో ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ పని చేస్తున్నారు.

ఈ విడత ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాసంఘాలపై జరుగుతున్న దాడుల వెనుక ఈ నేపథ్యం ఉన్నది. విప్లవ ప్రత్యామ్నాయానికి, యుద్ధానికి వేదికగా మారిన దండకారణ్యంతో లేదా నిర్దిష్టంగా ఛత్తీస్‌గఢ్‌తో సంబంధాలు పెట్టి ప్రభుత్వం ఈ కేసులు, అరెస్టుల వ్యవహారం నడిపిస్తోంది. గతంలోలాగా ప్రజాసంఘాల కార్యకర్తలపై కేసులు పెట్టేటప్పుడు అజ్ఞాతంలో ఉన్న విప్లవకారుల పేర్లను జత చేసే పద్ధతి మళ్లీ మొదలైంది. దీని వల్ల దిక్కుమాలిన ఆరోపణలు చేయడానికి ఆస్కారం దొరుకుతుంది. అట్లా కాకపోయినా అన్యాయమైన ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కాకపోతే ప్రజాస్వామిక ఆందోళనలను మరింత భయాందోళనలకు గురిచేయడానికి ప్రభుత్వం ఎన్నుకునే కుట్రపూరిత పద్ధతి ఇది.

గ్రీన్‌హంట్ మొదలైనప్పటి నుంచి సాధారణ నిర్బంధ స్వభావం మారిపోయినా జూన్ 9 నుంచి అరెస్టుల పర్వం మొదలైందని చెప్పుకోవచ్చు. జూన్ 9న వరంగల్‌లో మావోయిస్టు పార్టీ నాయకుడు అమరుడు కామ్రేడ్ ఆజాద్ సహచరి పద్మ తదితరులతోపాటు బంధుమిత్రుల సంఘం సభ్యురాలు భారతిని కూడా అరెస్టు చేశారు. ఈ కేసులో విరసం కార్యవర్గ సభ్యుడు సి. కాశీం, బంధుమిత్రుల సంఘం నాయకుడు గంటి ప్రసాదం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్షుడు ఆకుల భూమయ్యలను ఉపా చట్టం కింద ఇరికించారు. ఏప్రిల్ 22న హైదరాబాదులో జరిగిన ఆర్‌డిఎఫ్(రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్) జాతీయ మహా సభలకు ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న 35 మంది ఆదివాసులను, చేతనా నాట్యమంచ్ కళాకారులను, సత్యం అనే వ్యక్తిని అరెస్టు చేసి ఉపా చట్టం కింద కేసు పెట్టారు. ఈ కేసులో తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు ఆకుల భూమయ్య, కాశీం, చిక్కుడు ప్రభాకర్, మద్దిలేటి, దేవేంద్ర మొదలైనవాళ్లతోపాటు అప్పటికే అరెస్టయి జైల్లో ఉన్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ కార్యదర్శి నలమాస కృష్ణపై పి.టి. వారెంట్ జారీ చేశారు.

జులై 18, 19 తేదీల్లో హైదరాబాదులో జరిగిన అమరుల బంధు మిత్రుల సంఘం మహాసభలకు రావడానికి బయల్దేరిన ఆదివాసులను, చేతనానాట్య మంచ్ కళాకారులను 18 మందిని హైదరాబాదు బస్టాండ్‌లో అరెస్టు చేసి, వారిని పిలుచుకుపోడానికి వచ్చిన పౌరహక్కుల సంఘం నాయకులు నారాయణరావు, హనుమంతరావులను కూడా అరెస్టు చేశారు. ఈ కేసులో గంటి ప్రసాదం, పద్మకుమారి. రఘునాథ్, వరవరరావులను కూడా చేర్చారు. ఆ తర్వాత భద్రాచలంలో అరెస్టు అయిన బండికిరణ్‌తోపాటు మళ్లీ గంటి ప్రసాదం, పద్మకుమారి, వరవరరావు, కాశీం, నారాయణరావు, హనుమంతరావులను పరారీలో ఉన్న ముద్దాయిలుగా చేర్చారు.

ఆగస్టు 19న ఒకప్పుడు పౌరహక్కుల సంఘంలో ఉండిన ప్రకాశం జిల్లాకు చెందిన అనిల్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేసి వివిధ ప్రజాసంఘాల నాయకులను, సభ్యులను ఆ కేసులో చేర్చారు. అనిల్ సహచరి నిర్మలతోపాటు కుల నిర్మూలనా పోరాట సమితి అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్, పిడిఎం శ్రీనివాస్, అమరుల బంధుమిత్రుల సంఘం సభ్యురాలు శ్యామల, ప్రగతిశీల కార్మిక సంఘంలో పని చేస్తున్న రాజు తదితరులపై ఈ కేసు పెట్టారు. వీరితోపాటు అనేక మంది మావోయిస్టు నేతలను కూడా ఇందులో చేర్చారు. వారిలో ఒక్క రామకృష్ణ(ఆర్‌కె) మాత్రమే జీవించి ఉన్నాడు. వీరందరిపై నేరపూరిత కుట్ర, యుద్ధానికి పూనుకోవడం, రాజద్రోహం.. మొదలైన

తంగెళ్ళ సుదర్శనం పాటలు రెండు

సింగరేణి పువ్వువే నువ్వూ మా శంకరన్న

సింగరేణి పువ్వువే నువ్వూ మా శంకరన్న
సికాస చిరునవ్వువే నువ్వూ మా షంషేరన్న ॥సింగరేణి॥

కరీంనగర్ కన్నా కొడుకు గోదావరి గోరువంక
విద్యార్థి ఉద్యమాల ఉగ్గుపాలు తాగినోడ
రాడికల్ బాటలో నిలిచి మా శంకరన్న
రగల్జెండనెత్తినావయ్యో మా షంషేరన్న ॥సింగరేణి॥

ఆదిలాబాద్ అదివాసీ ఉద్యమాన్ని నడిపినావు
గోండులాకు అండాగుండి యుద్ధాన్నే ముద్దాడినావు
విప్లవాల వీరుడినయ్యో మా శంకరన్న
అలుపెరుగని యోధుడివయ్యో మా షంషేరన్న ॥సింగరేణి॥

ఇంద్రవెల్లి జోడెన్ ఘాట్ ఆసిఫాబాద్ బెల్లంపల్లి
కర్రెగుట్ట సిరువంచ దండాకారణ్యమంత
నిన్ను కదుపులోన దాచుకున్నయో మా శంకరన్న
కన్నా తల్లె కాచుకున్నయో మా షంషేరన్న ॥సింగరేణి॥

పోరులోన భాగమయ్యి విప్లవాన్ని నడుపుకుంటూ
కవితలు వ్యాసాలు రాసి ఉద్యమ కథలను రాసి
సాహిత్య సృజనజేసినవ్ మా శంకరన్న
విప్లవ చైతన్యమైనవో మా షంషేరన్న ॥సింగరేణి॥

ఉవ్వెత్తున లేచిన తెలంగాణ ఉద్యమాన్ని
అవకాశవాదులంత హైజాకుజేస్తాంద్రని
ప్రజా తెలంగాణ కొరకు మా శంకరన్న
ప్రజాపోరే మార్గమన్నవో మా షంషేరన్న ॥సింగరేణి॥

కాలా రాత్రి కాదా నిన్ను కాటు వేస్తె విషపుపాము
ఎలుకే కరిచిందంటు ఎంతో ధైర్యంగుంటివి
ప్రాణాలు పోతావుంటెనో మా శంకరన్న
ఎర్రెర్ర దండమంటివో మా షంషేరన్న ॥సింగరేణి॥

పొడిచేటి పొద్దువయ్యి నడిచేటి దండువయ్యి
పోరటాల కాంతివయ్యి చీకటిలో వెన్నెలయ్యి
విప్లవాల దారి జూపినవో మా శంకరన్న
త్యాగాల బాటలేసినవో మా షంషేరన్న ॥సింగరేణి॥

నేరారోపణలతోపాటు 1992 ప్రజాభద్రతా చట్టం, 1967నాటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం(యుఎపిఏ) ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 27న కరీంనగర్‌లో ఎపిసిఎల్‌సి అక్రమ కేసులకు వ్యతిరేకంగా పెట్టిన సభపై దాడిచేసి చిలుకా చంద్రశేఖర్, జల్లి లింగయ్య, నారాయణరావు, కరీంనగర్ జిల్లా ఎపిసిఎల్‌సి రాజగోపాల్, తెలంగాణ సింగరేణి కార్మిక హక్కుల ఉద్యమ వేదిక కన్వీనర్ ఏనుగు మల్లారెడ్డి, అధ్యక్షులు కూచన కుమారస్వామి, సంయుక్త కార్యదర్శి జి. గోపిలను అరెస్టు చేసి కేసు పెట్టి జైలుకు పంపారు.

రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కొసం, అమరుల ఆశయాల సాధన కోసం, సాహిత్య రంగంలో విప్లవ ప్రజాస్వామ్య విలువల కొసం, దళిత బహుజనుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వివిధ రంగాల్లో .. ప్రత్యామ్నాయ అవగాహనతో పని చేస్తున్న ప్రజాసంఘాలను అణచివేయడానికి ఈ అక్రమ అరెస్టుల పరంపర కొనసాగుతున్నది. చాలా ఉద్దేశ పూర్వకంగా ఈ కేసుల్లో అజ్ఞాతంలో ఉన్న విప్లవకారుల పేర్లను కూడా చేర్చి తీవ్రమైన నేరారోపణలు చేస్తున్నారు. ఈ నిర్బంధం నేరుగా ఆర్‌డిఎఫ్ నిషేధంతో తీవ్ర స్థాయికి చేరుకున్నది. గతంలో విరసంను నిషేధించినప్పుడు ఏ ఆరోపణలు చేశారో సరిగ్గా అలాంటివాటినే ఇప్పుడు ఆర్డీఎఫ్‌ను నిషేధిస్తూ చూపించారు. అయితే ఈ నిషేధానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌తో నేరుగా సంబంధం ఉంది. విప్లవ రాజకీయ తాత్విక విశ్వాసాలతో సంఘం పెట్టుకోడానికి వీల్లేదనే బెదిరింపు ఇందులో ఉన్నది. విరసం విషయంలో ఇలాంటి నిషేధాలు చెల్లుబాటుకావని నిరూపణ అయినా ప్రభుత్వానికి బుద్ధి లేకుండా మరో ప్రజా సంఘాన్ని బరితెగించి నిషేధించింది.

గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను వ్యతిరేకిద్దాం.. విప్లవ జనతన సర్కార్‌కు సంఘీభావం ప్రకటిద్దాం అనే ప్రజాస్వామిక, రాజ్యాంగబద్ధ నినాదంతో రాష్ట్రంలో పని మొదలు పెట్టిన విప్లవ ప్రజాస్వామిక వేదికను ప్రభుత్వం నిషేధించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాటున ఈ చర్యకు పూనుకోలేదు. గ్రీన్‌హంట్ వ్యతిరేక చైతన్యాన్ని రగిలించడంలో ఈ సంస్థ క్రియాశీల పాత్ర పోషించగలదనే అంచనాతోనే నిషేధించింది.

దండకారణ్యంలో సైనిక రంగంలో జరుగుతున్న గ్రీన్‌హంట్‌కు అనేక విధ్వంస రూపాలున్నాయి. అందులో ఒకటి ఈ అక్రమ కేసులు, అరెస్టులు, నిషేధాలు. ఇంకా చాలా రూపాల్లో ఇది విస్తరిస్తున్నది. అందుకే దీన్ని కేవలం ఆదివాసుల మీద, లేదా వాళ్లకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టుల మీద జరుగుతున్న యుద్ధంగాగాక దేశ ప్రజలపై జరుగుతున్న యుద్ధంగా గుర్తించాలని విరసం మొదటి నుంచీ ప్రచారం చేస్తున్నది. ఎన్నెన్ని రూపాల్లో గ్రీన్‌హంట్ విస్తరిస్తున్నదో గుర్తించి వాటన్నిటినీ ఎదుర్కోవడమే ఇవాళ మన ముందున్న కర్తవ్యం.

లక్షింపేట దళితులకు అండగా ఉందాం

లక్షింపేట దళితులకు అండగా ఉందాం
దోషులను శిక్షించే వరకు పోరే చేద్దాం ॥లక్షింపేట॥

దొంతరల కుల వ్యవస్థ
కుట్రలెన్నొ చేసినాది
మనువాద చింతనలో
దళిత బతుకు దగ్ధమయ్యె
ఆధిపత్య కులాలను ఎండగట్టుదాం
ఆ దాడులను ఎదిరించే దండులవ్వుదాం ॥లక్షింపేట॥

పోలీసులు చట్టాలు
ఉన్నోళ్ళకు చుట్టాలు
ఎన్నోదాడులు జరిగిన
దోషులపై కేసులేదు
దళితులే రాజకీయ నాయకులైనా
దళితులకు న్యాయమసలే దక్కలేదురా ॥లక్షింపేట॥

కూడులేని దళిత జనం
బీడు భూములను దున్నుతే
అగ్రకుల అహంకారం
అధికారం అండతోని
దళితుల గుండెలల్లో బర్సిందించెరా
ఊరి నుండి తరిమేసే కుట్రజేసెరా ॥లక్షింపేట॥

చుండూరు, కారంచేడు
దాడులను మరువలేము
వేంపెంట దళితులను
మంటల్లో మాడ్చినారు
లక్షింపేట దళితులను
వెంటబడి చంపినారు
అడుగడుగున నరమేధం జరుగుచుండెరా
ఆ నరమేదమునాపివేయ నడుంగట్టరా ॥లక్షింపేట॥

ప్రాజెక్టు మింగిపోగ
మిగిలిన భూమిని దున్నే
పోరులోన ఒరిగిన
దళిత మృతవీరులు
నివర్తి సంగమేశ్
వెంకట్రావు పాపయ్య
చిత్తరి అప్పుడు
బూరాడ సుందరరావు .
దళిత అమరవీరులకు జోహార్లందాం
ఆ ఆశయాల సాధనకై సమరమే చేద్దాం ॥లక్షింపేట॥

గోరు మాధవరావుకు లాల్‌సలాం

- దామరపల్లి నర్సింహారెడ్డి

ఎర్ర జెండా నీడలో
పోరుదారి అమరుల బాటలో
నగ్జల్‌బరీ పోరు శ్రీకాకుళ పోరులో
ఒరిగినట్టి వీరుడు
కలం యోధుడు గోరు మాధవరావు ॥ఎర్ర॥

ఆదిభట్ల కైలాసం వెంపటాపు సత్యం
పాణి గ్రహి పంచాది నిర్మల
చూపినట్టి బాటలోన
కడదాకా పోరాడిన మహానీయుడు
పోరాట యోధుడు గోరు మాధవరావు ॥ఎర్ర॥

భూమి కోసం, భుక్తి కోసం
దోపిడి విముక్తి కోసం
అలుపెరుగని ప్రజా పోరాటంలో
వెనుకడుగు వేయకుండా
ముందుకు సాగిన అజాత శత్రువు
గోరు మాధవరావు ॥ఎర్ర॥

శ్రీకాకుళ రైతాంగ వీరులకే సాధ్యమైన
ఎర్రపూల వనంలోన
శ్రీకాకుళం నుంచి తెలంగాణ దాకా కేగిసినా
పోరాటాలుద్యమాలు అలలు అలలుగా సాగినా
విప్లవాల ముద్దుబిడ్డ గోరు మాధవరావు ॥ఎర్ర॥

నగ్జల్‌బరీ బిడ్డలు ధారబోసిన
ఎర్రని రక్తపు ధారసాక్షిగా
నవ సమాజ స్థాపన నిర్మాణంకై
ప్రజాస్వామిక విప్లవంకై
పరితపించిన ప్రజల మనిషి గోరు మాధవరావు ॥ఎర్ర॥

అడుగడుగునా రాజ్యహింసను దిక్కరిస్తూనే
రాజ్యం కంటిలో నలుసై
తుదిశ్వాస విడిచేంత వరకు
పీడిత తాడిత ప్రజల పక్షం నిలిచి
కవితలెన్నో అల్లి జీవితమంతా
ప్రజా కళలకు అంకితమిచ్చిన
ప్రజా కవి గోరు మాధవరావు ॥ఎర్ర॥

ప్రజల కొరకు పోరాడి నేలరాలిన
అరుణతారవు
ధృవతార గోరు మాధవరావు
లాల్‌సలాం
మృతవీరుడు గోరు మాధవరావ్
లాల్‌సలాం ఇదే మా లాల్‌సలాం ॥ఎర్ర॥

దళితులపై దాడులు ఎన్నాండ్లు

- ఉప్పెన

దళితులపై దాడులు ఎన్నాండ్లు ఎన్నేండ్లని
పారిన రక్తం సాక్షిగ ఒరిగిన బిడ్డల సాక్షిగ
దప్పుపైన దరువు వేయర... దళితన్న
దుడ్డుకర్ర చేత బట్టర.. దళితన్న ॥దళితులపై॥

భూ దాహం జడలు విప్పి కుల రక్కసి బుసలు కొట్టి
లక్ష్మింపేట దళితులపై దారుణంగ దాడిచేసి
గొడ్డండ్లతో నరికినారుర... దళితన్న
నరమేధం చేసినారుర.. దళితన్న ॥దళితులపై॥

కారంచేడు, నీరుకొండ చుండూరు వేంపెంట
సంఘటనలు మర్వలేదు గాయాలు మానలేదు
మళ్ళీ లక్ష్మింపేటపై దాడితో దళితన్న
దళితుల రక్తాలు పారేర... దళితన్న ॥దళితులపై॥

ఈ నేల మాదని నాగండ్లతో దున్నుతుంటే
అగ్రవర్ణ అహంకారం ఉగ్రరూపం దాల్చి
పచ్చి రక్తాన్ని తాగిర.. దళితన్న
వెచ్చని ప్రాణాలు తీసిర.. దళితన్న ॥దళితులపై॥

ప్రశ్నించే కంఠాలను కత్తులతో కోస్తుంటే
ఎదురించే దేహాలను బరిసెలతో పొడుస్తుంటే
ఎంతకాలం ఓర్చుకుందము.. దళితన్న
బదులు మనం తీర్చుకుందము... దళితన్న
॥దళితులపై॥

నేల కొరకే ఐదుగురు దాడిలోన ఒరిగినారు
ఆ మట్టిపైన ఒట్టేసి ఆయుధాలు చేతబట్టి
బరిగీయకుంటే నిలువలేముర.. దళితన్న
గురి చూడకుంటే బతకలేముర.. దళితన్న ॥దళితులపై॥

భూమి ఎవడి సొత్తురా?

- ఎం.కె. కుమార్

నాటుదాం భూమిలో నాగలెయిరా
అడ్డొస్తే ఒక్కటయ్యి పారదోలుదాం
ఎన్నాళ్ళీ బానిస బతుకురా
సింహమల్లే లేచి దుంకాదరా

ఎటుచూసిన అగ్రవర్ణ కుట్రేకదరా
హిందువులం అంటూనే సంకెళ్ళేసెరా
గూడెంను సుట్టుముట్టి అరుపు తోటి
కళ్ళల్లో కారాలు చల్లినారురా
తలుపు వెనకున్న పసివాడురా
ఊపిరి బిగపట్టి వెక్కి ఏడ్చెరా
పిల్ల బతుకు కోసం ప్రశ్నించరా
ఎదురు తిరిగి తన్ని తగలెయ్యరా ॥నాటుదాం॥

భూముల్ని వాళ్ళసొత్తు అన్నదెవర్రా
మన చెమట, మన నెత్తురు మట్టేకదరా
ఉదయాన్నే గుండెల్లో గునపందించి
మన సెల్లి, మన అక్కను మానం దీసి
కత్తులతో నరికేసి తొడగొట్టెరా
కూలోడా నీకేల భూమి అనెరా
కన్నీరు పెట్టెనే ఓ తమ్ముడా
కత్తిరా లేచిరా అంబేద్కరుడా ॥నాటుదాం॥

ఊరిని వల్లకాడు చేసేకదరా
పోలీసు సందుచూసి పారిపాయెరా
సూరీడు తల్లడిల్లి ఎరుపెక్కెరా
కూస్తున్న పిట్టగొంతు మూగబోయెరా
చెమటతో పండించిన పంటనంతా
కళ్ళముందే తగలబెట్టి నవ్వినారురా
బక్క చిక్కినావని భయమేలరా
ఆకాశం సరిహద్దుగా సాగిపొమ్మురా ॥నాటుదాం॥

చిరునవ్వు చిందించే అమ్మా మోము
ఆ నెత్తుటి మడుగుల్లో నిదరోయెరా
కాపోళ్ళ పొలాలకు నెత్తురు చల్లి
మన కడుపులు కాలే మంటాయెరా
తన్నిన, గుద్దిన మౌనమేరా
కాలిన మనసుకు గాయమేమిరా
అడుక్కునే బతుకులు వదిలిపెట్టరా
చరిత్రను తిరగరాద్దాం పిడుకిలెత్తరా ॥నాటుదాం॥

మనవాడు అనుకుంటే లాభమేమిరా
మనకోసం కన్నీరు కార్చలేదురా
శవం సాక్షిగా డబ్బును పంచి
బతికున్న మనుషులను చంపినారురా
భూమి కోసం పనికోసం పోరుజెయ్యరా
నీ కొడవలి, గొడ్డలికి పదునెట్టరా
అనుక్షణం భయపడుతూ బతకలేమురా
ఒక్కసారి పోరాడి వీరుడవ్వరా ॥నాటుదాం॥

(లక్ష్మింపేట మారణకాండ నేపథ్యంలో...)

సాయుధ విప్లవ సాహిత్యకారుడు

- భూమి

వెయ్యికాళ్ళ జెర్రి ఒళ్ళు విరుచుకుంటున్నప్పుడు
మంగి కొండల మీద
ఒక అరుణతార పూసింది

గోదావరి ఖని బొగ్గు గర్భంలో
ఒక వెన్నెల రాత్రి ఉదయించింది

ఎంతదూరం పాకిందో ఈ విద్యుల్లత
జోడెన్‌ఘాట్ అరుణవర్ణాన్ని పులుముకొని
గోదావరీలోయ విప్లవ పాదులకు
తల్లిరొమ్మై పాలుదాపింది

పాదముద్రల నిండా ఎంత నెత్తురు
ఎడతెగని ప్రయాణంలో
ఈ ఎర్రమల్లె ఒక వ్యాన్‌గార్డ్
విప్లవాన్ని పుక్కిటపట్టి
'అధైర్యపడవద్దు
విప్లవంలో పోతే ప్రాణం
వస్తే విజయం' అన్న మాటలు
చెవుల్లో ఎల్లప్పుడూ మార్మోగేవే

గుండేటి శంకర్
క్రిష్ణ శేషన్న మహేష్ - షంషేర్
కేవలం పేర్లే మారాయా!
చినుకంటూ రాలాక
ప్రవహించకుండా ఎలా ఉండగలదు
పిల్లకాలువ వాగై
వాగు నదియై
నది మహాసముద్రమై
విస్తరించిన విప్లవోద్యమ గమనమది
అందులో సంలీనమైన యోధుని యుద్ధ ప్రయాణమది

అతడంటే ఇంతేనా...
గన్ను పెన్నయితే అతడు
పెన్ను గన్నయితే అతడు
షంషేర్, సాయుధ విప్లవ సాహిత్యకారుడు
సాహిత్య పేజీల మీద
లాల్‌సలాం చేసిన సంతకం

ట్రిగ్గర్ మీది వేలు
ఎన్ని తూటాలు పేల్చిందో అన్ని మాటల్నీ పంచింది
బందూకుతో పెనవేసుకుపోయిన
జీవిత సౌరభాల్నీ వెదజల్లింది

ఆ అక్షరాల నిండా నెత్తురు
తడితడిగా తగిలె విప్లవానుభవాలు
ఒక జోరువాన
బుల్లెట్ల చప్పుళ్లు
నిప్పులవాగు సవ్వడి
ఒక వేకువాకాశం
నాకు అతిశయోక్తులు చేతకావు
కావాలంటే అతన్ని చదవండి

'తనకోసం తాను జీవించడం మరణించడమే
ఇతరుల కోసం మరణించడమే జీవించడం'
అంటుంది క్యూబన్ జాతీయగీతం
షంషేర్ చనిపోలేదు
కళ్ళు నులుముకొని
వెన్నెల రాత్రుల్లో ఆకాశంకేసి చూడండి
అతను నవ్వుతూ కనిపిస్తాడు
తొలిసందెలో తూరుపుకేసి చూడండి
అతడు గురిపెట్టిన తుపాకీతో కనిపిస్తాడు

నా మట్టుకు నాకయితే
అమ్మ కలిపిన పెరుగన్నంలోనూ
అయ్య తెచ్చిన జిలేబీలోనూ
అతను ప్రత్యక్షమవుతున్నాడు
చిరునవ్వు పులిమిన మోముతో
'నాక్కూడా కొంచెం పెట్టు కామ్రేడ్'
అని అడుగుతున్నాడు

రాజ్యం ప్రజల మీద కుట్ర చేస్తుంది

- అశోక్

'క్షమించండి'
ఈ మాట చిదంబరం నోట విన్నాక
ఇక ఆ 'పదం' నాగరిక సమాజ
వాడుకకు పనికిరాదేమోననిపిస్తుంది
నిర్లక్ష్యన్నంగ ఇరవై రెండు మంది ఆదివాసీలను చంపి
అది సుశిక్షిత బలగాల ఘన విజయమంటుందు
శవాల కుప్పల్లో పిల్లలు, నిరాయుధ మహిళలు ఉన్నారెంటె
క్షమించండి, పాపం మాది కాదు చీకటిదంటుందు
అర్ధమ్మ రాతిరి గుంపు మీద గుండ్లు కురిపిస్తే
పిల్లలయ్యింది, తల్లులయ్యింది
బుల్లెట్లకేమెర్కని కుతర్కం చేస్తుందు
గుప్పెడు మందైనా సరే, గుమిగూడడం నేరమంటుంందు
దండకారణ్యంలో 144 సెక్షనా!
ఇది ఏ 'వేదాంత' సూత్రం, ఏ ప్రజాస్వామ్య నియమం!!

దండకారణ్యానికి మావోయిస్టుల 'చీడ' పట్టిందట
మానవ రహిత విమానాలతో జల్లెడపట్టి
మందుగుండుతో 'సానిటైజ్' చేయాలట
నిజమే
అరుందతీరాయ్ చెప్పినట్లు
దండకారణ్యంలో భూమి, ఆ భూమి మీద ఆదివాసి
ఆదివాసులకు అండదండగా మావోయిస్టులు
మూడు పొరలుగా ఒక్కటైంద్రు
కాని, సామ్రాజ్యవాదం, దాని దేశీయ బంటులు
భూమిని పెకిలించి వనరులన్నీ దోచుకోవడం కోసం
విధ్వంసక అభివృద్ధి వ్యూహ రచన చేస్తుంద్రు
కాని, ఆ భూమిని తాకాలంటే, దానిపై
జీవితం పరుచుకున్న ఆదివాసులను

వారికంటే ముందు, ముప్పై ఏండ్లుగా
ఆదివాసీలలో భాగమైన మావోయిస్టులను
మావోయిస్టులైన ఆదివాసీలను
మొత్తంగ అక్కడి మనుషులందరినీ
వాళ్ళ బతుకును, బతుకుదెరువును
ధ్వంసం చేయాల్సిందే
ఇదే దోపిడి వర్గ దమన నీతి
అందులో బాగంగానే, అన్నింటా విఫలుడని
'ఘనఖ్యాతి' పొందిన మన్మోహన్‌సింగ్
అన్ని వేదికల మీద మావోయిస్టులే
ప్రధాన అంతర్గత ప్రమాదమంటుండు
చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పి, ఉదారవాద
మధ్యతరగతి మెదళ్లను ఖబ్జా చేసి
రాజ్యహింసకు పౌర సమాజ
అంగీకారం పొందాలనుకుంటుండు
అవును, ప్రపంచ బ్యాంకు సూచిస్తున్నట్లు
పది శాతం అభివృద్ధి రేటుకు చేరాలంటే
ప్రజల మీద యుద్ధం చేయాల్సిందే
గ్రీన్‌హంట్‌తో భూమిని, అడవిని రక్తంతో ఎర్రవార్చాల్సిందె

అయినా, భూమి మీద ఆదివాసీల
ఆనవాళ్లే లేకుండా చేద్దామంటె
వాళ్ళు భూములు పంచుకొని
బతుకును ఖాయం చేసుకొనుడేంది
దేశమంతా సామ్రాజ్యవాద పెట్టుబడి
విత్తనాలు మొలకెత్తిస్తుంటే
వాళ్ళు ప్రత్యామ్నాయ విత్తనాల పండుగ చేసుకొనుడేంది
జనరహిత అభివృద్ధి నమూనా నిర్మిస్తుంటే
వాళ్ళు విప్లవ జనతన సర్కార్ నడుపుడేంది
టూరిస్టు కెమరాల్లో బందీగా ఉండాల్సిన జీవితాలు
'ప్రధాన' స్రవంతి ప్రచార సాధనాల్లో
పతాక శీర్షిక కావడమేంటి
నిజమే, మధ్య భారతంలో భూమి కదులుతోంది,
అడవి మండుతోంది
ఆ ప్రకంపనలు ఢిల్లీ గుండెకు దడ పుట్టిస్తున్నాయి
అందుకే, రాజ్యం అణగారిన ప్రజల మీద కుట్ర చేస్తోంది
ఆ కుట్రలో భాగమే, గ్రీన్‌హంట్ ఆపరేషన్
అడవంతా వేటగాళ్ళతో నింపిన ఢిల్లీ,
అసలు వేటే లేదంటుంది
నిజమే అది వేటకాదు, ఆదివాసీ జీవితాల దురాక్రమణ
వేటగాడు కావాల్సింది దొరక్కానే వెళ్ళిపోతాడు
కాని గ్రీన్‌హంట్ వేటగాళ్ళు విరబూస్తున్న
మోదుగుపూల వనాన్ని కాల్చి
గంజాయి మొక్కలు పెంచాలనుకుంటుండ్రు
అడవి బిడ్డలను ఊచకోత కోసి
విజయగర్వం చాటుతుండ్రు
కానీ శత్రువు ఒక్కటి మరచిపోయిండు
వాళ్ళది ఫీనిక్స్ జాతని
వాళ్ళు మళ్ళీ మళ్ళీ పుడుతారని, మంటలై లేస్తారని
వాళ్ళది నక్సల్బరీ, శ్రీకాకుళ తోవని
జనం కోసం బతికేటోళ్ళు నెత్తుటి బాకీ మర్చిపోరని
ఎత్తిన పిడికిలి దించపోరని

(జూన్ 28, 2012 బాసగూడ ఆదివాసుల హత్యాకాండను నిరసిస్తూ...)

శివుడో! శివసాగరుడా!!

- శిఖా - ఆకాష్

మార్తమ్మ మనుమడా
రోకలి పాటల వారసుడా
శివుడో! శివసాగరుడా!!
ఓ వసంతకాల మేఘ గర్జనా
మాలపల్లి మట్టిలోని నెలవంక కీర్తనా
మాదిగవాడ దండెం మీది వరకీల పండుగా
శంకరం పాడు పిలగాడా
అడవి కొలను సూరీడా
నత్తగుల్ల గజ్జెకట్టి నాట్యమాడే
పర్ణశ పాటగాడా తెలంగాణ సాహసగాడా
నల్ల నల్లాటి సూరీడా
హోచిమిన్ వారసుడా
గురజాడ అడుగుజాడా
శ్రీశ్రీ ప్రేమికుడా
మా వాడా అంబేద్కరా
యోధుడా! స్వాప్నికుడా!!
ఉద్యమాల ఊపిరీ
విప్లవ దళిత కాపరీ
దళిత విప్లవ గడుసరీ వందనం
అయ్యా! నినుగన్న తల్లికి వందనం
నిను పెంచిన నేలకు వందనం
నీవు వేసిన బాటకు
నీవు నేర్పిన మాటకు
నీవు పాడిన పాటకు
నీవు రాసిన కవితకు
నీవు నేసిన సూరీడుకు వందనం
నీవు చేసిన విప్లవ దళిత ఉద్యమాలకు వందనం
ఎరుపెక్కిన మానవ తారకు వందనం
శిరసెత్తిన నీలి గగన సితారకు వందనం -

* * *

కవిత్వం కడుపుతో ఉండి శివసాగర్‌ని కన్నది
దళిత జీవితం ఆకలితో ఉండి
అసమానతలు పండి
మహోద్యమ యోధుడు సత్యమూర్తిని కన్నది కనుగొన్నది
మన కాలం వీరుణ్ణి కలకన్నది
కాలం విసిరిన సవాళ్ళకు కవిత్వం
శివసాగర్ సమాధాన మన్నది
నడుస్తున్న చరిత్ర
మండుతున్న మాదిగ దప్పుపై
నల్లాటి సురీణ్ణి ఆవిష్కరిస్తున్నది
చెప్పులు తెగిన కలలకు
నెత్తురు పండిన కాలానికి
కత్తి ఆరె తీసుకుని
కన్నీళ్ళతో చెప్పులు కుట్టినవాడే

నిజమైన హీరో అంటున్నది
నవలోక వికసనానికి
జీవ రవళి వినిపించడానికి
మనుష్యులంతా సమానమంటూ
ఆత్మగౌరవ శాసనమై
ఒక నిలువుటద్దం బద్దలయ్యింది
పెంకు పెంకులో ఎన్నెన్ని నీడలో...
నీడల గోడలో... గోడల జాడలో...
బహిష్కృతుడు కాడు
వెలివేయబడ్డవాడు కానేకాడు
ఎవడు వెలివేయగలడు చిరంజీవి సూరీణ్ణి
కులం ముసుగు కప్పుకున్న
విప్లవ దొంగల్ని కాల నేరస్తుల్ని నిలేసినవాడు
అగ్రహారానికి వరికీల వీధిని పరిచయం చేసినవాడు
మాలపేటల మాదిగ వాడల
గోండు వీథుల గిరిజన తండాల
గుండె డప్పై కొమ్ముబూరై మోగినవాడు
శ్రమశక్తుల చెమట నెత్తురుల
సహజ సౌందర్యాన్ని అక్షరాలకు అలమినవాడు
ఆయుధానికి జీవితాన్ని
జీవితానికి ఆయుధాన్ని అధ్యయనం చేయమని
విప్లవాల ఊపిరైన వాడు
చరిత్ర చీకటి కోణాలను శోధించిన అన్వేషి
మరో ప్రపంచాన్ని వాగ్దానం చేసిన క్రాంతదర్శి
కర్మ ఛండాలురుపై కసిగట్టినవాడు
పరమ ఛండాలుడై అగ్రహారం పసపట్టినవాడు
ఈ కాలానికి సరిపడని ఈ దేశాన నిలబడని
ఆలోచనల్ని చేయొద్దని గద్దించిన వాడు
శ్రమశక్తుల చెమట నెత్తురుల
బాసను యాసను గోసను
సౌందర్య శాస్త్రం చేసినవాడు

* * *

గుడిసెలో సూరీడు
నులక మంచం సూరీడు
నేలమీది సూరీడు చాప మీది సూరీడు
చెమట సేతుల సూరీడు
చెలమ కన్నుల సూరీడు
మట్టి పాదాల సూరీడు
మల్లె మొగ్గల సూరీడు
వేషం లేని మోసం రాని మాలపల్లి సూరీడు
నీలి ఆకాశ నిగనిగలా సూరీడు
కోరమీసం సూరీడు తలనెరసిన సూరీడు
బతుకు మాసిన సూరీడు
మరణ శయ్యన సూరీడు
ఎచటకు పోతావు మా సూరీడా
నల్లనల్లాటి సూరీడా మా దళిత సూరీడా
నేటి నిజం నీవు రేపటి యుద్ధం నీవు
మా కలవు నీవు కలల అలల కవాతు నీవు
ఉద్యమ బాటవు నీవు
దళిత విప్లవ సౌందర్య జీవధ్భాషవు నీవు
సజీవ శ్వాసవు నీవు

చిల్లికాణీ సొంతంగాని
దొంగదారులు చేతగాని
బతక నేర్వని గరీబోడు
విలువల గుణ సంపన్నుడు
శివుడో! శివసాగరుడా!!
సృజన నేత్రుడా! త్రికాలజ్ఞుడా!
నడచివచ్చిన దారి మరువని తోట రాముడా!
విముక్తి పాటై మోగిన నరుడో భాస్కరుడా!
ఓ మండుతున్న మాదిగ డప్పా!
మా వసంతకాల మేఘునా
ఆకు సెప్పుల సూరీడు
పల్లె పల్లెలో గుడిసె గుడిసెలో
కొండ కోనలో అడవి గుండెలో
సెలవేటి స్వరంలో
గంజి బువ్వైన వాడు
ఎద్దు కూరైన వాడు
ఆకు అలములైనవాడు నీటి చెలమలైనవాడు
కట్టు కథలను గొంతెత్తి
పడికట్టు కలలకు పదునైన చూపునిచ్చిన
విప్లవాల విలుకాడు
మానవ విలువల చెలికాడు
దళిత బహుజన సూరీడు
శివుడు! శివ సాగరుడు!!
ఆకలి పాటల సాయుధుడు
ఆత్మగౌరవ యుద్ధ వారసుడు

* * *

శివుడో! శివ సాగరుడా!
నీ పాట విన్న మట్టి కూడా పిడికిలెత్తేది
పిట్ట కూడా ట్రిగ్గర్‌పై వేలుపెట్టి గురిచూసి నొక్కేది
తూనీగ కూడా తుడుంపట్టి దుమికేది
మరణ భయమూ మరచిపోయి
మోడువారిన చెట్టు కూడా చిగురు కలలేసేది
నీలాకాశం కలువపూల కవిత రాసేది
చంద్ర నిప్పుల సూరీడు కూడా జాజిపూల జావళి కట్టేది
గంద్రగొడ్డలి చంద్రకాంతిని తేనెతుట్టెగ పట్టి తెచ్చేది
తుపాకులన్నీ చలాకీ కుందేళ్ళై గెంతులేసేవి
మందుపాతర మట్టిపూల ఫౌంటెనై నాట్యమాడేది
జలపాతమేదో ఇంద్ర ధనస్సై ఇళ్ళిల్లు తిరిగేది
వసంతం పిట్టల సంగీతమై కిలకిలా పరిమళించేది
వెను తిరగని అడవి నది చిరుగాలి సితార మీటేది
మబ్బులన్నీ ఒక్కటయ్యి వానై పలకరించేది
సునామీలు కూడా సుమవనాలై సొగసులొలికేవి
మరణమైనా సీతాకోక పువ్వై తిరిగి లేచేది

భవిష్యత్‌పై విశ్వాసంతో

- సముద్రుడు

ఒకరి నుండి మరొకరం
కరచాలనం....
ఆలింగనాల స్పర్శలో

లాల్ సలాం... లాల్ సలామ్‌లతో
కంపెనీలుగా విడిపోతూ
బెటాలియన్లుగా కలుస్తున్నాం
తన్నుకొస్తున్న గత స్మృతుల
జ్ఞాపకాల పొరల నుండి
పొంగుకొస్తున్న దుఃఖంలో
ఎగిసికొస్తున్న ఎక్కిళ్లు
నన్ను పూర్తిగా ఊపేస్తున్నాయి
మళ్ళీ కలుస్తామో... లేదోనని
వేధింపులతో మెదడు మొద్దుబారుతుంటే
విప్లవ సాధనలో
దండకారణ్యాన్ని విముక్తి చేద్దామంటూ
ఇంద్రావతి... గోదావరిలా కలియతిరుగుతూ
గలగలల... కలకలల
తన్మయత్వాలకు దూరంగా
గోదావరి... కృష్ణమ్మల
గలగలల మీద కప్పుకొన్న మంచుపొర
విచ్చుకోవడం ఎలా?
ఆలోచిస్తూ నేను
వరుసలో నిలబడ్డాను గాని
నా మది అంతా మహేశ్, మాధవ్‌ల పైననే -
మెదక్.. నల్లమలల ఎర్రమల్లెల పైననే
నేలకు బరువయ్యానన్న విధంగా
నా కాళ్ళు బరువెక్కి
అడుగు తీసి అడుగేస్తున్నానే కానీ
నా మనసంతా
తెలంగాణ సాంస్కృతిక కళాకారిణి బెల్లి లలిత పైననే
తూర్పు కొండల్లో ఉదయించిన చంద్రమౌళి
చంద్రగిరి గుట్టలకు శత్రువు నిప్పు పెడితే
ఆదిలాబాద్ అడవుల్లో జంగైన రామకృష్ణల పైనే
కాకతీయ, ఉస్మానియా యూనివర్సిటీలలో తిరిగి
జగిత్యాల జైత్రయాత్ర
ఇంద్రవెల్లి గోండు జాతరలై.
దక్షిణ మధ్య పశ్చిమాలను కలుపుతూ
ఉత్తర, ఈశాన్య భారతాల
ముక్కల చెక్కలను ఒకటి చేస్తూ
జాతుల బందికానాలను బద్దలు చేస్తూ
తాడిత.. పీడితుల చెయ్యిపట్టి
జన్నారం నుండి జంగల్ మహల్‌గా మండిన
భారత నూతన ప్రజాస్వామిక విప్లవ నిర్మాతలు
ఆజాద్.. కిషన్‌జీల
పట్టుకొని చిత్రహింసలు పెట్టి చంపడం పైనే
కాల్చిన ఆ కాళ్ళు
కోసిన ఆ గొంతు
విరిగిన ఆ దౌడ... చూపుడు వేలు
చిత్రహింసల కొలిమిలో
ఎత్తిన ఎర్ర పతాకాల పైనే.
విప్లవ గమనంలో
ఉత్థాన పతనాల
మలుపులు...
ఆటు... పోటుల
వెచ్చని రక్తంతో వేసిన బాటల
చెరగని జ్ఞాపకాల గుర్తుల్లో
అమరుల ఆశయాలు కొనసాగిద్దామంటుంటే
అర్ధ మస్తిష్కంతో
కొనసాగిద్దామంటున్నాను
నా ధ్యాసంతా గతంపైకి వెళ్తుంది
భవిష్యత్తు చిత్రపటంగా
చిత్రిస్తున్న కుంచే
ప్రత్యామ్నాయ రాజ్యాధికారాన్ని రచిస్తున్న
నేను...
కనిపించని దూరాన్ని చూడడానికి
అమరుల ఆశయాలను
సహాయంగా తీసుకుంటూ
నదీ నదాల దాటుతూ
భవిష్యత్‌పై విశ్వాసంతో
ప్రజాయుద్ధంలో భాగమయ్యాను...
లాకప్ చీకటిల నుండి
క్రాంతి దారుల్లో సాయుధుడైనాను
గెరిల్లాగా మారాను.

(ఫిబ్రవరి 19, 2012లో కల్సిన సందర్భాన్ని కవితగా...)

ఆజాద్ స్మృతిలో

- అరుణ్

భూ ఆకాశాలు బద్దలై
శిథిలాలు ధరణిపై రాలినట్టు
అంబర వీధుల్లో
విహరించే సూర్య చంద్రులు ఆరిపోయినట్టు
ఇదేంది అంత చీకటి
కాళ్ళ కింది భూమి కదిలాడుతుంది
కలత నిద్రలో శతకోటి జీవుల
కలవర పాటు ఏమిటి
వెకువ జామున
మంచు ముత్యాల ముద్దాడుతూ
ముంగిట్లో నాట్యమాడే
ఉషా కిరణాలు ఏమైనట్టు
అభివృద్ధి పేరుతో
అనాథల చేసే దగాకోరులపై
అక్షరాయుధాలతో చీకటిని చీల్చుతూ
విశాల జన వాహినిని కౌగిలించుకునే
ఆ అక్షరమాల ఏది
అసలు ఏమి జరిగుంటుంది?
చిరుగాలి చిన్నంగ చెంత చేరినాది
చెడు వార్త తెచ్చింది చెవుల వేసింది
ఆకాశ వానొచ్చి అలజడీ రేపింది
దుర్వార్త వచ్చింది
దుఃఖంలో ముంచింది
ఆ వార్త విన్న కాలగమనం
ఒకసారి స్తంభించి పోయింది

సంస్మరణ

చంద్రశ్రీకి నివాళి

మట్టిపూల పరిమళం ఆమె స్వరం. నిజంగానే కడగట్టు కులంలో నుంచి వికసించిన ఆ స్వరంలో నేల మధురిమ తప్ప మరేం పలుకుతుంది? గానానికి, కవిత్వానికి, సకల కళలకు జన్మస్థానమైన దళిత కులంలో పుట్టినందువల్ల చంద్రశ్రీ కళాకారుల కులంలో సముచిత స్థానం సంపాదించుకుంది. ఆమె గాత్రానికి జన నాట్యమండలి పదును పెట్టింది. విప్లవోద్యమం చూపు నిచ్చింది. ఆ జీవితం గురించి ఆమె ఏమనుకున్నా, కడదాకా ఆమెతో ఉన్న సన్నిహితులేమనుకున్నా ఆమె దళితవాద నుంచి విశాల ప్రపంచంలోకి అవే తీసుకొని వచ్చాయి. ఒక విమర్శనాత్మక చూపునిచ్చాయి. ఆమెలోని కళకు దారి వేశాయి. ఈ సంలీనమై పోయింది. పాట ఆమెలో అజరామరంగా ఉండిపోయింది.

జన నాట్యమండలిలో ఆమె ఎన్ని పాటలు పాడిందో, ఎందరిని ఉద్వేగానికి లోనుచేసిందో అదంతా ఆమె కళాత్మను ఎంత గాఢమైన అనుభవానికి లోను చేసిందోగాని, ఆమె పాడిన నల్లాని సూరీడు అజరామర గానం. శివసాగర్ దళిత కవిత్వోద్యమంలో రాసిన ఆ పాట దళిత సౌందర్య శాస్త్రానికి అద్భుతమైన ఉదాహరణ. ఆయన వెన్నెలను, చంద్రుడిని విప్లవ కవిత్వోద్యమంలో తిరుగులేని మార్క్సిస్ట్ ఈస్థటిక్స్‌తో వర్ణించారు. తిరిగి సూరీడ్ని అలా దళిత కవిత్వంలోకి తీసుకొని వచ్చారు. ఆ పాటలోని దళిత సౌందర్యం జనరంజకంగా చంద్రశ్రీ గళంలో వేలాది మందిని ఊపేసింది. శివసాగర్ కవిత్వం ఆమె గొంతులో మరింత గాఢమైన అభివ్యక్తిని సంతరించుకుంది. తెలుగు విప్లవ, దళిత కవిత్వానికి శివసాగర్ ఎంతో, ఆ కవనానికి చంద్రశ్రీ అంత. ఆమెకు మాత్రమే సాధ్యమయ్యే కవితాలాపన అది.

దళిత స్త్రీ గాయనిగా ప్రజా సాంస్కృతికోద్యమంలో ఆమెది చాలా ప్రత్యేక స్థానం. శివసాగర్ వెళ్ళిపోయిన కొన్నాళ్ళకే చంద్రశ్రీ కూడా దూరం కావడం విప్లవ, దళిత సాహిత్య సాంస్కృతికోద్యమానికి తీరని వెలితి. ఆమె లేకపోయినా - దళితుల, అందునా దళిత మహిళల సాంఘిక విముక్తి నిజమయ్యే వరకు, ఆమె తొలినాళ్ళ జీవితాన్ని దిక్సూచీగా నడిపిన విప్లవోద్యమం విజయవంతం అయ్యే వరకు అరుదైన ఆమె స్వరం వినిపిస్తూనే ఉంటుంది. విరసం ఆమె స్మృతికి నివాళి ప్రకటిస్తోంది.

మొన్న సుధాకర్
నిన్న అప్పారావు
నేడు ఆజాద్
ఇలా! ఎందుకు జరుగుతుంది!
కుట్రలు కుతంత్రాలు సంక్షోభాలు
 నిషేధం నిర్బంధం
 ఎమర్జెన్సీ చీకటి
 విలయ తాండవ మాడుతున్న
ఆటుపోటు అలల నడుమ
'పల్లెలే పాఠశాలలు ప్రజలే గురువులు'
పల్లె బడిలో సైద్ధాంతిక రాజకీయ
ఎన్నెన్నో అనుభవాలు గడించి
సామాజిక, వ్యతిరేక పరిస్థితులకు
విషం కక్కే నల్ల తాచులకు
నిత్యన్వేషణలతో
వైద్యం చేసే మార్క్సిస్టు (కిషన్‌జీవి) వైద్యుడివి
విప్లవ కారులం విముక్తి చేస్తమని
పార్లమెంట్ పందుల దొడ్లో దొర్లుతున్న
 - విప్లవకారులకి
మార్క్స్ మైక్రోస్కోప్‌తో పరీక్షించి
రాసి వాసి వేరు చేసి చూపిన పరిశోధకుడేడి
హెచ్ఐవి వ్యాధికి మందు లేదు
దోపిడి వైరస్‌కు వైద్యం లేదని విర్రవీగే
మట్టికాళ్ళ మహా రాక్షసికి
ఎంఎల్ఎం యాంటి బయోటిక్‌తో
 వైద్యం పరిశోధిస్తున్నవాడు
ఆజాద్! ఆజాద్ ఉండే....
దోపిడికి నూకలు చెల్లుతాయని
 తేనె పూసిన కత్తిలా
 శాంతి చర్చల నాటకమాడి
వలవేసి పట్టిన ఎస్ఐబి స్పాటర్స్
దుర్మార్గంగ హత్యచేస్తే
పండుగ చేసుకుంది పాలకవర్గం
నీ మరణం పాలకవర్గానికి సంతోషాన్నిస్తే
నీ మరణం కార్మిక వర్గానికి విషాదాన్నిచ్చింది
చిందిన నీ నెత్తురుతో తడిసిన భారత భూమాత
పులకరించి వేల వేల వీరులకు పురుడు పోస్తుంది
నీవు నాటిన విప్లవ మొక్కలు
పెరిగి వృక్షాలై దోపిడి వర్గానికి
ఉరితాళ్ళు పేనుతున్నాయి
ఆజాద్ ఆశయ సాధనకై
పిఎల్‌జిఎ అంకితమైంది
'కాలేజీ రోజుల్లో
రెయింబవళ్ళు నీ ప్రశ్నావళి
సురాపనేని ఒర్పు నేర్పు
నీకు ఎంతో మార్గదర్శకం
నీవు నిజంగా పేద ప్రజలను
పెనవేసుకున్న మల్లెతీగవు
మార్క్సిస్టు మహావృక్షంలా
విద్యార్థి మేధావులకు తోడునీడగా ఉంటూ
విప్లవ మార్గం చూపిన మహనీయుడవు
అన్యవర్గ ధోరణులు ...
పార్టీలో చెదపురుగులా విస్తరిస్తూ ఉంటే
అన్యవర్గ ధోరణులపై అహర్నిశలు పోరాడుతూ
నీ ప్రియమైన ప్రజానికానికి దిక్సూచివైనావు!

('ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్) స్మృతిలో')

కథ

జీవన వేదం

- మంచికంటి

పాపం కాలు గాలిన పిల్లిలాగా తిరుగుతూనే ఉన్నాడు నాన్న. ఎంతసేపని అలా తిరుగుతాడు? అవును... రోళ్ళు పగిలే ఎండలు కాయాల్సిన ఎండాకాలంలో హోరుమంటూ కురిసే వర్షాలు చూసి రైతు హృదయమున్న ఏ మనిషి స్థిమితంగా, గుండె నిబ్బరంతో నిలబడగలడు?

బయటకు పోతాడు.. ఆకాశంలోకి చూస్తాడు.. ఏమనుకుంటాడో! మళ్ళీ లోపలకు వొస్తాడు. ఇంట్లోకి తొంగి చూస్తాడు! 'ఏమన్నా కావాలా నాన్నా?' అని అడిగితే ఏమీ వొద్దని తల ఊపుతూ అలాగే ఆకాశాన్ని చూస్తూ ఇంటిపంచనే నిలబడతాడు.

ఏ మాట చెప్పి ఆయన్ని ఓదార్చే పరిస్థితి లేదు. ఎవరు ఎన్ని రకాలుగా మాట్లాడినా, ఎలా నచ్చచెప్పాలని చూసినా ఉపయోగమేమీ లేదు. ఇప్పుడు ఆయన్ని ఓదార్చడం ఎవరి తరమూ కాదు. ఒక్క వానవల్ల తప్ప. జోరుగా కురిసే వాన వెలిస్తేనే... ఆకాశంలో మేఘాలు చెల్లా చెదురైపోతేనే... సూర్యుడు కొట్టొచ్చినట్టుగా బయటకు వొస్తేనే... ఆయన శాంతిస్తాడు. ఆయన మనసు అప్పుడు కుదుటపడుతుంది.

ఏం చేస్తాం? రైతు మనసాయనిది. సుతి మెత్తని మనిషి మనసాయనిది. అందుకే ఎప్పుడూ గాయపడుతూనే ఉంటాడు.

'ఏందండీ మీరు కూడా కదలకుండా చూస్తూనే ఉన్నారు. అసలే వర్షానికి ఇల్లూ వాకిలీ అంతా తడిసి ముద్దయిపోయింది. ఎక్కడా పొడి అన్నమాటే లేదు. అటూ ఇటూ తెగ తిరుగుతున్నాడు మీ నాన్న. కదలకుండా కూర్చోమని చెప్పొచ్చుగా' అరుణ విసుక్కుంది.

ఏం చెప్పాలి? పాపం ఆయనో గాయపడ్డ హంసలా గిలగిల్లాడి పోతున్నాడు. విలవిల్లాడి పోతున్నాడు.

ఈసారి దగ్గరగా వొచ్చాడు. ఏదో మాట్లాడాలని నోరు తెరిచాడు. మా పనుల్లో మేము ఉండడంతో మళ్ళీ బయటికి చూశాడు.

పాపం కదిలించడానికే భయపడుతున్నాడు. ఏం మాట్లాడితే ఎవరు విసుక్కుంటారోనన్న బిడియం. ముసలివాళ్ళతో మనసు విప్పి మాట్లాడేవాళ్ళు లేక ఎంతగా విలవిల్లాడిపోతున్నారో!...ప్చ్

'నాన్నా..' నేను పిలవడంతో నా వైపుకు తిరిగాడు. ఆయన విషాద మొహంలో ఎన్ని వెలుగు రేకలు ఒక్కసారిగా విచ్చుకున్నాయో.

పాపం వడివడిగా దగ్గరకు వొచ్చాడు. ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

'ఎందుకు నాన్నా ఆ వానలో అటూ ఇటూ తిరుగుతున్నావు' అడిగాను కుర్చీ తెచ్చి కూర్చోమంటూ.

'ఎందుకు లేయ్యా తడిగుడ్డల్తో ఉండాను. కుర్చీ పాడైపోయిద్ది' అంటూ నిలబడే ఉన్నాడు.

'పరవాలేదులే కూర్చో నాన్నా' అనడంతో భయం భయంగా కుర్చీ అంచున కూర్చున్నాడు.

'ఎందుకు నాన్నా కంగారుగా అటూ ఇటూ తిరుగుతున్నావు' అన్నాను. ఆ మాటలకు ఆయన గాయాల్ని చల్లని లేపనంతో అద్దుతున్నట్టుగా సంబరపడిపోయాడు.

'వానలు చూస్తున్నావు కదయ్యా... ఏం వానలు' అంటూ బయట కురుస్తున్న వాన వైపు చెయ్యి చూయించాడు. అవునన్నట్టుగా నేనూ తలూపాను.

'మరీ కలికాలంగా ఉందయ్యా. ఈ కాలంలో ఎప్పుడైనా వానలుపడ్డం చూశామంటయ్యా. ఎప్పుడూ లేదయ్యా' ప్రశ్నా సమాధానం రెండూ ఆయనే చెప్పాడు. 'పేపర్లలో కూడా ఏశారంట కదయ్యా. దేశమంతా అల్లకల్లోలంగా ఉందంటనే. టీవీల్లో కూడా చూయిస్తున్నారంట గదా!' టీవీ వైపు చూస్తూ చెప్పాడు.

లోపలికి పోయి పేపర్ తీసుకువొచ్చి తీసి బొమ్మలు చూయించాను. 'అ... రె... రె... రే... చూడయ్యా నీళ్ళల్లో ఉందయ్యయ్యా పంటలన్నీ. కమ్మని పంటలు నోటికాడకి వొచ్చేసరికి ముదనష్టపు వాన... ముదనష్టపు వానని మొఖాన పెట్టుకుందయ్యా'.

పేజీలు తిరగేస్తుంటే బొమ్మల వైపు చూస్తున్న ఆయన మొహంలో రంగులు మారసాగేయి.

ఇంకొద్దిసేపు ఆ బొమ్మల్ని అలాగే చూస్తూ భోరుమని అక్కడే ఏడ్చేటట్టున్నాడనిపించింది. అందుకే పేపర్ మూసి పక్కన పడేశాను.

'మనూళ్ళో గూడా ఈ వాన ఇట్నే ఉండుంటది గదయ్యా. పాపం అందరూ పొలాల మీదే ఉండి ఉంటారు' తన పొలమేదో నీట మునుగుతున్నట్టుగా దిగాలు పడిపోయాడు.

'అన్ని చోట్లా ఉందంట నాన్నా ఈ వర్షం' నెమ్మదిగా చెప్పాను.

'మరేనయ్యా అందరూ పొలాల మీద పడి దేవుకుంటా ఉంటారయ్యా. వొరి, పొగాకు, సెనగ, మిరపకాయలు అన్నీ... అన్నీ పొలాల మీద ఉండే ఉంటయ్యయ్యా. పాపం... నోటి కాడికి వొచ్చిన కూడు తీసిందయ్యా వాన ముదనష్టపు వాన. ముదనష్టపు వానని...' గుండె లోతుల్లో ఒక్కో పొరా కత్తితో ఎవరో పరపరా కోసేస్తున్నట్టుగా మాట్లాడుతున్నాడు.

'ఊళ్ళోనన్నా ఉంటే వాళ్ళ సాదక బాధకాల్లో పాలు పంచుకునేవాడినయ్యా... మనకేమో అక్కడ ఉండడానికి కుదిరి సావక పోయె' తన వాళ్ళందరూ అక్కడే ఉండి పోయారనే బాధతో చెప్పాడు.

మౌనంగా తల ఊపాన్నేను. 'నువ్వేం జేస్తావులే అయ్యా. కుదరకనే గదా! కుదిరితే నువ్వు మాత్రం ఇక్కడెందుకు ఉంటావు' ఆయనే నన్ను సమాధానపరచడానికి ప్రయత్నించాడు. 'దేనికైనా సర్దుబాటు చేసుకోవాలకదయ్యా' మళ్ళీ ఆయనే అన్నాడు.

ఇరుకిరుకు ఇళ్ళల్లో అంతకన్నా ఇరుకైన మనసుల మనుషుల్తో సర్దుకుపోవడం కష్టమే నాన్నా. ఏం చేస్తాం... ఇంతకంటే నేను ఏమీ చెయ్యలేకపోతున్నాను.

కాలం నా జీవితమ్మీద కసిగా రాక్షసపాదం మోపింది నాన్నా.

అందరిలా ఆలోచించలేకపోవడం, అందరిలా ఉండలేకపోవడం నా బలహీనతో... మానవీయతో అర్థంకాని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నాను. నన్ను కనీ పెంచి పోషించినందుకు నువ్వు బాధపడుతున్నావో. నీ కడుపున పుట్టినందుకు నేను ఇబ్బంది పడుతున్నానో నాకే అర్థంకాని అయోమయంలో ఉన్నాను నాన్నా.

నా మౌనం చూసి చాలాసేపు ఆయన కూడా అలాగే మౌనంగా ఉండిపోయాడు.

తినడానికేదో తెచ్చి ఇద్దరికీ గిన్నెలు అందించింది అరుణ.

'ఎందుకంటా ఆయనకంత విచారం. మన పొలాల్లో పంటలన్నీ మునిగి పోయినట్టుగా దిగాలు పడికూర్చున్నాడు. ఎవరియ్యో గాలివానకు పోయేదానికి ఈయన గారికెందుకంట అంత కంగారు' అంటూ విసురుగా వెళ్ళింది.

'ఏందంటయ్యా అమ్మాయి అంటంది. నాకు ఇనపడి సావదు. సెవులు మరీ దిబ్బలై పోయాయయ్యా' గిన్నెలో గింజలు ఒక్కొక్కటి చేత్తో ఎగరేసి నోట్లో వేసుకుంటూ చెప్పాడు.

ఎంత అదృష్టవంతుడిని నాన్నా, వినపడకపోవడం కూడా ఈ వయసులో మీకు వరమేనేమో! లేకుంటే మేము విసుక్కుంటూ మిమ్మల్ని అనే మాటలన్నీ మీ చెవిన పడితే ఎన్నెన్నిసార్లు గుండెలు పగిలి చావాల్సి వొస్తుందో కదా!

సమాధానం కోసం అలాగే నా వైపు ఎదురుచూడ సాగేరు. ఏమీ లేదులే అని తల ఊపాన్నేను.

ఆ పిచ్చిదానికి ఏం తెలుసు నాన్నా. మన కోసం మాత్రమే మనం బాధపడడంలో గొప్పతనం ఏమీ ఉండదని. అలాంటి లక్షణాలకి మా జీవితాల్లోనే తావులేకుండా పోయిందివాళ. ఇతరులను చూసి జాలి పడడం, వాళ్ళ బాధల్ని చూసి మనం కూడా బాధపడడం, చేతనైనంత సహాయం చెయ్యడం మర్చిపోతున్నారు నాన్నా మనుషులు... మర్చిపోతున్నారు. మరీ రాతి మనుషులుగా మారిపోతున్నారు.

ఇంకా మిగిలి ఉన్న మీలాంటి వాళ్ళని చూసి నవ్వుతారు. వెక్కిరిస్తారు. ఎగతాళి చేస్తారు. హృదయంలో స్పందించే లక్షణాల్నే కోల్పోతున్నాం నాన్నా మేము... కోల్పోతున్నాం...

ఆయన గిన్నెలో గింజలు తినడంలో ఎంతో హుందాతనం కనిపిస్తుంది. తన్మయత్వంతో నములుతుంటే... తినేటప్పుడు ఎంతమైమరచిపోయి తినాలో ఆయన్ను చూస్తుంటేనే అర్థమౌతుంది. పాపం నాన్న చేసే పనులన్నీ ఇంట్లో చెబితే ఇంకేమైనా ఉందా! కొంప కొల్లేరైపోదూ!

అప్పుడప్పుడూ ఎవరూ చూడకుండా పని మనిషికి ఐదో పదో ఇస్తూనే ఉంటాడు. 'అదేంది నాన్నా నెలనెలా మనం జీతం ఇస్తున్నాం కదా' అంటే... 'పోనియ్యిలేయ్యా దానికి మాత్రం గడవొద్దంటా! ఎన్ని ఇళ్ళల్లో పాచిపని చేస్తే ఇంటిల్లిపాదీ అన్నం తింటారయ్యా' అన్నాడు. ఇలాంటి విషయాలన్నీ గుండెల్లో దాచుకోవాల్సిందే! ఇంట్లో చెబితేనా... అమ్మో...

'ఏమండీ ఇంట్లో సామాన్లు కొన్ని కనబడడం లేదు. ఏమైపోయాయో ఏమో అర్థం కావడం లేదు' లోపలి నుండి కేక వేసింది. అరుణవైపు చూయిస్తూ 'ఏందో కేక వేస్తుంది పో...' అంటూ చేతిలో గిన్నెను కడగడానికి బయటకు తీసుకువెళ్ళాడు.

'నాన్న లోపలేమన్నా పెట్టాడేమో చూడు. అంట్లు ఎక్కువై పోతున్నయ్యని పని మనిషి రోజూ నసుగుతుందని అంటున్నాడు'.

'ఓహో పని మనిషికి కష్టం తగలగూడదు. మీకూ కష్టం తగలగూడదు. అయితే మీరు ఇద్దరూ కలిసి సాయమన్నా చెయ్యండామెకి. ఏం ఆమెకేమన్నా జీతం ఇయ్యడం లేదంటనా! రోజూ మిగిలిన అన్నమూ కూరలు కూడా ఎత్తుకునే పోతుందిగదా!'

'ఎంత త్యాగం చేస్తున్నావో పాపం. అవి ఎలాగూ పారేసేవే కాబట్టి పెడుతున్నాంగానీ, మనం వొండుకున్నయ్యి వేడివేడిగా పెడుతున్నామా! అలా పెడితే, అప్పుడు మన గొప్పతనం బయటపడేది' నవ్వుతూ అన్నాను.

'మీతో మాట్లాడాను చూడండీ... నాదీ బుద్ధి తక్కువ. ఎప్పుడూ బజార్లో వాళ్ళను వెనకేసుకు రావడమే గానీ ఎప్పుడన్నా... ఒక్క సారి నా వైపు నిలబడి మాట్లాడారా! ఎందుకు మాట్లాడతారూ... నేనంటే అంత అలుసు మీకు'... విసరుగా షెల్ఫ్‌ల తలుపులు తీసి మాయమైన గిన్నెల వేటలో పడిపోయింది.

అంతేలే ఉన్నమాటంటే ఉలుకెక్కువ ఎవరికైనా.... సత్యాన్వేషి ఎప్పుడూ లోకవిరోధే. ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం. తిట్లు తినడం నాకు అలవాటేగా! వారసత్వంగా వొచ్చిన లక్షణాలు కొన్ని ఉంటాయి. వాటిని ఎవ్వరూ చెరిపెయ్యలేరు గదా!

'మీలో మీరు తరువాత మాట్లాడుకుందురుగానీ అటు చూడండి. అక్కడ మీ నాన్నేం చేస్తున్నాడో!' అంటూ మళ్ళీ దగ్గరగా వచ్చింది. అటువైపు చూశాను ఏముందోనని. అక్కడ నాన్న నిలబడి, సంచీలో బట్టలు పెడుతున్నాడు.

'చూశారా ఇప్పటికిప్పుడూ బట్టలు సర్ది ప్రయాణానికి సిద్ధమౌతున్నాడు. ఈ ముసలి వాళ్ళని అనుకోవాలి. ఎప్పుడేం చేస్తారో తెలియదు' ఎక్కడికి నోటితోనే సైగ చేశాను.

'ఆ... ఇంకెక్కడికి ఊరికే అయ్యుంటుంది' వెటకారంగా అంది అరుణ. అబ్బా వినబడుతుందే అన్నట్టు చూయిస్తూ తల పట్టుకోవడం నావంతయింది.

ఎప్పుడూ ఏమి మాట్లాడాలో తెలియదు. పెద్దవాళ్ళని ఒక మాటంటే తక్కువ రెండు మాటలంటే ఎక్కువ. ఊరకే అలుగుతారైతే! అయినా ఏదోకరకంగా సూటిపోటి మాటలతో పొడుస్తానే ఉంటారు గదా!.

'ఏంది నాన్నా ఎక్కడికి బట్టలు సర్దుతున్నావు?' దగ్గరగా పోయి అడిగాను. మందు బిళ్ళలు వంక చూస్తూ బారుకీ పోయి వస్తానయ్యా. కళ్ళు మూసినా తెరిచినా ఊరే కనబడుతుందయ్యా' గొంతులో ఆందోళన జీరగా కదలాడింది.

'నేను చెప్పానా... ఎప్పుడైనా ఉన్న విషయమే చెబుతాను. అయినా నా మాటంటే కరివేపాకును పారేసినట్టుగా తీసిపారేస్తారు మీరు' అక్కడే నిలబడి అంటుందామె.

'అవును పోనియ్యి....పోతే ఏమైందంట చూసి రానియ్యి. మనూరేగా పోతుంది' నెమ్మదిగా చెప్పాను.

'ఏందండీ మీరు కూడానూ... వొద్దని చెప్పరేంది. ఎవరినో విచారించడానికి ఈయన పోయేదేందండీ. అంటూ ఇటూ

తిరుగుతాడు. బస్సు ఎక్కుతానో దిగుతానో జారి పడతాడు. కాలో చెయ్యో విరిగిందనుకోండి. ఎవరు చూస్తారంట'

'అలాగంటే ఎలాగా...! ముసలివాళ్ళు పిల్లలతో సమానం. ఏ పని చెయ్యాలనుకుంటే ఆ పని చేస్తారు. అలా చెయ్యనియ్యలేదనుకో, లోపల్లోపలే కుమిలిపోతారు'

'అంతేలే ఆయన తాన అంటే మీరు తందాన అంటూ ఉండండి. మీ ఇద్దరి మధ్యలో నేను ఇరుక్కుని చస్తున్నాను.

మనం మన వరకే ఆలోచించుకునే సంకుచిత మనస్కులం. వాళ్ళు మునులు.. యోగులు.. మహర్షులు... అంతకన్నా ఎక్కువే. వాళ్ళకి తనా పరా భేదం తెలియదు. అందరూ బాగుండాలనే కోరుకుంటారు. ఎవరికి ఏ ఆపదవొచ్చినా విలవిల్లాడిపోతారు.

'పాపం గొడ్డూ గోదా ఎట్టెట్ట ఉండాయో... ఎవురెవురికి ఎంతెంత నష్టం వొచ్చిందోనయ్యా. ఆరుగాలం పొలం మీదబడి చెయ్యడం ఏదోరకంగా నష్టపోవడం రైతాంగానికి మామూలై పోయిందయ్యా. ఏం జేస్తున్నాము మనం.. ఒక్కమాట పలకరించడమే కదా!' గొణుక్కుంటూ పోతున్నాడు.

'అబ్బో చలి అమ్మో చలి... ఊ... ఊ... చలి చలి' పరుగులాంటి నడకతో లోపలికి వచ్చాడు ఆంజనేయులు.

'ఏందిరా ఎప్పుడనంగా చెప్పాను నీకు బెల్లం తెమ్మని. ఏమైపోయావు?' ముసలాయనమీద కోపం ఆంజనేయులు మీద చూయించింది అరుణ.

'ఎక్కడమ్మా.. ఇల్లిల్లూ తిరగడమయ్యా. ఒక పక్క జోరున వాన కురుస్తా ఉండే. అందరికి అన్నీ చేరెయ్యాలి కదా! ఏందమ్మా ముసలాయన దారి బట్టాడు. మళ్ళీ ఏదో ఉపద్రవం తెచ్చినట్టున్నాడే!

'రేయ్ ఊరుకోరా! మండే పొయ్యిలో మరోపుల్ల యేస్తావు' కసురుకున్నాను.

'అమ్మా అందరూ నిన్ను ఏట్లోముంచడం ఖాయం. పాపం నువ్వు కాబట్టి నెట్టుకొని వస్తున్నావుగానీ...'

'రేయ్ నోరుమూస్తావా లేదా నువ్వు' అరిచాను పెద్దగా.

'ఏందండీ వాడిని కసురుకుంటారెందుకు? పోయే ఆయన్ని ఆపండి చేతనైతే' కోపంగా నావంక చూసింది. 'మీ మధ్య నేనెందుకులే' అంటూ ఆంజనేయులు నావంక నిరసన చూపొకటి చూసి వెళ్ళాడు.

'అరుణమ్మా నేనెల్లొస్తానమ్మా' అంటూ నాన్న దారిబట్టాడు.

ఏం చెయ్యమంటావు, నువ్వూ నేనూ ఆపితే ఆగే మనుషులేనా. వాళ్ళు పట్టిన కుందేలుకు మూడేకాళ్ళు కదా! ఆ తరమంతే. మనుషుల మధ్యనే ఉంటారు. మంచి మనుషుల్తో ఉంటారు. ఎవరెన్ని చెప్పినా చెప్పకపోయినా మనిషికీ మనిషికీ మధ్య సజీవమైన సంబంధాలు కలిగి ఉంటారు. ఆ బంధాల్ని తెంచడం ఎవరివల్లా కాదు. ఆ సంబంధాలు తుంచడం పుట్టించిన వాడి తరం కూడా కాదు.

'ఎంత చెప్పినా ఉలకరూ పలకరేందండీ. మీ మౌనంతో చచ్చిపోతున్నాను బాబూ! మీకూ తెలియదు. నేను చెప్పినా వినరు'.

అవసరమైనప్పుడు మాటల్ని జయించినవాడు మహర్షులతో సమానం తెలుసా! మౌనం ఎంత గంభీరంగా ఉంటుందో! ఎన్నెన్నో గొప్పగొప్ప సమస్యలకు కూడా ఒక్కొక్కప్పుడు ఎంతమంచి పరిష్కారమో కదా ఈ మౌనం. అందుకే ఈ సమయంలో మాట్లాడే అవసరం కంటే మాట్లాడకపోవడంలోనే సమస్యకి పరిష్కారం కనబడుతుంది.

'అయినా నాకెందుకులే మీ తండ్రీ కొడుకుల మధ్యన. మీరూ మీరూ ఏమైనా చేసుకోండి. రేపు ఏమైనా జరిగిందంటే మాత్రం నాకు తెలియదు. మీరే చూసుకోవాలి'

ఆమెను చూస్తూ నాన్నను అనుసరించాను.

* * *

'ఇంటా బైటా చెయ్యలేక చస్తున్నాను. ఆఫీసుకెళ్తే ఆ మేనేజర్ గాడితో ఒకటే గొడవ, నస పెడుతూనే ఉంటాడు. ఏడుపొక్కటే తక్కువ. ఇంటికొస్తే మీ అబ్బా కొడుకులుతోనూ చస్తున్నాను' కళ్ళ నీళ్ళు పెట్టుకుంది అరుణ.

'ఎలాగా అరుణా అలాగంటే. ఓర్పు కావాలి మనిషికి. సహనం సరిహద్దుల్లో నిలబడి ఆలోచించాలి. ఇవాళ పరిస్థితి మారిపోయింది, దానికి అనుగుణంగా మనమూ మారాలి. ఇప్పుడు ఎవ్వరూ ఎవర్నీ మనుషులుగా గుర్తించే పరిస్థితే లేదు. అయినా మన అవసరాలకు మౌనంగా తలవొంచుకుని వెళ్ళి పని చేసుకురావడమే.

ఒకప్పటి పరిస్థితి వేరుగా ఉండేది. ఎక్కడకు పోయినా ఎంతో వినయ విధేయతలతో ఉండేవాళ్ళు మనుషులు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చిటికలో చేసి పెట్టేవాళ్ళు. ఏమీ చెయ్యలేకపోయినా ఆత్మీయంగా పలకరించేవాళ్ళు ముందు. మనం అడిగిన విషయం వాళ్ళకు తెలియకపోయినా తెలిసిన వాళ్ళ దగ్గరకు మార్గం చూపించేవాళ్ళు.

ఇప్పుడలా లేదు. ఇళ్ళల్లో, ఆఫీసుల్లో ఎక్కడైనా సరే.. సమాజమే అలాగ తయారైంది. ఎవ్వరూ ఎవ్వర్నీ గౌరవించుకోవడం లేదు. ఒకర్నొకరు కబళించేసే శత్రువుల్లా చూసుకుంటున్నారు. పరస్పర ద్వేషాలు మితిమీరిపోయాయి. ఎప్పుడెప్పుడు పక్కవాణ్ణి కబళించుకుపోదామా అనే ఆలోచనలో ఉన్నారే తప్ప మనిషిగా గుర్తించే పరిస్థితి లేదివాళ.

నువ్వైనా... నేనైనా... మరెవరైనా వొస్తున్న మార్పులకు తలవంచాల్సిందే. అయితే మనం మనల్ని కోల్పోకుండా, మానవత్వాన్ని కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాన్ని మాత్రం చేస్తూనే ఉండాలి. పరిస్థితుల్ని అర్థం చేసుకోని వాళ్ళు మౌనంగా నీలాగా ఎప్పుడూ బాధలు పడుతూ ఉంటారు.

మనవా మధ్య తరగతి కుటుంబాలు. ఉన్నవళంగా భాగ్యవంతులమయ్యే అవకాశమూ లేదు. వేన్నీళ్ళకు చన్నీళ్ళని కదా ఈ ప్రైవేటు ఉద్యోగాలైనా చెయ్యాల్సొస్తుంది. ఏదోరకంగా మన జీవితాల్ని ఇలా ఈడ్చాల్సిందే. అటు చావలేమూ. ఇటు బతకలేమూ. ఎక్కడికక్కడ రోజురోజుకీ ఖర్చులు పెరిగిపోతున్నాయి.

పిల్లల చదువుల్ని కొనే పరిస్థితి ఉందా! అందరూ ఎక్కడికెక్కడికో తీసుకువెళ్ళి చదివించుకుంటున్నారు. వాళ్ళ భవిష్యత్తు కూడా ముఖ్యమే కదా! మన జీవితాలు ఎలాగూ బుగ్గిపాలైపోయాయి. కనీసం మన పిల్లల భవిష్యత్తన్నా తీర్చిదిద్దుకుందాం.

ఇలారా ఎందుకు ప్రతిదానికీ ఏడుస్తావు? సమస్య వొచ్చినప్పుడల్లా ఏడవడమే పరిష్కారం కాదు. ధైర్యంగా నిలబడి ఆలోచించాలి. ఆలోచనలోనే పరిష్కారాన్ని సాధించాలి. రా...

ఇలారా...'

'ఇప్పుడు మీ దగ్గరకొస్తే ఇంట్లో పనెవరు చేస్తారంట?' కళ్ళు తుడుచుకుంటూనే దగ్గరగా వొచ్చింది.

ఎంతటి బాధలోనూ ఒక చిన్న ఓదార్పు మనుషుల్ని ఎంత దగ్గరగా చేస్తుందో కదా! భార్యాభర్తలు దగ్గరైనప్పుడు ఎన్నెన్నో సమస్యలకు పరిష్కారాలు చిటికెలో దొరుకుతాయి.

ఏదేమైనా మనుషులు శారీరకంగా దగ్గరైనా మానసికంగా ఎంతెంతో దూరం పెరుగుతుంది. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటేనే గదా భార్యాభర్తల అనుబంధం కలకాలం నిలబడేది.

'పిచ్చిమొద్దా ఎందుకు ఏడుస్తావు. నేనెలాగూ నిన్ను సుఖపెట్టలేకపోతున్నాను. అందరిలాగా మంచి మంచి చీరలూ నగలూ కొని పెట్టలేకపోతున్నాను. మన పిల్లలన్నా బాగా చదువుకొని గొప్పవాళ్ళయి నీకు కావలసినవి అన్నీ కొని పెడతారు. అందుకే వాళ్ళకోసమన్నా కష్టపడాలి మనం. ఎన్ని బాధలుపడ్డా వాళ్ళ భవిష్యత్తుని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మన మీద ఉంది. రాబోయే మంచి రోజుల కోసం ఇవ్వాళ్టి నుంచే కలలు కంటూ బతకాలి తెలుసా' అన్నాను తల నిమురుతూ.

'మీరు కనండి కలలు. మాటలైతే చెబుతారు మెత్తమెత్తగా. ఎన్నిరోజులైనా మన బతుకుల్లో మార్పే లేకపోయనే. ఎంత కాలమని చెప్పండి ఈ బాధల్ని భరించడం. ఒక రోజా! రెండు రోజులా! జీవితాంతం ఇలాగే ఉంటే మనిషిలో ఆనందం ఎలా ఉంటుందండీ! జవజీవాలు చచ్చిపోవా!'

'ఆనందం వెతుక్కునే దాంట్లోనూ... చూసే చూపులోనూ ఉంటుంది. మనకు కావాల్సిన వొస్తువు దొరక లేదనుకో! దొరికిన దాంతోనే తృప్తి పడితే దానిలో దొరుకుతుంది ఆనందం. ఎప్పుడూ పక్కవాడితో పోల్చుకుని వాళ్ళకు ఉన్న మనకు లేవే అని ఏడుస్తూ ఉన్నామనుకో మనకున్న ఆనందం కాస్తా హారతి కర్పూరంలా హరించుకుపోతుంది. అందుకే పోల్చుకోవడమంత భయంకరమైన మహమ్మారి ఈ ప్రపంచంలో మరొకటి లేదు. ఆశలు ఉండాలే కాని అత్యాశకు పోకూడదు'

'ఊ... మాటలు మాత్రం మెత్తగా చెబుతారు గానీ... సంపాయించే మార్గం ఆలోచించరు. నాకు అవతల బోలెడంత పనుంది. లేవనీయండి' చెయ్యితీసి పైకి లేవబోయింది.

'మనలాంటి వాళ్ళకి ఉచితంగా దొరికేది. ఆప్యాయమైన ఒక పలకరింపు. అమృతప్రాయమైన ఒక చిరునవ్వు. ఆనందమయమైన ఒక కౌగిలే. మన సమస్యలు దూరంగా పారిపోవడానికి ఇవే దివ్యమైన ఔషధాలు. వీటికి కూడా దూరమైపోతే అగాధాల్లో ఉన్న మన జీవితాల్లో సంతోషం ఎప్పుడు పండుతుంది చెప్పు'.

'...సంతోషమా... ఆ మాట ఎప్పటికి అనుకోవాలండీ మనము?' పేలవంగా నవ్వింది.

'మరీ అంత నిరాశపడితే ఎలాగా! నిజమే... ఎప్పుడో సన్నని వర్షంలా మొదలైన బాధ జీవితం మొదటి అంచునే ఆరంభమైపోయింది. అది అలా పెరిగి పెరిగి చిరుజల్లై... జడివానై... వెల్లువై... పెను ఉప్పెనై మన జీవితాల్నే ముంచేసింది. ఇంక ఎప్పటికి తేలగలము... అసలు తేలుతామా ముంపులోనే ఉండిపోతామా!'

'ఏందలా! కన్నార్పకుండా చూస్తున్నారు'.

'ఇవాళెందుకో చాలా అందంగా కనిపిస్తున్నావోయ్'.

'ఏందంట రోజూలేనిది ఇవాళ కనిపించేది'.

'ప్రతి భర్తకూ భార్యా, ప్రతి భార్యకూ భర్తా అందంగా కనిపించకపోతే కనీసం అందంగా ఊహించుకోనన్నా ఊహించుకోకపోతే ఈ దేశంలో ఎన్నెన్నో సంసారాలు బుగ్గిపాలౌతాయి' ఆమెవైపు చూసాను.

'ఏంది అలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావు. ఏందో కాస్త నాక్కూడా చెప్పరాదా' బాధగా అడిగింది.

'నువ్వన్న విషయాన్ని గురించే ఆలోచిస్తుంటేనే భయమేస్తుంది. సంతోషం అనేమాట మనం మాట్లాడుకునే అవకాశముందా అని!'.

'ఏమో!' చెయ్యి తిరగేస్తూ పేలవంగా నవ్విన ఆమె నవ్వులో ఏ కోశానా జీవమున్నట్టే కనిపించలేదు. విషాదపు జీర పెదవుల కొసల్నుండి జారి శూన్యంలో కలిసిపోయింది. కళ్ళల్లో కాగడాపెట్టి వెతికినా ఎక్కడా జీవం కనబడలేదామె ముఖంలో. నిరాసక్తంగా లేచి అక్కడ నుండి వెళ్ళిపోయిందామె.

ఓటమి అంచునే వేలాడే జీవితమంటే ఇలాగే ఉంటుందేమో కదా! ఎన్నెన్ని అగాధాల్ని తన గుండెల్లో కనబడకుండా దాచుకుంటుందో కదా స్త్రీ. ఎన్నో సమస్యలు కందిరీగల తుట్టెలా పురుషుణ్ణి చుట్టుముడితే అంత దృఢంగా నిలబడలేడేమో!, బహుశా ఓదార్పుని వెతుక్కుంటూ వెళ్ళిపోతాడు. లేదా జీవితాన్నే చాలిస్తాడు. అనాది కాలం నుండీ ఓర్పూ... సహనమూ... బాధలూ... బాధ్యతలూ... బంధాలూ... అనుబంధాలూ స్త్రీలకే ప్రత్యేకంగా సంక్రమించిన ఆస్తులేమో! ఎన్నెన్నో కష్టాలనైనా భరించగల శక్తి ఒక్క స్త్రీకి మాత్రమే ఎందుకు ఉంటుందో...!

* * *

'ఇవాళన్నా ఇచ్చాడా! లేదా...!' వేలాడేసుకుని వొచ్చిన నా మొహం చూసి అనుమానంగా అడిగింది అరుణ.

'పోగొట్టుకోవడమే గానీ తేవడం మీకు తెలియదు గదా... మీ వాలకం చూస్తేనే అర్థమౌతుందిలే' ఒక విసురు విసిరింది నావైపు.

'ఇవ్వలేదు. వాయిదా వేశాడు' తప్పు చేసినవాడిలా సంజాయిషీ చెప్పాను.

అదేమాట... మొహంలో అదే విషాదం... నువ్వు మాత్రం ఎన్నిసార్లు పదేపదే నా నోట ఆ మాట వింటావులే... ఆమె కళ్ళల్లోకి చూడలేక అపరాధిలా తలదించుక్కూర్చున్నాను.

'వేస్తారండీ. మీ మొహమాటం చూస్తే ఎవరైనా మీకు గాలం వేస్తారు. అదీ మీ క్లోజ్ ఫ్రెండ్ హూ... ఎంత గొప్ప ఫ్రెండ్సో! నమ్మనివాడిని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. మీలాంటివాణ్ణే మెల్లగా ముగ్గులోకి దించేది. మీ జాలీ... దయ... కరుణ ఇవన్నీ మీకేమైనా సాయం చేశాయేమో చూడండి. పాపం... పాపం అంటారే అందర్నీ.. ఇప్పుడు ఈ స్థితిలో మనల్ని పాపమనే వాళ్ళు ఎవరైనా ఉన్నారా! ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నాం మనం. వాడు బాధల్లో ఉన్నప్పుడు ఆదుకున్నాంగా మనము. ఇప్పుడు వాడి డబ్బులేమీ ఇయ్యమనడం లేదుగా! ఇప్పుడు బాగానే ఉన్నాడు వాడు. అయినా మన డబ్బులు మనకి ఇవ్వడానికి ప్రాణం వొప్పటం లేదు.

డబ్బు మన దగ్గర ఉన్నప్పుడే జాగ్రత్త చేసుకోవాలి. అది చెయ్యిదాటి పోయిందా.. ఇక మనకు చేతికి చిక్కే సమస్యే లేదు. అప్పుడు ఎంత మొత్తుకున్నా విన్నారా! మీ ఫ్రెండ్ కష్టాల్లో ఉన్నాడని... బేంకులో ఉన్న డబ్బు గొడవ చేసి మరీ తీసుకువెళ్ళారు.

ఉద్యోగం లేక బికారిలాగా ఉన్నాడు. ఏదో ఒకవ్యాపారం చేసుకొని జీవితంలో నిలదొక్కుకుని మన డబ్బు మనకి ఇస్తాడన్నారా! చూడండి. మీకు దొరికే ఫ్రెండ్సందరూ ఇలాంటి వాళ్ళే దొరుకుతారు. వాడు వ్యాపారంలో నిలదొక్కున్నా మీకు డబ్బు ఇచ్చేదీ లేదు. చచ్చేదీ లేదు.

ఎంత ఫ్రెండ్సయినా అంత పిచ్చిగా నమ్మకూడదంటే నా మాటేమైనా పట్టించుకున్నారా! అయినా ఈ రోజుల్లో ఫ్రెండ్స్ ఎక్కడ ఉన్నారండీ. అవసరానికి ఫ్రెండ్సేగానీ, నిజమైన ఫ్రెండ్స్ ఎక్కడ ఉన్నారు?

నోటూ పత్రం కూడా లేకుండా ఆనాడు డబ్బిచ్చారు. ఈనాడు వాడు పచ్చ పచ్చగా ఉన్నాడు. మనమేమో ఎండిమోడువారి పోతున్నాము.

అప్పుడూ మీ ఫ్రెండే... ఇప్పుడూ మీ ఫ్రెండే. మిమ్మల్ని తన ఇంటిచుట్టూ తిప్పుకుంటున్నాడు చూశారా! అతి మంచితనం కూడా పనికిరాదండీ. అది వికటిస్తే జీవితాలే ప్రమాదంలో పడిపోతాయి. ఇవాళ చూడండి మన డబ్బే. మనకు ఇవ్వాల్సిన డబ్బే.... ఏ ఆధారాలు లేకపోవడం వల్ల వాడిచుట్టూ తిరగాల్సి వస్తోంది. ఎప్పుడో వాడికి ఇష్టమొచ్చినప్పుడు పావలా బేడా ఇస్తుంటే అదే తీసుకుని వొస్తున్నారు గానీ, నిలబెట్టి అడగలేక పోతున్నారు చూశారా'

'ఏం చెయ్యమంటావు. రక్తంలోనే అలాంటిది ఉంది. కోరి కోరి ఎవరైనా కొరివితో తల గోక్కుంటారా! కష్టాలు నెత్తి మీదకు తెచ్చుకుంటారా! తరతరాలుగా మాలో ప్రవహించే రక్తం అలాంటిది. మా నాన్నను దగ్గర్నుండి చూస్తున్నావు గదా! ఇప్పటికిప్పుడు పొమ్మంటే పోయేది కాదు. రమ్మంటే వచ్చేదీ కాదు.

ఈ బరవాసాతోనే మా నాన్న ఎంత ఆస్తి పోగొట్టుకున్నాడు. ఎక్కడా ఏ మాత్రం తగ్గేవాడు కాదు. కిందపడ్డా నాదే పైచేయి అన్నట్టుగా ఉండేవాడు. అంతెందుకు మొన్న వర్షాలప్పుడు చూశావుకదా! మనము ఎన్ని చెప్పినా ఊరుకున్నాడా! పోవడం పోవడం ఊళ్ళో అందరి పంటలు నీళ్ళల్లో నుండి ఒడ్డుకి వచ్చిందాకా తిరిగివచ్చాడా! వచ్చీరావడంతో మూలన బళ్ళా. మనకేమన్నా చూడకుండా తప్పిందా!

నేను కూడా అంతే చిన్నప్పటి నుండీ కష్టాల్లో ఉన్నాడులే ఆదుకుందాం అనుకున్నాను గానీ... వాడేదో కడుపులో పెట్టుకుని ఆ కసినంతా ఈ విధంగా చూయిస్తాడని ఎవరు మాత్రం కలగన్నారు'

'బేంకులో డబ్బులైతే తీసి ఇచ్చారు బాగానే ఉంది. అవీ చాల్లేదని మళ్ళీవొచ్చి నమ్మకంగా నా వొంటిమీద బంగారం తీసుకుని వెళ్ళి బేంకులో పెట్టించాడు. ఎంత తెలివైన వాడండీ మీ ఫ్రెండ్. వొడ్డీతో సహా మనమే మళ్ళీ కట్టుకుని విడిపించుకున్నాం కాబట్టీ సరిపోయింది. లేకుంటే వేలంపాటలో అది కూడా పోయేదే కదా!'

పోతే పోయింది పిచ్చిడబ్బనుకుని వొదిలేద్దాం. వాడు నా జీవితమ్మీదే కాదు నా మనసు మీద కూడా దెబ్బ కొట్టాడని తెలిస్తే ఇంకెంత నీచంగా చూస్తావు వాడిని. నా వెంటే తిరుగుతూ. ఎంతో అభిమానం నటిస్తూ ఎంత నమ్మక ద్రోహం చేశాడో చెబితే తట్టుకోలేవు. నిజంగా అంతటి క్రూరమైన మనస్తత్వం కలిగినవాళ్ళు నిజంగా ఉంటారా అని అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది.

స్నేహం అనే మాటకు అర్థమే లేకుండా పోయేది ఇలాంటి వాళ్ళను చూసినప్పుడే కదా! అయినా ఎంత పిచ్చివాడిని కాకపోతే ఒక్కసారి... రెండుసార్లు.. మూడుసార్లు మోసపోయాకైనా ఊరుకున్నానా! లేదే మళ్ళీ అదే మోసం... ఎన్నిసార్లు... వాడి చేతిలోనే... గొర్రె కసాయి వాడినే ఎందుకు నమ్ముతుందో నా విషయంలో స్పష్టంగా రుజువైంది.

ఆ రోజు నోటూ పత్రమూ లేకుండా వాడికి డబ్బు ఇచ్చేటప్పుడు అన్నయ్యా ఇంత డబ్బు నమ్మకంతో ఇస్తున్నావే... రేపేమైనా జరిగితే ఏమైపోతావు అని ఆ అమ్మాయి ఎందుకు అడిగిందో ఇప్పుడు అర్థమౌతుంది.

నా కంటే చిన్న పిల్లయినా జీవిత సత్యాన్ని ఆనాడే పసికట్టింది. నేను వెర్రి వాడిలాగా ఆ పిల్ల ముందు తలాడించాను. డబ్బు దేముందమ్మా ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది. వీడు బాధపడుతూ ఉంటే తట్టుకోలేకుండా ఉన్నానమ్మా. అందుకే ఏదేమైనా డబ్బు తీసుకునివొచ్చానంటే... పాపం ఆ అమ్మాయి 'నోటైనా రాయించుకోండన్నయ్యా' అని బతిమాలింది. కానీ వాడు ఒక్కమాట కూడా అన్లేదు.

నోటూ పత్రాలతో స్నేహాలు నిలబడవమ్మా అంటూ ఆ అమ్మాయికి హితబోధ చెయ్యబోయాను. ఏమో అన్నయ్య నీలాంటి వాళ్ళు కూడా ఉంటారని నిన్ను చూసిన తరువాతే తెలిసిందంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది పాపం.

స్వార్థం ఎప్పుడూ మోసాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది కాబోలు. నా మంచితనం ఎదుటివాళ్ళకు ఉపయోగపడింది కానీ నన్ను సుడిగుండాల్లోకి పడదోసింది.

మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోకుండా ఎలా ఉండగలం అని నేనానాడు అనుకున్నా గానీ, ఇవాళ వాడు అలా అనుకోలేకపోతున్నాడు.

'చదువుకునేటప్పుడు బాగానే ఉండేవాడు అరుణా! ఆ తరువాతెందుకు మారిపోయాడో పోయాడు.' అన్నాను సుదీర్ఘ శ్వాస వదిలిన తరువాత.

'అందరూ మనలాగే ఉంటారాండీ. ఏదేమైనా డబ్బుని చూసిన తరువాత మనిషికి ఎక్కడలేని స్వార్థం ముంచుకొస్తుంది. అందరూ మనలాగా మడికట్టుకు కూర్చుంటారనుకున్నారా'

అదీ నిజమేలే... డబ్బంటే చేదా ఎవరికైనా...! సమస్త ప్రపంచమూ డబ్బు కూడబెట్టే వైపే సాగిపోతున్నప్పుడు డబ్బుకు తప్ప దేనికీ విలువుండదు. ప్రేమలు... ఆప్యాయతలు... బంధుత్వాలు చివరికి స్నేహాలు కూడా డబ్బు దగ్గరకు వొచ్చేసరికి పుటుక్కుమని తెగిపోతున్నాయి.

'వాడి అవసరాన్ని గమనించి, అందర్నీ కాదని వాడికి సాయం చేశానారోజు. అదే పని ఏ దారినపోయే దానయ్యకో చేసినా జీవితాంతం గుర్తుంచుకునేవాడు. నాకు అవసరాలు గొంతు మీదకు

వొచ్చినప్పుడు అడిగినా... నీ డబ్బులు ఎక్కడికి పోవులేరా వొడ్డీతో సహా ఇచ్చేస్తానంటాడేగానీ... ఇచ్చిన పాపాన పోడే...

అలాంటి మనుషుల్ని మనుషులు అని అనాలన్నా ప్రాణం పోతుంది వాళ్ళని ఏం జెయ్యాలో చెప్పు.'

'ఏమో ఏం జేస్తారో... ఫ్రెండ్స్ ఫ్రెండ్స్ అంటూ ఇంటికి తీసుకుని వొచ్చి పంది కుక్కల్ని మేపినట్టు మేపినప్పుడు తెలియదా! ఇంత అమాయకంగా ఉన్నారేమిటండీ మీరు. అందరూ ఎంత తెలివిగా ఉన్నారో చూడండి. వాళ్ళని చూసైనా నేర్చుకోకపోతే ఎలా! లోకంతోపాటే సాగిపోతేనే కదా... మనమూ ముందుకి పోయేది.

నేర్చుకోవాలండీ ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ పోతేనే కదా! ఎన్నెన్ని రకాలుగా సంపాయిస్తున్నారండీ.....

ఒక్క ఉద్యోగాన్ని పట్టుకుని ఊగులాడితే ఏముందండీ... గొర్రెతోక బెత్తెడే కదా! ఏదన్నా ఒక బలమైన దెబ్బ తగిలిందనుకో... ఏమైపోతామండీ మనం. ఇంక కోలుకోగలమా! అందుకే ముందు జాగ్రత్తపడాలి'.

'ఏం చెయ్యమంటావు. అందరిలాగా పరుగెత్తాలంటే నా కాళ్ళు బలంగా లేవు. నా మనసుకు అంత శక్తి లేదు. ఉన్న దాంట్లోనే సర్దుకుపోదాం. ఏమౌతుంది. విలాసాల్లో మునిగి తేలకపోతే బతకలేమా! మనుషుల్ని మార్కెట్ పరిగెత్తిస్తుంది. అది తెలుసుకోవాలి ముందు.. లేకుంటే ఈ లోకంలో మనమెందుకు ఉన్నామో... ఏం చేస్తున్నామో... ఎందుకు బతుకుతున్నామో కూడా తెలుసుకోలేనంత ఊబిలో కూరుకుపోతాం. అది తెలుసుకోవాలి ముందు.

'బాగుందండీ మీ మెట్ట వేదాంతం మనం ఏ పరిస్థితుల్లో ఉన్నామో మీరు తెలుసుకోవడం అటుంచి అందర్నీ తెలుసుకోవాలనడం చాలా బాగుందండీ.

మన ఇద్దరి సంపాదనా అంతంత మాత్రమేనయ్యె, మిగుల్చుకున్న ఆ నాలుగు రూపాయలూ ఆ ప్రబుద్ధుల చేతుల్లో పోస్తిరి. ఎట్టా సాగుతుంది చెప్పండి సంసారం. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. డబ్బులవెంటే చదువులు నడుస్తున్నాయి. అసలు డబ్బు లేకుంటే ఎందుకు పనికొస్తామండీ ఘనం. అందరూ మనల్ని ఎంత వింతగా చూస్తున్నారో చూశారా! ఇట్లాగైతే ఎలా సాగాలి చెప్పండి మన సంసారం.'

'ఇన్నాళ్ళూ ఎలా సాగిందో అలాగే సాగుతుంది. ఏం చేస్తాం. భరించాల్సి వొచ్చినప్పుడు భరించాలి. ఎదుటివాడు దుర్మార్గుడైనా బాధల్లో ఉన్నప్పుడు చూస్తూ ఎలా ఊరుకోగలం.'

ఊరుకో వొద్దండీ. ఒక వైపు మీ నాన్న.. ఇంకోవైపు మీరూ దానాధర్మాలు చెయ్యండి. నేనూ నా పిల్లలూ అడుక్కుతింటూ పోతాము... ఛీ... ఛీ.. ఎన్నిరకాలుగా చెప్పినా మీకు అర్ధమేగాకుండా పోతుంది. ఏం చెయ్యాలి నేను. ఎన్నిరకాలుగా వివరించి చెప్పినా మీ పాట మీదే గాని, నా మాట చెవికెక్కదా'.

ఎంతో ఓర్పు తరువాత... అసహనం తరువాత... కోపం తరువాత ఉన్న అవస్థలోకి వెళ్ళిపోయింది తను. ఇంక ఏ విధంగా చెప్పినా ఏమి మాట్లాడినా లాభం లేదనే నిరాశలోకి వెళ్ళిపోయింది. తల బాగా కిందకు వొంచుకుని తనలోకి తనే ముడుచుకుపోయింది.

ఇంక ఆమె నోటి నుండి ఎలాంటి శబ్దమూ బయటికిరాలేదు. అలాగే కదలకుండా మెదలకుండా ఒకానొక ధ్యానస్థితిలోకి వెళ్ళిపోయింది.

* * *

'ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా! అబ్బ అయిపోయాడు. కొడుకు అయిపోయాడు. ఆయన కొడుకు రంగం మీద కొచ్చాడు. ఎవరికి చెప్పాలో ఎవరికి చెప్పకూడదో పిచ్చి ఎక్కుతోంది. పెద్దవాళ్ళెవరో పిల్లవాళ్ళెవరో అర్థం కాకుండా ఉంది'.

'ఏమిటే.. విషయం చెప్పకుండా ఉపోద్ఘాతం మొదలు పెట్టావు. ఉరుములూ మెరుపులూ ఆపి ముందు విషయమేందో చెప్పు' అంటూ అనునయంగా దగ్గరకు పోతే విదిలించి కొట్టింది తను.

'పెద్దవాళ్ళకి చెప్పీ చెప్పీ నోరు పడిపోయింది. ఇంక పిల్లలు మొదలుపెట్టారు'

'గొడవ చెయ్యకుండా విషయమేంటో చెప్పరా! పక్కనే కూర్చున్నాను.'

'అబ్బా... ఎంత ప్రేమ పుట్టుకొచ్చింది నాయనా. ఒకవైపు నేను బాధపడుతుంటే మీకు నవ్వులాటగా ఉందికదూ! మీ కొడుకేం చేశాడో చూశారా!' ప్రశ్నార్థకంగా నా వైపు చూసింది.

ఏం చేశాడన్నట్టు కళ్ళతోనే ప్రశ్నించాను.

'ఎప్పుడూ ఏదో ఒక వస్తువు పిల్లలకు ఇచ్చి వొచ్చేవాడా! పోనియ్యిలే పిల్లవాడు కదా పిల్ల చేష్టాలులే అనుకున్నామా! ఇవాళేం చేశాడో చూడండి'

'అబ్బా విషయమేంటో చెప్పవా? విసిగించకుండా ఎంతసేపు అలా నానబెడతావు' విసుక్కున్నాను.

'అవును, విసిగిస్తుంది నేనా! మీరూ మీ కొడుకూ, మీ అబ్బా! ఒకరైతే ఎలాగండీ. తలా ఒకవైపు దానధర్మాలు చేస్తాపోండీ... ఇయ్యాల సైకిల్ ఎవరికో దానం చేసి వొచ్చాడంట. ఇలా ఇస్తూ పోతే చివరకు చిప్ప చేతికి వొస్తుంది. అప్పుడు అందరమూ వీథుల్లో పడి అడుక్కు తినవచ్చు'.

'వాడికీ మంచి లక్షణాలొస్తే మంచిదే కదా! మేమేందో కాని పనులు చేసి వొచ్చినట్టు దోషుల్లాగా నిలబెడుతున్నావు. నావొంతు అయిపోయింది. ఇంక వాడివొంతు కూడా వొచ్చింది.

తోటివాళ్ళు బాధ పడుతుంటే చూడలేకపోవడం మంచి లక్షణంకాక చెడ్డ లక్షణమౌతుందా! ఇప్పటి నుండే తోటి వాళ్ళకు సహాయం చేస్తున్నాడంటే భవిష్యత్తులో ఎంతో గొప్పవాడయ్యే అవకాశం ఉంది.

ఇలాంటి అలవాట్లు ఎవరికైనా రావాలంటే తలకిందులుగా తపస్సు చెయ్యాల్సిందే! అలాంటిది మనవాడు పువ్వు పుట్టగానే పరిమళిస్తున్నందుకు గర్వపడాలి గానీ, బాధ పడతావేంది. నువ్వూ నీ చాదస్తమూ కాకపోతే...'

'అవునవును... పువ్వు పరిమళిస్తుంది. కాయ కూడా కాసి దబ్బున నేలమీద పడి పగిలిపోతుంది. అప్పుడు విత్తనాలన్నీ నేలపాలౌతాయే. అప్పుడు... అప్పుడు ఏడవాల్సి వొస్తుంది.

బజార్లోయి తెచ్చి ఇంట్లో పెట్టాల్సింది పోయి... ఇంట్లోయే

బజార్లో పెడుతుంటే ఇంకా సంతోషంగా వెనకేసుకు వొస్తున్నారు'.

అమ్మో.. ఇక మాట్లాడితే వాతావరణం వేడెక్కేటట్టుంది. ఇంక ఈ మాటల తూటాల నుండి మౌనంగా నిష్క్రమించడమే మేలేమో! 'ఇంతకూ మన ప్రబుద్ధుడు ఏమిచేసినట్టో' అడిగానామెని.

'వొచ్చే సంవత్సరం ఈ ఊర్లో ఉండడంట కదా! ఆ... ఇంక ఆయనకు సైకిల్ అవసరం లేదంట. అందుకని పరీక్షలు అయిపోయి ఇంటికి వొచ్చేటప్పుడే ఎవరో ఫ్రెండ్‌కి ఇచ్చి వొచ్చేడంట. అదిగో వస్తున్నాడుగా ఆయన్నే అడగండి. మీ ఇద్దరికీ నేను చెడ్డదాన్ని కావడమెందుకూ' వస్తున్న వాడివైపు చూస్తూ చెప్పింది.

'...సైకిల్‌కే ఇంత ఇదైపోతే ఎలాగ చెప్పు' చాలా తేలిగ్గా తీసిపారేశాను'

'సైకిలా అన్నారు. అది చాలదా వాడి వయసుకి'

'ఏందిరా.. సైకిల్ ఎవరికో ఇచ్చేశావంట. ఎవరికి ఇచ్చావు? వాడిని చూస్తూ అడిగాను.

'అవునాన్నా ఇచ్చేశాను. దానికే అమ్మ తెగ గొడవ చేస్తోంది. ఇంక సైకిల్ ఎలాగూ నాకు అవసరం లేదుగా! మీ దగ్గర ఉండను గదా! హాస్టల్లో ఉండేవాడికి నాకు సైకిల్‌తో పనేముంది చెప్పు'.

'పాపం మా ఫ్రెండ్ సైకిల్ కొనుక్కోలేని స్థితిలో ఉన్నాడు నాన్నా. రోజూ స్కూల్‌కి నడిచే వొస్తున్నాడు. అలాంటి వాళ్ళకు హెల్ప్ చేస్తే ఏంబోయింది నాన్నా. ఎలాగూ మనం వాడుకోము. తుప్పు పట్టించి పారేస్తే ఏమొస్తుంది. అందుకే ఇచ్చేసి వొచ్చాను. అమ్మేమో పోయి తీసుకురా అంటోంది. ఒకసారి ఇచ్చిన తరువాత మళ్ళీ అడిగితే వాడు బాధపడిపోడా నాన్నా. అదేమంటే అమ్మ తిడుతుంది'

'నీకే కాదురా బాబూ.. నా మీద కూడా పడ్డాయి అక్షింతలు. ఆ తుఫాను నా తీరాన్ని కూడా తాకింది' ప్రేమగా వాడిచేతిని పట్టుకొని నవ్వాను. దాంతో వాడికి భయం పోయి వాడూ నవ్వాడు.

'ఇద్దరూ తోడు దొంగలయ్యారండీ. ఒకరినొకరు చూసుకొని ఎందుకు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. మీ అలుసు చూసుకోనే కదా వాడు ఆ విధంగా తయారవుతుంది.

మీరిద్దరూ కాదండీ. మీ నాన్నతో కలుపుకోని ముగ్గురు తోడు దొంగలయ్యారండీ. ముగ్గురిదీ ఒకటే పోలిక. మీరందరిలో నేనొక్కదాన్నే పిచ్చిదాన్ని. ఎప్పుడూ పిచ్చిదానా పిచ్చిదానా అంటుంటే ఏందో అనుకున్నానండీ. దానికి అర్థమేందో ఇప్పుడు తెలుస్తుంది. చెయ్యండి చెయ్యండి. ఎన్నిరోజులు చేస్తారో అదీ చూస్తాను'.

'ఎందుకలాగా ఉడుక్కుంటావు. వాడేమీ తప్పు చేశాడు. వాడి ఆలోచన కూడా కరెక్టేగా!'

'ఆ... కరెక్టే కరెక్టే. వాణ్ణి అలాగే వెనకేసుకు రండి. ఇంట్లో వొస్తువులన్నీ తీసుకుని వెళ్ళి వీధిలో పారేసి వొస్తాడు. వాడికి మీరు కూడా ఎలాగూ తోడు ఉంటారు కదా! మీదీ మీదీ అందరిదీ ఒకటే మాట. మధ్యలో నాకెందుకు వొచ్చిన గొడవ. మీకు చీమ కుట్టినట్టయినా లేనప్పుడు నేను ఎందుకు బాధపడాలి.'

'ఊరకే ఎందుకలా అరుస్తావు చెప్పు. ఈ రోజుల్లో కూడా నీ కొడుక్కి అంత మంచి లక్షణం అబ్బిందంటే నువ్వు గర్వపడాలి. ఇప్పుడు పిల్లలు ఎలా ఉన్నారనుకుంటున్నావు. ఇంత మంచి లక్షణాలు ఈ వయసులోనే అబ్బడం వాడి అదృష్టము.. మన అదృష్టం కూడా. అయితే మనం మోసపోయినట్టు వాడూ మోసపోకుండా తగిన సలహా ఇస్తే చాలు.

అవసరాన్ని గుర్తించి సహాయం చెయ్యనివాడు మనిషెలా అవుతాడు చెప్పు. వాడి బంగారు భవిష్యత్తు కళ్ళముందు స్పష్టంగా కనబడుతుంటే, ఎందుకు బాధపడతావు.

ఎప్పుడూ నేనూ... నాదీ అని ముందుకు సాగిపోయే వాళ్ళు కన్నవాళ్ళను కూడా పట్టించుకోకుండా ఎన్నెన్ని బాధలు పెడుతున్నారో చూడు. ఇవాళ పోయింది. వాడికి అవసరం లేని సైకిలే కావొచ్చు. అది వాడుకునే స్నేహితుడు ఎంత ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడో కదా! జీవితంలో వాడు ఎంత గొప్ప స్నేహితుణ్ణి సంపాయించుకున్నాడంటావు.

దాన్ని పోగొట్టుకోవడము అనకూడదు. అదొక చెడ్డ అలవాటుగా భావించకూడదు. అదొక తత్వం. జాలి, దయ, వంటి లక్షణాలు ఉంటేనే అలా చెయ్యగులుగుతారు. ఇంత మంచి మనస్తత్వం ఈ వయసులో గొప్పవాళ్ళకే అబ్బుతుంది.

తల్లితండ్రుల నుండి కూడా ఇప్పుడు. ఎవరికీ ఏ మంచి గుణాలూ రావడం లేదు. ఇలాంటి ఆలోచనలు, అలవాట్లు, భావనలు, ఆలోచనలు ఇప్పుడున్న చదువుల్లో కూడా కాగడా బెట్టి వెదికినా కానరావడం లేదు'.

'అవునవును. మీరొక వివేకానందుడు అవతారమెత్తారు. వాడొక బుద్ధుడు అవతారమెత్తుతాడు. ఇంక ఈ కొంపేమో కొల్లేరౌతుంది. నడి ఏట్లో మునిగి పోయే దాన్ని నేనేగా!'

'హు... నీకా భయమే అక్కర్లేదు. ఇప్పటికిప్పుడు ఇవాళ్టికివాళ వొచ్చిన లక్షణాలేం కాదు ఇవి... నువ్వు పొమ్మంటే పోవడానికి. రమ్మంటే రావడానికి. తాతల తండ్రుల ముత్తాతల కాలాల్నుండీ ఇలాంటి లక్షణాలు అలా వాలుగా ప్రవహించే ప్రవహించే ప్రవాహంలాగా సాగుతూ ఉంటాయి.

మా తాతల నుండి మా నాన్నకు... మా నాన్న నుండి నాకూ... నా నుండి నా కొడుక్కు... వాడి నుండి వాడి కొడుక్కు... ఇది నిరంతరం సాగే జీవన ప్రవాహం. ఇలాగే ప్రవహించీ ప్రవహించీ తరాలు మారీ మారీ ఎక్కడో ఒక చోట ఏమో... ఏదో ఒక అద్భుతం... ఒక మహాద్భుతం జరగొచ్చేమో.

అదే ఒక కేంద్ర బిందువు కావచ్చు, ఆ బిందువు చుట్టూ అనేకానేక బిందువులు సింధువులు చేరతాయి. మనుషుల పోకడల్ని తెలుసుకోవడానికి జ్ఞాన కేంద్రాలు మొదలవుతాయి. అదొక నక్షత్రమౌతుంది. ఒక సూర్య కుటుంబమౌతుంది. పాలపుంతౌవుతుంది. అక్కడి నుండి వెలుగు రేకలు నలుదిశలా ప్రసరిస్తాయి. అజ్ఞాన తిమిరాన్ని తరమడానికి మార్గం సుగమం అవుతుంది. ఆ మార్గమే నలుగురి గురించి ఆలోచించేదవుతుంది.

అబ్బా... చెప్పండి చెప్పండి. మీకు ఎదురుచెప్పేవాళ్ళెవరు లేకుంటే మెట్టవేదాంతం ఎంతైనా ఎంతసేపైనా చెపుతారు మీరు. తల పట్టుకుంది అరుణ.

★

కథ

నేపాళ భూపాలుడు

- వెర్నన్ గొన్‌జాల్విస్
కేంద్రకారాగారం, నాగపూర్.
తెలుగు సేత - ఎన్. రవి కేంద్ర కారాగారం, హజారీబాగ్.

అల్లా... హో... అక్బర్... అంటూ ఆ రోజు ప్రభాతాన శ్రావ్యంగా వినిపించిన అజాన్ బ్యారక్‌లో రోజుకు ఐదుసార్లు ఉచ్ఛస్వరంతో స్వరరహితంగా వినిపించే అజాన్‌కు చాలా భిన్నంగా ఉంది. జనవరి మాసపు వేకువలోని నిశ్చలత, వలయాకారంలో ఉండే అండాసెల్ గోడలను తాకి వస్తున్నందున ధ్వనిలో వచ్చే మార్పు ఆ కంఠస్వర మాధుర్యాన్ని, లయగతులను ఇనుమడింపజేస్తున్నాయేమో కానీ, సంగీత రసం కోసం తపించిపోతున్న నా వీనులకు అది విందే అయ్యింది. నా చెవులు నన్ను పట్టి లేపి మునివేళ్ళపై నిశ్శబ్దంగా సెల్ ద్వారం వద్ద నిలబెట్టి ప్రతి ఆరోహణావరోహణనూ జాగ్రత్తగా వినేందుకు రిక్కించాయి. పిచ్చుకలు, కాకులు కూడా నిశ్శబ్దమైనట్టున్నాయి. మన సంగీతకారుడు కేంద్ర గుమ్మటానికి (సెంట్రల్ టవర్) అవతలివైపున నాలుగో నంబరు వార్డులో ఉన్నట్టున్నాడు. ముప్పై అడుగుల దూరమే కానీ చూపులకు ఆవల నాకు అతన్ని కలిసే అవకాశం త్వరలో వస్తుందా?

అయితే హై సెక్యూరిటీ బ్యారక్ వాళ్ళకు బయటివాళ్ళను కలవడమనేది అంత సులువేం కాదు. కసబ్ వచ్చిన కొన్ని రోజుల తర్వాత గానీ ఆ సంగీతానికి ఒక ఆకారాన్ని జోడించే అవకాశం నాకు కలగలేదు. అప్పటి దాకా అజాన్‌ను ఆలపించే అవకాశం ఆ గళానికి వచ్చినప్పుడల్లా ఆ మనిషి ఇలా ఉండొచ్చేమో అనేది నలుగురు అంధులు-ఏనుగు కథలోలా ఊహించడమే నేను చేయగలిగింది. ఆ శబ్దాన్ని బట్టి నేనొక ఆకారాన్ని ఊహించుకొనే వాడిని. అతను ఆరడుగుల ఆజానుబాహుడు కావచ్చా? విశాలమైన భుజాలు, ఛాతీతో ఉండే ఆయన నాభి నుంచి సునాయసంగా మంద్రమైన అలలుగా ఆ గంభీరస్వరం వెలువడుతోందా? లేదా గొంతు సన్నగానో, కీచుగానో ధ్వనిస్తుందనిపిస్తుందేమో అనిపించేలా చూడ్డానికి బక్క పలుచగా చిన్నగా ఉండి స్వరం విప్పితే మాత్రం కంచులా మోగేలాంటిదేనా? ఉత్తర భారతం వాడా? - కొంకణ తీరం వాడా? హైదరాబాదీనా-మలబారీనా? ఇటువంటి ఊహాకేళిలో సాధారణంగా ఏమౌతుందో అదే అయ్యింది... నేను ఓడిపోయాను.

భూపాల్ మాన్ ధిమాయ్, వయసు 47 సంవత్సరాలు. ఎత్తు ఐదు అడుగుల ఎనిమిది అంగుళాలు, దృఢకాయం. నేను ఊహించగలిగిన దానికంటే పూర్తి భిన్నం అయినా అతను మా ప్రాంగణంలోకి నింపాదిగా అడుగుపెట్టిన వెంటనే ఇతను నాకు తెలుసు అనిపించింది. కసబ్ కోసం జాగా కల్పించడానికి వార్డు ఖాళీ చేయించగా మా ప్రాంగణంలోకి సంతోషంగా వస్తున్న ఆ గుంపు చివరన అతను ఉన్నాడు. నిరాసక్తమైన ముఖ కవళికలు కానీ, నింపాది నడకగానీ, చిరునవ్వునవ్వే కళ్ళుగానీ ఆ గొంతు నుండి వెలువడే కంఠ స్వరాన్ని పట్టివ్వడం లేదు. స్పష్టంగా కనిపిస్తున్న ఆ మంగోలాయిడ్ ముఖ లక్షణాలు కూడా ఏ మాత్రం దోహదపడలేదు. అయితే వీటన్నింటినీ ఒక దగ్గర చేరిస్తే మాత్రం అన్ని అతికినట్టు సరిపోతాయి.

అందుకే అతను దృష్టిలో పడగానే ఆ పఠానీ కుర్తా పైజామా, పెరగడానికి పెనుగులాడుతున్న గడ్డం ఇవి అతనికి అతకవనిపించింది. అవన్నీ మాయమై ఒక బౌద్ధ భిక్షువు వస్త్రాల్లో అచ్ఛాదితమైనట్టనిపించింది. సరిగ్గా అప్పుడే ఒక మెరుపులాగా ఆ అజాన్. ఆ సంగీత మాధుర్యం ఎక్కడిదో అర్థమైంది. ఆ లయ-ధ్వనులు బౌద్ధారామంతో సరిగ్గా తోడు నిలవగలిగినవి. వీటన్నింటినీ ఏదో మారుమూల పర్వత సానువుతో జోడిస్తే సరిపోతుంది. ఇక అవి కాలాతీతంగా ఒక ఏకత్వంలో ప్రతిధ్వనిస్తుంటాయి.

బహుశా భూపాల్ నేను చెప్పినదాని దేంతోనూ ఏకీభవించడు. ఎందుకంటే ఆయనకు బుద్ధిస్టుల పట్ల ఒక ఏహ్యాభావం ఉంది. దలైలామా అశుద్ధాన్ని టిబెటన్లు చాలా భక్తి ప్రపత్తులతో తీసుకుని పంచుకొని తినే చీకటి కథనాలు అతను మాకు చెప్పాడు. దీన్ని గురించి ఏం వాదించినా, నిరసించినా అతను తన అభిప్రాయం మాత్రం మార్చుకోవడానికి సిద్ధపడలేదు. అతనికి నిజమేమిటో "తెలుసు". వేరేవాళ్ళు చెప్పే పని లేదు. అతని ఊరు టిబెట్ సరిహద్దుకు ఆరు గంటల నడక దూరంలోనే ఉంది. ఎన్నోసార్లు తను సరిహద్దు ఆవలికి కూడా వెళ్ళివచ్చాడు. అతను టిబెట్ నుండి ఎర్రచందనం, చైనీస్ పూసల దండలు తెచ్చేవాడు. నేపాల్‌లో వాటికి ధర ఎక్కువ. అతనికి స్థానిక టిబెట్ మాండలికం వచ్చు. కొంచెం కొంచెం చీని భాష కూడా. మరి టిబెట్ జాతి, మతాల వెనుకబాటు తనాల గురించి తనకంటే బాగా ఎవరికి తెలుసు? తనకే "తెలుసు"!

భూపాల్ పుట్టుకతో ఒక హిందువు. బహుశా ఇప్పటికీ వాళ్ళమ్మ ఈయన విడుదల కోసం ఊరి గుడిలో అర్చన చేయిస్తూ ఉంటుంది. ఇతని తండ్రి మాత్రం అట్లాంటివేం చేయడు. ప్రతి ఆదివారం ఆయన మూడు గంటల పాటు పర్వత మార్గాల్లో నడిచి దగ్గరలోనున్న రోడ్డుకు చేరుకుంటాడు, చర్చికి వెళ్ళడానికి. ఎన్నో ఏళ్ళక్రితమే ఈ మత విశ్వాసాన్ని పుచ్చుకున్నాడు. భూపాల్ యువకుడిగా ఖాట్మండుకు వెళ్ళాక ఇస్లాంతో ప్రభావితుడై ముసల్మానుగా మారి ఇంటిలోని వైవిధ్యాన్ని మరింత వైవిధ్యవంతం చేశాడు. ఒక ముస్లిం అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. తన ముగ్గురు పిల్లలనూ తన మత విశ్వాసంతోనే పెంచాడు. ఇప్పుడు భూపాల్ పేరు యూసుఫ్ ఖాన్. బహుశా మత

మార్పిడి చేయించిన పఠాన్ పెట్టిన పేరయివుంటుంది. ఇప్పుడు వార్డులో అందరూ యూసుఫ్ భాయ్ అని పిలుస్తారు. కుర్రాళ్ళైతే దలైలామా అంటారు. ఒక ప్రశాంతమైన చిరునవ్వుతో బదులిస్తాడు, తప్ప "నా పియ్యి తినండని" మాత్రం అనడు.

మతపరమైన భిన్నత్వం తరచుగా ఏకత్వాన్ని దెబ్బ తీస్తుంది. దమాయ్ ఇంట్లో కూడా అదే జరిగింది. ఆ నిరాడంబర భూ... పాలురు.... (తమ భూములను పాలించుకునే రైతులు) విభిన్న మత ప్రాపంచిక దృక్పథాల సంఘర్షణ వల్ల ఉత్పన్నమవుతున్న సైద్ధాంతిక ఒత్తిళ్ళను, భారాన్ని తమాయించుకోలేకపోయారు. భూపాల్ అరెస్ట్ కాకముందే భూపాల్‌కు కుటుంబంతో సంబంధాలు బెడిసికొట్టాయి. ఒకరికొకరు తీసిపోని తల బిరుసుతో ఉన్న తండ్రీకొడుకులిద్దరి మధ్య అగాధం పెరిగిపోయింది. భూపాల్ అరెస్టే దాన్ని ఇంకా పెంచే ఉంటుంది.

అయితే తొమ్మిదేళ్ళ నిర్బంధం కానీ, జీవిత ఖైదు శిక్షకానీ భూపాల్ ఆశలపైన నీళ్ళు చల్లలేదు. భీమ్ బహదూర్ దమాయ్, బింజెల్‌గ్రామం, వార్డు నెంబరు ఐదు, బలేలీ రాణా, సింధుపాల్ చౌక్ జిల్లా, నేపాల్. ఈ అడ్రస్‌కు ఉత్తరం వెంట ఉత్తరం వెళ్తూనే ఉన్నాయి కానీ, జైలు గోడలు దాటి వెళ్ళిన తర్వాత ఏ శూన్యంలోకి అవి పోతున్నాయో కాని, అక్కడణ్ణుంచి ఏదీ వాపసు మాత్రం రావడం లేదు. అయినా భూపాల్ పట్టువదలడం లేదు. అవే ప్రశ్నలు, అవే వార్తలు. ఇంటి దగ్గర ఎలా ఉంది? అమ్మ భాగానే ఉందా? నాయిన ఆరోగ్యం ఎట్లా ఉంది? నన్ను కలవడానికి రాలేవా? పాటియాలాలో జీవితఖైదు శిక్ష పడింది. హైకోర్టుకు అప్పీలుకు వెళ్లాను. ఇది నా లాయరు నెంబరు. నీవు ఆయనకు ఫోన్ చేసి అడగగలవా? నేను ప్రధాన ఆరోపణ నుండి విముక్తి అవుతాననే అందరూ అంటున్నారు. రాజకీయ ఒత్తిడి వల్ల నాకు తప్పుగా శిక్ష వేశారు. ప్రధాన ఆరోపణ పోతే, నాకు ఐదేళ్ళ శిక్ష పడుతుంది. అదెప్పుడో పూర్తయ్యింది. నేను ప్రస్తుతం నాపై పెట్టిన మరో తప్పుడు కేసులో ముంబయిలో ఉన్నాను. ఇందులో నేను విడుదల అవుతాను. శిక్షపడినా తొమ్మిదేళ్ళకంటే ఎక్కువ కాదు. అది కూడా నేను పూర్తి చేశాను. ఇది నా పదవ సంవత్సరం. నీవు ముంబయికి రాగలవా? ముంబయికి వచ్చాక ఆర్థర్ రోడ్ జైలుకురా. నేనిక్కడ అండా బ్యారక్‌లో ఉన్నా. ఇది నా ముంబయి వకీలు నంబరు. ఆయనకు ఫోన్ చేస్తే నా కేసులో ఏమవుతుందో తను చెప్తాడు. ఏదేమైనా దయచేసి ఉత్తరమైతే రాయి. నీవు ఈ తొమ్మిదేళ్ళలో ఒకసారి కూడా రాయలేదు. నన్ను మర్చిపోయావా? దయచేసి లాయర్‌కు ఫోన్ చేయి. తప్పక రాయి. ఉత్తరం రాసినప్పుడు నా పేరు భూపాల్ అని రాయి. ఇక్కడ వీళ్ళు నా పేరు అట్లాగే రాసారు.

ఖాట్మండుకు రాసే ఉత్తరాల్లో కూడా ఇవే విషయాలు. ఎలా ఉన్నావు? మన పిల్లలు ఎలా ఉన్నారు? ఇప్పుడు పెద్దగా అయి ఉంటారు కదా! అయ్‌షు కేమన్నా సంబంధం చూశావా? తన పెళ్ళి చేయడానికి నా కోసం వేచి చూడొద్దు. కానీ అన్ని కబుర్లతో నన్ను కలవడానికి మాత్రం రా. భయపడొద్దు. నిన్నెవరూ ఏమి చెయ్యరు. ముంబయిలో కూడా. ఒకవేళ ముంబయికి రావడానికి భయపడితే పాటియాలాకు రా. నేను తొందరగానే అక్కడికి వాపసు పోతా. నా వకీలుని అడుగు. ఆయన నెంబరు నీకు రాశాను కదా! మళ్ళీ రాస్తున్నా. ఒకవేళ నీవు రాకపోయినా కనీసం ఉత్తరం రాయి. నీవు వచ్చి ఎనిమిదేళ్ళు దాటింది. అంటే తొమ్మిదేళ్ళలో ఒక్కసారి. కనీసం ఉత్తరమైనా రాయలేదు. రాకపోయినా కనీసం రాయి. ఇంటి దగ్గర ఏం జరుగుతుందో నాకు తెలియనే తెలియదు. కనీసం రాయి.

భూపాల్ లేఖ రాయడమనేది నిరాశ, నిస్పృహలతో పోరాడ్డానికి ఒక ప్రయాస. ప్రతి ఉత్తరాన్ని రోజుల తరబడి కష్టపడి నేపాలీ భాషలో రాస్తాడు. ఆ తర్వాత రాత బావుంటుందని తాననుకొనే నాలాంటి వాళ్ళనెవరినో ఒకరిని పట్టుకుని కాపీ చేయమంటాడు. తర్వాత జైలరు చేతికి అందజేయడం - తర్వాత అది డిస్పాచ్ అయ్యిందని తనకు నమ్మకం కుదిరేదాకా రోజు అడగడం. డిస్పాచ్ అనేది నిరాశకు మందు. డిస్పాచ్ అంటే ఒక ఆశ. ఆ ఉత్తరం అందుతుందని ఆశ. ప్రత్యుత్తరం వస్తుందని ఆశ. లాయర్‌కు ఫోన్ చేస్తారని ఆశ. కలవడానికి ఎవరో ఒకరు వస్తారని ఆశ.

ఆశ నిరాశను పారదోలకున్నా కనీసం నిరాశ నుండి దృష్టిని మరలుస్తుంది. జవాబు వస్తుందని తనను తాను నమ్మించుకోడానికి, నటించడానికి భూపాల్‌కు అది ఒక అవకాశం కలుగజేసే విలాసం. దాంతో అతను రోజులు లెక్కపెట్టుకోవచ్చు-ఉత్తరం చేరడానికి పట్టే రోజులు, ఎవరినో ఒకరిని పట్టుకొని చదివించుకోడానికి పట్టే రోజులు, ఎవరినో ఒకరిని వెతికి పట్టుకుని జవాబు రాయడానికి పట్టే రోజులు, జవాబు చేరడానికి పట్టేవి... ఈలోగా, జైలు జీవితంలోని పనులు చేసుకోవడానికి ఈ చిన్న ప్రపంచంలో ఎదురుపడగలిగిన సమాజపు వ్యక్తులతో సౌహార్దంగా ఉండేందుకు అవసరమైన మానసిక ప్రశాంతతను అది ఇస్తుంది. అజాన్‌కు టైం కాగానే ఆ సంగీత సృష్టికి సిద్ధం కావచ్చు. దలైలామా అనే పిలుపులకు చిరాకెత్తిపోకుండా ప్రశాంతంగా ఉండొచ్చు. అద్భుతమైన పర్వతాల గురించి, నిర్మలమైన జలప్రవాహాల గురించి కథలు చెప్పవచ్చు. ఆ కథ చెబుతూ ఎప్పుడైనా సుదూర భవిష్యత్తులో నాకు జడల బర్రె మాంసపు విందు తినిపిస్తానని హామీ కూడా ఇచ్చాడు. పరిశుద్ధాత్ములు చుట్టుపక్కల లేనప్పుడు ప్రాక్టికల్ జోక్ వేయడానికి నాన్-వెజ్ జోకులు వేయడానికో కూడా మూడ్ తెచ్చుకొనే వాడు.

ఈ ఉత్తరానికి కూడా ఏ జవాబూ రావడం లేదని తేలిపోయే దాకా ఈ ఉల్లాసవంతమైన మూడ్ కొనసాగేది. అప్పుడిక మళ్ళీ నిస్పృహ. నిరంతరం నీడలా వెంటాడే నిస్పృహ మళ్ళీ ఒకసారి తలుపు తట్టేది. ఈ నిస్పృహకు మొట్టమొదటి బాధితులు దుబాయ్ డాన్ బట్టలు. పైసల కోసం దుబాయ్ డాన్ బట్టలుతికేవాడు భూపాల్. బట్టలుతికే బండపై ఆ బట్టలను ఎంత కసితో, బలంతో బాదుతున్నాడనేది అతని మూడ్‌ను బాగా పట్టిచ్చేది. నిరాశ నిస్పృహలోకి మారే కొద్దీ అతి చిన్న కారణంతో కూడా తన

సెల్‌మేట్‌తో దెబ్బలాడి రూంలు మారేవాడు. అసౌకర్యంగా ఉన్న రూం మేట్‌ను మార్చడం సులభం. కానీ మనసును సుదీర్ఘకాలంగా పట్టిపీడిస్తున్న పెనుభూతాలను వదిలించుకోవడం మాత్రం అంత సులువా?

ఒక సుదూర వ్యవసాయ గ్రామానికి చెందిన సాధారణ భూపాల్‌కు పట్టణ తళుకు బెళుకులు, జిలుగు వెలుగులు ఆకర్షవంతంగా అగుపించి తమవైపు లాగాయి. పట్టణాలంటే డబ్బు సంపాదించవచ్చు. బతుకంటే అక్కడిదే బతుకు! మొదటి మజిలీ ఖాట్మండు. అక్కడ ఎన్నో చిన్నా చితకా పనులు, ఉద్యోగాలు చేసి ఒక చిన్న హోటల్ లాడ్జిలో కుదురుకున్నాడు. ఆ మధ్యలోనే ఎప్పుడో డార్జిలింగ్ కూడా వెళ్ళాడు కానీ, ఏమీ కుదరలేదు. కలకత్తా ప్రయాణం ఘోరంగా ముగిసింది. ఇక్కడ ట్రాం నుండి కిందపడి విరిగిన కాలుతో, ఖాళీ జేబుతో వాపసు రావలసి వచ్చింది. అతని ముంబయి యాత్ర మరీ ఘోరంగా ముగిసింది. ముంబయిలో దిగిన మరుసటి రోజే పోలీసులు అతన్ని, అతని కుటుంబాన్ని అరెస్టు చేశారు. జీవిత సంపాదనంతా తీసేసుకున్నారు. పిల్లలను డోంగ్రి రిమాండ్ హోంలో పడేసి, భార్యను తొమ్మిది నెలలపాటు బైకుల్లా మహిళా జైలులో ఉంచారు. ఇక భూపాలైతే గత తొమ్మిదేళ్ళుగా ఒక జైలు నుండి మరో జైలుకు తిరుగుతూనే ఉన్నాడు. ఇక పట్టణాలకు దూరంగా ఉంటానని ముంబయికైతే మరింత దూరంగా ఉంటానని అతను ఒట్టుపెట్టుకోవడానికి ఇంతకంటే ఎక్కువ కారణం ఏం కావాలి?

వృత్తి నేరస్తులలాగా కాక, భూపాల్ నిరంతరం ఆలోచనలో మునిగి తేలే ఖైదీ, గతాన్ని నెమరువేసుకునే ఆలోచనలు-భవిష్యత్తులోకి తొంగిచూసే ఆలోచనలు. అతను చాలా కాలంపాటు-నేపాల్‌లో అధికారంలోకి వచ్చిన మావోయిస్టు ప్రభుత్వం తనకోసం ఏమన్నా చేస్తుందా అని ఆలోచించేవాడు. తనను బయటకు తీయడమో లేక కనీసం తనను నేపాల్‌లోని జైలుకి బదిలీ చేయించటమో చేస్తుందా అనే ఆలోచన! కష్టపడి ప్రచండకు ఒక ఉత్తరం రాసాడు. కానీ అంతలో ప్రచండ ప్రభుత్వం పడిపోవడంతో ఆ ఉత్తరానికి పురిట్లోనే సంధి కొట్టింది. ఇది నయమేమో! మరో ఉత్తరం అంటే బహుశా మరో నిరాశకే దారి తీసేది. నేపాల్ ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని తన వైఖరి మార్చుకొమ్మని ఒప్పించగలిగేంత ప్రాముఖ్యమైన విషయమేమీ కాదు భూపాల్ విషయం. భూపాల్‌కు న్యాయం చేకూర్చగలిగే వాళ్ళెవరికీ అందుకు పూనుకోగలిగేటంత పెద్ద విషయం కాదిది. వాళ్ళకు ఇంకా ఎన్నో ముఖ్యమైన విషయాలున్నాయి.

భూపాల్ ఇప్పటికీ ఘటనాక్రమాన్ని గుర్తు చేసుకుంటూ ఉంటాడు. తన "మిత్రుడు" తన సహాయం అడగడం; ఆ మిత్రుడు అక్కడికి వస్తున్న తన "మిత్రులు" కొందరికీ ఆశ్రయం ఇమ్మనటం-భూపాల్ వాళ్ళను తన మిత్రుని వద్ద ఉంచడం, ఆ మరో "మిత్రుడు" ముంబయికి మారడం మంచిదని సలహా ఇవ్వడం-ఖాట్మండులో హోటల్‌లో పెద్దగా సంపాదన ఏముంటుందనీ? ముంబయిలో అయితే చాలా ఎక్కువ సంపాదించవచ్చు. తను అక్కడ తన ఫ్రెండ్ కాంటాక్టు కూడా ఇప్పిస్తాడు. భూపాల్ తన సంపాదనంతా మూటకట్టుకొని భార్య పిల్లలతో సహా ముంబయికి నాలుగు రోజుల ప్రయాణానికి బయల్దేరడం, ఆ "కాంటాక్ట్"ను కలిస్తే అతను ఒక గదిలో వీళ్ళను ఉంచడం, అలిసి నిద్రపోతున్న ఆ రెండోరోజు అర్ధరాత్రి తలుపు తట్టడం-అలసటను ఒక్క దెబ్బతో వదలకొట్టింది. అలసటనే కాదు. ఇంకా ఎనెన్నో... పోలీసు వ్యానులో కూలదోయడం, చిత్రహింసలు, జీవితంలో ఎన్నడూ ఎరగనంతా అవమాన పరచడం. ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసి-814ను హైజాక్ చేయడానికి కుట్ర చేశాడనీ, ఖాట్మండులో తను ఆశ్రయమిచ్చిన వాళ్ళే హైజాకర్లనీ ఆరోపణ! భూపాల్ వద్ద ఆయుధం దొరికిందనీ తనను ఆయుధాల చట్టం హైజాకింగ్ వ్యతిరేక చట్టం, ఇంకా ఏవేవో చట్టాల కింద అరెస్ట్ చేశారనీ కోర్టు చెప్పితే తెలిసింది. హైజాక్ చేయడానికి అవసరమైన నిధుల కోసం ముంబయి బ్యాంకు నొకదాన్ని దోచుకున్నందుకు కూడా అరెస్టు చేశారని కోర్టు చెప్పింది.

భూపాల్ మెల్లగా దగ్గరికి జరిగి గుసగుసగా "ఇదంతా ఒక అబద్ధం, ఒక డ్రామా! ఇదంతా అద్వానీ పథకం. అద్వానీ మసూద్ అజహర్‌ను విడుదల చేయాలనుకున్నాడు. చూడు మసూద్ గత తొమ్మిదేళ్ళలో భారతదేశానికి వ్యతిరేకంగా ఏమన్నా చేసాడా? ఇప్పుడు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని ఎంత కష్టపెడుతున్నాడో చూడు. ఈ నిజాన్ని మీడియా ఎందుకు బయటపెట్టదు?"

నేను అనుకోకుండా చాలా దగ్గర నుండి ఆ కళ్ళలోకి నిస్పృహను చూసి మెల్లగా తల ఆడించుకుంటూ మనసులో అనుకున్నా-"భూపాల్ నీవు పిచ్చోడివవుతున్నావు".

ఒక నెల తర్వాత అద్వానీ, అతని పార్టనర్ మసూద్‌ను, ఇతరులను విడుదల చేయడం గురించి తనకేమీ తెలియదని ఓటర్లకు చెబుతున్నాడు. ప్రతిపక్షం విమర్శలు గుప్పిస్తుంటే అతని శిబిరం మాత్రం అదే మాటకు కట్టుబడి ఉన్నారు. మీడియాలోని గణనీయమైన సెక్షన్ అద్వానికే బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇచ్చింది. మరో నాలుగు నెలలు గడిచాక అద్వానీ శిబిరమంతా అతన్ని పక్కన పడేసి మసూద్ విడుదలలో ఉన్న ప్రతి నాయకుడూ-అద్వానీ చెబుతున్నది అబద్ధమనీ అద్వానీకి మొదటి నుంచే అన్ని విషయాలు తెలుసనీ అంటున్నారు.

భూపాల్ ఇప్పుడు మరోజైలుకి మారిపోయాడు. నాకు అతను చెప్పిన అద్వానీ కథ గుర్తుకొచ్చింది. నేను అతన్ని మరింత అడగవలసిందా అనిపించింది. భూపాల్ చెప్పిన కథ నిజంగా అంత పిచ్చికథనా? కాదా? ఏమో? కానీ అద్వానీ చెపుతున్న దానికంటే పిచ్చి కథనమైతే కాదు కదా? ఖచ్చితంగా కాదు.! కాదూ?

\- 0 -

(రచయిత వెర్నన్ గొన్ సాల్విస్ మావోయిస్టు ఖైదీ. ప్రస్తుతం నాగపూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. ఆర్థర్ రోడ్ జైలులో ఉండగా రాసిన భూపాల్ ఫ్రం నేపాల్ అనే ఇంగ్లిషు కథకు తెలుగు అనువాదం)

(మే - జూన్ 2012 సంచికలో ప్రచురించిన *'పురుగులు'* కథ రచయిత పేరు *'చైతన్య ప్రకాశ్'*గా సరిచూసుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం - సం.)

కథ

ముంజేతిని ఖండించినా...

- నల్లూరి రుక్మిణి

మీరంతా ఇలా తలోవేపు మూలుగుతూ ఉంటే... నేనెట్లా కూడదీసుకోనూ? నలుగురూ నాలుగు వైపులా అట్లా తలోదిక్కుకు పడిపోయేరే? తనువు తల్లడిల్లిపోతూ కాళ్ళను, చేతుల్నీ సమస్త అవయవాలను స్వాధీనంలోకి తెచ్చుకోవాలని ఆరాటపడుతోంది.

చిమ్మ చీకటి... నవంబరు నెల, చలిగాలి... పైగా తుఫానని నాలుగు రోజుల నుండి టి.విలలో ఒకటే వార్తల రొద.

తాను ఎక్కడున్నాడూ? ఏం జరిగిందీ? నిన్ననే గదా 'సిల్దా' సరిహద్దు దాటి నగరంలోకి ఎంటరయ్యింది. మామూలుగానే మధ్య తరగతి చిరుద్యోగి వాలకం... పాంటూ, షర్టు పైన చలికోటు.

తను నిర్దేశించుకున్న ప్రాంతానికి వచ్చాడు. కానీ వాతావరణంలో ఏదో మార్పు... వెంటనే పసిగట్టి ఎలర్టయ్యాడు. అయితే కాలం అతనికంత వ్యవధి నివ్వలేదు. అప్పటికే ఆలస్యమయిపోయింది. తనను ఇద్దరు ముగ్గురు వాటేసుకుని ఏదో గుచ్చటం తెలుసు... అంతే! నాలుగైదు గంటల తరువాతగానీ తెలివి రాలేదు... ఇది ఏ ప్రాంతమో! ఆచూకీ ఎట్లా తెలిసిందీ? ఎవరు చేరవేసి ఉంటారూ?...

జరిగిన సంఘటన గుర్తు చేకోసాగాడు. కాళ్ళూ చేతులు కట్టేసి ఉన్నయ్యి.

నలుగురైదుగురు చుట్టూ చేరి... ప్రశ్నల మీద ప్రశ్నలు 'మీ గణపతి ఎక్కడ! వాడికీ నీకూ నేరుగానే లింకు ఉంది! వాడొక్కడే మిగిలిందీ!... వాడిని ఫినిష్ చెయ్యగలిగితే దేశానికి మీ పీడ విరగడవుతుంది... వాడెట్లా ఉంటాడు! ఎంత ఎత్తు! ఏ రంగు! ఏ ప్రాంతంలో ఉన్నాడు'...

'ఆచూకీ చెప్పావంటే... నీకు కోట్లు ఇస్తాం... విదేశాలకు పోయే ఏర్పాట్లు చేస్తాం... హాయిగా బతకొచ్చు'... మరోవైపు లాలూచీ పథకం.

అతనికి కోపం, అవమానం, బాధ ముప్పిరిగొన్నాయి.

'నేనెవరనుకుంటున్నారు! 'రాంజీని'... బ్రిటిషువాడి నెదిరించిన రాంజీగోండు వారసుణ్ణి!... చెత్తమాటలు మాట్లాడొద్దు'....!!

అయినా అదే తంతు సహనం కోల్పోయేదాకా సాగింది.

'నీకు మర్యాదగా చెప్తే వింటావా! నువ్వేం తక్కువ వాడివా! పోలీస్ యంత్రాంగాన్నే సవాల్ చేసిన వాడివి... ఇక చూడు నీ స్థాయికి తగ్గ ట్రీట్‌మెంట్ ఎట్లా ఉంటుందో!' సైగ చేసి వెళ్ళిపోయారు.

అంతే, జబ్బలు దండెలు తేలి మొహం కరుడుకట్టి ఉన్న ముగ్గురు స్పెషల్ ట్రైనింగ్ వాళ్ళు దిగారు.

'చెప్పరా! మర్యాదగా చెప్పరా! నా నొడకా! చెప్పకపోతే ప్రాణాలు తీస్తాం'...

'ప్రాణాలే గదా తీసేది! మీరంతకంటే ఏం చెయ్యలరు?! రేపో మాపో ఎలాగూ పోయేవే! కాకపోతే కొద్దిగా ముందు!... అంతే!'

'ఓహో! నిన్ను ఓ తుపాకి గుండుతో అంత తేలిగ్గా ఏసేస్తామనుకుంటున్నావా! నెవ్వర్! మా డిపార్టుమెంటును... ఆ లాల్‌ఘడ్ అడివి జనంతో పరిహాసాలాడిస్తావా! స్టేషన్‌కొచ్చి... మేముండగానే స్టేషన్ చుట్టుముట్టి మమ్మల్ని నిర్బంధించి... మైకులో మీ ప్రశ్నలకు జవాబులు చెప్పాలని మమ్మల్ని నిలదీసి... మా వాహనాలకు నిప్పు పెట్టిస్తావా! ఎంత మొనగాడివి... ఇప్పుడు చూపించరా! నీ ప్రతాపం!' పోలీసు వాళ్ళకు జరిగింది తల్చుకుంటుంటే... కోపం దానంతటదే పొంగుకొస్తోంది. అట్లా మాట్లాడుతూనే... లావుపాటి కర్రలతో శరీరంపై ఎక్కడపడితే అక్కడ పొడుస్తున్నారు. అయినా కోపం ఆగడం లేదు.

అతనికి మాత్రం వాళ్ళను చూస్తుంటే... వాళ్ళ మాటలు వింటుంటే పరిహాసంతోపాటు లాల్‌ఘడ్ ముట్టడి దృశ్యమానమవుతోంది. ఎంతజనం! వేలకొద్దీ! తమ సాంప్రదాయ... ఆయుధాలైన విల్లంబులు... ఈటెలు... గొడ్డళ్ళతో ఆడవాళ్ళు సహితం బారులు తీరి బంకురా, ఝార్‌గామ్, ఝుట్కా, నోకత్ అటవీ ప్రాంతాల నుండి లాల్‌ఘడ్ చేరుకుని!... వాళ్ళేం చేశారూ?! ఏం డిమాండ్ చేశారు? అతి సాధారణమైంది. 'మమ్మల్ని ఎందుకు అన్యాయంగా కొట్టారో చెప్పమన్నారు' అంతే... అదే కారణం! కానీ వీళ్ళేం చేసారూ?... స్టెన్‌గన్స్, తుపాకులు, ఆధునిక ఆయుధాలు ఉండి కూడా స్టేషన్‌లోపల దాక్కున్నారు... ఎంత సేపటికీ బయటికి రాకపోయేరు.

'కస్సున పక్కలో దిగిందేమిటి? ఈటెనా! కాదు కాదు బాయ్‌నెట్!... తేరుకునేలోగా మరో పోటు... 'అబ్బా!'... ఆ రాత్రంతా పొద్దుపోయేదాకా తంతుసాగింది.

ఎప్పుడు స్పృహ కోల్పోయిందీ... ఎప్పుడు వాళ్ళు వదిలిపోయిందీ తెలియదు.

దేహం అణువణువూ రక్తం ఓడుతోంది, భరించరాని నొప్పి... కానీ తనను తాను కూడదీసుకోకపోతే ఈ శరీరం మరింత డీలా పడిపోతుంది.

ఓ దీర్ఘ శ్వాస తీసుకుని, ఆ ఊపుతో లేచి కూర్చోవాలని, గొప్ప ప్రయత్నం చేస్తోంది తనువు... గట్టిగా గాలి పీల్చుకుందామని శ్వాసకోశాలను కదలించబోయింది. శ్వాసకోసం చుట్టూ ఉన్న కండరాల్లోనూ - ఎదమీదనూ... ఎముకల్లోనూ పటపటమన్న శబ్దాలు... గాలి పీల్చేశక్తి లేనట్టుగా... తిరిగి నిస్ప్రాణంగా అయి... బిగించిన పట్టు సడలిపోయింది.

కడుపులో పేగులు పచ్చిపచ్చిగా ఎటు మెసలాలన్నా సహకరించడం లేదు. లోపల్లోపల ఏదో వెగటుగా తిప్పుతూ

జలజలమంటోంది! అర్థం కాలేదు.

'అమ్మా! సుదంతీ కాస్త ఆ జలజల ఏమిటో చెప్పు తల్లీ... లోపలంతా ఏదో నుజ్జు నుజ్జుగా ఉంది... తనకేమైందో తెలుసుకోవాలని తనువు ప్రయత్నం... బహుశా బాయ్‌నెట్ పోట్లతో చిల్లులు పడ్డ పేగుల్లోని కదలికలేమో!'

తల్లి తనువుకు ఓదార్పునివ్వాలని పెదవులు కూడదీసుకోవడానికి... పళ్ళ బిగువు ప్రయత్నం ఫలించలేదు. దవడలు దగ్గరకే రావడం లేదు. అవి అసలు ఉన్నట్టో! లేనట్టో! స్పర్శే లేనట్టుగా ఉంది.

తన దంతాలేమయ్యాయి! పీకేశారా! పెదవులు కోసేశారా! చేతులతో ఒక్కసారి తడుముకోవాలనిపించింది! తన నోటికేమైందో తెలుసుకుందామని చేసిన ప్రయత్నంలో... తెలియకుండానే భళ్ళుమంటూ వొంపులు వొంపులుగా రక్తం వొలికినట్టయింది. కడుపులోకి కారిన రక్తం బయటకు వెళ్ళకక్కడంతో, నిస్త్రాణంగా అయి మరోసారి మగత కమ్మింది.

'పారిన నెత్తురంతా పీపాల కెత్తిరయ్యా... కారిన నెత్తురంతా కడవలకెత్తిరయ్యా'!

* * *

ఆ రాత్రి పెద్ద టోపీలు మరోసారి కూడాయి. ఎక్కువ రోజులు మంచిది కాదు... బయటి వాళ్ళు స్మెల్ చేశారంటే, ప్రమాదం! వొదిలి పెట్టాల్సి వస్తుంది. తొందరగా ఆపరేషన్ ఫినిష్ చెయ్యాలి, లేదంటే మన చేతులు దాటిపోతుంది.

ఓ.కే. ఓ.కే ఏదైనా ఇట్లా ఎక్కువ సమయం తీసుకోవడం మంచిది కాదు. బయటికి పొక్కిందంటే అంతకంటే చాతగాని తనం మరోటుండదు.

'అసలు వాడికంటే వీడే కీలకం... ఏదో ఒకటి చేసి మాట్లాడేటట్టు చెయ్యండి... అంత కొంచెం నోరు తెరిచినా మనం ఎచీవ్ చేసినట్టే'...

సంభాషణ అంతా మూకీభాషలో జరిగిపోయింది.

అక్కడి నుండి నేరుగా పోలీస్ క్లబ్ వైపుదారి తీసిన... రెండు కార్లలోని, నాలుగు తలలూ ప్రత్యేక గదిలో చేరాయి.

అందులో ఒకడికి బావమరిది పేరుతో 'లోటస్' వ్యాపారంలో భాగముంది... మరో టోపీ, ఎం.పి.గారి అల్లుడి చినతాత కొడుకు, ఆ ఎం.పి.గారేమో 'నందిగ్రామ్' పోయిందనీ... తనకి కావాల్సిన పనులు ఆగిపోయినందున మహాకోపంగా ఉన్నాడని, ఈ టోపీ ఫీలై పోతోంది.

మనవాళ్ళ సంగతట్లా వదిలెయ్యండి! 'లోకల్ ఫెలోస్' ఓ టోపి మధ్యలో కలుగచేసుకుంది. అతని మాట ఎవరూ పట్టించుకోలేదు.

'మన డి.జి.పి. బాస్‌ని పిలిపించారు గదా! హోం అంబరీష దొర... ఏం నిర్ణయం చేస్తారో'...

'హోం' మాత్రం తక్కువా? వేదాంతలోను, పోస్కోలోనూ వాటాలున్నాయంటున్నారుగా. వీళ్ళక్కడ చెలరేగడం సహిస్తాడా! తొక్కడూ!'... అయినా ఇంత పెద్ద తిమింగలం దొరికాక వదులుతారా!'...

'అదేమో గానీ! ఇప్పుడు వీళ్ళను నామరూపాలు లేకుండా చెయ్యాలన్నదే అమెరికా వాడి లక్ష్యం. ఇదిగో వీళ్ళొక్కరే వాడికి కంటిలో నలుసులాగా ఉన్నారు. వీళ్ళు లేకపోతే అమెరికా కంపెనీలకు ఈ పాటికి మనవాళ్ళు కార్పెట్ పరిచేవాళ్ళు... అందుకే వాడికంత కోపం వీళ్ళ మీద.

అంతా తలపాగా వాడిని అంటారు గానీ... అసలు కథంతా నడిపేది ఈ నక్షత్ర పంచకమే! ఆ మధ్య అమెరికా వెళ్ళొచ్చాడుగా! వాళ్ళకు ఏవేవో వాగ్దానాలు చేసే ఉంటాడు.

'ఓకె.. ఓకె లీవ్ ఇట్... మనం పాలసీ మ్యాటర్స్ చర్చించవద్దు!... అది మన పరిధిలోది కాదు. సరే ఏదైనా రేపటితో ఈ 'ఆపరేషన్' ముగించాలి'.

* * *

అంతా నిశ్శబ్దం! తనువుకు తీరని అలసట... స్పృహ లేనట్టు ఎటు కదలడానికీ రావడం లేదు... చల్లటి గచ్చుమీద... ఒంటి మీద బట్టలేదు. చలిగాలికి గాయాలు సలుపుతున్నయ్యి... నొప్పులకు అతీతమైన ఓ మాయా నిశ్చలత దేహాన్ని ఆవరించింది. నిద్రలో మెలకువో... మెలకువలో నిద్రో ఎటూ కాని స్థితి. బాయ్‌నెట్ గాయాలకు తోడు... కరెంట్‌తో కాల్చిన వచ్చిపుండ్లు జివ్వుమంటున్నాయి.

ఓ క్షణం తనువుకు తట్టుకోలేననిపించింది. 'ఊపిరి ఆగిపోతే బావుండు!.. అట్లాంటి తలంపు ఒక్కసారిగా షాక్ కొట్టినట్లయింది. 'ఛీ!.. ఎట్లా ఆలోచిస్తున్నాను!... ఈ నిస్పృహే శత్రువుకు కావాల్సింది... అదే నిజమైతే వాడు జయించినట్టే గదా!

వాడు జయిస్తాడా! నా మీద వాడు జయిస్తాడా! వీల్లేదు'... గొంతు పైకెత్తి పాడుతున్నాననే అనుకుంటూ **ఓ అరుణ పతాకమా! చేకొనుమా రెడ్ శాల్యూట్... శ్రమ జీవుల కేతనమా! నీకిదిగో రెడ్ శాల్యూట్...** పాట తలంపులోకి రాగానే బారులు తీరి నడుస్తున్న ఆదివాసీలు... వాళ్ళు పాడుతున్న ఎర్రజెండా పాట వినిపించింది. లాల్‌ఘడ్, నందిగ్రామ్, సింగూర్‌ల విజయం కళ్ళల్లోకి వచ్చింది.

ఎంతటి ఘన విజయం... అది ప్రజా విజయం. విప్లవోద్యమంలో 'పోలీసుల అత్యాచారాల వ్యతిరేక కమిటీ' ఓ అద్భుతం. జంగల్ మహల్ జనం ఎంత సమరశీలురూ? చితామొణిమొర్మూ! భర్త ప్రాణాలను తీసుకుపోతున్న యముడిని యమలోకందాకా వెంటబడిన సతీసావిత్రిలాగా భర్తను తీసికెళ్ళిపోతున్నారని పోలీసుల వెనకపడి వాళ్ళను ప్రతిఘటించి విడిపించుకోవాలని ఎంత పోరాడిందీ?... చివరికి కన్ను కూడా చితికిపోయింది. అయినా పట్టువదిలిందా? ఆ కామ్రేడ్!... ఆమేనా? అలాంటి వాళ్ళెందరు! పన్మాణి, గంగా మొణి, గౌతమ్ పాత్రా, సుశీల్ హన్సదా, ఎంతమందీ!... వేలాది జనం తమ చేతికి దొరికిన, తలో ఆయుధం అందుకొని రాత్రికి రాత్రి ఎంత సంబరంగా... అదో పండుగలాగా రోడ్లన్నీ తవ్విపోశారు...

అక్కడ పర్యవేక్షిస్తూ ఆయుధం వీపుమీద పక్కకు పెట్టుకొని వాళ్ళతో కలసి చెట్లకొమ్మలు నరికి... రోడ్లు తవ్విపోయడంలో... వాళ్ళతోపాటు, వాళ్ళ మధ్యే ఉండడం! ఇన్నేళ్ళుగా తన విప్లవోద్యమ కలలు సాకారమవడం తనకు నిజంగా ఓ పండగే! వేలాది మంది ఆదివాసులు చేస్తున్న పని... అప్పుడే జరుగుతున్నట్టు ఆ క్షణం కూడా

ఎంతో ఉత్తేజం కలిగింది.

'అరే భాయ్! కరెంటుతో జాగ్రత్త'... అంటుంటే వినిపించుకున్నారా!... 'ఓ రాంజీ... కరెంటు మనల్నేం చేస్తది... అది మనం చేసేదే కదా!' అంటూనే తీగలు తెంపిపోశారు.

మేదినీపూర్, బంకురాలకు మిగిలిన ప్రపంచంతో లింకులు తెంపేశారు... పోలీసు యంత్రాంగానికి తోచలేదు... ప్రపంచం చేష్టలుడిగి చూస్తుండిపోయింది. ఆదివాసులంతా ఒక్కటయ్యారు... సి.పి.ఎం. కార్యకర్తలు సహితం... మేం మొదట ఆదివాసులం... తరువాతే కార్యకర్తలం అంటూ ప్రజా ఉద్యమంలో ఎట్లా కలిశారూ!'

అందంతా తల్చుకుంటూ... అవును తక్కువ చేశామా? ఇంత చేస్తే నా మీద ఈ పోలీసు అధికారులకు 'కసి' కాకపోతే మరేముంటుందీ? వాళ్ళకు నేనెంత కావలసిన వాడినో! నన్నంత తేలిగ్గా వదులుతారా!

గుండెల నిండా ధైర్యం... కళ్ళల్లో విజయం నిండుకున్నాయి.

* * *

'రేయ్! వీడేదో! మాట్లాడుతున్నాడురా! కమాండరు గదా! ఏం కమాండులిస్తున్నాడో!'... బూతుల వర్షం కురిసిందక్కడ... అయినా కసితీరక, 'కుక్కల కొడకా' అంటూ... గొరగొర శబ్దానికి కదిలిన దవడ మీద కచ్చగా బాయ్‌నెట్‌తో మరోరెండు పోట్లు పొడిచారు.

'పై ముండా కొడుకులకు ఏమిటో ఆలోచనలు... లేకపోతేనా... వీడి కండకండా కోసి పారెయ్యమా' తిట్టీ తిట్టీ అలిసిపోతున్నారు.

అప్పటికి ఆ ప్రాంతానికి వచ్చి మూడు నెలలైంది ఆ బెటాలియన్. రోజూ పొట్టనిండా తినేందుకు మాంసం కూరలు లేవు... రాత్రయితే ఓ బాటిల్ మందు లేదు. నీళ్ళు లేవు... నిప్పులు లేవు... పగళ్ళే కాదు... ఒక్కోసారి సమాచారం అందితే రాత్రిళ్ళు కూడా... వెధవల కోసం నిద్రాహారాలు లేకుండా ఆ కొండల్లో అడవుల్లో వెదకాల్సి రావడం... దహించివేస్తోంది వాళ్ళకు. ఎంత చేసినా కసితీరడం లేదు! తోడేళ్ళ వంటి దాహం మరి.

వీడికి ఎన్ని రోజులు కాపలా కాయాలో! ఆ నా కొడుకులకేం! ఏదో ఒకటి ఆర్డరు వేసి... పోయి ఎ.సి. గదుల్లో తొంగుంటారు! లంగ నా కొడుకులు.

పట్టలేని తమ కోపం... ఉద్యోగం మీదనా!... పై అధికారుల మీదనా... ఇక్కడికి తోలడానికి కారణమైన ఈ ఉద్యమకారుల మీదనా! ఎవరి మీద చూపించాలో తెలియని ఆవేశం ముంచుకురాగా!... బాయ్‌నెట్‌తో మరోసారి పొడుపు పొడిచాడు కసితో!

'అమ్మా' అన్నది తనువు.

'ఒరేయ్! వీడికింకా చురుకు తెలుస్తోందిరా! మూలిగాడు'... ఇంకా రెండు పొడువు... తెల్లారేటప్పటికి చచ్చి ఊరుకుంటాడు... మరొకడు మాట అందించాడు.

అదే అయితే ఇంతసేపా! పట్టుకురాగానే – అప్పుడే పోయేదిగా! వాళ్ళున్న ప్రాంతం ఎవరికీ తెలియకూడదు... వీళ్ళు బయటికి పోకూడదు... నిన్నటి నుండి వాళ్ళకూ నిద్రాహారాలు లేవు... వీడి పని ముగిస్తే మామూలు ప్రపంచంలోకి పోవచ్చు... అదే వాళ్ళ అసహనం.

'నిన్ననగా తెచ్చాం... ఒక్కమాట చెప్పాడా? నోరు విప్పాడా! చెప్పేవాడయితే! మొదటి ఊపులోనే కక్కేవాడు... ఇప్పుడింకేం చెప్తాడు! అయినా వాడికి నోరు విప్పి చెప్పే త్రాణ ఏదీ? ఇట్లానే ఉంటే గుటుక్కుమంటాడు రేపటికల్లా!'

వాళ్ళ మాటలు అతనికి ఎక్కడో లీలగా వినిపించినట్లయింది. గుండె నిండా బలం వచ్చినట్లయింది... శత్రువును అన్ని చోట్లా ఓడించాల్సిందే! యుద్ధరంగంలోనైనా... ఒంటరి నిర్బంధంలోనైనా!...

అవును! పోలీసు కాంపులలోనే... పోలీసులనెట్లా ఎదిరించారా వీరవనితలు! నిర్బంధాలలో కూడా ప్రజలెట్లా కదిలారూ!... తెలంగాణ గ్రామాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి, నిర్బంధం సాగిస్తుంటే మగవాళ్ళు అడవుల్లో, గుట్టల్లో రక్షణ తీసుకోవాల్సి వచ్చినపుడు ఆడవాళ్ళే స్వయంగా వ్యవసాయాన్ని చూసుకోలేదూ!... ఓ పక్క వ్యవసాయాన్ని చూసుకుంటూనే తమ వారికి తిండి తిప్పలు అందించడమే కాక ఉద్యమానికి వార్తాహరులుగా ఎట్లా పనిచేసారూ!... శత్రువు దీన్ని కట్టడి చేయాలని ఆడవాళ్ళను పోలీసు క్యాంపుల ముందే కూర్చోబెట్టి గ్రామాలు దాటనీయకపోతే, వాళ్ళేం చేసారూ! తమ పిల్లల్ని, ఆడుకునే చిన్నపిల్లల్ని గుట్టల్లోకి వార్తలు మోసుకుపోయే బాల సైనికుల్లాగా తయారు చెయ్యలేదూ! ఆ! ఆడవాళ్ళయినా క్యాంపులకెదురుగా ఊరికే కూర్చున్నారా!... నానా గొడవ చేసి, వొదలి పెట్టేదాకా లొల్లి లొల్లి చేస్తే! పోలీసులు తట్టుకోలేక విడిచిపెట్టలేదూ!... అట్లా నిర్బంధాల్ని ఆడవాళ్ళు సైతం ఎట్లా ఎదిరించి, ఓడించారు.

అవును నేనుండాల... ఈ శరీరాన్ని నిలెబట్టాల... ఆదివాసుల చేతికర్రనవ్వాల... ఆదివాసీలను అనుకుంటుంటే అబూజ్‌మడ్ తలపులు పులకలు రేపింది. జనతన సర్కార్... కొత్త సామాజిక నిర్మాణాల్లో ప్రజల భాగస్వామ్యం... ప్రజానుకూల అభివృద్ధి... ఆ జనంలో ఎంతటి సహకారం... సహకారం అన్నది వాళ్ళ సంస్కృతిలో భాగంగా ఎంత ఐక్యంగా ఉంటారూ!

సమిష్టి శ్రమతో చెరువుల నిర్మాణం... ప్రాథమిక విద్య... ముఖ్యంగా స్త్రీలు ఎంత ధైర్యస్తులూ... డి.కె.ఎం.ఎస్. ఎంత మందిని వీరవనితల్ని చేసింది. కుమ్మీ, చైతేల వంటి ఆదివాసీలు ఎందరు అమరులయ్యారూ?

ఇది పురిటిబిడ్డ... నడక నేర్పాలి... భవిష్యత్తులో ఉజ్జ్వల విముక్తి ప్రాంతంగా రూపుదిద్దుకోవాలి.

ఓడించాలి, ఈ గ్రీన్‌హంట్ యుద్ధాన్ని... ఓడించాలి... భూమినీ కొండలనూ తవ్విపోసి... మానవాళిని వినాశనం వైపు నెట్టుతున్న ఈ 'కాపిటల్ క్రీడను' ఎదిరించాలి. ఆదివాసీల మనుగడను భూస్థాపితం చెయ్యబోతున్న ఈ దుర్మార్గాన్ని ఆపాలి... ఆపాలి. తెలియని ఆవేశం శరీరాన్ని చుట్టుకుంది.

లోపలి ఉద్రేకాలతో రక్తం వేగంగా ప్రవహించడంతో ముక్కుల్లో నుండి బాయ్‌నెట్ రంధ్రాల నుండి... బయటకు నెత్తురు స్రవించి... అక్కడంతా గడ్డకట్టినట్టయ్యింది. నల్లగా మాసిపోయిన పాత డ్రస్సు మీదకు ఒక్కొక్క బొట్టూ కారి వంటి మీదున్న బట్టలు ఎరుపు కింద తిరిగాయి.

'ఛీ... ఛీ... ఇదంతా నెత్తుటి వాసన... నీచు కంపు కొడుతోంది. వొళ్ళంతా పొడిచి పెట్టినా... చావలేదు .. ఇంకా పచ్చిగా రక్తం

కారుతూనే ఉంది. మొండి లం...కొడుకు.. ఇంకోడయితే చావనన్నా చచ్చేవాడు... లేదంటే నోరువిప్పి అంతైనా చెప్పి ఈ దెబ్బలు తప్పించుకునేవాడు'.

అతని విశ్వాసం ముందు క్రమంగా ఓడిపోతున్న శత్రువు... గచ్చుమీద పడున్న అతని శరీరం ఆ టోపీల ఆలోచనల్ని ఆక్రమించి జయించింది.

* * *

తనువుకు మెల్లిమెల్లిగా తెలుస్తోంది. అదింకా చలనంలోనే ఉన్నట్టు. తానెక్కడుందీ? ఎన్నాళ్ళయిందీ?... ఆలోచనకు అందడం లేదు... రెండు రోజులా... మూడు రోజులా!

గాలిలో ఏదో రొద వినిపిస్తోంది. ఇది ఏ ప్రాంతం... అలికిడి పెద్దగా లేదు. ఎక్కడో దూరంగా తెచ్చినట్టున్నారు...

ముంజేతులు సలుపుతున్నయ్యి. భుజాలదాకా విపరీతమైన మంట. ఏమైందీ చేతులకు... కళ్ళు తెరుద్దామంటే తెరిపిడి పడటం లేదు. అసలు కన్ను ఉందా? లేదా! భరించలేని నొప్పి కంటి భాగంలో... చేతితో తడుముకోవాలనిపించింది... కానీ చెయ్యెత్తగలిగే స్థితిలో తనువు లేదు.

అంతా చిమ్మ చీకటి... ఈ చీకటి గదిలోనిదా! తనలోనిదా!

'గదిలోపలి చీకటా! చీకటిలోపలి గదా'... అప్రయత్నంగా శ్రీశ్రీ గేయం నాలుక మీదకు వచ్చింది. శ్రీశ్రీ ఓ ఉత్తేజం. ఆయనంటే జనానికి ఎంత ఆరాధన? ఎన్ని గ్రామాలు? 'భూమయ్య, కిష్టగౌడల ఉరిశిక్షల వ్యతిరేక కమిటీ' తరపున... ఆయనతో కలిసి నడవడం ఎంత మంచి అనుభవం.

చిన్న పిల్లాడిలాగా 'ఓ కామ్రేడ్! మనమిప్పుడేం చేయబోతున్నాం'.

'ఏం లేదు సార్! మీటింగు కోసం పెద్దపల్లి పోతున్నాం... కొద్దిగా నడవాల్సి ఉంటుంది'.

'ఏం ఫరవాలేదు... మనదంతా 'పదండి ముందుకే'... నువ్వేం ఫికర్ చెయ్యకు'.

ఆయన ఉపన్యాసాలకంటే ఆయన కవిత్వం యుద్ధ నినాదాలయ్యాయి. ఆయన - మనిషి అక్కడున్నాడన్నదే జనానికి ఉత్సాహాన్నిచ్చేది. వయసు మీరి, బలహీనంగా ఉన్నా... ఆ బక్కచిక్కిన దేహంతో తెలంగాణ నిర్బంధం మీద ఎన్ని ఊళ్ళు తిరిగాడూ!

ఔను, పెద్దపల్లి, మెట్టపల్లి పోరాట కేంద్రాలు... పురుషులేనా, ఆడవాళ్ళు కూడా ఎట్లా ఉద్యమాల్లోకి కదిలారు. తమ బిడ్డలను, భర్తలను అరెస్ట్ చేసి తీసుకువెళుతున్నారని ఆ స్త్రీలు ఎంత సాహసం ప్రదర్శించారు!... పోలీసులు జీపు తాళం చేతులు తీసేసుకొని జీపుని ఆపివెయ్యలేదూ!... తమవాళ్ళను వదిలిపెట్టేదాకా జీపును కదలనిచ్చారా!... నిర్బంధాలను ఎదుర్కోవడానికి ప్రజలకు ఎన్ని కొత్త కొత్తరూపాలో!

మద్దునూరు భూస్వామి తమతో కట్టించిన దండగలు తిరిగి కట్టలేదని కోనాపూర్, రాంపూర్, ధర్మాజిపేట జనం ఎలా కదిలారూ!... భూస్వామి రైతుల భూముల్లోకి ట్రాక్టర్లు తెచ్చి పంట నాశనం చేయించి పోలీసు క్యాంపు పెట్టించినా!... అయినా జనం దడిచారా!... క్యాంపు ఉండగానే మూడు గ్రామాల ప్రజలు కదిలి తిరిగి వాడి పాతికెకరాల పంటను ధ్వంసం చెయ్యలేదూ! దెబ్బకు దెబ్బ తీస్తూనే నిర్బంధాలను, హింసలను ఎదిరించారు. ఇళ్ళు తగలబెట్టి పంటలు నాశనం చేసి... మొగవాళ్ళను ఊళ్ళల్లో లేకుండా తరిమికొట్టీ!... పోలీసు క్యాంపులు పెట్టి ఎన్ని చేసినా రైతాంగం వెనకాడిందా!

అదిగో ఆ నిర్బంధాలనూ, దమనకాండనూ ప్రచారం చెయ్యడం కోసం ఆయన్నే కాదు ఆ కాలమంతా ఎందర్ని వెంటేసుకుని తెలంగాణ గ్రామాలన్నీ తిప్పాం... జగిత్యాల జైత్రయాత్ర... కరీంనగర్ రైతుకూలీ సభలు... మహోజ్వల పోరాట సంకేతాలు.

'ఉప్పు మడిగెలోన - ఉప్పెనే లేచింది
మద్దునూరు లోన - మంటలే లేచాయి
జగిత్యాల కొండల్లో జ్వాలలై నిలిచాయి'

చితికి జీరాడుతున్న తనువుకు ఎంతో సంతోషమనిపించింది. ఎన్నేళ్ళైందీ ఇవన్నీ తలచుకుని... జ్ఞాపకాలు నెమరువేసుకునే తీరికేదీ? ఈ కొనసాగింపులోనే తలమునకలై పోయాం... వెనక్కి తిరిగి చూసుకుంటుంటే తానెంత దూరం వచ్చాడూ?...

'ఎక్కడి మధురమ్మ కొడుకు... ఎక్కడి రాంజీ గోండు'

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ కిర్రుమన్న శబ్దం దూరంగా వినవచ్చింది. ఓహో! ట్రీట్‌మెంట్ మళ్ళీ మొదలు కావచ్చు... మానసికంగా సంసిద్ధుడవసాగాడు.

వచ్చినవాళ్ళు కదిలించి చూచారు... ఫరవాలేదు... కొంత తేరుకున్నాడు... 'ఏదన్నా ఇచ్చి అలా గోడకు కూర్చోబెట్టండి'.

మళ్ళీ అవే ప్రశ్నలు... 'ఇప్పటికైనా మించిపోయింది లేదు... గణపతి ఆచూకీ ఒక్కటి చెప్పు... వాడు నీ కాంటాక్టులోనే ఉంటాడు! నీకు ఏం కావాలంటే అదిచేస్తాం' ఎన్నిసార్లు అడిగినా అదే నోరు విప్పని మౌనం.

సహనం నటించడం ఇక వాళ్ళ చేత కావడం లేదు. 'వీడిట్లా చెప్పడురా! చెయ్యాల్సిన పని చేస్తేనే'... అని... సైగ చేసి అవతలికి వెళ్ళిపోయారు.

అంతే! పట్టకార్లతో గోళ్ళు పీకడం మొదలైంది.

నొప్పితో కళ్ళవెంట నీళ్ళు జలజలరాలాయి. అయినా పట్టువదలరాదు. శత్రువు జయించరాదు.

'ఫ్యూజిక్ వారసుడా! చేగువేరా చెలికాడా! రాడికల్ కుర్రవాడా! సూరపనేని జనార్ధనా! లాల్‌సలామ్, లాల్‌సలామ్!'

'చీడ పురుగులు! వీళ్ళను తుడిచిపెట్టకపోతే మాత్రం దేశం బాగుపడదు... ఏ మంచి పని... ఎక్కడ చెయ్యబోయినా, జనాన్నేసుకుని ఎదురు వస్తారు'. పెద్ద టోపీలకు అక్కసుగా ఉంది. తమ దందాలకు అడ్డులేకుండా చేసుకోవడానికే వాళ్ళ ఆరాటం.

ఆ మాటలేవీ అతని దాకా చేరలేదు... ఆ శరీరం తనది కాదన్న స్థితిలోకి మనసును ఏకాగ్రతలోకి తెచ్చుకోగలిగాడు.

'ఊగరా ఊగరా ఊరికొయ్యను అందుకొని ఊగరా!
చావన్నది నీకు లేనే లేదురా'...

టోపీలు తిట్టే తిట్లూ... శాపనార్థాలూ అతన్ని చేరడం లేదు. అతని నుండి ఏ శబ్దమూ లేదు.

'అసలేమీ ఉలుకూ, పలుకూ లేదేంటీ?... పోయేడా ఏంటి?' టోపీలకు మరోసారి అనుమానం వచ్చి టెన్షన్ పడ్డారు.

ముక్కు దగ్గర... గుండె దగ్గర పరీక్షగా చూసి 'హమ్మయ్య' అనుకున్నారు. 'బతికే ఉన్నాడురా!... లేకపోతే పెద్దబాస్‌ల దగ్గర అమ్మనా బూతులు తినాల్సి వచ్చేది'...

'చావగొట్టాలి... కానీ చావకూడదు... ఏం కనిపెట్టార్రా... మన డిపార్టుమెంట్ పెద్దలు... దొంగ నా కొడుకులు... వీడితో రెండు రోజుల నుండి ముక్క చెప్పించారా!'

కాలం దగ్గర పడుతోంది... ఒక్క ముక్క రాబట్టలేకపోయాం... పెద్ద టోపీలకు చిరాగ్గా ఉంది. అయినా మళ్ళీ ప్రయత్నం చేద్దాం!

తిరిగి చీకటి పడ్డాక మరోసారి నలుగురూ కూడారు.

'నువ్వే పెద్ద నాయకుడివి... అన్ని రాష్ట్రాలతో లింకులున్నవాడివీ... పార్టీ వివరాలన్నీ తెలుసు. పోనీ గణపతిని వదిలేయ్! కానీ ఈ రాష్ట్రమూ... పక్క రాష్ట్ర సెక్రటరీల వివరాలు చెప్పు! చాలు... నిన్ను వదిలేస్తాం'... రాజీ మొదలు పెట్టారు.

వాళ్ళ రాజీ బేరాలు... వేడికోళ్ళుగా వినిపించి... మరింత దృఢంగా అయ్యాడు. అతని శరీరపు కదలికలు... వాళ్ళ మాటలకు నిరసన తెలుపుతున్నట్టుగా ఉంది.

'ఏం! తలూపుతున్నావ్! చచ్చి ఏం సాధిస్తావ్‌రా!, మీ పార్టీ విప్లవం చేసి... దేశాన్ని జయిస్తుందా! ఏమనుకుంటున్నారు! భారత్ ఒక్కటే కాదు. మిమ్మల్ని నలిపేయడానికి! అమెరికా ఉవ్విళ్ళూరుతోంది. సాయుధ పోరాటం చేసి... పోలీసు రాజ్యాన్ని కూలదోస్తారా? అప్రాచ్! మేం తల్చుకుంటే మీరెంతరా! ఏదో ఈ గవర్నమెంటు 'జనం'! జనం' అనే గోలకి తప్పితే-లేకపోతే రెండు నిమిషాలు పట్టదు! మిమ్మల్ని స్మాష్ చేయ్యడానికి'.

'ఇప్పుడదీ అయిపోయిందిలే! ఇప్పుడు మీ మీద మాదే పెత్తనం! మాకు ఫుల్ పవర్స్ వచ్చినయ్యి... ఇక మీ పప్పులుడకవ్'... 'పిట్టలను కాల్చినట్టు కాల్చేస్తాం'.

'ముప్పైమందిని ఒక్కసారిగా బలిమెల డ్యామ్‌లో ముంచేస్తారురా!... ఇప్పుడు నిన్ను కాల్చడానికి ఒక్క గుండు చాలురా!'

ఆ మాటతో! స్పృహ లేక ఎక్కడికక్కడ వేళ్ళాడిపోతున్న అతని శరీరంలో విద్యుత్తు ప్రవహించింది.

ముప్పై మంది... ఎంత కసిగా అన్నాడూ!... ఆ ఘటన ఈ వెధవలకు పెద్దగాయం, మాన్పలేని అవమానం... మన ఓటమిలేని ధిక్కారం వీడికెంత కసిగా ఉందీ.

'అవును శత్రువు ఓడిపోవడం తమకెంత ఆనందమో... వాడికంత అవమానం... ఈ అనుభవం తమకెన్నిసార్లు ఎదురయ్యింది... విప్లవంలో శత్రువు పరాజయం ప్రజలకెంత సంతోషమో కదా!'

రాగినీడు, పాల్తెం, రాఘవాపురం, పోశెట్టి లక్ష్మీరాజం, హరిభూషణ్, గంగారాం ఒకొక్కక్కటీ ఒకదాని వెంట ఒకటి కదిలాయి. భూస్వాములు, పెత్తందారులు... ప్రజాపోరాటంలో ఓడిపోయి ఊళ్ళల్లో ఉండలేక పట్టణాలకు పారిపోవడం... విప్లవ విజయం సాధించిన ఘనత.

లొత్తునూరు, పైడిపల్లి, ఒకటేమిటి... కరీంనగర్ అంతా విప్లవోద్యమ వీచికలు.... దొరలను, భూస్వాములను సాంఘిక బహిష్కరణ చేసి మంగళ్ళు, చాకళ్ళు, మాల మాదిగలు పనులు బందు పెట్టడం... ఆ అవమానం భరించలేక దొరలు గ్రామాలు, ఆస్తులు, గడీలు వదిలి పట్టణాలకు పరిగెత్తడం.

పార్టీ చరిత్రలో అదో అపూర్వ ఘట్టం.

పాల్తెం, మద్దునూరులలో భూస్వామి ఓ గుట్టను ఆక్రమించి పెంపుచేసిన చెట్లను చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు స్వాధీనం చేసుకొని నరికి బండ్లకు వేసుకుని ఎర్రజండాలు కట్టుకొని బారులు తీరి ఊరేగింపు తీయడం, మాటలా... పాల్తెమే కాదు అప్పట్లో రాగినేడు, కోనారం, పెద్దపల్లి తాలూకా వ్యాప్తంగా భూముల ఆక్రమణ, కూలిరేట్ల పెంపుదల, పాలేర్ల జీతాల పోరాటాలు ఉవ్వెత్తున లేవగా, ఎలాగైనా వీటిని ఆపాలని భూస్వామి గూండాలతో ప్రజలను కొట్టించడం, పోలీసులతో నిర్బంధింపచేయడం వంటివి ఎన్ని చేశాడూ?... దానితో ఆ మూడు గ్రామాల ప్రజల మీద నిర్బంధాలను ఎలాగైనా ఆపాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాగినేడుకు ఊరేగింపుగా వెళితే వాడేం చేసాడు?... జనం మీదకి గూండాలను ఉసిగొలిపాడు... పోలీసులతో గాలిలోకి కాల్పులు జరిపించాడు. అయినా జనం ఎంత ధైర్యం ప్రదర్శించారు... ఎంత తెలివిగా వ్యవహరించారూ! ఎట్లా పట్టారో భూస్వామి కొడుకులిద్దరిని. ఊరేగింపు మధ్యకు లాక్కుపోయారు. అంతే!... మూడు రాత్రులు, మూడు పగళ్ళు అదో అపూర్వ ఘట్టం! చివరకి భూస్వామి, ప్రభుత్వం సంఘంతో రాజీకి దిగి డిమాండులకు ఒప్పుకోక తప్పలేదు.

'భూములు పంచాల్సిందే... ఎట్టి నాగలి ఇక ముందు చెల్లదు... పని చేసిందానికి కూలి కట్టాల్సిందే... దొంగ రుణాలు రద్దుచేసి... దొంగనోట్లు చించెయ్యాలి'...ప్రజలే ఒక్కొక్క డిమాండు ఎట్లా ముందుకు తెచ్చారూ!

జనం ఎంత సమిష్టిగా ఐక్యంగా నిలబడ్డారూ... వాళ్ళ జీవితాలలో అదో పర్వదినం... కలలో కూడా ఊహలకు అందని సన్నివేశాలు.

బాహ్య ప్రపంచం... భౌతికకాయం స్పర్శను గ్రహించే స్థితిలో లేదు. అయినా అతని మనోలోకం స్వేచ్ఛగా, ఆనందంగా... మద్దునూరు, లొత్తునూరు, పండితాపురం దొరలతో ఘర్షణ పడుతూనే ఉంది.

చినమెట్‌పల్లి భూస్వామి జగన్‌మోహనరావు మాత్రం పరమ కిరాతకుడు. పైగా కాంగ్రెస్ నాయకుడు. రైతుల సభను విచ్ఛిన్నం చేయడమేగాక రైతుల ఇళ్ళను రాత్రిపూట గూండాలతో దోపిడి చేయించి రైతులను బంధించాడు. ఇది తెలిసి తెల్లవారేసరికల్లా చుట్టుపక్కల గ్రామాల నుండి వెయ్యి మందికిపైగా రైతులు వాడి బంగాళాకు చేరిపోతే!... అంతే! దానితో వాడు భయపడిపోయి బంగ్లా మీద నుండి వాడు, వాడి అల్లుడు బోర్నపల్లి సురేష్‌రైతు, రైతు కార్యకర్తలపై కాల్పులు జరపగా!... రైతులు గాయపడ్డ మాట నిజమే! కానీ!... రైతులు ఊరుకున్నారా! అల్లుడు సురేష్ కూడా జనం మీద కాల్పులు జరిపాడని తెలిసి బోర్నపల్లి, చుట్టుపక్కల గ్రామాల రైతులు మెట్‌పల్లి రైతులకు సంఘీభావంగా సురేష్ ఇంటిని తగలబెట్టి, వాడి చేను చెలకా ధ్వంసం చేశారు. కిటికీలు, దర్వాజాలు పీకి మరీ తగులపెట్టారు.

భూస్వాముల అఘాయిత్యాలు, పోలీసుల నిర్బంధ కాండను

ప్రజలు చైతన్యంతో, ధైర్యంతో ఎట్లా ఎదుర్కొన్నారు.

లోపలి ఆనందం తాలూకా కాంతి చితకకుండా మిగిలిపోయిన చెక్కిలి మీదకు పాకింది.

'ఎవరక్కడా! వీడి నోటమ్మట మాట రావడం లేదు చూడండి'... ఓ టోపీ గబగబా వచ్చి...చేతిలో బాయ్‌నెట్‌తో పక్కలో పొడిచింది.

'అమ్మా!' విలవిలలాడింది తనువు. నీరసంగానే! అయినా స్పష్టంగానే 'మీరింత కాదు... ఇంకెంత చిత్రహింసలు పెట్టినా నా నుండి మీరేం తెలుసుకోలేరు... ఈ పోరాటంలో వొరిగిపోయిన బిడ్డలెందరో! అయినా దేన్ని ఆపగలిగారూ! ఇప్పుడైనా నన్ను చంపి విప్లవాన్ని రద్దు చేయలేరు'.

అతని మాటలకు టోపీలకు ఎక్కడ లేని కోపం ముంచుకొచ్చింది. 'వీడు మాట్లాడలేక కాదురా! చెప్పడం ఇష్టం లేక!'... 'ఇక లాభం లేదు కానివ్వండి... వీడికి మేదినీపూర్ గుర్తుకురావాలి... పోలీసులంటే ఏమిటో తెలిసిరావాలి' ఒక్కసారి కాదు, కండా కండా కోతపెట్టాలి... వీడు ఒక్కటి చేశాడా! పోలీసులను, అధికారులను రకరకాల మార్గాల వెదికి మరీ వేధించాడు.

'ఏరా! పోలీసులూ, ప్రభుత్వం... మేదినీపూర్ రాకూడదా! అంతా నీదేరా రాజ్యం... బహిరంగంగా జనానికి క్షమాపణలు చెప్పాలా! పోలీసులకు సరుకులివ్వకుండా... పనులు చెయ్యకుండా సాంఘిక బహిష్కరణ చేయిస్తావా!... ఇప్పుడెవడొస్తాడో చూద్దాం... అప్పటిదాకా ఆపి ఉంచిన సహనపు నటన మెల్లిమెల్లిగా దిగంబరమయ్యింది.

కోపంతో విసురుగా పెద్ద టోపీలు లేచిపోయాయి.

వాళ్ళ మాటలు ఎక్కడో లీలగా తాకాయతన్ని. వీడు ఎస్.పి. రాజేష్‌కుమార్ సింగే. అంత కసి వాడికే ఉంది... కళ్ళు తెరిపిడి పడకపోయినా అర్థమయింది. దానితో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

అవును అప్పటిలాగే ఇప్పుడు కూడా ఈ శరీరంతో పోరాటం చెయ్యాల్సిందే వీడితో! వీడిని చెవులు పట్టుకుని సాధారణ జనం ముందు క్షమాపణలు చెప్పమనడం... మామూలు విషయమా? ఒక జిల్లా పోలీసు అధికారి మరి... దానికి నేనే కారణమని వాడికి నిండా కసి... నన్ను సహించడం వాడికెట్లా సాధ్యం?

పకపకా నవ్వాడు... అట్లా నవ్వాననే అనుకొన్నాడు... అవును సాంఘిక బహిష్కరణ ప్రజల చేతుల్లో వజ్రాయుధం. తమ పెత్తనం సాగించడం కోసం!, జనం తమను ప్రశ్నించకుండా ఉండడం కోసం... కులం నుండి వెలివేయడం, తిండికి, తిప్పలకు ఏమీ దొరక్కుండా చేయడం. పేదలను మానసికంగానూ!... పరువు మర్యాదల మీద దెబ్బకొట్టడానికి ఉపయోగించే సాంఘిక బహిష్కరణ... అది ప్రజల చేతిలో పదునైన ఆయుధంగా మారి... భూస్వాముల ఇళ్ళల్లో పాచి పేరుకుపోయి, ఉతకని గుడ్డలు కంపుకొట్టుకుపోయి పనులు బందుపెట్టడంతో అవమానం పాలై పట్టణాలకు ఎట్లా పరిగెత్తుకుపోయారూ! వీళ్ళకేనా... గ్రామాలలో పెట్టినపోలీసు క్యాంపులలోని పోలీసులకు, గ్రామంలో ఏ వస్తువు, చివరకు మంచినీళ్ళు సహితం దొరక్కుండా బహిష్కరించడంతో గ్రామాలలో పోలీసుల అరాచకాన్ని కొంతమేరకు ఆపగలిగేరు కదా!... సాంఘిక బహిష్కరణ అంటే చంపబడానికన్నా మిన్నగా దొరలు భయపడ్డారు. మద్దునూరు దొర జగన్‌మోహనరావు దొడ్డిలో పాలచుక్క పిండేవాళ్ళు లేక, పశువులు దగ్గర బాగుచేసేవాళ్ళు లేక పాడిపశువులను వదిలి వేయాల్సి రావడం వాడికి ఎంత అవమానం. అందుకే ఉద్యమం మీద ఎంత కసి పెంచుకున్నాడు. ఆనాడు జగన్మోహనరావు... ఈనాడు ఎస్.పి. రాజేష్‌కుమార్ సింగ్...

సాంఘిక బహిష్కరణ, పోరాట ఆయుధం జగిత్యాల నుండే జంగల్ మహల్‌కు వచ్చింది. పోరాటంతో పాటు పోరాట రూపం కూడా.

మేదినీపూర్, బంకురా, పురూలియా... ఆ జనం... ఆ ఆదివాసులు సుశీల్‌మెహతో... ఆరతి ముర్ము, బెహలామహతో... లక్ష్మీప్రతిహార్, ఎంత గొప్ప మనుషులూ... జంగల్ మహల్ తలపుల్లోకి రాగానే మనసు పులకెత్తినట్టయింది.

దేశంలోనే ఓ కొత్త పోరాటం... ప్రజల మీద జరిపిన అత్యాచారాలపై కేసులు పెట్టడం కాదు... కోర్టులూ, సాక్ష్యాలూ, కేసులూ ఫలితం మామూలే... కానీ అతి సాధారణంగా కనిపించే అసాధారణ చర్య... 'క్షమాపణ' 'ముక్కునేలకు రాస్తూ!'

చితామొణి మొర్మును వివస్త్రను చేసి చిత్రహింసలు పెట్టి కొట్టినందుకు నిరసనగా... 'పోలీసులు ముక్కు నేలకు రాస్తూ' దలాల్ చౌక్ నుండి ఛోటాఫేలియా దాకా పోవాల్సిందే...

ఈ డిమాండ్ ఆ సమావేశంలో ప్రతిపాదించగానే... ఆ ఆదివాసులు సంతోషంలో కేకలు వేయడం... నృత్యాలు చెయ్యడం కళ్ళముందు ప్రత్యక్షమయ్యింది. తన దగ్గరకొచ్చి చేతుల్లో చేతులు వేసి కలిసి అడుగులు వేయించడం మర్చిపోగలనా? ఆ జనం తమ ఆనందం, ప్రేమా ఎట్లా పంచుకున్నారూ?

పెద్ద టోపీల ఆజ్ఞతో తిరిగి ట్రీట్‌మెంట్ మొదలైంది. నోరు తెరిచి ముక్క చెప్పడం లేదన్న కసితో... దూకుడుగా హింసను ప్రయోగించసాగారు.

కాళ్ళ మీద చేతుల మీద ఎక్కడంటే అక్కడ కరెంటుతో గొడ్డును కాల్చినట్లు కాల్చసాగారు. చర్మం, కండ కాలి.... కమురువాసన వ్యాపిస్తోంది. విరిగిన చోట్ల నుండి బొట్లు బొట్లుగా కారుతూ గచ్చు మీద రక్తం మడుగయ్యింది.

తనువు మరోసారి... ఎన్నోసార్లు స్పృహ కోల్పోయింది.

వాళ్ళలో వాళ్ళే తర్జన భర్జన పడ్డారు. 'ఇట్లా అయితే తెల్లారడం కష్టంరా!' ఇక చాలురా... వీడు బతికే ఉండాల... రేపు మళ్ళీ వాళ్ళ ముందు పెట్టాలిగా!

'ముందు వీడికి ఓ కప్పు 'టీ' అన్నా నోట్లో పోద్దాం!... తెల్లవారిందాకా బతికి ఉండాలి... లేకపోతే మన ఉద్యోగాలకు ఎసరు వస్తుంది'.

నోరు తెరిచి టీ గొంతులో పోశారు. రెండు గుటకలు కష్టం మీద పోశారు. కొద్దిగా ఆగి తిరిగి ఓ కప్పు పాలు నోరు విప్పి నోట్లో పోశారు. కటికి నేల మీద వేళ్ళాడుతున్న శరీరాన్ని ఓ చాప తెచ్చి దాని మీదకు చేర్చారు. చలికి ఓ గుడ్డ కప్పారు. ఇక ఆ పూటకు ఆ శరీరానికి పూర్తి విశ్రాంతినిచ్చారు.

అర్ధరాత్రి ఎప్పుడు దాటిందో... నిశ్శబ్దం రాజ్యమేలే వేళ... కాలిన గాయాలు సలుపుతుండగా... ఓర్వలేని బాధవల్ల తెలివి

వచ్చినట్లయింది.

తానింకా బతికే ఉన్నాడా? ఓహ్! తనకింకా తెలుస్తోంది. ఇంతకూ నా ఈ వర్తమానం శ్రేణులకు చేరిందో? లేదో?!.

ఆలోచనల వల్ల అయోమయంగా అవుతోంది. మధ్య మధ్యలో మగతలోకి జారిపోతూ చావుకీ బతుక్కీ మధ్య వేళ్ళాడుతోంది కాలం.

రాత్రంతా ఇచ్చిన వ్యవధి వల్ల తెల్లారి కొంత చైతన్యాన్ని కూర్చుకుంది. కళ్ళు మూతలు వేసే ఉన్నాయి. ఒళ్ళంతా బొబ్బలెక్కి.. నీరు చేరి ఉబ్బినట్లయింది.

తిరిగి పెద్ద టోపీలు ఆఖరి అంకానికి సిద్ధమయి వచ్చారు. 'లేపి కూర్చోబెట్టండి... చివరిసారి చూద్దాం!

చిన్న టోపీలకు లోపల్లోపల మండుతోంది... ఏమిటి వీడింకా చూసేది... తల వేళ్ళాడిపోతోంది. తల వెనుకభాగం పుచ్చులేచిపోయి ఉంది. లాగుతుంటే తెగిన కాలు వేళ్ళాడుతోంది... జబ్బలు వేళ్ళాడుతూ పట్టుకోడానికే కుదరడం లేదు. వాళ్ళకి శవాన్ని లాగుతున్నట్లుగా ఉంది. శరీరం రక్తపు వాసన వస్తోంది.

శరీరాన్ని కదలించడం వల్ల కలిగిన నొప్పి వల్ల పెద్ద పెద్ద మూలుగులు నోటి నుండి వెలువడ్డాయి.

శరీరపు స్థితిని చూసి... ఇక మాట్లాడగలిగే స్థితి లేదనుకొన్నారు. ఇక చివరి ప్రయత్నం ఈ పూటకు వదిలెయ్యండి... రేపు ఆపరేషన్ పూర్తి చేసేద్దాం. దీదీ నుండి సిగ్నల్ ఇంకా రాలేదు. కేంద్రంతో సంభాషణ పూర్తి అయిందో! లేదో!... ఏదైనా రేపటిదాకా అతన్ని ఉంచాలి.

ఆ మాటే కింది వాళ్ళతో చెప్పి... ఏదైనా ఇవ్వండి... రేపటిదాకా! అని వెళ్ళిపోయారు.

తిరిగి అతన్ని చాపమీద చేర్చారు. అతనికి తెలుస్తోంది... తనని లాగడం... తిరిగి పడుకోబెట్టడం. ఇంకా నా నుండి ఏం తెలుసుకోవాలనుకుంటున్నారో!...

మగతగా స్పృహ లేనట్టుగా పడివున్న అతనికి ఎక్కడో వింత వింత శబ్దాలు వినబడ్డాయి. సుత్తి దెబ్బలు... సమ్మెటపోట్లు... గవ్వల గలగలలు.

అది అంజుపాండే భవంతి కదూ! ధరమ్‌పూర్ సి.పి.ఎం. నాయకుడు. ఒక్కొక్క సుత్తిదెబ్బకు జనం చప్పట్లతో... కేరింతలతో ప్రోత్సహిస్తుండగా భవనం పెళ్ళు పెళ్ళున పడిపోతున్నది. ఎత్తిన సుత్తి సూర్యాస్తమయం కల్లా భవనం మొత్తం నేలమట్టమయ్యాకే దించుతామంటున్నారు. మానవ శక్తి కాంక్రీటు భవనాన్ని కొన్ని గంటల్లో రూపు రేఖలను మార్చివేసింది. ఉదయం రాచఠీవి ఒలక పోసిన భవనం సాయంకాలానికి అస్థిపంజరంలా మారిపోయింది.

స్త్రీలు శంఖుగుల్లలు తెచ్చి... సుత్తి దెబ్బలకు అనుగుణంగా మోతలు చేస్తూ ఆడుతున్నారు... పాడుతున్నారు. అక్కడ పండుగ జరుపుకుంటున్నారు. అదేచోట పోలీసులు 144 సెక్షన్ ప్రభుత్వ లెక్క ప్రకారం కొనసాగుతోంది.

అయినా! 'ఎవరిది రాజ్యం... మనది మనది'.

అవును! మావో ఏనాన్ అనుభవాల్లో చదివిందే... అక్కడ ప్రత్యక్షంగా చూశారు జనం. లాల్‌గడ్‌లో సి.పి.ఎం.కు కంచుకోటల్లాంటి 48 గ్రామాలను పోలీసుల అత్యాచారాల వ్యతిరేక కమిటీ స్వాధీనంలోకి తెచ్చుకుంది. రామ్‌ఘడ్, కాయిమా పోలీసు శిబిరాలను తగులబెట్టారు.

ప్రజల నినాదాలు... అతని చెవుల్లో వినిపిస్తున్నాయి. సమ్మెట పోటు శబ్దాలు ఆలకిస్తున్న అతని మనోలోకం... 'అమ్మా!' అనే మూలుగుతో వర్తమానంలోకి వచ్చింది. కాలు... తెగిపోయిన కాలు... కాలిపోయిన అరికాళ్ళు మంటలు రేపుతోంది.

రాత్రి ముగిసి... తెల్లవారబోతోంది. చివరి సన్నివేశానికి సిద్ధమయి వచ్చాయి పెద్ద టోపీలు.

కొద్దిగా హడావిడి... తెలుస్తూనే ఉంది.

వచ్చిన వాళ్ళు కదిలించి చూశారు. ప్రాణం ఉంది... కానీ మాట్లాడలేదని వాళ్ళే నిర్ణయానికి వచ్చారు.

అయినా 'చివరి అవకాశం... ఎవరి ఆచూకీ వద్దు... నువ్వు లొంగిపోతానని! చెప్పు!... నిన్నిప్పుడే పెద్ద హాస్పిటల్లో చేర్చి వైద్యం చేయించి... పది రోజుల్లో మామూలు మనిషిని చేస్తాం!' చివరి ప్రయత్నంగా పదే పదే వదరసాగారు. కానీ వాళ్ళ ప్రిపరేషన్ వాళ్ళు చేసుకుంటూనే ఉన్నారు. ఇక కాలం పర్మిట్ చెయ్యదు. ఎన్‌కౌంటర్ నాటకానికి తెరతీశారు.

అతని నుండి ఏ శబ్దమూ లేదు... చీలిపోయిన అతని అవయవాలన్నీ తిరస్కారాన్ని చూపిస్తున్నట్లుగా ఉంది.

ఏదో వ్యాను మోతలు... బూట్లు టకటకలు... చివరి క్షణాలని తెలుస్తోంది.

ముంజేతిని బిగించి

'చివరి వీడుకోలూ మీకూ - నా చిన్నితమ్ముల్లారా
ఎర్రపూలావనం కాడ - ఎదురు చూస్తుంటానయ్యా'

అని పాడాననే అనుకుంటున్నాడు.

* * *

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు).

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు.

ఈ - మెయిల్ ఐ.డి. : arunatara1977@gmail.com

మే - జూన్ 2012 సంచికలో ప్రచురించిన నల్లూరి రుక్మిణి కథ 'ప్రవాహం తిరోగమించదు'లో కొన్ని లోపాలు దొర్లినాయి. సవరణ కింద ఇచ్చినాం. పొరపాటుకు చింతిస్తున్నాం - సం.

(16వ పేజీలో కుడి కాలమ్ 5వ పేరా నుంచి... 17పేజీ కుడి కాలమ్ 7వ పేరా దాకా ఈ కింది విధంగా సరిచూసుకోగలరు.)

సుజాత ఆలోచనల్లో పడింది-చింతూరు వెళ్ళడమా? లోకల్‌గా సంతని కవర్ చెయ్యడమా? అని. పైగా నిన్నలేని వారలవారల డ్రస్సులతో పారా మిలటరీ వాళ్ళు ఊరంతా దిగినట్టుగా కూడా గమనంలోకి వచ్చింది. వాతావరణంలో మార్పేదో కనబడింది. పోలీసు వ్యాన్లు, ట్రక్కులూ హడావిడిగా తిరుగుతున్నయ్యి.

'ఏమిటో! అంతా హడావిడి ఎక్కువగా ఉందే'... అన్నది పైకే!.. ముప్పై మంది... ఇప్పుడేమిటి మేడమ్! రాత్రి నుండే! నిన్న రాత్రి పది గంటలకు ఓ ఇరవై ముప్పై మంది ఇదిగో ఆ మూల మలుపు నుండి మార్చింగ్ చేసుకుంటూ ఇటు గుండా అటు సెంటరు వేపుకు వెళ్ళారు' అని, 'మమ్మల్ని భయపెట్టాలనీ' అని నవ్వింది చిన్నపిల్ల.

సుజాత లోకల్లోనే ఉండిపోవాలనుకుంది. వీలయినప్పుడు అమరుల బంధువులతో ఇంటర్వ్యూలు తీసుకోవచ్చుననుకుంది. పైగా సంత కూడా చూడవచ్చు.

పదకొండు గంటలయితేగానీ సంత మొదలు కాదు... అప్పటిలోపు స్నానాలు చేద్దామనుకుంటూ ఆడ పిల్లలు బాత్‌రూమ్‌ల వైపు వెళ్ళగా... కళాకారులు నృత్య నాటికేదో ప్రాక్టీసు చెయ్యడంలో పడ్డారు.

సుజాత వాళ్ళే కాక, మరో టీవీ ఛానల్ వాళ్ళు కూడా వచ్చారు. ఇక్బాల్‌ని తీసుకుని వీళ్ళు వచ్చేలోపు మనం సంతలో ఎవరన్నా దొరికితే మాట్లాడిద్దాం అనుకుంటూ సంతవైపు దారితీసిందామె.

ఎండ చిటచిటలాడుతోంది అప్పటికే.

చర్ల సంత అంత పెద్దదేం కాదు. ఎంట్రన్స్ ఒక చిన్న సందులాగా ఉండి లోపల విశాలంగా ఉండే ఖాళీ స్థలం. సందుబారు ఎలకల మందు అమ్మేవాళ్ళు ఎక్కువగా ఉన్నారు. ఆ చుట్టు పక్కల రోడ్ల మీద ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పొగాకు, తినుబండారాలు, బట్టలు, తెల్ల సామాన్లు ఒకటేమిటీ అన్నీ ఉన్నయ్యి. ఖాళీ స్థలమంతా టెంట్లు వేసుకుని రకరకాల సామాన్లు అమ్ముతున్నారు. ఎక్కువ బట్టల షాపులే కనిపిస్తున్నాయి.

నిజానికి సంతలో దొరికే ఏ వస్తువయినా చర్లలో ఏ రోజయినా దొరికేటివే!. కానీ సంత ఒక ప్రాచీన సాంప్రదాయం... ఆ రోజు అన్నీ ఒకేచోట ఉండటం వల్ల ఆదివాసీలు ఒక చోటే కొనడానికి ఇష్టపడతారు. బజారంతా ఏ కొట్టులో ఏవి దొరుకుతాయో తిరిగి బేరాలాడి కొనగలిగిన లోకజ్ఞానం వాళ్ళింకా సంతరించుకోలేదు. పైగా వేల మంది ఒకేసారి తమవాళ్ళు సామూహికంగా బయటి ప్రపంచంలోకి రావడం వాళ్ళకు నైతిక బలాన్నిస్తుందేమో కూడా. బహుశ అడవి జంతువుల నుండి రక్షణగా కూడా ఉండవచ్చు.

సంతలో కెమెరాలు, బ్యాగులు భుజాన తగిలించుకుని తిరుగుతున్న సుజాతను, ఇక్బాల్‌ను వింతగా చూడసాగారు.

సుజాత చీరలు కొంటున్న ఆడవాళ్ళ దగ్గర నించుంది. వీళ్ళు ఏం మాట్లాడకుండా అట్లా గమనిస్తున్నట్టుగా ఉండడంతో ఆ గుడ్డల అంగడామెకు ఇబ్బందిగా ఉంది. ఆమె తెలుగు భాష, మరాఠీ భాష కలగలిసిన తెలుగులో!, 'ఏం కావాలి?' అని అడిగింది.

'ఏం లేదు! వీళ్ళు ఏమేమి వస్తువులు కొంటున్నారో చూస్తున్నా'మంది. ఆ ఆదివాసీలకు నిజమైన అవసరాలేమిటో, సంతలో వాళ్ళు దేనికి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారో గమనించాలనుకుందామె!.

బ్లూ రంగుకు, తెల్లటి చమ్కీకుట్లు ఉన్న చీరను బేరం చేస్తోంది.

'పాంచ్ సౌ అచ్ఛా శాడీ అచ్ఛా డిజైన్' చీర గొప్పదనం గురించి చెప్తోంది అంగడి మనిషి.

ఆదివాసీ మహిళల మొహంలో ఏ భావమూ కనబడలేదు. అసలు సుజాతకు వాళ్ళ మొహాలల్లో భావాలు చదవాలన్నా చేతకావడం లేదు. తానొక మనిషినక్కడ ఉన్నానన్నట్టుగా తన ఉనికినే గుర్తించలేదు వాళ్ళు... ఇటు తిరిగి చూడనైనా చూడనే లేదు.'తుమారా నామ్ క్యా? కహాఁసే ఆయా? తనను పట్టించుకుంటారేమోనన్నట్టుగా. దానికీ వాళ్ళు పట్టించుకోకపోగా అక్కడి నుండి కదలివెళ్ళిపోయారు.

దానితో ఆ అంగడామె 'ఎవరమ్మా మీరూ? పొద్దున్నే మా బేరాలు చెడగొట్టడానికా! ఫో! ఫో' కసిరింది. సుజాతకు ఓ క్షణం చివుక్కుమనిపించింది. అక్కడి నుండి కదిలి ఓ పక్కగా నిలబడ్డారు వాళ్ళు.

ఆ అంగడామె ఆడవాళ్ళను భాషలో ఒకటే అరిచిపిలిచి చివరికి తిరిగి రప్పించింది. సుజాత నేరభావంతో అట్లా చూస్తూ ఉండిపోయింది.

తిరిగి వచ్చిన ఆ ఆదివాసీ మహిళ అదే చీరను చేత్తో పట్టుకుని 'ఏక్ సౌ' అన్నది. సుజాత దిమ్మెర పోయింది. ఎక్కడ ఐదొందలు, ఎక్కడి వంద ఆదివాసీలు?

బాగా ఎట్లా అడగ్గలిగారూ?

'తీన్ సౌ'

'నా'

'ఏక్ సౌ దస్'... వెళ్ళడానికి సిద్ధమయిందామె.

'అచ్ఛా! రిచ్ఛా... పకడో, పకడో! ఏక్ సౌ బీస్ రూపియా'

బేరం కట్ ఆఫ్ అయిపోయింది. గుంజులాటలు లేవు. రెండేమాట ఇంతలో ఇంకో ఆమె మరో చీర బేరం చేసింది. ఆ చీర రంగు బాగానే ఉంది. కానీ మరీ పాత చీరనిపించింది. అది కూడా అరవై రూపాయలకు కొన్నారు.

అదంతా చూస్తున్న సుజాతకు ఓ పక్క వాళ్ళు కనబరచిన తెలివికి ముచ్చటగానే ఉన్నా దానిలో కూడా వాళ్ళు మోసపోతున్న వైనం బాధనిపించింది.

అక్కడున్న చీరలన్నీ బాగా వాడినవి... ఫాల్స్ కుట్టి ఉన్నాయి. ఉతికి ఇస్త్రీ చేశారు. అవి తమ బోటి వాళ్ళ ఇళ్ళల్లో స్టీలు సామాను కోసం పదికో ఇరవైకో వేసేస్తారు. అలాంటివి వంద రూపాయలకా? ఎంత దగా! ఆ వంద రూపాయలు ఆదివాసీలు ఎంత కష్టపడితే వస్తాయి?. వరసగా ఆడవాళ్ళు వస్తూనే ఉన్నారు... చీరల బేరాలు సాగుతూనే ఉన్నాయి.

మెల్లిగా అక్కడి నుండి ముందుకు కదిలారు. నలుగురైదుగురు ఆదివాసీ స్త్రీలు బుట్టల్లో చింతపండు పెట్టుకుని కూర్చోనున్నారు. బహుశ లోకల్ వాళ్ళు కావచ్చు.. కట్టూ బొట్టూ మధ్య తరగతి స్త్రీలనిపించారు. చింతపండు ముద్దని పది రూపాయలకు బేరం చేస్తున్నారు. అది అరకిలో తేలిగ్గా ఉంటుందనుకుంది సుజాత.

'అవును కొనే దగ్గరా, అమ్మే దగ్గరా రెండు చోట్లా దగానే'.

ఇక్బాల్ ఆమె మాటలు వింటూ 'మీరు ప్రతిదానికీ కదలిపోతే కష్టం మేడమ్! ఇంత మోసం సమాజంలో ఉంది కనకనే! వాళ్ళు ఆ మావోయిస్టులను తప్ప ఎవర్ని నమ్మడం లేదు. మీరు గంటపై నుండి ఇంత మందిని కదిలించారు... ఒక్కరితో పేరు చెప్పించుకోగలిగారా?

'సరేలే! పద అటువేపు కూడా తిరుగుదాం'.

అక్కడి నుండి మెల్లిగా నడుస్తూ ఒక్కొక్కళ్ళు ఏమి కొంటున్నారో గమనించసాగారు. తిను బండారాల జోలికి పెద్దగా పోవడం లేదు. ఆడవాళ్ళ గుంపు గాజుల మల్లారం దగ్గరుంది. చేతికి గాజులున్నా మరికొన్ని గాజులు వేయించుకుంటున్నారు. పక్క పిన్నులు, రబ్బరు బాండ్లు, రంగురంగుల బొట్టు బిళ్ళల దగ్గర పడుచు పిల్లలు ఎగబడుతున్నారు.

మొగవాళ్ళు చొక్కాలు, లుంగీలు తీసుకున్నారు. ఒకతను కత్తెర బేరం చేస్తున్నాడు. ***'కత్తెరెందుకూ' అంది సుజాత ఆసక్తిగా!.***

సడన్‌గా మాట వినబడి తత్తరపడ్డాడతను. అయినా వెంటనే తమాయించుకుని చేతితో తలమీద చూపిస్తూ క్షవరానికని సైగ చేశాడు.

న్యాయం నిగ్గు తేలుస్తూనే...

- వరవరరావు

'మామయ్య గురించి మీకు తెలియని పార్శ్వాన్ని పరిచయం చేస్తాను. ఆయన ఉద్యమానికి, మీకు ఎంత సమయం ఇస్తాడో మా కుటుంబానికి, మాకు అంత సమయమిస్తాడు. మాకు పిల్లలుగా ఉన్నప్పుడు అద్భుతమైన ఫ్యాంటసీలు చెప్పేవాడు. హాస్య చతురోక్తులతో ఇప్పటికీ కట్టిపడేస్తాడు. ఉడ్‌హౌజ్, ముళ్లపూడి వెంకటరమణల్లో ఉన్నంత ఉదాత్తమైన హాస్యం ఉంటుంది ఆయన మాటల్లో. ఆయన నిరంతరం పుస్తకాలు చదివేవాడు. వ్యక్తిగత జీవితంలోని విషాదాన్ని సమిష్టిలో హాస్య సంభాషణలో పోగొట్టుకునేవాడు. చార్లీ చాప్లిన్ క్యారెక్టర్ వంటివాడు అన్నాడు మందలపర్తి కిశోర్. బి.ఎస్.ఎ. ఇంటి దగ్గర ఆయన అంతిమయాత్ర సందర్భంగా నిరాడంబరంగా పంచుకున్న జ్ఞాపకాలలో, ఆయన అనార్కిస్టు అనిపించే బోహీమియన్ అని కిశోర్ అన్నాడు.

1969లో నేను ఖాజీపేట నుంచి హహబూబ్‌నగర్ బదిలీ అయినప్పుడు అక్కడ పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న బి.ఎస్.ఎ. సత్యనారాయణతో పరిచయమైంది. కామ్రేడ్ అని అతిసహజంగా పిలుచుకోవడం ఆయన నుంచే విన్నాను. నేర్చుకున్నాను. పి అండ్ టి వర్కర్స్ యూనియన్ విప్లవ ట్రేడ్ యూనియన్ మాత్రమే కాదు, విప్లవ పంథాల నిరంతర చర్చల వేదిక అని కూడా నాకు త్వరలోనే అర్థమైంది. పురుషోత్తమ రాజు, దామోదర్ వంటి వాళ్లు ఒకవైపు బి.ఎస్.ఎ., యు. శ్రీనివాస్ వంటి వాళ్లు మరొకవైపు ప్రభావితం చేయాలని చూస్తుండే వాళ్లు అని ఆయనతో కలిసి పని చేసిన పోస్టల్ ఉద్యోగి ఒకరు చెప్పారు. 'ఆయనతో పరిచయం అయి, ఆ రోజుల్లో ఆ యూనియన్‌లో పని చేయకపోతే నేను మనిషిగా మిగిలే వాణ్ణేనా అని ఈ రోజు అనిపిస్తుంది' అని గొంతు గాద్గదికమైన జ్ఞాపకాల బరువుతో ఆయన చాలాసేపు మాట్లాడలేకపోయాడు. నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటపంథా గురించే బి.ఎన్.ఎ. చెప్పేవారని అన్నారాయన.

ఆయన నుంచి ఎంతో స్ఫూర్తిని, ఉత్తేజాన్ని పొందిన సాఫ్ట్‌వేర్‌లో పనిచేసే యువకుడు ఆయన పొడవాటి పూర్తి పేరు తనకు, తన పూర్తి పేరు ఆయనకు తెలుసుననీ, కొద్దిమందికి మాత్రమే తెలిసే అవకాశం ఉన్న ఈ రహస్యాన్ని బయటపెడుతున్నట్టుగా చెప్తూ, ఆయన నుంచి ఇంగ్లిషు నేర్చుకున్న పద్ధతి చెప్పాడు. లాయర్‌గా తాను రాసిన డ్రాఫ్టులు తనతో టైపు చేయించే వాడని చెప్తూ 'Peace of land కాదు piece of land' అని స్పెల్లింగ్‌లు నేర్పాడన్నాడు.

ఒక చారెడు నేల కోసం ఒక జీవిత కాలపు శాంతియే కాదు, జీవితాలే ఎంత దుర్మార్గంగా అంతమవుతాయో లక్షింపేట దళితుల అనుభవాల్లోనూ ఇప్పటికీ ఎన్నిసార్లు చూసామో.

బి.ఎస్.ఎ. వ్యక్తిగత ఆస్తి మీద, వ్యక్తిగత సుఖ సౌకర్యాలపైన ఏ మాత్రం ఆసక్తి లేనివాడు. ఇరవైయ్యేళ్ల న్యాయవాద వృత్తి, యాభై ఏళ్ల ట్రేడ్ యూనియన్ వ్యాపకాలు, రాజకీయ జీవితం అంటే ఆయన గడిపిన అతిసాధారణ, నిరాడంబర జీవితం చూస్తే ఈ రోజుల్లోనా అని ఆశ్చర్యపోకుండా ఉండలేం. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, హైకోర్టులో ఎన్నో కేసులు వాదించి గెలిచిన వాడాయన. ఈ క్రమంలో ఎప్పుడూ ఎక్కడా న్యాయమూర్తులతో, ప్రాసిక్యూటర్‌లతో, ప్రభుత్వ న్యాయవాదులతో ఇచ్చ కాలంతోనో, మొహమాటాలతోనో ప్రవర్తించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. 'కంటెంప్ట్ ఆఫ్ కోర్టు రుచి చూపేదాకా పోయాడు. అట్లని మానవ సంబంధాల్లో ఎవరితోనూ వ్యక్తిగత స్థాయిలో పదునుగా, అవమానకరంగా మాట్లాడి ఎరుగడే. ఎంత కుండబద్దలు కొట్టినట్లు నిర్మొహమంటంగా మాట్లాడ్తాడో, అంత సరదాగా, స్నేహశీలంగా ఉంటాడు. జ్ఞాపకాలు పంచుకున్న, ఇంగ్లిషు తెలిసిన ప్రతి ఒక్కరూ ఆయనను జోవియల్ (సరదాగా)గా ఉంటాడు అని విశేషణం వాడారు. ఆ విషయంలో వింత, అతివాద తేడాలేకాదు ఏ రాజకీయ వాసనాలేని ఆయన ఇరుగుపొరుగు వాళ్లు ఆయన కుటుంబ సభ్యులూ ఉన్నారు.

'ఈ వయసులో ఈ అనారోగ్యంతో ఆవకాయతో అన్నం తింటున్నారేమిటండీ' అని ఉద్యోగ క్రాంతి హనుమంతరావు అడిగితే 'కమ్యూనిస్టును కదండీ ఎరుపంటే ఇష్టం!' అని ఈయన తేలగొడుతుంటే ఆ గది, ఆ వాతావరణం ఆయన ఎంత దాచినా దాగని ఆయన ఆర్థిక స్థితిని బయటపెడుతూనే ఉన్నది.

ఇరవై ముప్పై ఏళ్ల వృత్తి అనుభవం ఉన్న న్యాయవాదులందరూ ఆయన డ్రాఫ్టింగ్‌లో ఎంత నిష్ణాతుడో చెప్పారు. అవి సర్వీసు మ్యాటర్స్ కావచ్చు. సివిల్, క్రిమినల్ కేసులు కావచ్చు.

విచిత్రమేమిటంటే 1969కే ఆయన చారుమజుందార్ రాజకీయాలతో ప్రభావితుడయి ట్రేడ్ యూనియనిజం సంకెళ్ళు బద్దలు కొట్టాలని రాకీజకీయ పాఠాలు చెప్పేవాడు. అదే కాలంలో ముఖ్యంగా 1970-75 మధ్య కాలంలో పురుషోత్తంరాజు, దామోదర్, యు. శ్రీనివాస్‌లతోపాటు ఎంతో బలమైన పోస్టల్, టెలిగ్రాఫ్ ఉద్యోగుల సంఘాన్ని, ఆర్ఎంఎస్ ట్రేడ్ యూనియన్‌ను మాత్రమే కాదు, హైదరాబాదులోని అన్ని పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల్లో ఎల్ఎస్ఎస్ మూర్తి వంటి సహచరులతో కలిసి మిలిటెంట్ ట్రేడ్ యూనియన్‌లు నిర్మాణం చేశాడు. 1970ల తొలి రోజుల్లో సికింద్రాబాద్ అంజలీ టాకీస్ దగ్గర ఆయన ప్రసంగం విన్న ఒక పోస్టల్ డిపార్టుమెంటు అధికారి ఆయనను అప్పటి నుంచే గురువుగారు అనే ప్రబోధించేదట. పోస్టు మాస్టర్ జనరల్ అయిన ఆమె ఆయన అంతిమ దర్శనానికి వచ్చింది. ఎల్ఎస్ఎన్ మూర్తితో కలిసి 'కార్మిక పథం' పత్రిక నిర్వహించడంలో, పిళ్ళా వెంకటేశ్వరరావుతోకలిసి 'శ్రమజీవి' పత్రిక నిర్వహించడంలో ఆయనకు కార్మిక సంఘాల పట్ల ఉన్న అవగాహన, స్పష్టత, స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

ఆయన ఆర్ఎంఎస్ నుంచి సిఆర్‌పిపి (కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్) దాకా ఎన్ని అవతారాలయినా ఎత్తవచ్చు. ఉత్తరాల సార్టింగ్ నుంచి న్యాయవాద వృత్తిదాకా ఎన్ని వృత్తులయినా మార్చవచ్చు. కాని ప్రవృత్తిలో, అంతఃకరణలో ఆయన శ్రమ జీవి కనుక ధన్యజీవి అన్నారు ప్రతి ఒక్కరు. తూర్పు గోదావరి జిల్లా అత్తిలిలో కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టిన బి.ఎస్.ఎ. సత్యనారాయణ 1956లో హైదరాబాద్‌కు వచ్చాడు. అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన రోజుల్లో ఉద్యోగరీత్యానే కాదు, మానసికంగానూ హైదరాబాదీ అయిపోయాడు. 1969 నుంచి ప్రత్యేక తెలంగాణావాది అయిపోయాడు. ఎల్ఎస్ఎన్ మూర్తి, యు. శ్రీనివాస్‌లతోపాటు నక్సల్బరీ శ్రీకాకుళ ఉద్యమ రాజకీయాల కోసం పని చేయడంలో నిమగ్నమయ్యాడు.

విరసం ఏర్పాటు, విప్లవ రచయితల అరెస్టులు, పుస్తక నిషేధాలు, భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్ష రద్దు ఉద్యమం, సికింద్రాబాద్ కుట్రకేసు, ఎమర్జెన్సీ కాలమంతా హైదరాబాద్‌లోని పబ్లిక్‌సెక్టార్ పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలే కాదు, కర్నూలు, ఆదోనీల దాకా కార్మిక రంగంలో విప్లవ రాజకీయ ప్రచారంలో ఆయన కూడా ఎమర్జెన్సీలో జైలు పాలయ్యాడు. ఆర్ఎంఎస్ పోరాటాల్లో సస్పెండ్ అయ్యాడు. పోరాడి తనతోపాటు అందరికీ ఉద్యోగాలు సంపాదించాడు. సస్పెన్షన్ కాలంలో తనతోపాటు కొందరు లా చదివారు.

ఇంక ఎమర్జెన్సీ తొలగి జగిత్యాల జైత్రయాత్ర తర్వాత 85 దాకా మల్లోజుల కోటేశ్వరరావు నాయకత్వంలో యు. శ్రీనివాస్, బిఎస్ఎలు కార్మిక, ఉద్యోగ రంగాల్లో విప్లవ ప్రచారానికి అంకితమయ్యారు. శ్రీనివాస్‌తానే కాదు మొత్తం కుటుంబమంతా అజ్ఞాత జీవితానికి వెళ్ళిపోయి, అజ్ఞాతంలోనే అనారోగ్యంతో అమరుడయ్యాడు. ఆయన కుమారుడూ 'ఎన్‌కౌంటర్' అయ్యాడు. ఆయన కుటుంబంతోనే అజ్ఞాతంలోకి వెళ్ళి ఆయనను ఆదర్శంగా ఎంచుకున్న స్వరూప (నవనీత) ఇటీవలనే క్యాన్సర్‌తో అమరురాలయింది. 22వ తేదీ సాయంత్రం ఉస్మానియా వైద్య కళాశాలకు బి.ఎస్.ఎ. మృతదేహాన్ని అప్పగిస్తున్నప్పుడు ఆర్ఎంఎస్ పి&టి ఉద్యోగ సంఘాలన్నీ ఆయనకు జోహార్లు చెప్తూ 'మా సంఘాలు ఎల్లకాలం గర్వంగా చెప్పుకునే నాయకులు యు. శ్రీనివాసులు, బి.ఎస్.ఎ. సత్యనారాయణ, సుదర్శన్‌లు' అని చెప్పారు. సుదర్శన్ నిజామాబాద్ పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేస్తూ తెలంగాణ జనసభ సంస్థాపక కార్యవర్గ సభ్యుడుగా 2005 జనవరి 15న చర్చల కాలపు 'కాల్పుల విరమణ' గడువు ముగియకముందే ఉత్తర తెలంగాణ మావోయిస్టు పార్టీ నాయకత్వంతో ప్రత్యేక తెలంగాణ అంశం గురించి చర్చించడానికి వెళ్లి తెరాస వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లా వసంత్‌తోపాటు 'ఎన్‌కౌంటర్'లో అమరుడయ్యాడు వరంగల్ జిల్లా అడవుల్లో.

1985 తొలి రోజుల్లో విజయవాడలో రాడికల్ యువజన సంఘం నిర్వహించిన రాజకీయ పాఠశాలల్లో పాఠం చెప్తూ పోలీసు దాడిలో అందరితోపాటు అరెస్టయి, విడుదలయ్యాక ఇంకా విప్లవంలో పూర్తికాలం పని చెయ్యడానికి ఎంచుకొని 85-89 గడ్డుకాలంలో అజ్ఞాతంలోకి వెళ్ళాడు. తొంభైలలో మళ్ళా బహిరంగ జీవితానికి వచ్చి 'శ్రమజీవి' పత్రిక నిర్వహణతోపాటు న్యాయవాద వృత్తిలో చేరారు.

1993లో బార్ కౌన్సిల్‌లో నమోదై కోర్టుకు వెళ్ళిన మొదటి రోజే కోర్టుకు కేసు గురించి జైలు నుంచి వచ్చిన శాకమూరి అప్పారావు 'మాకు రాజకీయ పాఠాలు చెప్పి మీరక్కడా, మీ నుంచి నేర్చుకొని మేమిక్కడ' అన్నాడట. కోటేశ్వరరావు, శాకమూరి అప్పారావులే కాదు యు. శ్రీనివాస్‌లే కాదు, తన సహచరులు వేరెక్కడ ఉన్నా, తానెక్కడ ఉన్నా తన జీవితాదర్శం, లక్ష్యం ఎప్పుడూ ఏమరపాటున కూడా విస్మరించని వాడు బి.ఎస్.ఎ.

బూటకపు ఎన్‌కౌంటర్ల నిజనిర్ధారణలకు వెళ్లేచోట, ఖండించే చోట, అక్రమ అరెస్టుల విషయంలో పోలీసు స్టేషన్‌కు కూడా వెళ్ళి జోక్యం చేసుకునేచోట ఆయనెక్కడా వెనకాడలేదు. ఆయన న్యాయవాద వృత్తిని కోర్టు హాల్‌కు పరిమితం చేయలేదు. అట్లాగే ఆయనకు మనం చాలా మంది లాయర్ల విషయంలో చూసే ఆఫీసు కూడా లేదు. ఇరవై నాలుగు గంటల కోర్టులు, న్యాయం అని చట్టాలైతే వచ్చాయిగానీ, అర్ధరాత్రయినా ముద్దాయి కోసం మెజిస్ట్రేట్ ఇల్లు కూడా కోర్టే. జైలు ద్వారాలు కూడా తెరుచుకోవాలి అని అక్రమ అరెస్టులను అరికట్టే చట్టాలయితే వచ్చినవి గానీ, స్థల, కాలాలతో నిమిత్తం లేకుండా న్యాయం కోసం నిందితుల తరపున అట్లా నిజంగా పోరాడిన వారు బి.ఎస్.ఎ.. పోలీసులు, ప్రభుత్వాలే కాదు, మాజీ నక్సలైట్లతో కూడిన రాజ్యాంగ యంత్ర మాఫియాతో కూడా ప్రపంచంలో మసలుకున్నాడు. పోలీసు స్టేషన్‌లలో సంతకాలు పెట్టడానికి పోవడానికి, కోర్టులకు పోవడానికి మాకు ప్రాణభయం ఉన్నదని భావిస్తే కళ్యాణరావు, నాతోపాటు చిలుకలూరుపేటకో, మరో చోటికో గంటి ప్రసాదంతోపాటు నిజామాబాద్‌కో మేం కోరినా వచ్చేవాడు. వద్దన్నా వచ్చేవాడు. ఇంక అచ్చంపేట నుంచి భోపాల్ దాకా ఆయన రాజకీయ ఖైదీల కోసం జైళ్ళు, కోర్టులు, పోలీసు కస్టడీ ఎక్కడ న్యాయ సహాయం అవసరమని తాను భావించినా, ముద్దాయిలు భావించినా రెక్కలు కట్టుకొని వాలాడు. అక్షరాలా రెక్కలు కట్టుకొని వాలడమే, బస్సు, రైలు, తిండి, తిప్పలు లేకుండా చాయ్‌లు, సిగరెట్లు (వ్యాకరణ భాషలో చెప్పాలంటే) నిత్యం ఆహారం వైకల్పికం.

డికె బసు తీర్పు ప్రకారమే జ్యుడిషియల్ కస్టడీ నుంచి పోలీసులకప్పగించిన నిందితులను విచారించాలని కోర్టులు లాంఛనంగా చెప్పినా న్యాయవాదుల సమక్షంలో అది జరిగితీరాలని, ఆ తీర్పు స్పిరిట్‌తో అమలు చేయించిన 'మొండివాడు' బి.ఎస్.ఎ.. అది అచ్చంపేటలో ప్రశాంత్ అనే రచయిత విషయంలో కావచ్చు. ఆఖరుసారి ఖానాపూర్ పోలీసు స్టేషన్‌లో మూడు రోజులపాటు అజాద్ సహచరి పద్మ సహనిందితుల ఇంటరాగేషన్ సందర్భం కావచ్చు. పోలీసు ఇంటరాగేషన్ ఐదు గంటలకు ముగిస్తే ఇంక అక్కడి నుంచి పోలీసులను ఇంటరాగేట్ చేసే అసాధ్యుడు బి.ఎస్.ఎ. అని ఆయన తోటి న్యాయవాదులు చెప్పుకుంటారు. రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఉపాధ్యక్షుడుగా ఆయన ప్రాసిక్యూట్ చేసి న్యాయం నిగ్గు తేలుస్తూనే అలసిసొలసిపోయాడు. బి.ఎస్.ఎ. సంకల్పం ఎంత మొండిదయినా ఆయన ఆరోగ్యం అందుకు సహకరించలేదు.

28 జూన్, 2012 - ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

అరుదైన వ్యక్తిత్వానికి అరుణారుణ జోహార్లు!

- పి. వరలక్ష్మి

కడపజిల్లాలో కెసి కెనాల్ ఆయకట్టుదారుల సంఘం సమావేశం జరుగుతోంది. వేలాది మంది రైతులు హాజరయ్యారు. ఒక పెద్దమనిషిని స్టేజీ మీదికి ఆహ్వానించారు. జనంలో నుండి 'యూరియా దొంగ' అని పెద్ద కేక వినపడింది. అన్నదెవరో చూడకుండానే పోల్చుకున్నారు అక్కడున్నవాళ్ళు. అతను ఎంజె సుబ్బరామిరెడ్డి. 'మేమతన్ని వేదిక మీదికి అనుమతించం'. అన్నాడతను. నువ్వెవరు ఆ మాటనడానికి అన్నారు నిర్వాహకులు. 'ఎవరి కోసం మీటింగు పెట్టినారో వాళ్ళలో నేనొకన్ని'. కొంతమంది అతనిపైబడి బలంగా కొట్టడం మొదలుపెట్టారు. జనం అడ్డుపడి అతన్ని బైటపడేశారు. మరోమారు చెక్కర ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై చర్చ జరుగుతోంది. స్థానిక ఎం.ఎల్.ఎను దొంగ అన్నాడు. సమావేశంలోకి చొరబడి ఫ్యాక్టరీకి నష్టాలు రావడానికి కారణం ఎవరెవరో, ఎవరెంత తిన్నారో చెప్పడం మొదలు పెట్టాడు. అతన్ని బైటికిలాగి కాని సమావేశం కొనసాగించలేకపోయారు. ఇంకోసారి గిరిజన సంక్షేమ సంఘం మీటింగుకు అతిథిగా వచ్చిన ఆ శాఖ మంత్రిని నిలదీశాడు. ఇలాంటివి కొన్ని వందల సంఘటనలు. ఎం.జె ఏదైనా సమావేశంలో ప్రత్యక్షమైతే కొందరు తలపట్టుకుంటారు. కొందరు చెవులు రిక్కిస్తారు. కొందరు వినోదం చూడడానికి తయారవుతారు. అతను పచ్చి నిజాలు మాట్లాడతాడు. నిజాలు తప్ప వేరే ఏమీ మాట్లాడడు. ఎంతగానంటే, ఒకసారి ఎస్.ఐను కొట్టాడని అతనిపై కేసుపెట్టి కోర్టులో హాజరుపరచినప్పుడు అతని లాయరు చెప్పిన విధంగా తను కొట్టలేదని అబద్ధం చెప్పకుండా కొట్టానని చెప్పాడు. ఎందుకు కొట్టావంటే ఆ ఎస్.ఐ. నక్సలైట్లను బూతులు తిట్టాడట! ఆయననెరిగినవాళ్ళు ఇటువంటివెన్నో చెప్తారు. అంతేకాదు. కడపజిల్లా ప్రజలకు ఎంత పెద్దదిక్కో ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఎలా ప్రత్యక్షమవుతాడో, ఎంతటి కష్టమొచ్చినా ఎలా తట్టుకొని నిలబడతాడో, కొండంత ఎం.జె పక్కనుంటే ఎంత ధైర్యమొస్తుందో వివరిస్తారు. ఎంజె అంటే ఇంత మాత్రమే కాదు. ఆయన జీవితం చదవలేనంత విస్తృతమైనది. ఆయన వ్యక్తిత్వం అంచనాలకు అందనంత సంక్లిష్టమైనది.



ఎంజెది రాజీపడని మనస్తత్వం. ఈ సమాజంలోని అసంబద్ధత పట్ల, అన్యాయం పట్ల, దౌర్జన్యం పట్ల అతనికి విపరీతమైన ఆగ్రహం. జులై 22న రైలు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరేంతవరకూ అతను వ్యవస్థతో గొడవపడుతూనే ఉన్నాడు. ఆగస్టు 2న అతని ఊపిరి ఆగిపోయేంత వరకు అతను జనం గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. 1953లో కడపజిల్లా ఖాజీపేట మండలం, తిప్పాయపల్లెలో ఒక సాధారణ రైతు కుటుంబంలో ములపాకు జంగంరెడ్డి సుబ్బరామిరెడ్డిగా జన్మించిన ఎంజె విద్యార్థి దశ నుండే వ్యవస్థ దుర్మార్గం పట్ల వివిధ రూపాల్లో స్పందించేవాడు. విద్యార్థిదశలో గాంధేయవాదిగా బయలుదేరి ఆ తర్వాత కమ్యూనిస్టుగా ఎదిగాడు. విప్లవ రాజకీయాలతో ప్రేరణ పొంది నక్సల్బరీ పంథావైపు వచ్చాడు. తొలిదశలో విరసం జిల్లా బాధ్యుడిగా, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశాడు. ఆ తర్వాత పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శిగా ఎన్నికై ప్రజాఉద్యమాలపై రాజ్యహింసను ఎండగట్టాడు. అనేక నిర్మాణాల్లో పని చేసిన ఎంజె దేనిలోనూ స్థిరంగా కొనసాగలేకపోయాడు. పౌరహక్కుల సంఘం బాధ్యుడిగా ఆయన జిల్లా అంతా విస్తృతంగా తిరుగుతుండిన కాలంలో ఏవో కారణాల వల్ల జిల్లా శాఖ రద్దయ్యింది. అటునుండి ఆయన రాయలసీమ పౌరహక్కుల సంఘం పేరుతో పనిచేయడం మొదలు పెట్టి చివరిదకా పనిచేశాడు. అయితే ఆ సంఘానికి ఒక నిర్మాణ రూపం ఇవ్వలేకపోయాడు. ఆయన వెంటతిరిగి పనిచేయడం అసాధ్యమని, దానికి చాలా పరిమితులు అడ్డువస్తాయని ఆయన సన్నిహితులు చెప్తారు.

ఆయనది నిర్మాణాల్లో వొదగని స్వభావమో, లేక ఆయన్ని ఇముడ్చుకునే విప్లవ రాజకీయ నిర్మాణాలు రాయలసీమలో లేకపోవడమో, లేక రెండూ కారణమో పక్కనపెడితే ఆయన చివరిదాకా నక్సల్బరీ రాజకీయాలతోనే ఉన్నాడు. ఈ విషయంలో ఏ చిన్న తడబాటు లేదు. 70ల్లో జై ఆంధ్రా ఉద్యమంలో పాల్గొన్నాడు. 80ల్లో రాయలసీమ ఉద్యమంలో తలమునకలుగా తిరిగాడు. 2009 తెలంగాణ ఉద్యమ సందర్భంలో ఒకప్పుడు రాయలసీమ ప్రగతిశీల శిబిరంలో ఉన్నవాళ్ళంతా సమైక్యాంధ్ర అంటుంటే ఆయన తెలంగాణను సమర్థిస్తూ కుండబద్దలు కొట్టాడు. తెలుగు ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్న సందర్భంలో ఒక ప్రజాస్వామిక చర్చ మొదలు పెట్టాలనుకునే మావంటి వారికి ఆసరా అయ్యాడు. రాయలసీమ పౌరహక్కుల సంఘం వేదిక నుండి ప్రత్యేక తెలంగాణను సమర్థిస్తూ, బూటకపు సమైక్యతను ఎండగడుతూ, రాయలసీమ ఉద్యమ ఆవశ్యకతను స్పష్టం చేశాడు. ఆయన నిఖార్సైన ప్రజల భాషలో ఏ విషయాన్నైనా చిన్నపిల్లలకు కూడా అర్థమయ్యే రీతిలో మాట్లాడతాడు. ఎంత సామాన్యంగా మాట్లాడతాడో అంత లోతుగా ఆలోచిస్తాడు, చర్చిస్తాడు. ఆయన జ్ఞాపకశక్తి, జ్ఞానవిస్తృతి ఆశ్చర్యం కలిగిస్తాయి. రాయలసీమకు సంబంధించిన ఏ విషయమైనా తెలుసుకోడానికి కొత్త తరం వాళ్ళకు ఆయనొక రెఫరెన్స్.

జీవితమంతా సమాజం గురించి తపనపడిన ఎంజె ఏనాడైనా

తన గురించి ఆలోచించాడా అనిపించేలా బతికాడు. వివాహం చేసుకోలేదు. అక్క ఇల్లు ఆయన చిరునామాగా చెప్తాడు కాని ఆయనది ఎక్కువగా సంచార జీవితమే. చేతిలో చిన్న సంచితో ఊళ్ళన్నీ తిరగతుండేవాడు. మాసిన అడ్డపంచె, భుజంపై ఎర్ర తువ్వాలుతో గ్రామీణ ప్రజల్లో కలగలసిపోయేవాడు. ఆయనతో కొద్దికాలం పనిచేసిన ఒక మిత్రుడి మాటల్లో చెప్పాలంటే 'సాధారణంగా మనం హాలు దగ్గరే ఆగిపోతాం, అతను వంటింటి దాకా పోతాడు' వంటింటిదాకా పోయినప్పుడు ఆడవాళ్ళతో మాట్లాడతాడు. వాళ్ళను కలుపుకుంటాడు. ఆచరణలో ఇది ఆయనకున్న స్పష్టత. పల్లెజనం ఆయను తమవాడిగానే కలుపుకుంటారు. మా ఊర్లోనే ఉండిపో పెద్దాయనా అని ఆప్యాయంగా ఆయన కాళ్ళకు బంధాలు వెయ్యాలని ప్రయత్నిస్తారు. దళితులు ఆయనను సొంతం చేసుకొని మాట్లాడతారు. ఎంజె అంటే 'మాదిగ జాంబవంతుడు' అంటారు. ఆయన అంతిమయాత్రలో 'మావాడు' అని ఆయన్ని సొంతం చేసుకోని సమూహం లేదు. ఆయన నిబద్ధత, నిమగ్నత సామాజిక కార్యకర్తలకూ ఆశ్చర్యమే. దివిసీమ ఉప్పెన సందర్భంలో బాధితులతో మమేకమై సేవలందించడం దగ్గరినుండి (అక్కడా అవకతవకలపై అధికార్లతో కొట్లాడాడు) మామూలుగానో, పనిమీదనో దారిలో పోతున్నప్పుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని హాస్పిటల్‌లో చేర్పించి వాళ్ళ సంబంధీకులు వచ్చేవరకూ అన్నీ మర్చిపోయి వాళ్ళ బాగోగులు చూసిన సందర్భాల గురించి ఆయన సంస్మరణ సభలో ఆయన సంబంధీకులు ఎన్నెన్నో తలపోసుకున్నారు. ఒకసారి వాళ్ళ అక్కతోపాటు ఆయన ప్రయాణంలో ఉండగా పెద్ద ప్రమాదం జరిగి పదుల సంఖ్యలో మనుషులు గాయపడ్డారు. అక్కను పంపించివేసి అతను వారం తర్వాత ఇంటికొచ్చిడు. జోలె పట్టుకొని ప్రయాణీకుల దగ్గర డబ్బులు వసూలు చేసి, దగ్గరుండి క్షతగాత్రులకు వైద్యసేవలందించి వాళ్ళ కుటుంబసభ్యులకు కబురంది వచ్చేదాకా అక్కడే ఉండిపోయాడట. మొరటువాడిగా, మొండివాడిగా కనపడే సున్నిత మనస్కుడు ఆయన. అయితే ఆవేశం, లేదంటే దు:ఖం కట్టలు తెగుతుంది. అంత భారీ మనిషి కళ్ళనీళ్ళు పెట్టుకోవడం చూసి ఎంతటివారైనా చలిస్తారు.

క్లిష్ట సమయాల్లో ఆయన ధైర్యం, సమయస్ఫూర్తి ఆయన తొణకని స్వభావానికి నిదర్శనం. ఎమర్జెన్సీ సమయంలో జమ్మలమడుగులో తుపాకుల దొంగతనం కేసులో ఎంజెను, ఆయన మిత్రులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. కొట్టి కొట్టి అలసిపోయారో ఏమో కాసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నవారి మాటల్లో వీరబ్రహ్మం గురించిన చర్చ వచ్చింది. వాళ్ళతో మాట కలిపి రాత్రంతా వీరబ్రహ్మం గురించి వాళ్ళకు వినుగొచ్చేవరకూ, నిద్రొచ్చేవరకూ చెప్పుకుంటూపోయాడట. నీకిదేం తిక్క అని మిత్రులడిగితే అలా చెయ్యకపోతే రాత్రంతా మనల్ని కొట్టి చంపేసేవాళ్ళు అన్నాడట. ఇక చనిపోయేవరకు కూడా ఆయపై ఎన్నెన్ని కేసులో. అవి ఎంత విచిత్రంగా ఉంటాయంటే ఎస్.సి. భూముల దురాక్రమణ గురించి ఆందోళన చేసినప్పుడు ఆయనపై ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసుపెడతారు. లాకప్పుల్లో, ఆందోళనల్లో ఎన్నెన్ని దెబ్బలు తినేవాడో. మామూలు మనుషులైతే ఆ దెబ్బలకు చచ్చిపోతారనిపిస్తుంది. ఆయన ఉక్కుశరీరం మాత్రం చలించేది కాదు. ఎక్కడికైనా అనుకున్న సమయానికన్నా కొన్ని గంటలు ముందు చేరుకోవడం ఆయనకలవాటు. అట్లా ఊరుచేరుకొని బస్టాండులో పడుకున్నప్పుడు పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్ళేవారట. ఒకరాత్రి ఆయనే రాయచోటి పోలీసుస్టేషనుకొచ్చి దుప్పటి పరచకొని పడుకున్నాడట. ఏంటి ఇక్కడికొచ్చి పడుకున్నావంటే ఎట్టైనా మీరు నన్ను ఇక్కడికే తీసుకొస్తారు కదా అన్నాడట.

ఆయన మొండితనం ఆయనతో కలిసి పనిచేయడానికి ఇబ్బంది పెట్టేది. మైదుకూరు సెంటర్లో ఏధో డిమాండు అట్టమీద రాసుకొని హటాత్తుగా ధర్నాకు కూర్చుంటాడు. మీరొక్కరూ ఎందుకిలా అంటే అడిగినవాళ్ళనీ కూర్చోమంటాడు. జనం లేకుండా ఏం చెయ్యగలం అంటే, జనం కలిసి రాకుంటే అన్యాయం న్యాయమైపోతాదా అంటాడు. కలిసొస్తే ఎవరితోనైనా పనిచేస్తాడు, అది సిపిఐ అయినా బిజెపి అయినా. ఆయనకు నిర్మాణాలకున్న పరిమితులు లేవు. వ్యక్తికున్న పరిమితులు లేవు. నలుగురు కలిసేచోటికి పిలుపు లేకున్నా పోతాడు. నచ్చితే కలిసిపోతాడు. నచ్చకపోతే వెనుదిరగడు, కొట్లాడతాడు. విప్లవ ప్రజాసంఘాల సమావేశాలైతే కాకిచేత కబురందినా ఎంతదూరమైనా వస్తాడు. ఆయన హాజరైన చిట్టచివరి సభ అమరుల బంధుమిత్రుల సంఘం దశాబ్ది మహాసభలు. అక్కడినుండి వస్తూ తిరుపతిలో లక్ష్మింపేట దళితుల హత్యాకాండపై సభ గురించి విని ఆ సభకు వెళ్ళే క్రమంలో ప్రమాదంలో గాయపడ్డారు. అప్పటికే ఆయనకు తీవ్రమైన అనారోగ్య సమస్యలున్నాయి. ఒంటరిగా ఎక్కడికీ పంపొద్దన్న డాక్టర్ల సలహామేరకు ఆయన మేనల్లుడు సురేష్ ఆయన సెల్‌ఫోన్ తీసేసుకొని కొద్దిరోజులు హౌసరెస్ట్ చేశాడు. అనుక్షణం శ్రమించే మనిషికి అలా విశ్రమించడం ఇష్టం లేదేమో. అందుకేనేమో జనం మధ్యకొచ్చి శాశ్వతంగా విశ్రమించాడు.

చివరి ఊపిరిదాకా రాజీలేకుండా పోరాడడం చిన్న విషయమేం కాదు. ఫ్యాక్షన్ సెగల్లో, ప్రజాస్వామ్యమనే మాటే కరువువైన నేలపై హక్కుల సేద్యం చేయడం చిన్న విషయమేం కాదు. నోరు పెగలని నిశ్శబ్దంలో ఉరుమై గర్జించడం, ముఠానాయకుల మీసాల మెలివేతల మధ్య ఒంటరిగా దౌర్జన్యానికెదురెల్లడం చిన్న విషయమేం కాదు. భరించలేని పీడనను, ఉక్కపోతను అనుభవిస్తున్న రాయలసీమ మట్టినుండి రూపుదిద్దుకున్న అరుదైన వ్యక్తిత్వానికి అరుణారుణ జోహార్లు.

లేఖ :

మే – జూన్ సంచిక నాలుగవ కవర్‌పై 'నల్లచట్టం' అన్న పదప్రయోగం చేశారు. అయితే నల్లచట్టాలనే మాట వాడొద్దని గతంలో మనం అనుకున్నాం. అప్రజాస్వామిక లేదా అక్రమ చట్టాలు అని వాడడం సరియైనది. 'ఉపా' మాత్రమే కాదు, ఎ.పి. పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ చట్టాన్ని కూడా విస్తృతంగా ప్రయోగిస్తున్నారు.

– వరవరరావు

వ్యాసం

ఒక ఇస్క్రా - ఒక కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి

- ఎన్.వి.ఎస్. నాగభూషణ్

కమ్యూనిస్టు భావజాలంతో పరిచయం గలవారు 'ఇస్క్రా' అనే పదాన్ని వినే ఉంటారు. ఎందుకంటే విప్లవ నాయకుడు లెనిన్, రష్యన్ విప్లవాన్ని సంఘటితం చెయ్యడానికి విదేశాల్లో స్థాపించిన పత్రిక పేరు ఇది. అయితే ఇప్పుడా 'ఇస్క్రా' ప్రసక్తి ఎందుకంటారా? ఎందుకంటే ఈ వ్యాసంలో పేర్కొనబోతున్న వ్యక్తిని వర్ణించడానికి అంతకుమించిన పదం ఏదీ ఈ రచయితకు తట్టలేదు కాబట్టి. ఇంతకీ 'ఇస్క్రా' అంటే అర్థం 'అగ్నికణం' అని! 'అగ్నికణం నుండి మహాజ్వాల రగుల్తుంది' (డిసెంబరిస్టు కవి 'ఒదొయేవ్‌స్కీ' రాసిన కవితాచరణం) అనేది ఇస్క్రా పత్రిక టాగ్‌లైన్.

ఈ వ్యాసంలో పేర్కొనబోతున్నది. ఒక తెలుగు రచయిత గురించి. దీన్ని బట్టి ఆయన రచనలు అగ్నికణాల్లా దావానలాన్ని రేపేలా ఉంటాయని పాఠకులు భావించే ఉంటారు. అవును మీ భావన నిజమే. అయితే అది పాక్షికంగానే వాస్తవం ఎందుకంటే ఆ రచయిత, వ్యక్తిగా కూడా 'ఇస్క్రా'లానే ఉంటాడు కాబట్టి! అయితే ఆ రచయిత ఎవరో చెప్పేముందు, ఒక్కసారి తెలుగు నాట గల సాహిత్య దుస్థితి గురించి పర్యాలోచన చెయ్యడం అవసరం.

నేడు తెలుగునాట కవుల, రచయితల సంఖ్య వందల్లో కాదు, వేలల్లో ఉందంటున్నారు. అంతమంది అంతగా ఎదిగినందుకు మనమంతా సంతోషించాలి. అయితే విచారించాల్సింది ఏమంటే, వీరిలో ఎక్కువమంది ఒక ప్రాంతానికో, కులానికో, మతానికో అంటి పెట్టుకుని ఉండడం. మూల్యాంకనం పేరుతోనో, పునర్మూల్యాంకనం పేరుతోనో, లేదా పునఃపునర్మూల్యాంకనం పేరుతోనో అలా అంటి పెట్టుకున్నవాళ్లు - ఇతరులను అసలు కవే / రచయితే కాదని, తమ వాడే అసలైన కవి / రచయిత అనీ ఉన్నతీకరించి భుజాలపై ఎక్కించుకుని మొయ్యడం చూస్తూనే ఉన్నాం. వీటన్నిటికీ అతీతంగా, శ్రామిక వర్గ విముక్తి కోసం పనిచేసే వాళ్లకి కూడా ఏదో ఒక విధంగా తమకు గల గజ్జిని అంటగట్టి అధఃనీకరించడం కూడా గమనిస్తూనే ఉన్నాం.

అయితే ఇలాంటి వారంతా కలిసి కూడ బలుక్కున్నట్లుగా, ఒక గొప్ప రచయితను, తెలుగు వారికే గర్వకారకుడయిన ఒక విలక్షణ, విశిష్ట రచయితను ఎలాంటి మూల్యాంకనం చెయ్యకుండానే గుర్తించ నిరాకరించడం (గుర్తించకపోవడం కూడా గుర్తించ నిరాకరించడమే) చూస్తే తెలుగునాట సాహిత్య సహృదయత ఇంత అధఃపతనస్థితిలో ఉందా అనిపిస్తుంది. అతను తమ పార్టీ / కులం / మతం / ప్రాంతం వాడు కాదన్న కారణంగా పాఠకులకు చేరువ కాకుండా జాగ్రత్తపడ్డారు. ఒకటీ, అరా పత్రిక తప్ప మరే పత్రికా అతన్ని పట్టించుకున్న పాపానా పోలేదు. అతడు ఏవో ప్రేమకథలో / కామకథలో రాస్తే, లేదా ఏ 'యాస'నో పట్టుకుని రోజువారీ రచ్చబండ ముచ్చట్లు రాసినా మహా రచయితగా కీర్తించేవారేమో! (ఇక్కడ 'యాస'ను హేళన చెయ్యడం కాదు, 'యాస' అనేది దానికదే ఒక గొప్ప సాహిత్య విలువ కలది కాదని చెప్పడమే ఉద్దేశం) అవేవీ ఆయన చెయ్యలేదు. కనుకనే ఆయన పత్రికల దృష్టికీ, విమర్శకుల దృష్టికీ ఎక్కలేదు. ఆయన్ను ప్రత్యేకించి తర్కించి అడిగితే తప్ప, తానొక రచయితనని చెప్పుకోనంత నిరాడంబరుడు. రచయిత కావడం అనేది ఒక చెప్పుకోదగ్గ సంగతి కాదని ఆయన అభిప్రాయం కావచ్చు. ఓ అరడజను కవితలో, కథలో గిలికి (అవి ఎటువంటివైనా), 'నన్ను చూడు, నా రచనలు చూడు' అని కాలరెగరేసుకు తిరిగే ఈ రోజుల్లో, సమాజంలోని చీకటి కోణాల్ని బయటపెట్టే అత్యద్భుతమైన వాస్తవాల్ని బద్దలు కొట్టే నిఖార్సయిన పచ్చి నిజాలు రాసి, ఆ నిజాల్లో కూడా చాలా నవలల్లో తాను కేవలం విన్నవో, కన్నవో కాక, ప్రధాన పాత్రధారిగా ఉంటూ రాసినప్పుడు, అదే ఏ అమెరికాలోనో అయితే ఏజాక్ లండనో, ఏ రష్యాలోనో అయితే ఏ గోర్కీయో అయ్యేవాడు. తెలుగువాడు కాబట్టి ఒట్టి 'కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి'గా మిగిలిపోయాడు! కొన్ని రాజకీయపార్టీల దృష్టిలో అయితే 'అరాచకపు విశ్వమోహనరెడ్డి'గా, కొందరు పాఠకులకు 'గెరిల్లా విశ్వమోహనరెడ్డి'గా, కాదంటే మరీ పాత తరం పాఠకులకు 'డిటెక్టివ్ నవలా రచయిత కొమ్మిరెడ్డి'గా ఉన్నాడు. ఒక్క చతుర పాఠకులకు మాత్రం అసలు పేరుతో పాటు 'మోహన్', 'కె. ఆర్. విశ్వం', 'జి.ఆర్. ప్రభాకర్', 'కె.వి. మోహన్'... ఇలా పలురకాల పేర్లతో పరిచయమయ్యాడు. ఆ పరిచయాలు అంతటితో సరి. అంతే తప్ప, అసలీ వ్యక్తి ఎవరు, ఆయన చెప్పేది ఏమిటి, ఆ రచనలు ప్రాధాన్యత ఏమిటి, ఈ పేర్లు గల వారందరూ ఒకరేనా, తెలుగు సాహిత్యానికి ఆయన ఏమేం చేర్పులు చేర్చాడు. ఆయన సిద్ధాంతం ఏమిటి, వ్యక్తిత్వం ఎలాంటిది. వగైరాల గురించి ఆలోచించినవారే లేరు.

అయితే ఆయన్ను గురించి పత్రికలు అసలు ఏమీ పట్టించుకోలేదనడం కూడా సరికాదు. అతను 'లిన్ పియావో' గ్రూపులో ఉన్నప్పుడు, పార్టీ ఆదేశం పై బ్యాంక్ దోచేందుకు ప్రయత్నించి పట్టుబడినప్పుడు, 'బందిపోటు దొంగగా మారిన రచయిత' అనీ, దేవస్థానం భూములూ, చెరువు శిఖం భూములూ, పోరంబోకు, బంజరు భూములు తదితర భూముల్ని పేదలకు పంచుతున్న సందర్భంలో తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్న సమయాల్లోనూ; ఒకానొకప్పుడు ఆయా ఉద్యమాల సందర్భంగా అరెస్టు చేసి జైల్లో పెట్టి ఎన్‌కౌంటర్‌కు పాల్పడతారేమోనని అనుమానం రాగా తన అరెస్టువార్తను వెంటనే పత్రికల్లో వచ్చేట్లు చెయ్యమని కోరగా, చలసాని ప్రసాదరావు (సుప్రసిద్ధ జర్నలిస్టు, విపుల చతురల ఎడిటర్, చిత్రకారుడు, విమర్శకుడు) అందుకనుగుణంగా ఆ వార్తను ఈనాడు పత్రికలో ప్రచురించినపుడు; అలాగే 2000 ఏప్రిల్ 11న ప్రకాశం జిల్లా దొనకొండ మండలం మంగినపూడి గ్రామంలో

పి.ఓ.డబ్ల్యూ (స్త్రీ విముక్తి) కార్యకర్త మరియమ్మతో పాటు ఆయన్నూ అరెస్టు చేసి, గుంటూరు జిల్లా వినుకొండ మండలం దొండపాడు పరిసరాల్లో పోలీసులు 'ఎన్‌కౌంటర్' చేసి 'ఒక కిరాతకుణ్ణి, ఒక దుర్మార్గుణ్ని చంపిపారేశా'మని చెప్పినప్పుడు - అదే చలసాని ప్రసాదరావు ఈనాడు దినపత్రిక 'కబుర్లు' కాలంలో 'మారణహోం'లో ఒక సమిధ'గా ఆయన్ను గురించి రాసినప్పుడు... పత్రికలు ఆయన్ను పట్టించుకున్నాయి, అంత వరకే. అంతకు మించి ఎక్కువా కాదు. తక్కువా కాదు. అయితే కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి అంతమాత్రమేనా? అంతకుమించి మరింకేమీలేదా?

నిజానికి విశ్వమోహనరెడ్డి వ్యక్తిత్వాన్ని గురించి, ఆయన రచనల గురించి సమగ్రమైన సమాచారం ఈ వ్యాస రచయిత వద్దలేవు. తెలిసిన సమాచారాన్నయినా పాఠక మిత్రులతో విస్తృతంగా పంచుకుంటే, వారిలో ఏ కొందరికైనా ఆసక్తి కలిగి పరిశోధించి, సమగ్రమైన సమాచారాన్ని భావితరాల వారికి అందజేస్తారన్న ఆశతో ఈ వ్యాసాన్ని ఈ రచయిత రాస్తున్నాడు. పూనుకుంటే, కనీసం ఓ 30, 40 పూర్తిస్థాయి పరిశోధనా వ్యాసాలు వచ్చే అవకాశం ఉంది. అయితే సదరు సంస్థలు ప్రజలకు ఏవి అక్కరలేదో వాటి గురించి మాత్రమే పరిశోధనలు చేయిస్తాయి. అవసరమైన విషయాలపై పరిశోధింపజేయడం తమ పని కాదనుకుంటాయి. ఆ పని పత్రికలకు వదిలేస్తాయి.

ఆధునిక రష్యన్ సాహిత్య పితామహుడు, మహాకవీ అయిన 'అలెక్సాండ్ర్ పూష్కిన్' గురించి సాదావచనంలో చెప్పడం సిగ్గుగా ఉంటుందని ప్రసిద్ధ రష్యన్ సాహిత్య విమర్శక పితామహుడు 'విస్సారియెన్ బెలిన్‌స్కీ' అన్నాడు. అందుకోసం వైభవభరిత పద చిత్రాలు కావాలన్నాడాయన. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా, సాదాగా, బక్కగా లోతుకు పోయిన కళ్లతో ఒక నిరుపేద షాపు గుమాస్తాలా ఉండే విశ్వమోహనరెడ్డిని పెద్ద పెద్ద సమాసాలతో, అలంకారాలతో వర్ణించడాన్ని ఈ వ్యాసరచయిత సిగ్గు పడుతున్నాడు. అందుకు ఈ వ్యాస రచయితకు తట్టిన ఒకే ఒక్క పదం, వ్యాసారంభంలో చెప్పిన పదం 'ఇస్క్రా' మాత్రమే. విశ్వమోహనరెడ్డి వ్యక్తిగా రచయితగా కూడా 'ఇస్క్రా' లాంటివాడు.

ఇతరులలానే, విశ్వమోహన్‌రెడ్డి గురించి ఈ వ్యాసరచయితకు కూడా మొదట ఏమీ తెలీదు. ఆయన మరణించిన (12-4-2000) అయిదారేళ్ల తర్వాత ఈ వ్యాసరచయిత ఆయన నవల 'జైలు' చదవడం జరిగింది. (ఆయన రాసిన మరి మూడు నవలలు - 'మానవహోమం', 'దొంగలు', 'దాడి'తో పాటు ఈ 'జైలు' నవలని కూడా ఒక సంపుటిగా శారద సాహిత్య వేదిక, తెనాలి వారు ప్రచురించారు) అంతకు కొద్దిరోజుల ముందే తొల్‌స్తోయ్ (టాల్‌స్టాయ్) రాసిన 'నవజీవనం' (ఇంగ్లిషులో 'రెసరెక్షన్') నవలని ఈ రచయిత ఆయన రాసిన ఇతర నవలలు మూడింటితో పాటు విమర్శనాత్మక అధ్యయనం చెయ్యడం జరిగింది. ఆ నాలుగింటిలో ఈ నవజీవనమే ఉత్తమమైందన్న నిర్ధారణకు వచ్చాడు. ఆ విధంగా నవ జీవనాన్ని వంటబట్టించుకున్న ఈ రచయితకు, 'జైలు' నవల కూడా నవజీవనం అంతటి స్థాయిదిగా భావించడం జరిగింది. నవ జీవనం నవలలోని కథానాయకుడు 'నెఖ్లూడో'ను తలచుకుంటే, 'ఎంతగొప్పవాడు!' అన్న భావన కలుగుతుంది. కానీ జైలు నవలలోని 'పోతాలు'ను తలుచుకుంటే మాత్రం కన్నీళ్లుధారగా కారతాయి. అలాగే పోతాలులాంటి అనుభవాల్ని ఎన్నింటినో పొందిన విశ్వమోహనరెడ్డిని తలుచుకున్నా కూడా!

ఇక్కడ మరొక్క ముఖ్య విషయాన్ని చెప్పకపోతే రచయితగా ఆయనెంతటి అసాధారణ వ్యక్తో తెలుసుకోవడం అసంపూర్ణమవుతుంది. అదేమిటంటే ఒక నవలకి ఆయన తీసుకునే సమయం! అతి తక్కువ సమయంలో ఒక రచనను పూర్తి చెయ్యడంలో విమర్శకులు తరచు ప్రసిద్ధ రష్యన్ రచయిత 'చేహోవ్'ని ఉదహరిస్తుంటారు. కేవలం 44 సంవత్సరాలు మాత్రమే జీవించిన చెహోవ్, ఆ చిన్న జీవితంలోనే పలునాటికలూ, నవలికలూ, సామాజిక గ్రంథాలతోపాటు, ఆణిముత్యాల్లాంటి వెయ్యికిపైగా ప్రపంచ స్థాయి కథల్ని రాశాడు. ఆయన హైస్కూలు చదువు సాగించేటప్పుడే తండ్రి మూలంగా బలవంతంగా దుకాణంలో అమ్మకానికి కూర్చుండి, బేరాలమధ్యనే కేవలం రెండు మూడు గంటల్లోనే చిన్న కథల్ని రాసి తన చదువుకి కావలసిన డబ్బు సంపాదించుకునే వాడంటారు. అయితే కథ రాయడానికీ నవల రాయడానికీ చాలా తేడా ఉంటుంది. సబ్జెక్టు మీద మంచి అవగాహన ఉన్నప్పుడు కథని ఒక్క ఊపులో రాయొచ్చు. ఎందుకంటే కథ ఒకటి, రెండంశాల చుట్టూనే తిరుగుతుంది కాబట్టి. కానీ నవలలో పలు అంశాలుంటాయి. దేని ప్రాధాన్యత దానికివ్వాలి. మళ్లీ ఆ అంశాల మధ్య పరస్పర సంబంధం ఉండాలి. ఎక్కడ బిగువు సడలినా, ఆ మేరకు అక్కడ లోపం స్పష్టంగా కనబడుతుంది. అటువంటి నవల్ని సాదాసీదాగా రాయడానిక్కూడా కొన్ని వారాలు పడుతుంది. అలాంటప్పుడు మనకు అంతగా తెలియని ఒక ప్రత్యేక ప్రపంచాన్ని పాఠకుల చేత దర్శింపజేయడానికి, సమాజంలోని ఒక చీకటి కోణాన్ని దర్శింపజేయడానికి బిగువైన కథనంతో పాటు, అడుగడుగునా మనకు నమ్మశక్యంగాక పోయినా యదార్థమైన సంఘటనలతో రాయడానికి మరింత సమయం కావాలి, కానీ విశ్వమోహనరెడ్డికి పట్టే సమయం కేవలం 48 గంటలు. ఏదో ఒక్క నవలకు మాత్రమే కాదు, ఆయన రాసిన నవలలన్నింటికీ ఒక్కోదానికీ రెండు మూడు రోజులు మాత్రమే. ఒక్క 'రిగ్గింగ్' రాయడానికి మాత్రం వారం రోజులు పట్టిందట. (ఈ గంటల లెక్కలు చలసాని ప్రసాదరావే ఇచ్చారు. విశ్వమోహనరెడ్డి తన రాత ప్రతులపై తేదీతో పాటు సమయాన్ని కూడా గుర్తించేవాడట. ఇక ఆయన ఎంత ధారాళంగా రాస్తాడంటే, ఆయన అముద్రిత నవలల్లో ఎక్కడా కొట్టివేతలు లేవని వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన కొత్తపల్లి రవిబాబు చెప్పారు. అలాగే ఒక నెలలో అరడజను నవలలు రాసి, తన మీదికి విసిరేశాడని చలసాని రాశారు.) ఇంత ధారాళంగా, వేగంగా రాసే వారిని ఒక సాధారణ రచయితగా పరిగణించడం సరికాదు. విశ్వమోహనరెడ్డి రచయితగానే కాదు, వ్యక్తిగా కూడా అసాధారణుడే. ఎంతో ఓపిక, ఆవేశం, ఆవేదన, జీవితం పట్ల ఒక సమగ్ర తాత్త్విక దృష్టి, తన చుట్టూ జరుగుతున్న అన్యాయాల పట్ల కసి, వీటన్నింటినీ మించి అపారజీవితానుభవం అతణ్ణి రచయితను చేశాయి. ఆయన రచనలన్నీ వైవిధ్యపూరితమైనవే. ఎంతటి రచనా శక్తీ, మేధస్సూ ఉన్నా, వైవిధ్యపూరితమైన జీవితానుభవం లేకపోతే అలాంటి రచనలు చెయ్యడం సాధ్యం కాదు.

జాక్ లండన్ బాల్యంలోనే చదువు మానేసి తన పొట్ట తనే

పోషించుకుంటూ, మొదట స్మగ్లర్లతో, వేటగాళ్లతో శాన్ ఫ్రాన్సిస్కో అఖాతంలో తిరుగుతూ, ఫ్యాక్టరీ కూలీగా, తర్వాత ముత్యపు చిప్పల దొంగగా, అటుపై అలాంటి దొంగల్ని పట్టుకునే కోస్టుగార్డుగా, తర్వాత నౌకపై సరంగుగా, ఆపై నారమిల్లులో, రోడ్డు పనిలో కూలీగా, తర్వాత కార్మికయాత్రలో పాల్గొని, అటుపై దేశదిమ్మరిగా తిరుగుతూ జైలు పాలై, అనంతరం చాకలిషాపులో పని చేసి, తర్వాత అలాస్కాలో బంగారం కోసం వెతుకులాడుతూ – ఇలా రకరకాల అనుభవాలతో రచయితగా మారి, అమెరికాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే రచయిత అయ్యాడు.

గోర్కీ కూడా 10వ ఏటే తన శ్రమతో పొట్ట నింపుకోవాల్సి వచ్చి, ఒక చెప్పుల దుకాణంలో పనిచేస్తూ చేతులు కాలడంతో ఒక బంధువుల ఇంట్లో బండచాకిరీ చేసి, తర్వాత ఒక నౌకలో పాత్రలు తోముతూ, అనంతరం అడవి పక్షుల్ని పట్టుకుని అమ్ముతూ, తర్వాత నాటకాల్లో నటునిగా, తర్వాత నౌకలో సరుకులు దింపేవానిగా, తర్వాత బేకరీలో, అటుపై కిరాణా కొట్లో పనిచేసి, ఆత్మహత్యకు ప్రయత్నించి, అనంతరం వాచ్‌మన్‌గా ఉండి, తర్వాత సైన్యంలో చేరడం కోసం వేలాది మైళ్లు రెండు సంవత్సరాల పాటు కాలి నడకన వెడుతూ, కడుపు నింపుకునేందుకు ప్రతిరోజు కనిపించిన పనినల్లా చేస్తూ, ఎన్నో ప్రమాదాల్ని ఎదుర్కొని ఆపై పత్రికా విలేఖరిగా, అటు తర్వాత శ్రామిక వర్గ రచయితల్లోనే ఉన్నతమైన వానిగా ప్రఖ్యాతి పొందాడు.

అలాగే కుప్రీన్ కూడా మొదట సైన్యంలో పని చేసి, అక్కణ్ణుంచి వచ్చేసి, జీవిక కోసం నాటకాల ప్రాంప్టర్‌గా, బొగ్గు బస్తాలకెత్తేవానిగా, చర్చినాయకునిగా, దంత వైద్యునిగా, పుచ్చకాయలమ్మేవానిగా, భూమి సర్వేయర్‌గా, శానిటరీ సామాను అమ్మేవానిగా, ఎస్టేట్ మేనేజర్‌గా, పత్రికా విలేఖరిగా, ఫ్యాక్టరీ కార్మికునిగా ఇలా ఎన్నో రకాల పనులు చేస్తూ కథా వస్తువుకవసరమైన సామాగ్రి సేకరణ నిమిత్తం వారాలు, నెలలు, సంవత్సరాలు కృషి చేసి, ఎన్నో సాహసకృత్యాలు చేసి, తన అరుదైన అనుభవాలతో అద్భుత కథలు, నవలలు రాశాడు.

అయితే ఈ ముగ్గురు రచయితలూ కూడా తమ కాలం నాటి విప్లవాన్ని ఆహ్వానించినా, వారు ప్రధానంగా రచయితలు మాత్రమే. అయితే ఈ విషయంలో గోర్కీకి కొంత మినహాయింపు ఉంది. గోర్కీ కూడా రాజకీయ వాసన కొంత కలవాడయినప్పటికీ, ప్రధానంగా రచయిత మాత్రమే. కానీ కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి అలాకాదు. ఆయనకు రాజకీయాలే ప్రధాన వ్యాపకం. తను బతికిన 50 సంవత్సరాల కాలంలో తన ప్రధాన రచనల కోసం కేవలం 10 సంవత్సరాల కాలంలో కొన్ని రోజులు మాత్రమే. ఆ కాలంలోనే 'గెరిల్లా' పత్రిక నిర్వహణ, దానికి సంబంధించిన సాంస్కృతిక కార్యకలాపాలు. అంతకుముందు, ఆ తర్వాత జీవించిన 10 సంవత్సరాలు రాజకీయ కార్యక్రమాల నిర్వహణకే కృషి చేశాడు. తన నవలలు పాఠకాదరణ పొందినప్పటికీ, చివరి పది సంవత్సరాలూ రచనాభిరుచికి స్వస్తి చెప్పి, కేవలం విప్లవ రాజకీయాలకే తన మొత్తం సమయాన్ని వెచ్చించి, అందులోనే చనిపోయాడు!

కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి సిద్ధాంత చర్చలకన్నా, ఆచరణకే అధిక ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి. పార్టీల ఇరుకుగోడల్లో ఇమడలేని కార్యవాది. అందువల్లనే మొదట మితవాద వామపక్షమైన సి.పి.ఐ.లో, అనంతరం వివిధ ఎం.ఎల్ గ్రూపుల్లో పనిచేసినప్పటికీ, ఆయన్ను చాలా మంది అరాచకవాదిగానే భావించారు.! తన నవలలు ఎంత వేగంగా రాశాడో, అంత వేగంగా రాజకీయ కార్యాచరణ సాగాలని కోరుకున్న వ్యక్తి ఆయన. అవి అంత వేగంగా సాగనప్పుడు, పార్టీల నిర్మాణాల్ని సైతం పక్కన పెట్టి, తనకు తానుగా తను అనుకున్న వేగంతో సాగినవాడు. అయితే వ్యక్తి వేగం కన్నా, సామూహిక వేగం ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది. ఆయన వేగాన్ని తట్టుకోలేని ఆయా పార్టీలు ఆయన్ని వేగం తగ్గించుకోమని ఒత్తిడి చేసిన సందర్భాలెన్నో. తన వేగానికి తన రచనలూ ఆటంకమని భావించడంతో, రచయితగా పరిణతి చెందిన తర్వాత పది సంవత్సరాలూ తన రచనలకే తిలోదకాలిచ్చిన అకుంఠిత దీక్షాపరుడు! తను నమ్మిన ఆశయం కోసం ఎంతకైనా తెగించడం, తీవ్రంగా శ్రమించడం, ఒక్కక్షణం కూడా విశ్రాంతిగా ఉండకపోవడం ఆయన నైజం. పేదప్రజల్ని అమితంగా ప్రేమించడం ఆయన కార్యాచరణకు పునాది. ఆ కార్యక్రమాలవల్ల నష్టపోతున్న భూస్వామ్యవర్గాలు, వారి తాబేదర్లయిన రౌడీలు, పోలీసులు ఆయన్ను అనుక్షణం వెంటాడి, అనేక సార్లు దొంగ దెబ్బ తీసి, తప్పుడు కేసుల్లో ఇరికించి, పలుమార్లు జైలుకి పంపి, ఆఖర్న ఎన్‌కౌంటర్‌లో హతమార్చడం యావత్తు శ్రామిక వర్గానికే కాక, సాహిత్యలోకానికే తీరని విషాదం!

విశ్వమోహనరెడ్డి జీవితంలో అడుగడుగునా సంచలనాలే తొంగిచూశాయి. ఆయన పుట్టడానికి ఒక భూస్వామ్య కుటుంబంలో (కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతంలో ఒక కుగ్రామంలో. బహుశా అది 'పొట్టిపాడు' కావచ్చు) పుట్టాడు. చిన్నతనంలోనే ఫ్యాక్షన్ రాజకీయాల వల్ల మిగిలిన కుటుంబాల్నీ, బంధువుల్నీ, యావదాస్తినీ – సమస్తాన్నీ పోగొట్టుకుని, 15 సంవత్సరాల వయసులో ప్రొద్దుటూరు పట్టణంలో కొన్ని నెలలు ఒక చిన్న హోటల్ నడిపాడు. అది దివాలా తియ్యగా, జీవిక కోసం ఆ వయస్సులో డిటెక్టివ్ నవలలు పుంఖాను పుంఖాలుగా 'కొమ్మిరెడ్డి' పేరుతో రాశాడు. అటుపై ఒక పుస్తక సంస్థను మద్రాసు, ప్రొద్దుటూరుల్లో ఏర్పాటు చేశాడు. అదీ సరిగ్గా నడవక సినిమా తీద్దామని కథ, స్క్రీన్‌ప్లే తనే సిద్ధం చేసుకున్నాడుగానీ, ఆ సినిమా సెట్స్ దాకా వెళ్లినట్లు కూడా లేదు. ఉన్న కొద్దిపాటి సొమ్మూ పోగొట్టుకుని కట్టుబట్టలతో ఒంటరిగా మిగిలాడు. అయినా అధైర్యపడక, నంద్యాల ప్రాంతంలో గల 'నాగులవరం' గ్రామం చేరి, అక్కడ ఒక భూస్వామి దగ్గర పాలేరుగా చేరాడు. అప్పటికే నాస్తికుడైనా, ప్రజల్ని సమీకరించడానికి భక్తినే సాధన చేసుకుని భజన సమాజానొక్కదాన్ని నెలకొల్పాడు. గ్రామ సమస్యలపై ఆ సమాజం ద్వారా పోరాడాడు. భూస్వాములు హత్యాప్రయత్నం చేస్తే, తప్పించుకుని ఆ ఊరొదిలి, నంద్యాల చేరి, రిక్షా కార్మిక సంఘాన్ని ఏర్పరచాడు. అప్పుడే సి.పి.ఐ. పార్టీతో సంబంధం ఏర్పరచుకున్నాడు. ఆయన ఆత్మకథగా భావించబడే 'అలజడి జీవితం' అనే అసంపూర్ణ, అముద్రిత నవలను బట్టి, పార్టీ కోసం నంద్యాల ప్రాంతంలో గల గాజులపల్లి చుట్టుపక్కల గుడ్డిబసవన్న గుడి దగ్గర వేలాది ఎకరాల బంజరు భూపోరాటానికి దిగి, ఆ చుట్టు పక్క గ్రామాల్లో పార్టీని పటిష్టపరిచాడు.

ఆయన పోరాట పటిమ చూసి అక్కడి వారు నక్సలైట్‌గా అనుమానించారు. నాగులవరంలోని అటవీ బంజరు ఆక్రమణ

సందర్భంగా అరెస్టు కాబడి, బెయిలుపై బయటపడ్డాడు. తాలూకా కమిటీకి తెలుపకుండానే స్వంత డబ్బుతో కరపత్రాలు పంచి ప్రచారం చేసి, కానాల చెరువు బంజరు కోసం కలెక్టరు దగ్గరకు 1000 మందితో ప్రదర్శన జరిపాడు. గాజులపల్లె ప్రదర్శన సందర్భంగా పెట్టిన కేసులో జైలు శిక్ష తప్పకపోవచ్చుననుకొని, కమిటీకి తెలియకుండానే వెంటనే గోస్పాడు ఫిర్కా మహాసభ నాగులవరంలో ఏర్పాటు చేశాడు. తాలూకా కమిటీ అతనిపై జిల్లా కమిటీకి ఫిర్యాదు చెయ్యగా, జిల్లా కార్యదర్శి చర్య తీసుకునేలోగా మహాసభ జరిపించాడు. అయితే భూస్వాముల దాడి వల్ల సభను ఊరి బయట పెట్టాల్సి వచ్చింది. అందువల్ల భయపడ్డ జనం తక్కువ మందే హాజరయ్యారు. ఈలోగా గాజులపల్లె కేసులో వారం రోజులు జైలుశిక్ష అనుభవించాల్సి వచ్చింది. జైల్లో కొందరు నక్సల్స్‌తో పరిచయం ఏర్పడింది. జైల్లో మొదటి రోజే అక్కడ పెట్టే భోజనం సరిగ్గా లేకపోతే ఆయన నాయకత్వంలో సమ్మె జరిగింది. అందులో నక్సల్స్ కూడా పాలు పంచుకున్నారు. మేజిస్ట్రేట్ హామీతో సమ్మె విరమణ జరిగింది. సి.పి.ఐ. పార్టీ పట్ల ఆయనలో ఏర్పడ్డ అసంతృప్తిని గమనించి, నక్సల్స్ ఆయన్ని తమలోకి రమ్మనగా, బయటకు వెళ్లాక ఆలోచిస్తానన్నాడాయన.

జైలు నుంచి విడుదలయ్యాక ఆయనలో గల అసంతృప్తిని గమనించి పార్టీ పెద్దలు పార్టీ వదలొద్దని కోరారు. ఇంతలో నాగులవరంలోని మాలపల్లెను భూస్వాములు తగులబెట్టి, ఆయన్ను చంపించాలని ప్రయత్నించారు. ఆ సంగతి తెలుసుకున్న ఆయన, తనకెలాగైన చావు తప్పదని ఊహించి, తను చనిపోయేలోగా తనను నమ్ముకున్న పేదలకేదైనా చెయ్యాలని ఆలోచించి, కానాల చెరువు, గాజులపల్లె ఫారెస్టులకు చెందిన బంజర్లను పంచాలని అమరణ దీక్ష చెయ్యడానికి సంకల్పించాడు. ఇంతలో పార్లమెంటు ఎన్నికలు రాగా, కడప అభ్యర్థిని పార్టీ నిలబెట్టి, ఆ ఎన్నికల ప్రచారం చెయ్యమని పార్టీ కోరింది. ఎన్నికలయ్యాక నిరాహార దీక్ష చెయ్యవచ్చునని భావించి, పార్టీ ఎన్నికల ప్రచారంలో అందరికన్నా ముందుండి నడిపించాడు. ఆ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఈశ్వరరెడ్డి లక్షకు పైగా ఓట్లమెజారిటీతో గెలిచాడు. ఇంతలో ఆయన ఆలోచన మారి నక్సల్స్ వైపు వెళ్లాలనుకున్నాడుగానీ, ఆయనపై బురద జల్లుతూ తప్పుడు ఆరోపణలతో పార్టీ ప్రచారం చేసే సరికి, నక్సల్స్‌తో కాంటాక్టు ఇప్పిస్తానన్న వ్యక్తి వెనక్కి తగ్గాడు. అటు తర్వాత ఆయన తన మకాంను ప్రొద్దుటూరికి మార్చి, బేల్దారి పనిలో శ్రామికుడిగా రెండేళ్లు పనిచేశాడు. తిరిగి నాగులవరం వెళ్లి, కొంత పొలం తీసుకుని కౌలుకి చేస్తూ, కూరగాయల అమ్మకం సాగించాడు. అప్పుడే గ్రామ యువజనుల కోరికపై 'పురపాలకులు' అనే నాటకం వారికి నేర్పడానికీ, అందులో తాను విలన్ వేషం వెయ్యడానికీ అంగీకరించాడు. మరోపక్క తాను స్వయంగా రాసిన 'రావణ బ్రహ్మ' నాటకాన్ని ఆడడానికి మరో ట్రూప్‌ని తయారుచేశాడు.

ఇంతలో ప్రత్యేక ఆంధ్రోద్యమంతో ఆ ప్రాంతమంతా వేడెక్కేసరికి, ఆవేశపరుడయిన ఆయన తన డబ్బుతో కరపత్రం ముద్రించి 1973 మార్చి 15 నుండి ఆమరణ నిరాహార దీక్ష మొదలెట్టి చేస్తుండగా, 21న పోలీసులు అరెస్టు చేసి బలవంతంగా గ్లూకోజ్ ఎక్కించారు. అటుపై 1974 జనవరి 13, 14 తేదీలలో కర్నూలులో జరిగిన విప్లవ రచయితల సంఘం మహాసభకు హాజరయ్యాడుగానీ, ఇక ఇతర రాజకీయ పార్టీలలో చేరరాదనుకొని, స్వంతంగా తానొక్కడే సభ్యునిగా 'ప్రజా కమ్యూనిస్టు పార్టీ'ని ఏర్పరచాడు. వ్యవసాయ కూలీలలో కంటే, పట్టణ కార్మికుల్లో పనిచేస్తే మంచిదనుకుని, తన నివాసం నంద్యాలకు మార్చాడు. ఇక్కడితో 'అలజడి జీవితం' నవల ముగిసింది. దీనికి కొనసాగింపు మరో అసంపూర్తి, అముద్రిత నవల 'సమ్మె'. ఇది చాలా చిన్న నవల. ఇందులో రిక్షాకార్మికులతో సమ్మె నడిపించడం, సమ్మె సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, కలెక్టరు సమస్యను పరిష్కరిస్తాననడం జరిగింది.

తర్వాత దాదాపు 1978 దాకా కొమ్మిరెడ్డి జీవితాన్ని గురించిన వివరాలు తెలియడం లేదు. 1978కి కొద్దికాలం ముందే ఇంకొల్లు చేరుకొని ఉండాలి. 1978 నుంచి 1990 దాకా కొన్ని వివరాలు తెలుస్తున్నాయి. రచయితగా విశ్వమోహనరెడ్డి విశ్వరూపం ఈ సమయంలోనే కనబడుతుంది. ఈ కాలంలోనే ఆయన నవలలు 13 ప్రచురితం అయ్యాయి. ఆయన మరణానంతరం 'రిగ్గింగ్' నవల ప్రచురింపబడింది. అంతేగాక, మరి 5 నవలల్నీ, 'నరబలి' (1982) అనే నాటకాన్నీ ఇక్కడుండగానే రాయడం జరిగింది. అంతేగాక 'గెరిల్లా' అనే పత్రికనూ ఇక్కడే నడిపి కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలూ నడిపాడు. కొంతకాలం పాటు ఏ రాజకీయ పార్టీలోనూ చేరని ఆయన తన భావాలను ఈ పత్రిక ద్వారా ప్రచారం చేశాడు. వామపక్షపార్టీలు కూడా ఏదీ, ఏ పనినీ చెయ్యాల్సిన విధంగా చెయ్యడం లేదని భావించి, అన్ని పార్టీలకూ దూరంగా ఉన్నాడు, అయితే కొంతకాలం పాటు నక్సల్స్ గ్రూపులలో ఒకటయిన 'లిన్‌పియావో' పార్టీతో సంబంధాలు పెట్టుకుని, పార్టీ ఆదేశాన్ని అక్షరాలా అమలు చెయ్యడం కోసం ఒకసారి బాంక్ (యూనియన్ బాంక్?)ని దోచుకోవడానికి విఫల ప్రయత్నం చేసి, పారిపోతుండగా జీపు బురదలో కూరుకుపోగా, పట్టుబడి జైలుపాలయ్యాడు. అనేక సార్లు జైలుపాలయిన విశ్వమోహనరెడ్డి, ఒకసారి జైలు ఆస్పత్రికి చేరి అక్కణ్ణుంచి తప్పించుకుపోయాడు. తన జైలు అనుభవాలతో 'జైలు' అనే అద్భుత నవలను రాశాడు. కొంత కాలం నిశ్శబ్దంగా ఉన్నాక, 1990 ప్రాంతంలో తరిమెల నాగిరెడ్డి స్థాపించిన యు.సి.సి.ఆర్.ఐ. పార్టీలో చేరాడు. బహుశా అప్పుడే ఇంకొల్లు నుంచి బయటకు రావడం జరిగి ఉంటుంది. విప్లవం సాధించడానికి సాయుధ పోరాటమే ఏకైక మార్గమని ఆయన ఆలోచన, తరిమెలనాగిరెడ్డి పార్టీలో చేరడంతో మారి, సాయుధ పోరాటంతో పాటు, ప్రజాస్వామిక ఉద్యమరూపాలైన మహజర్లు, మెమొరాండాలు, ఊరేగింపులు, ప్రదర్శనలూ కూడా చేయించడానికి తీవ్రంగా పూనుకున్నాడు. అందుకోసం తన రచనా కార్యక్రమం అడ్డు వస్తుందని, దాన్ని కూడా వదులుకున్నాడు.

ఈ సందర్భంగా విశ్వమోహనరెడ్డి వివాహం విషయాన్ని తప్పక ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. రాజకీయ కార్యకర్తగా ఎంతో ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన విశ్వమోహనరెడ్డి, వివాహ విషయంలో ఆ ఆదర్శాన్ని అమలు చేసి, బహుశా ఎవరికీ అందనంత ఎత్తుకి చేరాడు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న తాను, ఒక వికలాంగురాలికి ఆధారంగా ఉంటే బాగుంటుంది అనుకొని, పత్రికల్లో ప్రకటన ఇచ్చి, హిందీ పండిట్ ట్రైనింగ్ చేస్తున్న గుర్రం ఇందిరాదేవి

అనే అవిటి ఆమెను, ఆమె పెద్దలతో చర్చించి, వివాహం చేసుకున్నాడు. కుటుంబ జీవనంలో కూడా ఎంతో ఆదర్శంగా ఉండేవాడు. తెల్లవారు ఝామున 4 గంటలకే లేచి, నీళ్లు తెచ్చి, మిగిలిన పనులన్నీ పూర్తి చేసి, పొయ్యి దగ్గర అన్నీ అమరిస్తే, ఆమె వంట చేసి పెట్టేది. తెల్లారేసరికి ఆయన ఊళ్లోకి వెళ్లి జనాలను కలిసేవాడు. వారితోనే ఆయన పని అంతా. ఒక్క క్షణం కూడా వృథా చెయ్యకూడదన్నది ఆయన ఆలోచన. ఏదైనా ఒక ఊళ్లో నాలుగంటే నాలుగు రోజులున్నాడంటే అగ్గి రాజుకున్నట్టేనని, ఆయన దూకుడు తగ్గించమని పలుసార్లు కోరడం జరిగిందని, ఆయనతో నిర్మాణాత్మకంగా పనిచేయించడానికి పగ్గాలు పట్టుకు లాగాల్సి వచ్చిందని ఆ ప్రాంత బాధ్యుడు స్వామి చెప్పడం జరిగింది. మళ్లీ ఆయన కుటుంబం విషయానికి వస్తే, ఉద్యమ క్రమంలో తానెప్పుడైనా ఎన్‌కౌంటర్‌కు గురికావచ్చునని గ్రహించి ('అశ్రుతర్పణం' అనే నవలలో ముందుగానే ఆ విషయం ఊహించాడు), భార్యకు ఆడ తోడు ఉండాలనుకుని (ఒక కొడుకు అప్పటికే ఉన్నా), ఒక అనాథ పిల్లను తెచ్చి పెంచుకున్నాడు.

ఇక ఆయన కార్యాచరణ విషయానికి వస్తే, పిడుగురాళ్లలో 70 ఎకరాలలో 700 ఇళ్లను సున్నపురాయి క్వారీ, తదితర చోట్ల పనిచేసే నిరుపేద శ్రామికులకు నిర్మింపజెయ్యడం ఆయన ఉద్యమ జీవితంలో గొప్ప మలుపు తిప్పింది. లెనిన్ నగర్ పేర నిర్మించాడీ ఆవాసాన్ని. అలాగే కొండమూచిలో 60 ఎకరాలు ఖనిజం తవ్విన అటవీ భూమిని ఆక్రమించి 300 ఇళ్లను శ్రామికుల కోసం తరిమెలనాగిరెడ్డి నగర్ నిర్మింపజేశాడు. అలాగే గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతం బొల్లాపల్లి దగ్గర అటవీ, దేవాలయ బంజరు భూములు వేలాది ఎకరాలకై పలు ఉద్యమాలు నిర్మించాడు. ఆయా సమయాలలో ఆయనపై ఎన్నో మార్లు భూస్వాముల గుండాలు, పోలీసులు రకరకాలుగా దాడులు చెయ్యడానికి ప్రయత్నించారు. కేసులు పెట్టారు. ఒకానొక ఘర్షణలో ఓ భూస్వామి చనిపోయాడు. అక్కడా సమయంలో విశ్వమోహనరెడ్డి లేనప్పటికే, ఆయనపై హత్యానేరం మోపేసరికి, రహస్య జీవితానికి వెళ్లాడు. 11-4-2000న రాత్రి ప్రకాశం జిల్లా దొనకొండ మండలం 'మంగినపూడి'లో విశ్వమోహనరెడ్డి, పి.ఓ.డబ్ల్యు (స్త్రీవిముక్తి) కార్యకర్త మరియమ్మలు ఒక సానుభూతిపరుని ఇంట్లో ఒక సమస్యపై సమావేశమై ఉండగా, పోలీసులు అరెస్టు చేసి, 12వ తేదీన గుంటూరు జిల్లా వినుకొండ మండలం దొండపాడు పరిసరాల్లో ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపినట్లు ప్రకటించారు. హత్యజరిగేనాటికి విశ్వమోహనరెడ్డి వయసు కేవలం 50 సంవత్సరాలు మాత్రమే. నాడు తెలుగు దేశం పాలనలో (చంద్రబాబు ముఖ్యమంత్రిగా) పిడుగురాళ్లలో విశ్వమోహన్‌రెడ్డికి స్మారక స్థూపం నిర్మించుకునేందుకు కూడా అనుమతించలేదు. ఆ ప్రభుత్వం పతనమయ్యాక మాత్రమే విశ్వమోహనరెడ్డికి 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా (బతికుంటే) 60 అడుగుల స్థూపాన్ని నిర్మించారు ఆయన అభిమానులు.

విశ్వమోహనరెడ్డి రెండు నాటకాలతో పాటు, మొత్తం 19 నవలలు రాశాడు. వీటిలో 12 నవలలు చతుర మాసపత్రికలో అచ్చయ్యాయి. కాగా, 'ఎవరి స్వార్థం వారిదే' అనే నవలను ప్రగతి పబ్లిషర్స్ పేర ఆయనే ప్రచురించుకోగా, ఆయన మరణానంతరం 'రిగ్గింగ్' నవలను 'జనసాహితీ' వారు ప్రచురించారు. మిగిలిన 5 నవలలూ అముద్రితాలు. అయితే చతురలో ప్రచురించబడ్డ 4 నవలలు 1. 'జైలు', 2 'మానవహోమం', 3. 'దొంగలు', 4. 'దాడి' అనే వాటిని ఒక సంపుటిగా ఆయన మరణానంతరం శారదసాహిత్యవేదిక తెనాలి వారు ప్రచురించారు. చివరిగా ఈ నాలుగు నవలల్లో ఉన్న అంశాల గురించి అతిక్లుప్తంగా తెలుసుకుందాం.

మొదట తానెందుకు నవలల్ని రాస్తున్నదీ అన్నదానికి, విశ్వమోహన్‌రెడ్డి చెప్పిన కారణాన్ని తెలుసుకుందాం. తన 'ఎవరిస్వార్థం వారిదే' నవలకు రాసిన ముందు మాటలో ఇలా రాశాడు. '... పాఠకులకు ఒకనీతి, సత్యం చెప్పడం కోసం సమాజంలో జరిగే కుళ్లూ, కుతంత్రాలూ, మాయలూ, మోసాలూ, వాటిని ఎదిరించేవారిని గురించి కూడా చెప్పాల్సిఉంది' అందుకోసం కేవలం యదార్థ గాథల్ని మాత్రం తాను రాస్తున్నాననీ, ఎట్టి వాస్తవరహిత, అభూతకల్పనలూ రాయబోనని కూడ విశ్వమోహనరెడ్డి ప్రతిజ్ఞ చేశాడు. తన నవలల్లో ఆయన కేవలం పాత్రల పేర్లు మాత్రమే మార్చి రాశాడు. అంతే కాదు, చాలా నవలల్లో పోరాట దృక్పథం కల కథానాయకుడు ఆయనే.

ఆయన మొదటినవల 'మానవహోమం' (1980, మార్చి)ను చూద్దాం. రాయలసీమ ఫాక్షన్‌రాజకీయాల ముఖచిత్రాన్ని మొట్టమొదట ఆవిష్కరించింది ఈ నవలే. అలాగే ఈ నవల 'భోగిమంటలు'గా వెండితెరకెక్కింది. ఫాక్షన్ రాజకీయాలతో తీసిన సినిమాల్లో ఇదే మొదటిది. దీని తర్వాత దజన్లకొద్దీ సినిమాలు ఈ నేపథ్యంతోనే నేటికీ వెలువడుతున్న సంగతి తెలిసిందే. ఇక ఈ నవల 'చతుర'లో అచ్చవడానికి ముందు జరిగిన విషయాన్ని కూడా కొంత చెప్పాలి. ఈ నవల నిండా ముఠా కక్షలూ, హత్యలూ వగైరాలుండడం వల్ల, దీన్ని ఏ పత్రికా ప్రచురించడానికి ఒప్పుకోలేదట. 'చతుర' సంపాదకుడు చలసాని ప్రసాదరావు కూడా ఇదేదో కొత్తరకం డిటెక్టివ్‌లా ఉందని పక్కనపెట్టాడట! అయితే రచయిత ఆయనకో ఉత్తరం రాస్తూ, అందులోని సంఘటనలన్నీ తమ గ్రామాల్లో నిత్యం జరిగేవేననీ, అయినా ఏ సంపాదకుడూ నమ్మడం లేదనీ, దాన్ని వెలుగులోకి తీసుకొచ్చి తమ మారణ సీమను ప్రజల ముందుంచమనీ అభ్యర్థించాట్ట. దాంతో ఆ సంపాదకుడు ఆ ప్రాంతంలోని తమ ఈనాడు విలేఖరినీ, ఒక శాసనసభ్యుణ్ణీ సంప్రదించి, అదంతా నిజమేనని తెలుసుకున్నాక ప్రచురించాట్ట. ఈ నవలను పాఠకులు ఎంతగానో ఆదరించారని ఆ సంపాదకుడే రాశాడు.

ఇక ఈ నవలలోని కథాంశాలు చూద్దాం. పైడిపల్లె గ్రామం పాడిపంటలకే గాక, ముఠా కక్షలకూ ప్రసిద్ధే. ఒక ముఠాకి నాయకుడు చెంచురెడ్డి. రెండోదానికి గురివిరెడ్డి నాయకుడు. ఈ కక్షల వల్ల ఎంతో మంది చనిపోగా, కాళ్లూ చేతులూ పోయిన వారికి లెక్కలేదు. ఈ వైరాన్ని తగ్గించడానికి గురివిరెడ్డి చెల్లెలు అన్నపూర్ణమ్మను చెంచురెడ్డి కిచ్చి చేశారు. రెండు కుటుంబాల మధ్య రాజీ కుదిరినా అది ఎంతో కాలం సాగలేదు. తిరిగి రేగాయి. వాటిని చల్లార్చడానికి తిరిగి రెండు కుటుంబాల వారూ ప్రయత్నిస్తుండగానే, గురివిరెడ్డి మనుషులు చెంచురెడ్డిని హతమార్చడంతో నవల ప్రారంభమవుతుంది.

తీవ్రస్థాయిలో రేగిన ఉద్రిక్తతలను చల్లార్చడానికి మరుసటి రోజు నుంచీ ప్రయత్నాలు జరిగాయి. అందుకు అన్నపూర్ణమ్మ అంగీకరించడంతో, ఆమె పెద్దకొడుకు శ్రీరెడ్డికీ, గురివిరెడ్డి కూతురు పార్వతికీ వివాహం చేశారు. అయితే ఈ రాజీకి శ్రీరెడ్డి మూడో తమ్ముడు 14 ఏళ్ల గోపిరెడ్డి అంగీకరించక ఇంట్లోంచి వేరుపడి తమ ముఠా నాయకత్వం స్వీకరించాడు. అతనికి వంతపాడే వాళ్లు, దళారీలు తోడయ్యారు. గురివిరెడ్డి కొడుకులు గోపిరెడ్డిని చంపించడంతో, శ్రీరెడ్డి రాజీని వీడి నాయకత్వం స్వీకరించి, మామను హత్య చేయించాడు, బలంగా నిర్మించుకున్న గది కింద పేలుడు సామగ్రి పెట్టించి మరీ. కోర్టుకు వెళ్లివస్తున్న శ్రీరెడ్డిని, అతని పెద్దతమ్ముడు రాంరెడ్డినీ, వారి అనుచరుల్ని గురివిరెడ్డి కొడుకులు చంపగా, వారిని శ్రీరెడ్డి అనుచరులు చంపేశారు. ఇరుపక్షాల నాయకులూ చనిపోగా, తిరిగి ఆ గ్రామంలో కక్షలకు దిగకుండా శాంతి నెలకొనడానికి శ్రీ రెడ్డి రెండో తమ్ముడు సురేంద్రరెడ్డికి, పార్వతిచెల్లెలు నాగమణికి వివాహం చెయ్యడానికి, అలాగే శ్రీరెడ్డి కొడుకునూ, గురివిరెడ్డి పెద్దకొడుకు బలరాంరెడ్డి కొడుకునూ ఒకచోట ఉంచి వారు పెంచడానికి ఇరుపక్షాలవారు అంగీకరించారు. అందువల్ల తిరిగి భవిష్యత్తులో కూడా కక్షలు చెలరేగవని రాజీనడిపిన జిల్లా ఎస్.పి. ఆశించాడు. 'ఆ గ్రామం అంతటితోనయినా బాగుపడితే చాల'ని ఆ చుట్టుపక్కల గ్రామాల వారూ, పోలీసులూ ఆశించారట, కోడిపెట్టలకు వెతికే పోలీసులు తప్ప అంటాడు నవలాంతంలో రచయిత.

ఇప్పుడు 'దొంగలు' (1987, మార్చి) అనే నవలను పరిశీలిద్దాం. సమాజంలో ఒక చీకటి కోణం దొంగల బతుకులు. దొంగతనం చెడ్డపనే, చెడ్డపని చేసి, సమాజం చేత ఛీత్కారాలు పొందలాని ఎవరూ కోరుకోరు. ఏ గత్యంతరం లేనప్పుడు దొంగ పని చేసైనా, కడుపు నింపుకోవడానికి చూస్తారు. దొంగతనాలు జరిగే పరిస్థితుల్ని సరిచెయ్యాల్సిన సమాజం, దొంగల్ని సమాజం నుంచి వెలివేసి, పోలీసు వ్యవస్థ ద్వారా వారిపై క్రూరంగా వ్యవహరిస్తుంది. అవినీతి కూపంలో ఇరుక్కుపోయిన పోలీసులు, దొంగతనం మానెయ్యాలనుకున్న వారి క్కూడా సహాయం చేయరు. ఎక్కడ దొంగతనం జరిగినా వారినే ఇరికిస్తారు. తనతో లాలూచీపడిన దొంగలకు అండగా నిలుస్తారు. నిజానికి దొంగతనాలు చేసి బతికేవారు చిన్నదొంగలే. పెద్దదొంగలు పెద్దమనుషులుగా సమాజంలో దర్జాగా తిరుగుతూంటారు. దొంగల కొడుకులు దొంగలేకావాల్సిన పనిలేదు. కాని కొన్ని జాతుల్నీ, కులాల్నీ కూడా ప్రత్యేక సెటిల్‌మెంట్లలో ఉంచి సభ్య సమాజం నుంచి తరిమేసి వారిని తరతరాలుగా దొంగలుగానే బతకమని శాసిస్తుంది. ఈ విషయాలన్నింటినీ శక్తివంతంగా, దొంగల బతుకుల్లో ఉండే వాస్తవిక స్థితిగతుల్ని తెలియజేస్తుంది ఈ నవల. నాగేశ్వరరావు స్టువర్టుపురం సెటిల్మెంటులోని నాలుగు దొంగల ముఠాల్లోని సింగన్నముఠా పెద్ద సింగన్న కొడుకు. సింగన్న దొంగతనాలు మానేశాడు. తన కొడుకు ఆ వృత్తిలో దిగడం ఇష్టం లేక, దూరంగా హాస్టల్లో పెట్టి చదివిస్తున్నాడు. ఉన్నత విద్య చదివే నాగేశ్వరావు తానుండే హాస్టల్‌లో భోజనం సరిగ్గా పెట్టక అవినీతికి పాల్పడే వార్డెన్ మీద కలెక్టర్‌కి ఫిర్యాదు చేశాడు. ఆ కక్షతో వార్డెన్ నాగేశ్వరరావుపై దొంగ సాక్ష్యాలు సృష్టించి, పెద్దల సహాయంతో దొంగతనం కేసులో ఇరికిస్తాడు. నాగేశ్వరావు చెప్పేది వినిపించుకోకుండా పోలీసులు అతణ్ణి దారుణంగా హింసిస్తారు. చెయ్యని తప్పుకి శిక్షింపబడడంతో మనస్తాపం చెందిన నాగేశ్వరావు జైలుకు తీసుకెడుతూంటే తప్పించుకుని, ఇక తాను దొంగగా బతుకక తప్పదని తెలుసుకుని, పోలీసులతో అంట కాగే ప్రసాద్‌తో చేరి దొంగతనాలకు పాల్పడుతూ, తన వాటా వచ్చిన డబ్బుని అవసరంలో ఉన్న పేదలకు సహాయం చేస్తుంటాడు. విలాసంగా జీవించే ప్రసాద్, తన వాటాకి అడిగే నాగేశ్వరావుపై కక్ష పెంచుకుని పోలీసులకు పట్టిస్తాడు. తప్పించుకోవడం కోసం హెడ్డును పొడిచి పారిపోయాడు. నాగేశ్వరావు నాగుగా మారాడు. అతడిపై పోలీసులు కక్షగట్టి చిక్కించుకుని దారుణంగా హింసించారు. చచ్చే పరిస్థితుల్లో ఉన్న అతణ్ణి ఒక రాజకీయనాయకుడి ఒత్తిడితో చికిత్స చేయిస్తారు పోలీసులు. ఆపై జైలు పాలయిన నాగు, జైల్లో వార్డెన్ తిండి సరిగ్గా పెట్టక మోసం చేస్తుంటే, నిలదీసి విజయం సాధిస్తాడు నాగు. విడుదలయ్యాక పెద్దల ఇళ్లలో బ్లాక్ మనీ దొంగిలిస్తూ, ఈలోగా బ్యాంక్‌లో, దేవాలయంలో తన పనికానిచ్చి సంచలనం కలిగించాడు. దాంతో పోలీసులపై ఒత్తిడి పెరిగి, అతన్ని లేపేస్తేనే సరిపోతుందని ప్రణాళిక రూపొందించి, ప్రసాద్ సాయంతో నాగు ప్రియురాలిచేత మత్తుమందు ప్రయోగించి, నాగును చంపేసి, ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారు పోలీసులు.

ఇప్పుడు 'దాడి' (1882, జనవరి) అనే నవలను చూద్దాం. సమాజంలో దళితులే తీవ్రంగా అణగదొక్కబడిన వర్గంగా పేర్కొంటారు. దేశంలోకి కొత్తమతం ఏదొచ్చినా మొదట దాన్ని స్వీకరించేది దళితులే. నేడు రిజర్వేషన్ల ఫలాలు అందుకుని వారిలో గణనీయ సంఖ్యలో ఉన్నత స్థితికి చేరుకున్నారు. నేడు దేశంలో పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా వినబడే మొదటి గొంతు దళితులదేనని చెప్పవచ్చును. కానీ కొండల్లో కోనల్లో తిరిగే గిరిపుత్రులు పూర్వంలా నేటికీ ప్రకృతి దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడిబతుకుతున్నారు. వారూ ఈ దేశ ప్రజలేనన్న స్పృహ పాలకులకుండదు. పాలనా ఫలాలు ఈ గిరిపుత్రులకు అందనే అందవు. కానీ పాలనా విషఫలాలు ఆరగించాల్సినవారు మొదట ఈ జనమేనంటే వారి దౌర్భాగ్యస్థితిని ఊహించుకోవచ్చును. ఆ గిరిపుత్రులకు కర్నూలు జిల్లా పాణ్యం సమీపంలోని ఎర్రకోటలపై నివశించే చెంచులు, సుగాలీలపై చెయ్యని నేరాలకు పోలీసులు సామూహికంగా జరిపిన దౌర్జన్యమే ఈ 'దాడి' నవల సారాంశం. వీరు తిండికి కరువై చిన్న చిన్న దొంగతనాలు చేస్తుంటారు. ఆ మిషతో లోకంలో జరిగే అన్ని దొంగతనాలకూ వీరినే బాధ్యులుగా చేసి, తండాలకు తండాల జనాన్ని తీవ్రంగా అణచివేతకు గురిచేసింది పోలీసు వ్యవస్థ. వారు బాధ్యులు కారని తెలిసినా, తమ అణచివేతలో మార్పు చెయ్యలేదు. వారికి (ఆ చెంచులకు) నాగరిక పాఠాలు చెప్పి మార్గదర్శనం చేసినవాడు వెంకటరెడ్డి. ఆ వెంకటరెడ్డి మరెవరో కాదు, మన రచయితే.

ఇక చివరిగా 'జైలు' (మార్చి, 1987) నవల. జైల్లున్నది నిజానికి ఖైదీలలో నేరప్రవృత్తిని పోగొట్టి, వారి శిక్షాకాలంలో సత్ప్రవర్తన

వ్యాసం

కరచాలనం స్పర్శ కాదు ఆత్మీయ పలకరింపు, ఉత్తేజ ప్రసారం!

- మిడ్కో

క్యాంపు సమీపిస్తున్న ఆనవాళ్లు కనబడ్డంతో మూడుగంటల నడక వల్ల ఏర్పడ్డ అలసట స్థానాన్ని ఉత్సాహం ఆక్రమించసాగింది. ఎందరో పరిచితులూ, స్నేహితులూ, ఆత్మీయులూ, శ్రేయోభిలాషులూ కలుస్తారు కనుక, ప్రతిసారీ కొన్ని కొత్త పరిచయాలు అవుతూ ఉంటాయి కూడా కనుక సహజంగా ఎప్పుడైనా క్యాంపును సమీపించేటప్పుడు ఉండే ఉత్సాహమే అది. ఎప్పుడూ ఉండే ఉత్సాహాన్ని నేనొక సీనియర్ కామ్రేడ్‌ను మొదటిసారి కలవబోతున్నాననే భావన మరింత పెంచింది. పైగా గత కొంత కాలంగా విప్లవోద్యమానికి పెద్ద నష్టాలేమీ జరిగి ఉండలేదు కనుక మనసు ఉల్లాసంగానే ఉంది. కలవబోయే ఆ కామ్రేడ్ గురించి ఏవేవో ఊహలు. తనతో నాకు ముఖాముఖి పరిచయం లేకపోయినా తన గురించి విని ఉన్నాను. విన్న కొంత సమాచారాన్ని బట్టే నాకు ఆ కామ్రేడ్ పట్ల ఏర్పడిన గౌరవమూ అభిమానమూ కూడా నా ఉత్సాహం పెరగడానికి కారణం.

క్యాంపులోకి అడుగుబెట్టగానే మాకు చేతులు కలపడానికి వరసగా నిలబడిన కామ్రేడ్స్ వైపు చూపు సారించాను. అందర్లోకి ప్రత్యేకంగా కనిపించిన కామ్రేడ్‌ను చూడగానే 'నేను కలవాల్సిన కామ్రేడ్ ఇతనే' అనుకున్నా. నన్ను చూస్తూనే ఆ కామ్రేడ్ మొహంలో విచ్చుకున్న పలకరింపుతో కూడిన చిరునవ్వు నేననుకున్న దాన్ని మరింత రూఢీ చేసింది. నన్ను పోల్చుకోవడం తనకేమీ కష్టం కాదు. నేను వస్తున్న విషయం తనకు తెల్సు, మా టీంలో తనకు తెలియని దాన్ని నేనొక్కదాన్నే కూడా. నాతో వచ్చిన కామ్రేడ్సందరితో పాటూ నేనూ ఒక్కొక్కరికీ కరచాలనం చేస్తూ 'లాల్‌సలాం' చెబుతూ ముందుకు నడుస్తున్నా. ఆ సీనియర్ కామ్రేడ్‌కు కరచాలనం చేసే వంతు వచ్చింది. మరింత ఉత్సాహంగా చేయిని ముందుకు చాచాన్నేను. మరుక్షణంలో నా ఉత్సాహం నీరుకారిపోయింది – ఆ కామ్రేడ్ నాకు కరచాలనం చేసిన తీరు ఫలితమది.

అతను చాలా సంకోచంగా, నా చేతిని తాకాలా వద్దా అన్నట్టుగా చేయి చాచాడు. చేతులు కలపడం పూర్తయి కమాండర్ 'లైన్ తోడ్' చెప్పేశాక ఆ కామ్రేడ్ నా వైపు అడుగులేసి నా ప్రయాణ సాధకబాధకాల గురించీ, నాకు తెల్సిన కామ్రేడ్స్ క్షేమసమాచారాల గురించీ వాకబు చేయడం మొదలు పెట్టాడు. అతను నన్ను చూడ్డం మొదటిసారే అయినప్పటికీ, నా గురించి పరోక్షంగా కొంత తెల్సి ఉండడం వల్లనేమో నాతో చనువుగానే మాట్లాడుతున్నాడు. కానీ నాకు మాత్రం మనసులో ఇబ్బంది మెదులుతూ ఉంది. ఆయన అడిగిన ప్రశ్నలకూ, వివరాలకూ యాంత్రికంగా ముక్తసరిగా సమాధానం చెప్తున్నాను గానీ, బుర్రలో మాత్రం 'ఈ కామ్రేడ్ నాకు చేతులు కలపడానికి ఎందుకంత సంకోచించాడు?' అనే ప్రశ్నే

గరపడానికి. కానీ మన జైళ్లు ఆ పని చేస్తున్నాయా? జైలుకొచ్చేది కరుడుగట్టిన నేరస్తులూ, చిల్లర నేరాలు చేసిన వారే కాదు, అసలు ఏ నేరాలూ చెయ్యని అమాయకులూ, నీతిన్యాయాల కోసం పోరాడేవారు, తప్పుడు ఆరోపణలతో దొంగ సాక్ష్యాలతో నేరస్తులుగా ముద్రవేయబడ్డ వారు వస్తారు. ఖైదీలు ఎలాంటి వారైనా, జైలు సిబ్బంది న్యాయబద్ధంగా ఆదర్శప్రాయమైన నడవడికతో ఉండాలి. జైళ్ల గురించి ఎవరు రాసినా, విన్నవో, కన్నవో, ఊహించినవో తప్ప, అనుభవించినవి కావు. కానీ మన రచయిత స్వయంగా పలుమార్లు జైలుశిక్షలు అనుభవించినవాడు గనుక, జైళ్లలోని ఖైదీల దయనీయ పరిస్థితుల్ని, ఖైదీల పట్ల జైలు సిబ్బంది పాటించే రాక్షస పద్ధతుల్నీ కళ్ళకు కట్టినట్లు వాస్తవాల్ని తెలియజేశాడు. పోతాలు రిక్షా కార్మికుడే గాక, రిక్షా కార్మిక నాయకుడు కూడా, రిక్షాల యజమానులు, సిటీ బస్సులు అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడటం వల్ల అక్రమకేసుల్లో ఇరికించబడి జైలు పాలయ్యాడు. అక్కడ జైలు సిబ్బంది సాగించే అణచివేత, అవినీతికి వ్యతిరేకంగా పోరాడడంతో, తీవ్రహింసకు గురయ్యాడు. కొందరు ఖైదీలు చనిపోయారు. ఇక తాము జైల్లో ఉంటే బతకనివ్వరని తెలుసుకొని, కొందరు ఖైదీలతో పాటు సబ్ జైలర్‌ని చంపి, పారిపోతాడు. చాలా మంది పట్టుబడతారు. కొందరు చనిపోతారు. పోతాలు ఎలాగో ప్రాణాలు దక్కించుకుని, స్వేచ్ఛ తన ఒక్కడికే రావడం కుదరదని, అలా ఆలోచించడం తప్పని మొత్తం సమాజం స్వేచ్ఛ కోసం ప్రయత్నించాలని తెలుసుకోవడంతో, ఆ వైపుకి పయనం సాగించడంతో నవల సమాప్తమవుతుంది.

ఈ నవలాసంపుటిలోని నాలుగు నవలల్లో కూడా సమాజానికి అంతగా తెలియని చీకటి కోణాల్ని పరిశీలించి, ఆ వైపుగా వెలుగు రేఖలు ప్రసరింపజేశాడు రచయిత. ఆయన రచనలన్నిటా ఆ కృషే సాగింది. అందువల్ల సాహిత్యాభిరుచి కలవారు ముఖ్యంగా సామాజిక కోణంలో ఆలోచించేవారు ఆయన రచనలను తప్పక చదవాలి. అప్పుడే తెలుగు సాహిత్యాకాశంలో పొటమరించిన వెలుగురేఖల్ని దర్శించ గలుగుతారు.

ఈ నాలుగు నవలల్లోనే కాదు, ఆయన రాసిన మొత్తం నవలల్లో సంఘంలో గల ఎన్నో చీకటి కోణాలు కనిపిస్తాయి. అయితే వాటిల్లో ఎక్కడా రాచకొండలా ఉర్రూతలూగించే వర్ణనలు గానీ, కొ.కు.లా మేధోపరమైన విశ్లేషణలుగానీ ఉండవు. కానీ ఆ చీకటి కోణాలపై ఆయన ప్రసరింపజేసిన వెలుగురేఖల ద్వారా, పాఠకులే అవి అలా ఉండడంలో గల సమంజస్యాన్ని అర్థం చేసుకుంటారు. తన అతి నిరాడంబర శైలి ద్వారా ఆయన ఈ ఘనత సాధించాడు. నిరాడంబరంగా ఉండడానికి ఎంతో సహనం కావాలి. ఎంతో శ్రమిస్తేగానీ సాధించలేని ఈ ఘనతను కొమ్మిరెడ్డి అనాయాసంగా సాధించడమే విశేషం!

మెదులుతూ ఉండింది.

నేను మహిళను కాబట్టా? లేదా ఎవరికైనా తను అలాగే చేతులు కలుపుతాడా? రెండింటిలో ఏదైనా కావచ్చు. నేను ఈ రెండు తరహాల కామ్రేడ్స్‌ను ఇదివరకే చూశాను. కానీ వయసు రీత్యా, అనుభవం రీత్యా, స్థాయిరీత్యా ఎంతో పెద్దవాడైన ఈ కామ్రేడ్ ఈ రెండింట్లో ఏ తరహాకి చెందదమయినా నాకు మింగుడుపడనిదే.

కరచాలనం అనేది ఒక విప్లవ సాంప్రదాయం కదా! దాన్ని పాటించడంలో ఆడా మగా తేడా ఉండవచ్చా? ఉదాసీనత, యాంత్రికత ఉండవచ్చా?

ఈ సందర్భంగా నా మొదటి కరచాలనం గురించి మీకు చెప్పాలనిపిస్తోంది. మొదటి కరచాలనం అంటున్నానంటే అంతకు ముందెప్పుడూ కరచాలనం చెయ్యలేదని కాదు. బడిలోనూ, కళాశాలలోనూ కొన్ని వందల మందితో వేలసార్లు కరచాలనం చేసి ఉంటాను. కానీ కరచాలనం అంటే ఏంటో తెలియజెప్పినది కనుక అది మొదటి కరచాలనంగా నా మనసులో ముద్రించుకుపోయింది. అది ఆదోని పద్మక్క చేసిన కరచాలనం. ఎటువంటి కరచాలనమది? నా అణువణువునా ఒక కొత్త వెలుగునూ, ఉత్తేజాన్నీ నింపిన కరచాలనం.

ఎన్నేళ్ల క్రితపు జ్ఞాపకమది? కానీ ఇప్పటికీ తాజాగా పరిమళాలు వెదజల్లుతూనే...

1993, అక్టోబర్ నెల, మధ్యాహ్నం పూట... నా హాస్టల్ రూం తలుపు మీద టక టక శబ్దం. యాంత్రికంగా తలుపు తీస్తే ఎదురుగా ఒక అపరిచితురాలు. నా కొశ్చెన్ మార్క్ మొహంలోకి సారించిన చూపుల్తో 'మీరు ఫలానా వాళ్ల అమ్మాయా?' అనే ప్రశ్న. మా బాపు కొలీగ్ అయివుండొచ్చు అని మనసులో అనుకుంటూ 'రండి' అంటూ నా ఆహ్వానం.

కుర్చీలో ఆమె... ఎదురుగా బెడ్‌పైన నేనూ... ఏం మాట్లాడాలో తెలియక అయోమయంగా చూస్తున్న నన్ను మరింత అయోమయంలోకి తోసేస్తూ నా చేతిలో మా అన్నయ్య నాకు రాసి పంపిన ఉత్తరాన్ని పెట్టిందామె. దాన్ని చదువుకుంటే అర్థమయింది ఆమె ఎవరో. ఇక ఆ తర్వాత ఆమెతో నేనేం మాట్లాడాలా అని ఆలోచించాల్సిన అవసరం లేకపోయింది. మాట్లాడాల్సినవన్నీ ఆమే మాట్లాడింది. నాతోనూ మాట్లాడించింది. ఆ సాయంత్రం ఆమె నా రూం నుండి బయల్దేరింది - బహుశా ఓ కార్యకర్తను తయారు చేసుకున్నానన్న సంతృప్తితో. సాగనంపడానికి ఆమెతో పాటే అడుగులేసిన నాతో 'మళ్లీ కలుద్దాంరా' అంటూ మా రూం ముంగిట్లో చేసింది ఆ కరచాలనం. నా చేతిని తన ఐదు వేళ్లతో బిగిస్తూ... ఎంత దృఢంగా ఉందో ఆ కరచాలనం- ఆమె విప్లవ దీక్షలాగే. ఆ స్పర్శ నా చేతిని మాత్రమే తాకలేదు, నా అణువణువునూ ఆవరించింది. అప్పటిదాకా ఆమె మాటల ద్వారా పొందిన ఉత్తేజాన్ని, ఆ కరచాలనం రెట్టింపు చేసింది. ఆమె చేతిని అలాగే ఎప్పటికీ వదలకూడదు అన్నట్లుగా పట్టుకొని 'తప్పకుండా కలుద్దాం' అన్నాను. నా నోటి నుండి వెలువడినవి మాటలు కాదు. విప్లవోద్యమం పట్ల నేను ప్రకటించిన కమిట్‌మెంట్ అది. అప్పటి దాకా నాలో రూపుదిద్దుకుంటూ ఉండిన భావం తన కరచాలనంతో ఒక్క గెంతులో బయటకి వచ్చిందనిపించింది.

ఆ తర్వాత తను కల్సిన, విడిపోతున్న ప్రతిసారీ అలాగే అదే ఉత్తేజాన్ని అందిస్తూ కరచాలనం చేసేది. అందుకే పద్మక్క అమరురాలయ్యాక ఆమె మీద నేను రాసిన కవిత, ఆమె కరచాలనాన్ని ప్రస్తావిస్తూనే మొదలవడం యాధృచ్ఛికం కాదు.

నన్ను ఇంతే ఉత్తేజపరిచిన మరో కరచాలనం గురించి కూడా కొంత చెబుతాను. నేను కార్యకర్తను అయ్యాక నాకు కల్సిన మొట్టమొదటి పురుష కామ్రేడ్, రెడ్డప్ప (అసలు పేరు కృష్ణప్ప. ఏపి రాష్ట్ర కమిటీ సెక్రటేరియట్ సభ్యుడిగా పనిచేస్తూ 1996 ఏప్రిల్‌లో అమరుడయ్యాడు). కామ్రేడ్ రెడ్డప్ప ఉన్న షెల్టర్‌కు ఓ సాయంత్రం నన్నొక కామ్రేడ్ తీసికెళ్లింది. ఆమె నాకు తనను పరిచయం చేయగానే నేను రెండు చేతులూ జోడించి 'నమస్కారమండీ' అన్నాను. పద్మక్క తదితర మహిళా కామ్రేడ్స్‌తో కరచాలనం అలవాటే అయినా పురుషులతో కూడా, అందులోనూ వయసులో అంత పెద్దవాళ్లతో కరచాలనం చేస్తారని ఆనాటికి నాకు తెలియదు. మేం ఆ రూంకి వెళ్లిన కొద్ది సేపటికి పద్మక్క వచ్చింది. నాకు అన్నను పరిచయం చేసిన కామ్రేడ్ 'ఈ అమ్మాయి అన్నకు చేయి కలుపలేదు, చేతులు జోడించి నమస్కారం చేసింది తెల్సా' అంటూ పద్మక్కకు కంప్లైంట్ చేసింది. పద్మక్క నాకేసి నొచ్చుకున్నట్టుగా చూస్తూ 'ఏరా అన్నకు చేయి కలపలేదూ' అంది. నేను బిక్కమొహం వేసుకొని 'నాకేం తెల్సు చేతులు కలుపాలనీ' అన్నాను. వెంటనే పద్మక్కకు కంప్లైంట్ చేసిన కామ్రేడ్ 'ఈ అమ్మాయి తెలియక కలుపలేదు సరే, అన్న కూడా... తను చేయి చాచబోయాడు ఈ అమ్మాయి టక్కుమని చేతులు జోడించేప్పటికి తను చేయి వెనక్కి తీసుకున్నాడు. తనైనా కలుపాలి కదా' అంది. దానికి పద్మక్క 'అలా కాదురా... ఎదుటి కామ్రేడ్స్‌కు చేతులు కలపాలి అనే తపన మొదట మన నుండే ఉండాలి' అంది. నేను చేయి కలుపలేదని ఆ అమ్మాయి చేసిన కంప్లైంటూ, నొచ్చుకున్నట్టుగా అక్క చూసిన చూపూ, కరచాలనం చెయ్యాలనే తపన మననుండే ఉండాలన్న తన మాటలూ కరచాలనపు ప్రాధాన్యతను నాకు అర్థం చేయించాయి.

ఇక ఆ రాత్రంతా మా సమావేశం నడిచింది. నేను ఉదయాన్నే లేచి ఆ రూం నుంచి బయల్దేరుతుండగా అన్నే మొదట నాకు కరచాలనం చేసి 'జాగ్రత్తగా వెళ్లు... బాగా పనిచేయాలి మరి... పుస్తకాలు బాగా చదువు' అన్నాడు. ఆ కరచాలనం కూడా నాకెంత ఉత్తేజాన్నిచ్చిందో! కామ్రేడ్‌షిప్‌కి అర్థాన్ని తెలియజెప్పిందది. అంత పెద్దాయన నన్ను సమ ఉజ్జీగా గౌరవిస్తున్నట్టు అన్పించింది.

కృష్ణన్న కరచాలనమూ అంతే... తనైతే కరచాలనంతోనే సరిపెట్టకుండా, మరోచేయిని తల మీద వేసి 'ఏరా బాగేనా?' అనేవాడు. (కృష్ణన్న కరచాలనం, పలకరింపూ, ఆత్మీయతా గుర్తొచ్చినప్పుడల్లా తనను జీవితంలో ఒక్కసారన్నా కలువని వాళ్లు ఎంత కోల్పోయారో అన్పిస్తుంటుంది ఎప్పుడూ.)

బి.కె.తో ఒకసారి చేసిన కరచాలనం కూడా ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఎప్పుడూ తన కరచాలనం ఆత్మీయంగానే ఉండేది. ఆసారి మాత్రం మరింతగా. అది నేను మానసికంగా చాలా కలత చెంది ఉన్న సమయం. నేనున్న క్యాంపుకు బి.కె. వచ్చాడు. ఏదో పనిలో ఉన్న నేను విజిల్ కాషన్ విని అందరితో పాటు వెళ్లి చేతులు కలుపలేక పోయాను. కొద్దిగా ఆలస్యంగా వెళ్లేప్పటికి తను టెంట్‌లో కూర్చొని ఉన్నాడు. నన్ను చూస్తూనే టెంట్లోంచి బయటకు వచ్చి చిరునవ్వుతో చేయి కలిపి, వెంటనే వదలకుండా, అలాగే నా చేయిని

పట్టుకొని, నా ముఖంలోకి పరిశీలనగా చూస్తూ 'ఎట్లున్నావు?' అన్నాడు.

నాకు ఆ కరచాలనం ఎంత ఊరటనిచ్చిందంటే అది ఒక వ్యక్తి చేసిన కరచాలనంగా అనిపించలేదు. మొత్తంగా పార్టీ చేసిన కరచాలనంగా అన్పించింది. 'సమస్త పార్టీ నీకు అండగా ఉంద'ని భరోసా ఇచ్చినట్టనిపించింది.

ఇలా చెప్పుకుంటే పోతే పలకరింపునూ, పరామర్శనూ, ఆత్మీయతనూ, సాంత్వననూ అందించిన కరచాలనాలెన్నో.

ఇటువంటి ఆత్మీయ కరచాలనాల మధ్య చాలా అరుదుగానే అయినా కొన్ని నిరుత్సాహం కలిగించిన కరచాలనాలూ ఉన్నాయి. కొందరు పురుష కామ్రేడ్స్ సంకోచంగా చెయ్యాలా వద్దా అన్నట్టుగా కరచాలనం చేసినప్పుడల్లా ఇబ్బందిగా అన్పిస్తుంది. ఒక్కోసారి బాధగా కూడా అన్పిస్తుంది. వీళ్లకు నేను ఒక కామ్రేడ్‌గా కాక ఒక మహిళగానే ఎందుకు కనబడుతున్నాను అనిపిస్తూంటుంది.

ఇలా అన్పించిన మరొక సంఘటనను చెప్తాను. ఈస్ట్ రీజియన్ ఎపిలో భాగంగా ఉన్న సమయమది. రీజినల్ కాన్ఫరెన్స్ జరుగుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సాహితీ సాంస్కృతిక వేదికలో నేనూ సభ్యురాల్ని. ఆ వేదిక ఆధ్వర్యంలో రోజూ సాయంత్రం గంటసేపు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. అందులో భాగంగా ఒకరోజు ఒకాయన (ప్రస్తుతం 'కామ్రేడ్' అనిపించుకునే అర్హతను కోల్పోయాడతను) దారకొండ అమరుడు కామ్రేడ్ శ్రీధర్ గురించి ఒక కవితను రాసి, స్వయంగా చదివాడు. ఆ కవిత నాకు చాలా నచ్చింది. అప్పటికి అతను నాకు పెద్దగా పరిచయం లేకపోయినా అభినందించాలనిపించింది. అతను కవిత చదివి వేదిక పైనుండి పక్కకు రాగానే నేను దగ్గరకు వెళ్లి 'చాలా బాగుంది' అంటూ కరచాలనం చెయ్యడానికి చేయి చాచాను. బదులుగా అతను చేయి చాచలేదు. ఇబ్బందిగా సంకోచంగా చూస్తూ ఉండిపోయాడు. అప్పుడు పక్కనే ఉన్న ఒక సిసి కామ్రేడ్ 'అరె ఆ కామ్రేడ్ అభినందిస్తూ చేయి కలుపుతుంటే నువ్వు కలుపవేంటీ... కలుపు' అన్నాడు. కానీ ఆ తర్వాత అతనికి నేను ఆ అవకాశం ఇవ్వలేదు. ఆ ఆలోచనను విరమించుకుని చేయి వెనక్కి తీసేసుకున్నా, నేను ఒక కామ్రేడ్‌కు చేయి కలపాలనుకున్నానే గానీ నన్ను మహిళగానే చూస్తోన్న ఒక పురుషుడికి కాదుగా. ఆ తర్వాత ఆయన ఎప్పుడు కల్సినా చాలా సంకోచంగానే చేయి కలిపేవాడు.

ఇలా ఎదుటి కామ్రేడ్స్ సంకోచంగా చేతులు కల్పినప్పుడు ఫీలయ్యేది నేనొక్కదాన్నేనా? అందరూ ఇలాగే ఫీలవుతారా? అనే నా సందేహం తీరడానికి ఎక్కువ కాలం ఏమీ పట్టలేదు. కొందరు కామ్రేడ్స్ తమతో సంకోచంగా చేతులు కలుపుతారనీ, అలా కలిపినప్పుడు చాలా ఇబ్బందిగా, అవమానంగా కూడా అన్పిస్తుందని తోటి మహిళా కామ్రేడ్స్ పలువురు నాతో పంచుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి.

మహిళలు పురుషులతోనైనా, పురుషులు మహిళలతోనైనా కరచాలనం చెయ్యడానికి ఎందుకు సంకోచం ఉండాలి? కరచాలనం అనేదాన్ని మనం విప్లవ సాంప్రదాయంగా ఎందుకు ఎంచుకున్నాం? కరచాలనం అనేది ఒక పలకరింపు, ఒక పరామర్శ... అంతకు మించి అది పరస్పరం ఉత్తేజాన్ని, ప్రేరణను అందించుకోవడం. అంత స్ఫూర్తిదాయకమైన సాంప్రదాయాన్ని పాటించడంలో స్త్రీలు, పురుషులు అనే తేడా ఉండవచ్చా? స్త్రీ పురుషులు నిస్సంకోచంగా కరచాలనం చేసుకోవడం తప్పు అనే భావన ఏమైనా కొందరిలో పని చేస్తున్నదా అనిపిస్తుంది వాళ్లు కరచాలనం చేసే తీరు చూస్తే. అసలీ విషయాన్ని గురించి ఇంతగా ఆలోచించడం, చర్చించడం, రాయడం, కొన్ని కాయితాలను ఖర్చు చేయడం అవసరమా అని కొందరికి అనిపించవచ్చు. కానీ నేను మాత్రం మళ్లీ మళ్లీ బాధ పడాల్సిన అవకాశం నుండి నన్ను నేను రక్షించుకోవడానికి, నాలాంటి మరి కొందరిని రక్షించడానికి ఇది రాయడం అవసరమే అనిపిస్తుంది. సంకోచంగా, చెయ్యాలా వద్దా అన్నట్టుగా కరచాలనం చేసే వాళ్లతో ఏదో ఒకసారి చేసేశాం, బాధపడ్డాం అని సరిపెట్టుకోలేంగా. వాళ్లతో మళ్లీ మళ్లీ చేయాల్సిన సందర్భాలు వస్తూనే ఉంటాయి. అలా చేయాల్సి వచ్చినప్పుడల్లా వీళ్లకెలా చేయాలి అనే ఘర్షణ ఉంటుంది. వాళ్లలాగే నేను కూడా చాచీ చాచనట్టు చేయి చాచితే కేవలం నా మునివేళ్లతో వాళ్ల మునివేళ్లను తాకడమే అవుతుంది గానీ అది కరచాలనం అనిపించుకోదు. లేదా వాళ్లెలా ఉంటే నాకేంటీ అందరికీ చేసినట్టుగానే నా తరహాలో నేను నా ఐదు వేళ్లను ఉపయోగించి చేద్దామనుకుంటే మనసులో అంత సంకోచం ఉన్న వాళ్లు నా కరచాలన తీరును ఎలా అర్థం చేసుకుంటారో అని ఘర్షణ పడుతుంటాను. వాళ్లెలా చేస్తారో తెలియకపోతే ఈ ఘర్షణేం ఉండదు గానీ ముందే తెల్సినపుడు మాత్రం ఈ ఘర్షణ తప్పనిసరిగా ఉంటుంది. కామ్రేడ్స్ లేదా నాయకులు కల్సినప్పుడు మనకు మనసులో ఎంత సంతోషంగా ఉండాలి? ఎందుకంటే మనకు ప్రతి కలయిక ఒక అద్భుతమే. ఎందరో కామ్రేడ్స్ ఇలా చేతులు కలిపి, అలా ఇంకెన్నడూ కలవనంత దూరం వెళ్లిపోతున్న కఠిన పరిస్థితుల్లో బతుకుతున్న మనకు, ఒకసారి విడిపోయిన కామ్రేడ్స్ మళ్లీ కలవడం ఎంత సంతోషకరమైన సందర్భం. అటువంటి సందర్భంలో ఇటువంటి అనవసర ఘర్షణ పడాల్సి రావడం బాధాకరం కాదా?

నేను స్త్రీ పురుషుల మధ్య సంకోచకరమైన కరచాలనాల గురించే మాట్లాడాను. మరి పురుషులతో పురుషులూ, స్త్రీలతో స్త్రీలూ అంటీ ముట్టనట్టుగా కరచాలనం చేస్తే? పురుషులతో పురుషులూ, మహిళలతో మహిళలూ కరచాలనం చేయడానికి సంకోచాలయితే ఉండనక్కర్లేదు కదా. అయినా అలా చేస్తున్నారంటే వాళ్లకు కరచాలనపు స్ఫూర్తి పట్ల విశ్వాసం లేదని అయినా అనుకోవాలి. లేదా కరచాలనం చేస్తున్న ఎదుటి కామ్రేడ్స్ పట్ల కామ్రేడ్లీ భావన, గౌరవమూ లేదని అయినా అనుకోవాలి. కరచాలనం చేసే తీరును బట్టి మనుషుల సైకాలజీ విశ్లేషించవచ్చనే వాదనలు ఉన్నాయి. అలా వచ్చిన పలు విశ్లేషణలూ ఉన్నాయి. అయితే వాటిలో శాస్త్రీయత పాలు ఎంత అనేది నేను చెప్పలేను గానీ, ఎవరికైనా నిస్సంకోచంగా కరచాలనం చేయాలంటే మానసిక పరిపక్వత, నిర్మలమైన మనసు, కరచాలనం చెయ్యవలసిన వారి పట్ల కామ్రేడ్లీ భావన, గౌరవం, సమదృష్టి తప్పక ఉండాలి. ఇవి లోపించినప్పుడు కరచాలనంలో సంకోచమూ, ఉదాసీనతా, యాంత్రికతా చోటు చేసుకుంటాయనిపిస్తుంది.

కరచాలనమే కాదు క్రిష్ణన్న, బి.కె.లతో ఎప్పుడు ప్రయాణం చేసినా ఫార్మేషన్‌లో వాళ్ల వెనక ఉన్నప్పుడు కొండలు ఎక్కుతున్నప్పుడో, కాలువలు దాటుతున్నప్పుడో ఎక్కడైనా కష్టంగా ఉన్న చోట ఆగి,

రిపోర్టు

ఆదివాసీలపై విరసం సభ

దండకారణ్యంలో జరుగుతూ ఉన్న ఆదివాసీ పోరాటాలకు మద్దతుగా విరసం గుంటూరు యూనిట్ జూలై 5, 2012న సభ నిర్వహించింది. ఈ సభలో కార్యదర్శి కా. వరలక్ష్మి 'ఆదివాసీ ప్రాంతాలలో వనరుల దోపిడి' అనే అంశంపై ప్రసంగించారు. ఆమె తన ప్రసంగంలో ప్రపంచవ్యాప్తంగా 'నాగరికమనుకున్న దేశాలు, జాతులు వెనుకబడిన ప్రాంతాలలో నివసించే ప్రజా సముదాయాలను, జాతులను పరమ పాశవికంగా అణచివేసి, ఆయా ప్రాంతాలలో ఉన్న విలువైన వనరులను సంపదను దోచుకొని, తమ దేశాలను అభివృద్ధి చేసిన వైనాన్ని చారిత్రకంగా సోదాహరణంగా వివరించారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక సంపద అంతా పేద దేశాలలోని వనరుల దోపిడీ మూలంగానే పెరిగిందని, తమ భవిష్యత్ అవసరాల కోసం, తమ వనరులను కాపాడుకుంటూ, ఇతర దేశాల వనరులను, సంపదను విధ్వంసం చేయడం సామ్రాజ్యవాదుల స్వభావమని కా. వరలక్ష్మి వివరించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ తదనంతర కాలంలో భారత పాలక వర్గాలు బహుళ జాతి కంపెనీలకు ఈ దేశ వనరులను దోపిడీ చేసుకోవడానికి అవసరమైన లైసెన్సులను మంజూరు చేశాయని, స్థానిక దళారీ పెట్టుబడిదారీ వర్గం ఆ బహుళ జాతి సంస్థలతో కుమ్మక్కయి ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న లక్షల కోట్ల విలువైన సహజ సంపదను చేజిక్కుంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ఆమె వివరించారు. ఆ కుటిల యత్నాల కారణంగా ఆదివాసీల జీవితాలలో జరుగుతూ ఉన్న విధ్వంసాన్ని వరలక్ష్మి సభకు తెలియజేశారు. అక్కడ ఆదివాసీలు జరుపుతున్న పోరాటాలు కేవలం తమ అవసరాలను కాపాడుకోవడం కోసం మాత్రమే కాదని, అవి ఈ దేశంలోని సామాన్య ప్రజలందరి ప్రయోజనాలను రక్షించే లక్ష్యంతో జరుగుతున్నవని అంటూ అటువంటి దండకారణ్య ఉద్యమానికి మద్దతు తెలపడం అందరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు.

విరసం కార్యవర్గ సభ్యుడు కా. పాణి 'ఆదివాసీ పోరాటాలు-రాజ్య నిర్బంధం' అనే అంశంపై ప్రసంగిస్తూ వలస పాలన నాటి నుండి నేటి వరకు జరిగిన ఆదివాసుల పోరాటాలను ప్రస్తావించారు. ఈ రోజు దండకారణ్యంలో జరుగుతూ ఉన్న ఆదివాసుల పోరాటం గత పోరాటాల కంటే గుణాత్మకంగా భిన్నమైందని, ఇది కేవలం జంగిల్, జమీన్‌లపై ఆధిపత్యం కోసం మాత్రమే జరుగుతున్న పోరాటం కాదని, అంతకంటే లోతైన,

---

అలవోకగా చెయ్యందించేవారు. (ఇంకెవరూ అందించలేదని కాదు అందించారు, అందిస్తున్నారు కూడా. ఇక్కడ అందరి ప్రస్తావన తేవడం లేదు) అలా అందించడం ఒక చేయూతగానే కాదు, మన సాధకబాధకాలను గురించి నాయకత్వం శ్రద్ధగా పట్టించుకుంటుందనే భావన ఎంత భద్రతనిస్తుంది? వీళ్లిలా చేయూతనివ్వడం గురించి నాతో మరి కొందరు మహిళా కామ్రేడ్స్ పంచుకున్నప్పుడు వాళ్ల గొంతుల్లో ధ్వనించిన కృతజ్ఞతను బట్టి కూడా నాకర్థమైంది, ఆ చిన్న చేయూత ఎంత విలువైన ఊతాన్నిస్తుందో. బి.కె.కు ఇద్దరు గార్డ్‌లను నియమించాక తన వెనుక ఛూటే నడిచేవాడు. ఇక ఆ సమయంలో అతని వెనక నాలాంటి వాళ్లు ఎవరు నడిచినా ఆ చేయూతను ఛూటే అందించేవాడు. బహుశా అలా అందించాలనే ఆదేశాన్ని అతను బికె నుండి ఒకసారి అందుకుని ఉంటాడు. కానీ ఇక అవసరమైన ప్రతిసారీ తను ఆగి ముసిముసి నవ్వులను పంచుతూ మాకు చెయ్యి అందిస్తూ ఉండేవాడు. ఒక్కోసారి అలా అందించడం కోసం నెమ్మదిగా నడుస్తున్న మా కోసం అతను ఒకటి, రెండు నిమిషాలు నిలబడాల్సి కూడా వచ్చేది. మాకు చెయ్యందించి మళ్లీ పరుగు పరుగున వెళ్లి బి.కె.ను అందుకునేవాడు. అలసటతో, ఆయాసంతో చెమటలు కక్కుతూ కొండలెక్కుతున్నప్పుడు అందించే ఆ చేయూత, పంచే ఆ చిరునవ్వు ఎంత అమూల్యమైనవో!

ఈ అమూల్యమైన, సాంత్వన పూరిత సంగతులు గుర్తుకొస్తున్న సందర్భంలో ఓ చేదు అనుభవం కూడా గుర్తుకొస్తోంది.

నేను మొదటిసారి ఈస్ట్ డివిజన్‌కు వెళ్లిన సమయమది. ఓసారి చాలా వేగంగా నడుం లోతు దాటి ప్రవహిస్తున్న వాగును దాటవల్సివచ్చింది. నాకు ఎవరి చెయ్యయినా పట్టుకోవడం అవసరమనిపించింది. అప్పుడు నాతో పాటే ఉన్న మహిళా కామ్రేడ్స్ అందరూ చిన్నవాళ్లు. ఒకవేళ నేను కొట్టుకుపోతే వీళ్లు పట్టుకోగలరా అనే అనుమానం వచ్చింది. అందుకే పొడుగ్గా, దృఢంగా ఉన్న ఒక కామ్రేడ్‌తో 'అన్నా, నేను నీ చేయి పట్టుకుంటా' అన్నాను. దానికి ఆయన ఎలా మొహం పెట్టాడంటే - దాన్ని వర్ణించడానికి సరైన పదాలు దొరకడం కష్టం. ఒక ఆపద నుండి నన్ను నేను రక్షించుకోవడానికి సాయమడిగితే, మరో ఆలోచన లేకుండా నాకు సాయం అందించాల్సిన ఆ కామ్రేడ్‌కు ఆ క్షణాన నేను సాటి కామ్రేడ్‌లా కాక ఒక మహిళగానే ఎందుకు తోచాను? నా మనసు ఎంతగా గాయపడిందంటే, అలా ఇబ్బందిగా పెట్టిన మొహంతోనే అతను నాకు తన చేయిని అందించబోయాడు గానీ నాకు ఇక కొనగోటితో కూడా ఆ కామ్రేడ్ చేయిని తాకబుద్ధి కాలేదు.

ఇటువంటి సంకోచాలు స్త్రీ, పురుష సంబంధాల పట్ల మనలో ఉన్న అశాస్త్రీయ భావజాలాన్నీ, భూస్వామ్య దృక్పథాన్నీ తెలియజేస్తాయి. వీటిని వదిలించుకోకుండా ఉన్నతమైన స్త్రీ పురుష సంబంధాలను నెలకొల్పడం సాధ్యం కాదు. సమాజంలో ఉన్నత విలువల్ని ఆవిష్కరించే కృషిలో నిమగ్నమై ఉన్న మనలో ప్రతి ఒక్కరం మన 'కరచాలనం' నిస్సంకోచంగా, హృదయపూర్వకంగా, కామ్రేడ్లీ ఆప్యాయత వ్యక్తమయ్యేలా ఉండేలా చూసుకోవల్సి ఉంది.

విరసం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సదస్సు

విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7వ తేది 2012న బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గం. వరకు నెల్లూరులోని టౌన్‌హాల్‌లో విరసం సదస్సు జరిగింది. ఈ సదస్సులో విప్లవోద్యమం - నూతన నిర్బంధ రూపాలు అనే అంశంపై కా. పాణి, పాట - ప్రజలు - ఉద్యమాలు అనే అంశంపై కా. కాశీంలు ప్రసగించారు. కా. వి. చెంచయ్య అధ్యక్షత వహించారు. కా. గంటి ప్రసాదం (అమరుల బంధు మిత్రుల సంఘం) ఈ సదస్సులో పాల్గొన్నారు.

విప్లవోద్యమం - నూతన నిర్బంధ రూపాలు అనే అంశంపై కా. పాణి మాట్లాడుతూ విప్లవోద్యమంపై నూతన నిర్బంధ రూపాలంటే ఇప్పుడు ఆపరేషన్‌గ్రీన్‌హంట్ అనే అర్థం అని అన్నారు. లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ అనే యుద్ధతంత్రం గురించి మాట్లాడుకోవడమే. ఇది గత నలభై ఏళ్ళుగా మనం విశ్లేషిస్తూ వచ్చిన ప్రజా ఉద్యమాలపై అణచివేత వంటిది కాదు. ఏకంగా భారత ప్రభుత్వం మూడేళ్ళుగా ఈ దేశ ప్రజలపై చేస్తున్న యుద్ధం. ఇంతకాలం అమలు చేస్తూ వచ్చిన నిర్బంధాల చరిత్రలో భాగంగా ఈ యుద్ధం మన ముందుకు వచ్చింది కాబట్టి, ఈ పూర్వ రంగం తీవ్రమవుతూ విరుచుకపడింది కాబట్టి దాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన నిర్బంధరూపమని అనవచ్చు.

అయినా గత నిర్బంధ రూపాలకూ ఈ యుద్ధానికీ గుణాత్మకంగానే తేడా ఉన్నదని గుర్తించాలి. ఈ దేశ ప్రజలు దశాబ్దాలుగా నిర్మిస్తున్న విప్లవోద్యమాలు అనేక నిర్బంధరూపాలను అధిగమించి పురోగమిస్తున్న నేపథ్యంలో పాలకవర్గాలు ఏకంగా ఈ యుద్ధం చేస్తున్నాయి. కాబట్టి ఇప్పుడు నిర్బంధం గురించి మాట్లాడడమంటే నేరుగా అన్ని రకాల భాషా పరదాలను దాటుకొని యుద్ధం గురించి మాట్లాడడమే.

విప్లవ రచయితలు ప్రజాయుద్ధం గురించి నలభై ఏళ్ళుగా కవిత్వం రాస్తూ వచ్చారు. ఇప్పటికా కవిత్వం, గానం వాస్తవ రూపం దాల్చాయి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహం ఈ నేల మీద నిజమైంది. ప్రజా సైన్యం దేశాన్ని విముక్తం చేస్తుందని లాంగ్‌మార్చ్ కథల్లో చదువుకున్నవాళ్ళు... చైనా పల్లెసీమల్లో, పర్వత సానువుల్లో కదంతొక్కిన విప్లవ గెరిల్లాల అడుగుజాడలను ఇప్పుడు దండకారణ్యంలో పోల్చుకుంటున్నారు. భారత ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మొదలు పెట్టిన యుద్ధం రెండోదశకు చేరుకున్నది.

ఇవాళ యుద్ధం మీద మాట్లాడుకొనేటప్పుడు శత్రు వర్గం చేస్తున్న దుర్మార్గం గురించేగాక ప్రతి యుద్ధంలో, ప్రజా యుద్ధంలో సాధిస్తున్న అపూర్వ విజయాల గురించి కూడా మాట్లాడుకోవాల్సిందే. ఇది ప్రభుత్వం యుద్ధానికి దిగిందని జనదీనాలాపాన్ని వినిపించాల్సిన సందర్భం కాదు. అది నిజం కూడా కాదు. ఎందుకంటే ఇప్పటికి మూడేళ్ళుగా దండకారణ్య ఆదివాసులు వీరోచితంగా ప్రతిఘటించి ప్రజాయుద్ధమంటే ఎలా ఉంటుందో పాలకులకు రుచి చూపిస్తున్నారు.

అందువల్ల ఈ సమయంలో విరసం తప్పనిసరిగా రెండు విషయాలను విస్తృతంగా ప్రచారం చేయవలసి ఉంది. ఒకటి : యుద్ధం - ప్రజా యుద్ధం గురించి, రెండు : ఆదివాసీ ప్రాంతంలో పెట్టుబడి విధ్వంసం - ప్రజా ప్రత్యామ్నాయ నిర్మాణం అంటే ఒక్కమాటలో చెప్పాలంటే యుద్ధం గురించి, నిర్మాణం గురించీ కలిసి మాట్లాడాల్సిన సందర్భం ఇది. ఈ రెంటిలో దేని ప్రాధాన్యత తగ్గినా దండకారణ్యంలో రూపొందుతున్న అద్భుత దృశ్యానికి ఉన్న రెండు పార్శ్వాలను సరిగా ఎత్తి చూపడంలో విఫలమైనట్టే. ఇది ఇవ్వాల్టి వాస్తవ దృశ్యమే కాదు... భవిష్యత్తులోకి విస్తరించగల చారిత్రక గుణం దీనికి ఉన్నది. సంఘర్షణ, ప్రయోగం అనే రెంటికి ఇవాళ దండకారణ్యం స్థావరం అయింది. యుద్ధం జరుగుతున్నచోటనే నిర్మాణం జరగడం అనేది దండకారణ్య విప్లవంలోని అనివార్యమైన ప్రత్యేకతగా ముందుకు వచ్చింది. దాన్ని దానిగా గుర్తించి శక్తి మేరకు విశ్లేషించాల్సిందే.

ఇప్పటికే విప్లవమంటే విధ్వంసమని, రక్తపాతమని నమ్ముతున్నవాళ్ళు మన మధ్యనే ఉన్నారు. విప్లవోద్యమం ఈ యుద్ధం

విశాలమైన లక్ష్యం దీనికుందని అన్నారు. అత్యంత విశాలమైన ఆ బస్తరు ప్రాంతంలో ఒక ప్రత్యామ్నాయ, నిజమైన ప్రజాస్వామ్యాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఆదివాసీల జీవితాలలోనేగాక వారి ఆలోచనలలో కూడా మౌలికమైన మార్పు తీసుకవచ్చే పోరాట కోణాన్ని ఆయన ఆవిష్కరించారు. జనతన సర్కారు పేరుతో తమ ఆర్థిక రక్షణ, సాంఘిక, సాహిత్య, సాంస్కృతిక అవసరాలను తీర్చుకునే దిశగా, ఆదివాసుల సమిష్టి జీవన సంస్కృతిలోని మంచిని ప్రోది చేస్తూ అదే సమయంలో తెగ పెద్దల దాష్టీకాన్నీ, ఆదివాసీల ఆలోచనలలోని వెనుకబాటు తనాన్ని తొలగించడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన వివరించారు. పాలక వర్గాల చుట్టిముట్టి-ఏరివేత వ్యూహాన్ని భగ్నం చేయడం కోసం తమ ఆహార భద్రతను పెంచుకుంటూ, స్థానిక వనరులకు ప్రమాదం కలగకుండా ప్రకృతితో సహజీవనం చేయడానికి దండకారణ్య ఉద్యమం తీసుకుంటున్న చర్యలను ఆయన సభకు వివరించారు. ఒక బలమైన నూతన రాజకీయ ఆర్థిక సాంఘిక సాంస్కృతిక వ్యవస్థ నిర్మాణం దిశగా సాగుతున్నది కాబట్టే, ఆ ఉద్యమాన్ని తుద ముట్టించడానికి భారత పాలక వర్గాలు సామ్రాజ్యవాదుల కనుసన్నలలో ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయని, దానికి వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రజలందరి కర్తవ్యమని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభకు కా. సి.ఎస్.ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు.

☆

మధ్యనే నూతన వ్యవస్థలను నిర్మిస్తోంది. కాబట్టి ఈ యుద్ధం గురించేగాక, దండకారణ్యంలోని నిర్మాణం గురించి కూడా ఈ రోజు మాట్లాడుకోవాలి.

యుద్ధశాస్త్రం ప్రకారం లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ అనేదాన్ని ప్రపంచం మీద తన ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి అమెరికా చాలా దేశాల్లో అమలు చేసింది. 1930లలో నికారుగువాలో, 1946లో గ్రీస్ తదితర దేశాల్లో దీన్ని అమలు చేసింది. సిఐఎ పారా మిలటరీ యాక్షన్ల ద్వారా మధ్య ప్రాచ్యంలో, దక్షిణా ఆసియాలో, లాటిన్ అమెరికా దేశాల్లో అనేక దుర్మార్గాలకు పాల్పడింది. యుద్ధశాస్త్రం ప్రకారం హై ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్, మీడియం ఇన్‌టెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్, లో ఇన్‌టెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ అనే మూడు రకాల యుద్ధతంత్రాలను అమెరికా అమలు చేస్తూ వచ్చింది. ఇప్పుడు భారత ప్రభుత్వం ఈ మూడో రకాన్ని మధ్య, తూర్పు భారత దేశాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో అమలు చేస్తోంది.

ఎస్ఐసిలో నిర్దిష్టమైన వ్యూహం, ఎత్తుగడలు ఉన్నాయి. సైనిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, మానసిక రంగాలను సమన్వయం చేస్తూ యుద్ధాన్ని నడిపే వ్యూహం ఇందులో ఉంది. అంతేగాదు, కేవలం యుద్ధమేగాక ప్రజల మనసులను గెలుచుకోవడం, ఇంటెలిజెన్స్‌ను వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించుకోవడం, ప్రత్యేక బలగాలను కేటాయించడం అనే వ్యూహం ఈ యుద్ధ తంత్రంలోఉంది. దీని ప్రకారం దీర్ఘకాలిక యుద్ధాన్ని నడపడానికి రాజకీయ, ఆర్గనైజేషనల్, సైనిక ఎత్తుగడలు ఉన్నాయి.

చాలా విచిత్రంగా అప్పట్లో శ్రీకాకుళ పోరాటంపట్ల ప్రతికూల వైఖరి తీసుకున్నవాళ్ళు తమ అభిప్రాయాలను ప్రచారం చేయడానికి క్రియాశీలంగా పని చేశారు. అట్లా ఉంటే చూడ్డానికైనా ముచ్చటగా ఉంటుంది. కానీ గ్రీన్‌హంట్ విషయంలో మాత్రం ఈ మూడేళ్ళుగా తెలుగు రచయితలు, కవులు, కళాకారులు ఒక రకమైన మౌనం దాపున నెట్టుకొస్తున్నారు. తమ కళ్ళ ముందు ఏమీ జరగనట్టు, అంతా ప్రశాంతంగానే ఉన్నట్లు అయోమయ కవిత్వాన్ని వల్లిస్తున్నారు.

తెలుగు మేధో, సృజన లోకం గొడ్డుపోతోందని ఈ యుద్ధ కాలంలో చెప్పవలసి రావడం ఎంత విషాదం! నాలుగు గొంతులు కలిస్తేగాని ఒకమాట బైటికి వినిపించని ఈ కాలంలో ఈ మాట ఇప్పటికీ చెప్పకుండా ఎంతకాలం ఉత్తుత్తి ఆలింగనాలతో బతికేస్తాం. పరమ వైభవోజ్వల దినాలూ ఇవే.. నికృష్టపు రోజులూ ఇవే..! ఇవిగాక మరేమవుతాయి? ఉప ఖండపు ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం ఆదివాసులు దారుణమైన యుద్ధంలో తలమునకలై ఉంటే ఏమిటీ మేధో ప్రపంచపు మౌనం? ఇది దేనికి అర్థం? ఒకపక్క భారత ప్రజల చరిత్రలో కనీవినీ ఎరుగని పోరాటమూ, నిర్మాణమూ; మరోపక్క సాహిత్యకారులు, ఆలోచనాపరుల భరించరాని మౌనం మరోపక్క. ఎంత అసంబద్ధమైన బీభత్స దృశ్యం ఇది!

ఈ యుద్ధంలో మనలాంటి వాళ్ళ పాత్ర ఏమిటో తేలుతుంది. వివిధ ప్రజా ఉద్యమ సంస్థలు, మేధావులు, వ్యక్తులు తామేమి చేయాలో నిర్ణయించుకోవాలి. యుద్ధంలో ఆయుధాల తయారీయేగాదు, సైనికుల బూట్ల లేసులు అల్లడం కూడా ఎంత విలువైన, అవసరమైన పనో మనందరికీ తెలుసు. యుద్ధాల్లో, అంతర్యుద్ధాల్లో ప్రజల విజయం కోరుకున్నవాళ్ళందరూ ఇలాంటి అనేక రూపాల్లో కృషి చేశారు. అట్లా నిరంతరం ఈ యుద్ధం ముగిసేదాకా విప్లవ సైన్యానికి అండగా నిలబడి చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. మొత్తంగా ప్రజాపక్షం వహించే వాళ్ళందరూ తాము వ్యక్తులుగా ఏం చేయగలరో నిర్ణయించుకొని తన సకల కార్యక్రమాలు, ఆలోచనలు ఈ ప్రజా యుద్ధం చుట్టూ నిర్మించుకోవలసిన సమయం ఇది.

ఇదేదో ఏకైకవాదంగా పరిణమించే ప్రమాదం లేదా? సమాజంలో ఎన్నో సమస్యలు ఉండగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ మాత్రమే ఎందుకు సర్వస్వం కావాలి? లోకమంతా అనేక మార్గాల్లో నడుస్తోంటే ఒక్క గ్రీన్‌హంట్ గురించే మాట్లాడితే సరిపోతుందా? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. నిజమే.. లోకం పలు రూపాలతో వ్యక్తమవుతోంది. మన రాష్ట్రం, దేశం అనేక సమస్యలతో అట్టుడికిపోతున్నాయి. ప్రజలు నానాటికీ అనేక సమస్యలతో యాతనపడుతున్నారు. ఇందులో చాలా వాటిని గ్రీన్‌హంట్ నేపథ్యంలో అర్థం చేసుకోవచ్చు.

కనీసం ఒక్క విషయం తెలిస్తే చాలు. పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులు ఈ దేశంలో ఒక దుర్మార్గమైన దోపిడీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నాయి. అది సోంపేటలో, కాకరాపల్లిలో, నెల్లూరు థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో.. మొత్తంగా కోస్టల్ కారిడార్ అంతటా, తెలంగాణ అంతటా ఒకలాగా వ్యక్తమవుతోంటే దండకారణ్యం తదితర ఆదివాసీ ప్రాంతాల్లో మరో రూపంలో వ్యక్తమవుతోంది. దండకారణ్యంలోకి చొరబడాలని కార్పొరేట్ శక్తులు చేస్తున్న ప్రయత్నం మిగతా దేశమంతా జరుగుతున్న దోపిడీ వ్యూహంలో భాగమే. అట్లా దండకారణ్య విప్లవోద్యమానికి ఈ దేశంలోని ఇతర ప్రజా సమస్యలకూ దగ్గరి సంబంధం ఉంది. అంత మాత్రమేగాక దేశంలో మరెక్కడా లేని ప్రతిఘటన దండకారణ్యంలో మాత్రమే ఉంది.

ఈ ప్రతిఘటనను, ప్రత్యామ్నాయాన్ని బతికించుకోవాలంటే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు ఉన్న విస్తృత విధ్వంస రూపాన్ని లోతుగా విశ్లేషించుకోవాలి. అది అన్ని ప్రాంతాల, ప్రజల, జీవనోపాధుల, జీవన భద్రతల, సాంస్కృతిక వైవిధ్యతల, సామాజిక విముక్తి ప్రక్రియలన్నింటిపై జరుగుతున్న యుద్ధం. మన కాలంలో మన కళ్ళెదుట మన ప్రజలపై రాజ్యం చేస్తున్న యుద్ధం. ప్రజలు మనందరి విముక్తికి ఉపయోగపడే ప్రయోగాన్ని చేస్తున్నారు. దాన్ని చాలా విస్తృతపర్చాలి. ఆయా ప్రాంతాల్లో దోపిడీ ఎట్లా జరుగుతున్నదో గుర్తించి దానికి ప్రత్యామ్నాయాలను నిర్మించాల్సి ఉంది. గ్రీన్‌హంట్ యుద్ధం ఎట్లా ఆదివాసుల, మావోయిస్టుల సమస్య మాత్రమేకాదో.. అట్లాగే ప్రత్యామ్నాయం మనందరిదనీ, దండకారణ్య ప్రయోగం నుంచి మనందరికీ కావాల్సిన ప్రత్యామ్నాయాలు తయారుచేసుకోవాల్సి ఉందని గుర్తించాలి. దండకారణ్య ప్రత్యామ్నాయాన్ని కాపాడితేనే యావత్ సమాజానికి అవసరమైన సోషలిస్టు ప్రత్యామ్నాయానికి దారులు దొరుకుతాయంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

పాట - ప్రజలు - ఉద్యమాలు అనే అంశంపై కా. కాశీం మాట్లాడుతూ ఉద్యమాలలో పాట ఎంతటి ప్రభావశీలమైన పాత్ర పోషించిందో వివరించారు. సమస్త కళలు శ్రమ నుంచే ఆవిర్భవించాయన్నారు. ఆ శ్రమ తనను తాను విముక్తి చేసుకునే క్రమంలోనూ పాటది విశేషమైన పాత్రే ఉందన్నారు. పాట శ్రామికులను ఆర్గనైజ్ చేసే ఒక గొప్ప శక్తిగా అనేక ఉదాహరణలతో వివరించారు.

చిదంబరంను కేంద్రమంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలి సి.ఆర్.పి.ఎఫ్ బలగాల్ని వెనక్కి పిలవాలి

- వరంగల్ ప్రజా సంఘాల డిమాండ్

ఛత్తీస్‌గడ్‌లోని చింతల్నార్ ప్రాంతంలోని బాసగూడ ఊచకోత సంఘటనను నిరసిస్తూ గ్రీన్‌హంట్ వ్యతిరేక ర్యాలీ జూలై 13, శుక్రవారం సాయంకాలం హన్మకొండ అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది.

జూన్ 28 రాత్రి విత్తన పండుగ, భూ పంపిణీ నిర్ణయాల కోసం సమావేశమైన బీజాపూర్ జిల్లా కొత్తగూడ, రాజుపెంట, సర్కిన్‌గూడ ఆదివాసులపై సి.ఆర్.పి.ఎఫ్ బలగాలు దాడిచేసి ఆరుగురు పిల్లలతో సహా 17 మంది ప్రజల ఊచకోతకు పాల్పడడం చట్టవ్యతిరేకమైన పాశవిక చర్య అని వరంగల్ ప్రజా సంఘాలు నిర్ద్వందంగా ఖండించాయి.

ఈ సందర్భంగా 'రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు తమ స్వంత ప్రజలపై దాడిచేసి ఏకపక్ష కాల్పులకు పాల్పడ్డ సి.ఆర్.పి.ఎఫ్., కోబ్రా బలగాలను శిక్షించాల్సిందిపోయి, మరిన్ని దాడులకు ప్రోత్సహించే విధంగా మాట్లాడడం దారుణమని' బాలగోపాల్ ఆలోచనా వేదిక బాధ్యులు టి. హరికృష్ణ అన్నారు. 'కోబ్రా, కేంద్ర బలగాల చర్యల్ని సమర్ధించిన చిదంబరం మీద జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని, అట్లాగే కేంద్ర మంత్రి వర్గం నుండి చిదంబరంను, ప్రధాన మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని' ఆయన డిమాండ్ చేశారు.

అడవిపై హక్కు ఆదివాసీలదేనని, బహుళజాతి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలన్ని రద్దుచేసి, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ పకడ్బందీగా అమలు చేయాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు బాదావత్ రాజు అన్నారు. హత్యాకాండకు పాల్పడ్డ కేంద్ర బలగాలపై 302 కేసు నమోదు చేయాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సంఘటనను తప్పుపడ్తూ రుజువులతో సహా సంఘటనా పూర్వపరాలను సహచర కేంద్ర మంత్రి కిషోర్ చంద్రదేవ్ వివరించినా చిదంబరం హోం మంత్రిగా కొనసాగడం సిగ్గు చేటని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అభినవ్ అన్నారు.

బస్తర్ ప్రాంతంలో మోహరించిన సైనిక శిక్షణ శిబిరాలను ఎత్తివేసి ఆదివాసీ ప్రజలు జీవించే హక్కును, ఆదివాసీ ప్రాంతాల్లోని సహజ వనరులను పరిరక్షించాలని వరంగల్ రచయితల ఐక్యవేదిక ప్రతినిధి నల్లెల్ల రాజయ్య అన్నారు.

చిదంబరం, మన్మోహన్‌సింగ్‌లకు ఈ దేశ ప్రజల గోడు పట్టదని, అమెరికా కనుసన్నలలో బహుళజాతి కంపెనీలకు ఈ దేశ సహజ వనరులను దోచిపెట్టడం మాత్రమే తెల్సుననీ విరసం కార్యవర్గ సభ్యుడు బాసిత్ అన్నారు. అందువలననే అత్యంత విలువైన ఖనిజ వనరులున్న మాడ్ కొండలపై మానవ రహిత విమానాల్ని వదలి వందలాది కిలో మీటర్ల రేంజిలో శతఘ్నులు పేల్చి, బాంబులు వెదజల్లి ఆదివాసుల హననానికి పాల్పడే లక్ష్యంతో అమెరికన్ కార్పొరేట్ పర్యవేక్షణలో పథక రచన చేస్తున్నారని ఆయన అన్నారు. విత్తన పండుగ, భూ పంపిణీ కోసం సమావేశమైన కొత్తగూడ, రాజుపెంట, సర్కిన్‌గూడ ఆదివాసుల్ని చుట్టుముట్టిన కోబ్రా, సి.ఆర్.పి.ఎఫ్ బలగాలు ఏకపక్షంగా కాల్పులు జరిపాయి. గాయపడి కొన ప్రాణంతో ఉన్నవారిని, భయంతో పారిపోతున్నవారిని అమానుషంగా చంపివేశారు. అందుకే అక్కడి ఆదివాసులు సి.ఆర్.పి.ఎఫ్ బలగాలు తమ ప్రాంతాల్నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు.

ఆదివాసి ప్రజలు, ముఖ్యంగా పోరాట ప్రాంత ప్రజలు తమ ప్రాణాలు పోయినా, దొంగ సర్కార్లు ఇచ్చే పునరావాస ప్యాకేజీల్ని తిరస్కరిస్తున్నారని, తమకాళ్ల మీద తాము నిలబడి జీవించే ఒక స్వావలంబనతో ప్రత్యామ్నాయాన్ని పీడిత ప్రజలందరికీ వాళ్లు చూపుతున్నారని కూడిన తెలంగాణ సంగారా భేరి రాష్ట్ర ఉపాధ్యక్షులు పోరిక ఉదయ్ సింగ్ నాయక్ అన్నారు. అటువంటి పోరాట ప్రజలకు బుద్ధి జీవులు, మేధావులు అండగా నిలబడాలని ఆయన కోరారు.

ర్యాలీ అనంతరం చిదంబరంను బర్తరఫ్ చేయాలని, సైనిక శిబిరాల్ని ఎత్తివేయాలని, న్యాయవిచారణ జరిపించాలని, అటవీ వనరులపై ఆదివాసుల హక్కుల్ని పరిరక్షించాలని పలు డిమాండ్లతో కూడిన మెమోరాండంను కలెక్టర్ తరఫున, ఆ కార్యాలయ అధికారి శేషాద్రికి ప్రజా సంఘాలు అందజేసాయి. కాగా తమ నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని ర్యాలీ నిర్వహించిన సంఘాలు కోరాయి.

గౌరవ జిల్లా కలెక్టర్,
వరంగల్

విషయం : ఛత్తీస్‌గడ్‌లోని ఊచకోతకు వ్యతిరేకంగా ర్యాలీ - న్యాయ విచారణకు డిమాండ్ - తమ ద్వారా ప్రభుత్వానికి

అయ్యా,

28 జూన్, 2012న ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కొత్తగూడ గ్రామ పంచాయితీలో సిఆర్‌పిఎఫ్, ఆ రాష్ట్ర పోలీసులు ఎనిమిది మంది పసిపిల్లలతో సహా 17 మంది ఆదివాసీలను పొట్టన బెట్టుకున్న దారుణ మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నాం.

విత్తనాల పండుగ కోసం సర్కిన్‌గూడ, రాజుపెంట, కొత్తగూడ గ్రామాల ప్రజలు కొత్తగూడలో సమావేశం ఏర్పాటుచేసుకుంటే, నిరాయుధులైన వారిపై ఏక పక్షంగా కాల్పులు జరపడం, ప్రభుత్వం

రిపోర్టు

ప్రజలపై యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం! జనతన సర్కార్‌కి అండగా నిలబడుదాం!

విరసం ఆవిర్భావ దినోత్సవం జూలై 15, 2012న మదీనా ఎద్యుకేషనల్ సొసైటీ, ఉదయం 11 - సాయంత్రం 6.30 గం.లకు హైదరాబాదులో జరిగింది. విరసం కార్యదర్శి వరలక్ష్మి సభని ప్రారంభిస్తూ ఈ సదస్సు ప్రత్యేకత గురించీ, ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించింది.

'ప్రజలపై యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం
జనతన సర్కారుకి అండగా నిలబడదాం'

అన్న బ్యానర్ కింద బాసగూడలో ఆదివాసీ స్త్రీ పురుషుల్నీ, పోలీసులు కాల్చి చంపిన అమరుల దేహాల్ని చిత్రించారు. వాటితోపాటు ఉంచిన ఫొటో ప్రదర్శన కూడా ఆ సంఘటనలకి అద్దం పట్టాయి.

కా. ఉజ్వల్ అధ్యక్షత వహించగా, పౌరహక్కుల సంఘం తరపున చింతల్నార్ వెళ్ళి నిజ నిర్ధారణ చేసిన చిలకా చంద్రశేఖర్ ఆ సంఘటన గురించి వివరంగా చెప్పారు. కాల్చిన తర్వాత ఆ వ్యక్తి కొన ఊపిరితో ఉంటే గొడ్డలితో మెడ నరకడం పోలీసుల దుర్మార్గాలను వివరించారు. రెండో దశ ఆపరేషన్ గ్రీన్‌హంట్ - విప్లవ జనతన సర్కార్ అనే అంశం మీద అధ్యక్షత వహించిన వరవరరావు నేపథ్యం గురించి విశదీకరించారు. నిజనిర్ధారణ కోసం ఆ అడవుల్లోకి వెళ్ళి ఆదివాసుల్నించి నిజా నిజాలు క్షుణ్ణంగా తెల్సుకొని వచ్చిన పాణి విషయాలన్నిటిని పూసగుచ్చినట్టు చెప్పాడు. 'ఇవాళ అక్కడ జరుగుతున్న అంతర్యుద్ధం లూటీ సర్కారుకీ జనతన సర్కారుకీ మధ్య. ఈ ఘటన జరిగిన ప్రాంతం నుంచి అడవిలో లోపలికి వెళ్ళి జనతన సర్కార్ పనితీరు పరిశీలించాం. బీజాపూర్ జిల్లాలో ప్రతి ఊరుకీ చెరువులు తవ్వారు. మావోయిస్టులు, గ్రామస్తులు కలిసి బయట నుంచి నాణ్యమైన విత్తనాలు దొరకవని వాళ్ళే విత్తనాలు తయారు చేసుకుంటున్నారు. వ్యవసాయం అద్భుతంగా ఉంది. ఇక్కడ రైతుల ఆత్మహత్యలు పరిపాటి అయ్యాయి. అక్కడ స్త్రీలు పొలాలు దున్నితే పురుషులు విత్తనాలు జల్లుతారు. కమిటీల్లో స్త్రీల పాత్ర ఎక్కువగా ఉంది. కొన్నిచోట్ల అయితే పూర్తిగా స్త్రీలే కమిటీలు నిర్వహిస్తున్నారు. ప్రజా మిలీషియాలో 20 ఏళ్ళు దాటిన స్త్రీలుంటే, భూంకాల్ మిలీషియాలో 40 ఏళ్ళ పై వయసు స్త్రీలు ఉన్నారు. తెలుగు, హిందీ, భూగోళం, చరిత్ర, సైన్సు నేర్పిస్తారు. సంచార వైద్యాలయాలున్నాయి.

అమాయకులైన తమ సొంత ప్రజలపై చేస్తున్న యుద్ధం తప్ప మరొకటి కాదు.

వివిధ హక్కుల, ప్రజా సంఘాలుగా ఈ సంఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వం ఇంత చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించడం, ప్రజల ప్రాణాలను హరించడం రాజ్యాంగ వ్యతిరేకం అని, ఈ రకమైన చర్యలన్నింటిని ప్రభుత్వం వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

మా డిమాండ్లు :

1. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి హోం మంత్రి చిదంబరాన్ని విధుల నుంచి తొలగించాలి.
2. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచేత సంఘటనా స్థలంలోనే న్యాయ విచారణ జరిపించాలి.
3. జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా చిదంబరంపై హత్యకేసును నమోదు చేయాలి
4. ఆదివాసీ ప్రాంతాల నుండి అన్ని రకాల బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలి.
5. ప్రకృతి వనరులపై పూర్తి హక్కును స్థానిక ప్రజలకే కల్పించాలి.
6. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ పకడ్బందీగా అమలు చేయాలి.
7. ఊచకోతలో పాల్గొన్న పోలీసు బలగాలపై హత్యకేసు నమోదు చేయాలి.
8. ఆదివాసీ ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్న సైనిక శిక్షణా శిబిరాలను, స్కూళ్ళను ఎత్తివేయాలి.
9. ఆదివాసీ ప్రాంతాలలోని అపార ఖనిజ సంపదను వెలికి తీయడానికి ప్రభుత్వం వివిధ బహుళజాతి కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకొని, ఆ సంపదపై ఆదివాసులకే హక్కును కల్పించాలి.
10. ఆదివాసుల పోరాటాలకు అండగా నిలుద్దాం.

పాల్గొన్న సంఘాలు :

1. టి. హరికృష్ణ-బాలగోపాల్ ఆలోచనా వేదిక
2. బాదావత్ రాజు-మానవ హక్కుల వేదిక
3. బాసిత్-విప్లవ రచయితల సంఘం
4. గునిగంటి రమేష్-మానవ హక్కుల వేదిక
5. రాజు-తెలంగాణ రైతాంగ సమితి
6. సాదు రాజేష్-మానవ హక్కుల వేదిక
7. ఎస్. నాగరాజు-టి.పి.ఎఫ్
8. మాద లక్ష్మి నారాయణ-ఎల్.ఐ.సి. ఎస్.సి., ఎస్.టి ఉద్యోగ సంఘ బాధ్యులు
9. కొంగర జగన్-దళిత బహుజన ఫోరం
10. బి. అభినవ్, మంద సంజీవ్-కుల నిర్మూలన పోరాట సమితి
11. షేక్‌నబీ-వరంగల్ బార్ అసోసియేషన్

సాల్వాజుడుంలో నుంచి వీళ్ళ మీద దాడులు చేసినవాళ్ళు, తప్పు తెలుసుకుని తిరిగివచ్చిన వాళ్ళకూడా భూములు పంచారు. ఆదివాసులు అమాయకులు కాదు. వాళ్ళు విప్లవోద్యమం నిర్వహిస్తున్నారు. అందుకే వాళ్ళ మీద దాడి. ఆ దాడిని మనం ఖండిద్దాం. వాళ్ళకి మనం మద్దతు ఇద్దాం' అని ముగించాడు.

బాసగూడలో గ్రామస్థులు సమావేశమై 'భూ సమస్య గురించీ, చనిపోయిన పూజారి స్థానంలో మరొకరిని తీసుకోవడం గురించి, మాట్లాడుకుంటూండగా రాత్రివేళ పోలీసులు హఠాత్తుగా దాడిచేసి కాల్పులు జరిపారు.

విరసం నుంచి పాణితోపాటు వెళ్ళిన బాసిత్ మాట్లాడుతూ 'ఘటన జరిగాక, శవ పంచనామా అయ్యాక గ్రామస్తులకి బియ్యం, పప్పులు వ్యాన్‌లో రెవెన్యూ అధికారి తెచ్చి పంచబోయాడు. ఆ మహిళలు పట్టరాని కోపంతో 'మా బిడ్డల్ని చంపుకుతిని, మేం తినేందుకు బియ్యం తెచ్చారా? మాకు అక్కర్లేదు' అని తిప్పికొట్టారు. ఆ అధికారి తిరిగివెళ్ళిపోయాడు. 'మీరు మావోయిస్టుల్ని చంపితే కూడా ఇలాగే ఇస్తారా?' అని ప్రశ్నించారు. ఇదీ ఆదివాసీ మహిళల చైతన్యం' అని చెప్పాడు.

('పౌరస్పందన' అనకుండా రచయితల, ప్రజా సంఘాల స్పందన అంటే బాగుంటుందని ఒక అభిప్రాయం.)

స్పందన -

ఈ సమావేశాన్ని (సాయంత్రం 3.30 - 6.30 గం.ల వరకు) వరలక్ష్మి నిర్వహించింది. 'జాతీయ, అంతర్జాతీయ సంఘటనలకి తెలుగు ప్రజల్లో, రచయితల్లో వెంటనే స్పందన వచ్చేది. కాని 2005 నుంచి అంతర్గత యుద్ధ వాతావరణం ఉన్నా, రచయితల్లో స్పందన తగినంతగా రాలేదు. ఇది మావోయిస్టుల మీద పోరాటమే కాదు గదా? మన ఆదివాసుల మీద యుద్ధం. దీనికి మనం ఎలా మద్దతు పలకాలో మీ మీ సూచనలివ్వండి' అని కోరింది.

1. కందుకూరి శ్రీరాములు గ్రీన్‌హంట్ వ్యతిరేక కవిత చదివారు.

2 నగ్నముని - కవి, రచయిత

మా జీవితాల్లో విరసం భాగమైపోయింది. ఈ 42 ఏళ్ళలో విరసం బాధ్యతలు మరీ మరీ పెరిగాయి. ఎన్నో నిర్బంధాలు, నిషేధాలు ఎదుర్కొంటోంది. ఆసియా ఖండంలో ఒక జ్యోతి విరసం. నాలాంటి వాళ్ళు చెయ్యలేకపోయినా విరసం చేస్తున్నందుకు గొప్పగా ఉంది. ప్రజల్ని ఓటర్లుగా మార్చింది ప్రభుత్వం. రాజకీయనాయకులకి ప్రజలంటే వస్తువులు. వాళ్ళకి అస్తిత్వం లేదు. ఇది గ్రీన్‌హంట్ కాదు రెడ్‌హంట్. అడవుల్లో ఉన్న ఆదివాసులు, మనం ఏకరక్త బంధువులం. ఎవరికివాళ్ళకి తమదాకా వస్తేగాని నొప్పి తెలీదు. ప్రభుత్వం చేస్తున్నది యుద్ధం కాదు, వేట. మన సంపదలో భాగం అడవి, ఆదివాసులు ఆకలితో, రోగాలతో చచ్చిపోతున్న వాళ్ళ గురించి పట్టించుకోదు ప్రభుత్వం. నాదో సూచన-ఆదివాసీల రక్షణ కోసం వెళ్ళిన వాళ్ళని వేటాడుతున్నారు. ఆదివాసీల్ని నిలబెట్టడం కాదు, వాళ్ళకి రాష్ట్రం ఏర్పాటు చేయాలి. అలాగైతే వాళ్ళ సమస్యల్ని గుర్తించి, పరిష్కరించుకోగలరు.

3. ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు (రిటైర్డ్ పొలిటిక్స్ ప్రొఫెసర్, ఓయు)

హక్కులు అందరికీ ఉండాలి. ఆదివాసుల జీవించే హక్కుని నేను సపోర్టు చేస్తాను బతికి ఉన్నంతకాలం. ఆదివాసీ స్త్రీల గురించి ప్రత్యేకంగా కృషి చేయాలి. వ్యవసాయ రంగం అధోగతిలో ఉండడం వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అవి కూడా మీరు పట్టించుకోండి.

4. కాసుల ప్రతాపరెడ్డి - రచయిత

ప్రభుత్వం ఆదివాసుల్ని అడవిలో జంతువులుగా భావిస్తోంది. తప్పుచేసి సారీ అనడం ప్రభువర్గాల స్వభావం. ప్రజా ఉద్యమం ఒక దశకి చేరుకుంది. పరిమితుల్లో పనిచేసే వాళ్ళందరిని కలుపుకోవాలి.

వద్దెబోయిన శ్రీనివాస్‌ని అరెస్టు చేస్తే ఖండించే దశ లేకపోయింది. రాజ్యహింసని వ్యతిరేకించడం ముఖ్యం - తెలంగాణని కోరుకోవడం కన్నా కూడా. విరసానికి మా సహకారం ఎప్పుడూ ఉంటుంది.

5. కాకరాల - రచయిత

పుస్తకావిష్కరణ చేస్తూ - బ్రిటిష్ పాలనలోకన్నా మధ్య తరగతి చచ్చుబడిపోతోంది. 'మా జీవితం మాది. మా అడవి మాది' అని పోరాడుతున్న ఆదివాసీలకి అభినందనలు. మనం మర్చిపోయిన వర్గ పోరాటాన్ని మనకి ఆదివాసులు గుర్తు చేస్తున్నారు. దాన్ని మనం స్వీకరించి ప్రజల యుద్ధానికి అండగా ఉందాం. ఇక్కడ లక్షలాది ప్రజలు మురికి వాడల్లో బతుకుతున్నారు. అక్కడా ఇక్కడా దరిద్రాన్ని పారదోలే కృషిలో భాగస్థులమవుదాం.

6. దప్పు రమేష్ - రచయిత

ఆసుపత్రులు, స్కూళ్ళు, వివిధ సంఘాలు నిర్మించుకుంటూ జనతన సర్కార్ ఆదివాసీ ప్రజలతో కలిసి పని చేస్తోంది.

'ఆపరేషను గ్రీన్‌హంటూ
మాది విప్లవ బలగాల ఫ్రంటూ'
అని పాడాడు.

7. ఎ.కె. ప్రభాకర్ - రచయిత

'ఆదివాసుల్ని హ్యూమన్ షీల్డ్‌గా వాడుకుంటున్నారు. అందుకే మేం ఎదుర్కొంటున్నాం' అంటోంది ప్రభుత్వం. యుద్ధ నీతికి కూడా కొన్ని పద్ధతులున్నాయి. అవి పాటించాలి. బుద్ధి జీవుల్ని వీటికి దూరంగా ఉంచే కుట్ర చేస్తోంది ప్రభుత్వం. 'ఎవరి పోరాటాలు వాళ్ళే చేసుకుంటారు' అనుకోకుండా మనం పోరాటానికి సంఘీభావం తెల్పుదాం.

వరలక్ష్మి - ప్రజల పట్ల బాధ్యతగా ఉన్నట్టునటిస్తూ, పబ్బం గడుపుకున్న తర్వాత నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంటారు పాలకులు - మమతా బెనర్జీలాగా.

8. మోహన్ - (అరుణోదయ) కవి, గాయకులు

గ్రీన్‌హంట్‌ని వ్యతిరేకిస్తూ మేం ప్రతిచోటా పాడుతున్నాం.
మీ మీదా పూలవర్షం కురుస్తున్నది

మా మీదా పూలవర్షం కురుస్తున్నది
మీరు ఉయ్యాల్లో ఉన్నారు
మేం కిందనే ఉన్నాం.

ఒక కవి చెప్పినట్టు 'పక్కవాళ్ళని అరెస్టు చేస్తే నన్ను కాదుగదా' అని ఉపేక్షిస్తే, నన్ను అరెస్టు చేసినప్పుడు అడిగేందుకు ఎవ్వరూ ఉండరు' అనేది గుర్తుంచుకోవాలి.

9. కాసుల లింగారెడ్డి - రచయిత

కవిత - నిజం తుపాకి కన్ను మధ్య తరగతి, మీడియా భావిస్తున్నట్టు ఇది మావోయిస్టులకీ ప్రభుత్వానికి యుద్ధం కాదు.(మైదానాల్లోని వనరుల్ని ప్రైవేటు కంపెనీలకి అప్పనంగా అప్పచెప్పేందుకు) వేదాంత, జిందాల్ లాంటి కంపెనీలకి బాక్సైట్, ఇనుప ఖనిజాలు దోచిపెట్టడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతూంటే, తమ కాళ్ళకింద భూమిని తొల్చేస్తున్నందుకు యుద్ధం చేస్తున్నారు ఆదివాసీలు.

జీతన్ మరాండీలాంటివాళ్ళ ఉరిశిక్షలకి వ్యతిరేకంగా అందరం కలిసి చేశాం. అలా కల్సి చేద్దాం.

శంకరగుహ నియోగిని చంపితే ఏమీ చేయలేక పోయాం. పిల్లల వైద్యుడు బినాయక్‌సేన్‌ని జైల్లో పెట్టారు.

విరసం విశాల వేదికని నిర్మిస్తే నేను నా వంతు కృషిని చేస్తాను.

వరలక్ష్మి - సహజ వనరులు బొగ్గు, ఇనప ఖనిజం అక్కడ బాగా దొరుకుతుంది. దీన్ని రవాణా చేయడానికి విశాఖ దాకా రవాణా చేయడానికి పైప్‌లైన్ వేశారు. ఎస్ఆర్ కంపెని మూడు నదుల నీళ్ళలో ఇనప ఖనిజాన్ని కలిపి పంపుతారు. సహజ సంపదల్ని ఇలా లూటీ చేస్తున్నారు. శత్రువు తన బలగాల్ని ఏకీకృతం చేస్తోంది.

10. దానీ - రచయిత

పటేల్ దగ్గర్నుంచీ చిదంబరం (హోం మంత్రులు) దాకా ఒకే భాష. బిర్సాముండా నుంచి ఇంద్రవెల్లి, దండకారణ్యం దాకా ఆదివాసీలందరిదీ ఒకే పోరాటం. వాళ్ళలో రాని మార్పు మన మధ్య తరగతిలో వచ్చింది. మనం వామపక్షాల వైపు, ఆదివాసీల వైపు చూడ్డం మానేశాం.

పేరెంట్స్‌కేమో Protective attitude. పిల్లలకి స్వేచ్ఛ కావాలి. గాలిజనార్దనరెడ్డి బిజెపిలో ఉండగా కోట్లు సంపాదించాడు.

నేను విరసంలో లేనుగాని విరసంతో ఉన్నాను. నా సంఘీభావం ఎప్పుడూ ఉంటుంది.

11. బజరా - రచయిత

వాతావరణం వేడిగా ఉంది. వానల్లేవు. వాతావరణంలో సమతుల్యత లోపించింది.

ఇంతమంది ఆదివాసుల్ని చంపుతున్నా మనం చేతులు కట్టుకుని అలాగే కూర్చున్నాం.

మనిషి జీవించినంత కాలం ప్రభుత్వంతో యుద్ధం చేయాల్సిందే.

బోరు బావిలో పడిన పిల్లాడి చావుని గురించి ఎస్ఎంఎస్‌లు ఇమ్మంటారు. అందరికీ ఆదాయం.

క్షమాపణ చెప్తూ చిదంబరం - ఆదివాసీలు కానట్టయితే సారీ అన్నాడు. అన్నీ ప్రైవేటు పరం చేస్తున్నారు.

ఆదివాసుల సమస్య గురించి ఇనీషియేటివ్ తీసుకుని ఏదన్నా కార్యక్రమం చేపడితే నేను కలవడానికి సిద్ధం.

'వ్యవసాయ సంబంధాలు' పుస్తకాన్ని **కా. రాంకి** ఆవిష్కరిచారు.

'వీరవనం' - వడ్డెబోయిన శ్రీనివాస్ దీర్ఘ కవితా సంపుటిని **కా. ఉదయభాను** ఆవిష్కరించారు.

12. నాళేశ్వరం శంకరం - రచయిత

ఒక సింహం ఎన్ని జంతువులున్నా తనకి కావాల్సినదాన్ని ఒక్కదాన్నే ఎత్తుకుపోతుంది. కాని పోలీసులు అలా కాదు ఒకసారి మా మిత్రుల ఇంట్లో ఉన్నాను. వాళ్ళింటికి పోలీసులు సెర్చ్ చేయడానికి వచ్చారు. 'నువ్వెవరంటే తమ్ముడివని చెప్పు' అన్నాడు మా ఫ్రెండ్. వాళ్ళ ఇల్లు సెర్చ్ చేసి వెళ్ళిపోయారు. కాని ఈనాటి పోలీసులకే పాశవికత్వం నేర్పింది ప్రభుత్వం. అందుకే ఇంత అమానుషంగా కాల్చేస్తున్నారు. దీన్ని ఎదిరించేందుకు మీరు చేస్తున్న కృషికి సంఘీభావం తెలుపుతున్నాను.

13. వేముగంటి మురళీకృష్ణ - రచయిత

మధ్య తరగతి ఎంత నికృష్టంగా తయారయిందంటే - బిడ్డలకి విలువలు నేర్పడం లేదు. వాళ్ళ పిల్లలు రేవ్ పార్టీలకి వెళ్ళడం, అరెస్టవడం, వాళ్ళ బెయిళ్ళు, విడుదల చేయించడంలో నిమగ్నమవుతున్నారు. స్త్రీలు కన్నీళ్ళతో సీరియళ్ళు చూడ్డం (ఈ కామెంట్‌కి మన వాళ్ళు నవ్వడం నాకు చిరాకనిపించింది). పాపం ఈ మధ్య తరగతికి సమాజాన్ని పట్టించుకునే తీరిక లేదు. మీకు నా తోడ్పాటు ఉంటుంది.

14. కోటి - ప్రజా కళా మండలి రాష్ట్ర కార్యదర్శి

గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా తన సందేశాన్ని పాట ద్వారా తెలియజేశారు.

15. ఎ. నరసింహారెడ్డి - ఎ.పి.టి.ఎఫ్

పాలక వర్గం సాయుధమయింది గనక సాయుధంగానే ఎదుర్కోవాలి. బాక్సైటు, ఇనుము, అల్యూమినియం కోసం మన గనులు విదేశాలకి కావాలి. ప్రపంచంలోని 22 శాతం అల్యూమినియం మన దగ్గర దొరుకుతుంది. అల్యూమినియంతో రాకెట్లు, జెట్ విమానాలు తయారుచేస్తారు. మంచిది ఒరిస్సాలో దొరుకుతుంది. అమెరికాకి ఇది కావాలి. మన ప్రభుత్వానికి ప్రజలకన్నా అమెరికాకి సాయపడ్డమే ముఖ్యం.

మధ్య తరగతి జీవులకి భయం జాస్తి. దీన్ని విడిచిపెట్టి వాస్తవాలు తెల్సుకుని ప్రజల కోసం పని చేయాలి. ఇది వరకి మధ్య తరగతి ప్రజల్ని రచయితలు పట్టించుకునే వారు. ఇప్పుడూ అదే జరగాలి. మీ ప్రయత్నాల్లో నేనూ భాగస్వామినవుతాను.

సీరియల్

సూర్యుడు

- కె.వి. కూర్మనాథ్



ఆర్టిస్టు : రాయ్ లిచ్టెన్‌స్టిన్

(4)

(గతసంచిక తరువాయి...)

రమాకాంత్

- రచయిత

సూర్యుడి గురించి తెలుసుకోవడానికి ఎవరెవరినో కలుస్తున్నప్పుడు నాకు అర్థమయిందిది. ప్రజలలో ఎంతెంత సృజనాత్మకత ఉన్నదీ, అది ఎంత గొప్పగా మనిషి సామూహిక ఎరుకని ఎలా గుర్తుపెట్టుకుంటుందీ, ఎలా ఒక తరం నుంచి మరో తరానికి ఆ ఎరుకని, గుర్తుల్ని అపురూపంగా గుర్తుపెట్టుకుంటుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నాను.

ఒకరి గుర్తుల్లోంచి మరొకరి గుర్తుల్లోకి, ఒకరి తలపుల్లోంచి మరొకరి తలపుల్లోకి వెళ్ళి ఎన్నెన్ని విషయాలు మాట్లాడారో!

గాలిలో ఊహించి రాసే క్షుద్ర సాహిత్యం కంటే, ప్రజలతో సంభాషించి రాసే సాహిత్యం గొప్పది. ఎందుకంటే, అది భూమితో మాట్లాడుతుంది కాబట్టి. మనిషైనా, మనిషి పుట్టించిన సాహిత్యమైనా నేల విడిచి సాము చెయ్యకూడదనేవాడు.

'అలా ఊహించి రాసే సాహిత్యం చిత్తుకాగితాలతో సమానం. ప్రజల్లో కలిసి తిరిగితేనే జీవితానికి సంబంధించిన ఆయువుపట్లు తెలుస్తాయి. రక్తమాంసాలతో సజీవంగా ఉండే సాహిత్యం ప్రజలమధ్యలోంచే పుడుతుంది,' అన్నాడని నేను ఇంటర్వ్యూ చేసిన రచయిత చెప్పేడు.

ఇది నాకు ఒక కొత్త అనుభవం. రకరకాల వృత్తుల్లోని వాళ్ళని, రకరకాల పనుల్లో ఉన్నవాళ్లని కలుసుకోవడం, వాళ్ళు సూర్యుడి గురించి చెబుతుంటే రికార్డ్ చెయ్యడం, వాళ్ళు మాట్లాడుతుంటే రాసుకోవడం. అంతకు ముందు నేను ఊహించని ఎత్తుల్నించి, కోణాల్నించి నా కళ్ల ముందు దృశ్యం కనిపిస్తుంది.

ఈసారి సూర్యుడిని కలిసిన ఒకానొక రచయిత చెప్పిన అనుభవాలు అతడి మాటల్లోనే.

***

నాకెందుకోగాని అతడు ఎర్నెస్ట్ ఎవర్ హర్ద్ లాగా ఉంటాడని ఊహించుకునే వాడిని. కాలేజీ రోజుల్లో చదివిన ఉక్కు పాదం లోని నవల్లో లాగా అతడు మాట్లాడతాడని, అతడిలాగే ఉద్యమాన్ని నడిపిస్తున్నాడని అనుకునే వాడిని. ఇవన్నీ అతడిని ఎరిగిన వాళ్ళు, అతడితో మాట్లాడిన వాళ్ళు చెప్పిన సంగతులను బట్టి నేను ఏర్పర్చుకున్న ఒక ఊహ. వీటికి తోడు పత్రికల్లో వచ్చిన వార్తలు నా ఊహని మరింత బలపరిచేయే తప్ప, తగ్గించలేదు. అతడిని ఒక్కసారి కూడా కలవకపోతే.

బహుశా నా ఊహ అలాగే ఉండిపోయేది. మొదటిసారి కలిసేక తెలిసింది, నా ఊహ ఎంత నిజమని. మొట్టమొదటిసారి అతడిని కలిసింది జైలు ములాఖత్లో. నన్ను తీసుకెళ్లినాయన పరిచయం చేశాడు. 'కథలు రాస్తాడు,' అని. షేక్ హేండ్ ఇచ్చేడు. నాకు ఎంత సంతోషం కలిగిందో చెప్పలేను. ఇంతకు ముందే చెప్పేను మీకు, సాహిత్యంనుంచి వచ్చిన వాడినని. అతడిని గురించిన వార్తలు, అతడు చేసిన పనుల గురించి, చేసిన త్యాగాలనుంచి విని ఉన్నాను కాబట్టి, నేను నా ఊహ ప్రపంచంలో నేను చదువుకున్న సాహిత్య లోకపు పాత్రల్లో అతడిని పోల్చుకున్నాను. సరిగ్గా నేనూహించినట్టే ఎవర్ హర్ద్ లాగానే ఉన్నాడు. అదే పొడవు, అదే రూపం. నా ఆశ్చర్యానికి అంతే లేదు. 'ఇదెలా సాధ్యం,' అనుకున్నాను.

ఏ ఊరు, ఏమి చేస్తున్నావు లాటి ప్రశ్నలు అయిపోయాక, వాళ్ళిద్దరూ చాలా సేపు మాట్లాడుకున్నారు. ఏదో సమస్య వింటున్నాడు, ఏదో చెపుతున్నాడు. మధ్య మధ్యలో నాతో కల్పించుకుని ఏదో మాట్లాడాడు. వాళ్ళ మాటలు అయిపోయేదాకా ఆగుదామనుకున్నాను.

వాళ్ళ సంభాషణ అయిపోయేక నా వైపు తిరిగేడు. నాకు కొంచెం టైమ్ దొరికింది. ఇంకేం, ఎప్పటినుంచో నా మనసులో ఉన్నది చెప్పేశాను.

మిమ్మల్ని చూస్తూనే ఎవర్ హర్ద్ ని చూస్తున్నట్టు ఉందని అన్నాను. నవ్వేడు చిన్నగా.

'జాక్ లండన్ వందేళ్ల క్రితం ఊహించిన పోరాటం అమెరికాలో మొదలయి ఉండకపోవచ్చు గాని, అతడూహించిన దానికంటే చాలా ముందే ప్రపంచంలో చాలా చోట్ల మొదలయింది. మనదగ్గర కూడా నలభై ఏళ్ళ క్రితమే మొదలైంది. ఎవర్ హర్ద్ లాటి మామూలు మనుషులు ఎలాటి ప్రకంపనలు సృష్టించవచ్చో లండన్ మనకళ్ళ ముందు ఉంచేడు. చరిత్ర నిర్మాణంలో పాల్గొంటున్న వాళ్ళందరూ సమానమే. కొందరినే కథానాయకుల్లాగా చూడడం మంచి పద్ధతి కాదు' అన్నాడు.

ఆకాశపుటంచుల్లో బాణాల్లాగా ఎగిరే పక్షులు వంతులు మార్చుకుని, గాలిని చీల్చుకుంటూ ఎలా ముందుకు పోతాయో పోరాట అవసరాల కోసం ఒక్కొక్కరు ఒక్కో బాధ్యత తీసుకు నడుస్తారు. ఒక్కొక్కరు ఒక్కోసారి ముందుండి నడిపిస్తారు. చరిత్ర నిర్మాణం సామూహిక కార్యక్రమం. 'అందుకే మనదగ్గర hero worship ఉండదు. విగ్రహాల్ని కాదు మనం సృష్టించాల్సింది, వాళ్ళు ఏయే విలువలకి నిలబడ్డారో ఆ విలువల్ని దిక్సూచిగా మార్చుకు నడవాలి' అన్నాడు.

***

అతడు చెప్పడం చెప్పేడు కానీ, తొలి యవ్వనపు దినాల్లో ఏర్పడ్డ అభిప్రాయం అంతా తొందరగా ఎలా మారుతుంది? నాకతడు నడుస్తుంటే, మాట్లాడుతుంటే, విషయాలు చెప్తుంటే, నవ్వుతుంటే, జోకులు వేస్తుంటే, క్రోధంతో తీక్షణంగా మాట్లాడుతుంటే - నాకు నవలలోని పాత్ర గుర్తొచ్చేది.

అతడితో మాట్లాడిన ఒక్కో సందర్భం తర్వాత, అతడి సామాన్య ప్రవర్తన మరింతగా ఆకట్టుకునేది. ఎదుటివారికి తెలియని విషయాలని శ్రద్ధగా వివరించడం, తనకి తెలియని విషయాలని - అవతలి వాళ్ళు ఎంత చిన్న వాళ్ళైనా - సీరియస్ గా అడిగి తెలుసుకోవడం.

***

సడెన్‌గా అడిగేవాడు, ఇప్పుడేం చదువుతున్నావని.

కొన్నిసార్లు చెప్పేవాడిని. కొన్ని సార్లు 'లేదనేవాడిని'.

'ఎందుకలా? చదువుతుండాలి, ఎప్పటికీ. నోటికి భాష ఉన్నట్టే, చేతికీ, మెదడుకీ, హృదయానికీ కూడా భాషలు ఉంటాయి. నువ్వు ఆ భాషల్ని ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండాలి. చదవాల్సిన పుస్తకాలు చదవకపోతే తెరుచుకోవాల్సిన తలుపులు మూసుకుపోతుంటాయి. నువు చదవని పదాల చోటున, తుమ్మమొక్కలు మొలిచే ప్రమాదం ఉంటుంది. వాటి ఆకులమాటున పదునైన ముళ్లు మొలిచిపోతాయి' అన్నాడు.

ఒక డాక్టరు ఎలా అయితే జబ్బుల పాథాలజీ గురించి నిరంతరం ఆలోచిస్తుంటాడో, ఒక రైతెలా అయితే ఆకాశాన్నీ, మేఘాల్నీ, మట్టినీ, మొక్కల్నీ, క్రిముల్నీ అంచనా వేస్తుంటాడో, రచయిత కూడా నిరంతరం తన ముడి సరుకుల గురించి ఆలోచిస్తుండాలి. మనుషుల్ని గమనిస్తుండాలి, మనుషుల ప్రవర్తనని, ప్రత్యేకతల్ని, లౌల్యాల్ని, లేకితనాల్ని, మంచిని, వెటకారాన్ని గమనించాలి.

'నాకు ఫిక్షన్ ఇష్టం. అవే చదువుతున్నా ఎక్కువగా' అన్నానొకసారి.

'చదువు. ఎంత ఫిక్షన్ చదివితే అంత మంచిది. కానీ గుర్తు పెట్టుకో. నువ్వు చదివే ఫిక్షన్ రాసిన వాళ్ళు ఎలాంటి నేపథ్యం నుంచి వచ్చారో గమనించావా? గోర్కీని తీసుకో, మ్యాకవోస్కీ ని తీసుకో, నువు ఇంతకు ముందు చెప్పిన జాక్ లండన్ తీసుకో, లూషన్‌ని చూడు - ఒక్కొక్కరు పెరిగిన, చదివిన, జీవించిన నేపథ్యం చూడు. కల్లోల భరిత, సంక్షుభిత, ఉత్తేజభరిత, చారిత్రాత్మక ఘడియల్లో బతికారు. ఆ కల్లోలాల్ని అర్థం చేసుకుని, సంక్షోభంలో తామేటువైపో అవగతం చేసుకుని, చరిత్రని తమ పదునైన కథనాల్తో రికార్డ్ చేశారు' అన్నాడు.

నాకు ఒక్క సారి ఒళ్ళు జలదరించింది. ఏదో కాలక్షేపం కోసమనో, మూడ్ వచ్చిందనో, ఖాళీ దొరికిందనో, హృదయం స్పందించిందనో రాసేను తప్పితే, ఇంత సీరియస్ గా ఎన్నడూ తీసుకోలేదు నేను.

***

'యెనన్ ప్రసంగం చదివేవా?' అని అడిగాడు. నేను కథలు రాయడం మొదలుపెట్టిన రోజుల్లో. మళ్ళీ జైల్లోనే కలయిక. జైల్లో జరుగుతున్న ఉద్యమం బయటి ప్రపంచాన్ని ఒక కుదుపు కుదుపుతున్నది. జైలు ఉద్యమానికి బాసటగా బందీ కాని గొంతుకల నినాదాలు, పాటలు, కవితలు, కథలు జైళ్లలో కాదు, మధ్యతరగతిని తీవ్రంగా ఆలోచింపచేస్తున్న రోజులవి.

యెనన్ ప్రసంగం నేను చదవలేదని చెప్పాలా వద్దా? తన దగ్గర అబద్ధం చెప్పాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే, అయ్యో చదవలేదా అన్న భావమే ఉంటుంది కానీ వెటకారం గానీ, తక్కువ చేసి మాట్లాడడంగానీ ఉండదు.

'ప్రజల కోసం రాసే వాళ్ళకు, మావో యెనన్ ప్రసంగం ఒక మేనిఫెస్టో లాటిది. రచయితలు ఎలా ఉండాలి, ఏయే జాడ్యాల్ని వదిలించుకోవాలో, ఎలా డీ క్లాసిఫై కావాలో చెప్పాడు. ప్రజల్ని విముక్తి చెయ్యడానికి ఎన్నో రంగాల్లో యుద్ధం చెయ్యాలి. ఒక రంగంలో ఆయుధం ముఖ్యమైతే, మరో స్థాయిలో పెన్ను అవసరమని చెప్పాడు. ఈ రెండింటినీ జమిలి చేస్తే తప్ప, సమర్థవంతంగా అభివృద్ధి చేస్తే తప్ప విప్లవ కార్యాచరణకి జవసత్వాలు రావని' అన్నాడు.

***

'ఒకసారి ఉత్తరం రాశాడు, ఏదో పత్రికలో వచ్చిన నా కథ చూసి. '.........కథ చదివేను. కానీ ఒక్కటి గుర్తుపెట్టుకో. ఎప్పుడో ఏదో ఒక రచన చేస్తే సరిపోదు. నిరంతరాయంగా రాస్తూనే ఉండాలి. ప్రజలకి వ్యతిరేకంగా, శత్రు శిబిరం నుంచి కుప్పలు తెప్పలుగా సాహిత్యం వస్తోంది. ఎంత వస్తోందంటే, ఆ వరదలో అక్కడక్కడా, అడపాదడపా వస్తున్న మంచి సాహిత్యం కొట్టుకుపోతోంది. లేదా కన్పించడం లేదు. మెజారిటీ ప్రజల అవసరాలకోసం రావాల్సిన, వస్తున్న సాహిత్యం అతి స్వల్పం. ఒక బాధ్యతగా రాస్తూనే ఉండాలి. రైతు పంట వేసినట్టు, నది ప్రవహించినట్టు, గాలికి ఊగే పూలరెమ్మ లాగా, రాయడం ఒక సహజమైన పనిలాగా మారిపోవాలి. అవసరానికి అన్నట్టు రాయాలి. కథ రాస్తావో, కవిత రాస్తావో, వ్యాసమే రాస్తావో - ఏదో ఒకటి రాస్తూనే ఉండాలి. మన అభిప్రాయం ఎప్పటికప్పుడు ప్రజల్లోకి పోవాలి. వేరే ఆలోచనలు ఉన్నాయని చెప్తూ ఉండాలి. ఎంత ఎక్కువ మంది రాస్తే అంత మంచిది మనకు. అందుకే, వీలైనంత ఎక్కువ రాస్తూండు. ఏమి రాయాలో చెప్పక్కర్లేదు నీకు'.

***

అతడు చెప్పింది ఎంత వరకు విన్నానో (ఎక్కువగా రాయడం విషయంలో) తెలీదు కానీ రాసిందంతా అతడు చెప్పిన దానికే అని మాత్రం చెప్పగలను. పేపర్ మీద పెన్ను పెడితే చాలు, అతడు చెప్పిన విషయాలు కళ్ల ముందుకొచ్చేస్తాయి. ఇక అంతకంటే, ఇంకేం రాయగలను?

***

(ఇంకా ఉంది)

లేఖ :

విరసం అభిప్రాయాలు మారుతున్నాయా?

చాలా సంవత్సరాలుగా విరసం సభలకు వస్తూ, నాయకుల ఉపన్యాసాలు వింటూ, అరుణతార, వేరే పుస్తకాలు చదువుతూ ఉన్న విరసం అభిమానిని. నక్సలైట్ ఉద్యమ అభిమానిని. ఈ మధ్య రెండు సభలలో విరసం నాయకుల ఉపన్యాసాలు వింటే విరసం చాలా రోజులుగా చెప్తున్న అభిప్రాయాలు మార్చుకుంటున్నదా అని అనుమానం కలిగింది.

ఆర్‌డిఎఫ్ సభలలో ప్రణాళిక గురించి చర్చలో విరసం నాయకులు ఒకరు ఆ ప్రణాళికలో 'బ్రాహ్మణ సామ్రాజ్యవాదం' అనే మాట చేర్చాలని పట్టుబట్టారు. బహిరంగంగానే అటూ ఇటూ చర్చ జరిగింది. సామ్రాజ్యవాదం అనే మాట అర్థశాస్త్రానికి, ప్రపంచ ఆర్థిక పరిణామాలకు సంబంధించినదని, మనదేశంలో కుల వ్యవస్థ సామాజిక రంగానికి, మనదేశానికి మాత్రమే సంబంధించినదని అనుకుంటున్నాను. కాదా? ఇలా రెండు మాటలను కలపవచ్చా? ఈ కొత్త మాటను అంగీకరించాలా?

అమరుల బంధుమిత్రుల సంఘం సభలలో విరసం నాయకులు మరొకరు దండకారణ్యంలో రాజ్యం పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నదని, విప్లవ పార్టీ సోషలిజాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. కాని ఎన్నో రోజులుగా నక్సలైట్ ఉద్యమ ప్రత్యేకత అది మన దేశాన్ని అర్ధ భూస్వామ్య, అర్ధ వలస రాజ్యంగా నిర్వచించడమే అని విన్నాను. ఇటువంటి దేశాలలో మొదట నూతన ప్రజాస్వామిక విప్లవం జరుగుతుందని, ప్రస్తుతం నక్సలైట్ పార్టీలు చేస్తున్న పని అదేనని విన్నాను. కాదా? మన సమాజాన్ని పెట్టుబడిదారీ సమాజంగా గుర్తిస్తున్నారా? ఇప్పుడు జరగవలసింది నూతన ప్రజాస్వామిక విప్లవం కాదా? సోషలిస్టు విప్లవమేనా?

కాలానికి తగినట్టు అవగాహనలు మార్చుకోవడం తప్పు కాదు. కాని నక్సలైట్ ఉద్యమం, విరసం ఏ అభిప్రాయాలకు మూలంలో కట్టుబడి ఉన్నాయో ఆ అవగాహనలు మార్చుకోవచ్చునా? ఆ మార్పు ఊరికే ఉపన్యాసం మధ్యలో చెప్పవచ్చునా? ఎన్నో సంవత్సరాలుగా వారి ఉపన్యాసాల, రచనల వల్లనే మాబోటి అభిమానులకు ఏర్పడిన అభిప్రాయాలు హఠాత్తుగా ఎలా మారాలి? ఈ విషయాలు ఎక్కడైనా సిద్ధాంతపూర్వకంగా చర్చించడం జరిగిందా? ఈ మార్పులు కేవలం ఈ ఒకరిద్దరు విరసం నాయకుల వ్యక్తిగత అభిప్రాయాలా, లేక విరసం మొత్తంగా అంగీకరించిన అభిప్రాయాలా, లేక విరసంకు మార్గదర్శిగా ఉండే నక్సలైట్ ఉద్యమపు అభిప్రాయాలు కూడానా?

తెలిసిన పెద్దలు వివరిస్తే బాగుంటుందని కోరుతున్నాను.

- కె. ఎల్లయ్య

పుస్తక పరిచయం (సీరియల్)

గతితార్కిక భౌతికవాదం

రెండో అధ్యాయం

తాత్త్విక వికాసంలోని ముఖ్య దశలు

- ఐరా గొలోబిన్

(8)

స్వేచ్ఛానువాదం : కొడవటిగంటి రోహిణీ ప్రసాద్

(గతసంచిక తరువాయి...)

పూర్వ వైజ్ఞానిక తత్వశాస్త్రం

తత్వశాస్త్రం అనేది 'వివిధ విషయాలను గురించిన ఆలోచనాత్మక అధ్యయనం' అన్నాడు తత్వవేత్త హెగెల్; అది వివిధ విషయాల అంతర్గత స్వభావాలను విశదపరిచే ఆలోచనాత్మక పరిజ్ఞానం.[1] ఈ 'ఆలోచనాత్మక అధ్యయనం'లో రెండు అంశాలుంటాయి; (భావనల రూపంలో) మేధస్సు యొక్క నిర్మాణాత్మక ప్రక్రియలూ, (ప్రభావవంతంగా ఉండే) భావావేశపరమైన వీను. మేధస్సు అంతకంతకూ సమగ్రమయే తార్కికశక్తిని సంతరించుకుంటుంది; భావావేశాలు వ్యవస్థీకృతమైన విలువలకేసి దారితీస్తాయి.

తత్వశాస్త్రం అనేది 'ఆశ్చర్యం'తో మొదలౌతుందో[2], 'సందేహం'తోనో[3], కొంతవరకూ రెండిటితోనో చెప్పలేంకాని 'ఆలోచనాత్మక అధ్యయనం' మూలాలన్నీ అతిప్రాచీన కాలానివీ, నమోదైన చరిత్ర మొదలవక మునుపటి వీను. ఈ ఆలోచనలన్నీ క్రమంగా పోగవుతున్న సాంకేతిక పరిజ్ఞానంతోనూ, సంస్కృతితోనూ పరస్పర చర్యలకు లోనవుతాయి. తేటతెల్లం అనిపిస్తున్న విషయాల్లో లోతుగా దాగి ఉన్న సత్యాన్ని ఈ ఆలోచనలు వీలున్నప్పుడల్లా ప్రత్యక్షంగా పరిశీలిస్తాయి; వీలుకానప్పుడు ఊహిస్తాయి. బానిస విధానం మొదలైనప్పుడే నాగరికత ఆరంభమైందని కొందరు సమాజ శాస్త్రవేత్తలంటారు కాని అది కాస్త నిర్హేతుకం అనిపిస్తుంది. '...స్వభావంలోగాని, తార్కిక, ప్రతీకాత్మకపద్ధతుల్లో యోచించడంలోగాని, నాగరిక, ఆదిమానవుల్లో భేదమేమీ ఉండదు'.[4] ఆదిమానవుల్లో కూడా విశిష్టులైన చింతకులుండేవారు; వారు మౌలికమైన సాధారణ సమస్యలతో తంటాలు పడ్డారు. వారికి వైజ్ఞానిక తత్వశాస్త్రపు ప్రాథమిక విషయాల అవగాహన కొంత ఉండేది. చాలా విషయాలను వస్తుగత రీతిలో అర్థం చేసుకోగలిగారు. వాటి చలనశీలతా, పరస్పర సంబంధాలూ వారికి అవగతం అయ్యాయి.[5] వర్గాలు ఏర్పాటుకానటువంటి (పూర్వవర్గ) ప్రాథమిక సాముదాయక సమాజాల్లో (తెగ, కులం) తత్వశాస్త్రాన్ని వివేకంగా గౌరవించేవారు. ఆ సమాజంలో వివేకవంతుడైనవాడు ఆలోచనాపరుడూ, వ్యవహర్తా కూడా. అటువంటి వ్యక్తిని సాముదాయక వివేకానికి ప్రతినిధిగానూ, రక్షకుడుగానూ గౌరవించేవారు. 'ఏ యుగంలోనైనా శ్రమ విభజనలో తత్వశాస్త్రానికి స్పష్టమైన స్థానం ఉండేది; దాని పూర్వోహలన్నీ పూర్వీకుల నుంచి అందిన ఖచ్చితమైన మేధో సమాచారం మీదనే ఆధారపడేవి. వాటినుంచే ఆ తత్వశాస్త్రం మొదలౌతుంది'.[6] తత్వశాస్త్ర చరిత్రకు ఒక తర్కం అంతర్గతంగా ఉంటుంది. 'ఈ చరిత్ర కేవలం కల్పనాత్మక ఊహలు కలబోసినట్టు కాదు; అనుకోకుండా జరిగేదీకాదు... ఇదొక శాస్త్రంగా వికాసం చెందుతున్న క్రమంలో తప్పనిసరిగా తలెత్తే దశలే ఇవన్నీ..'.[7]

సామాజిక ఆచరణలో ప్రగతి కలిగినప్పుడల్లా బోలెడంత సమాచారం పోగవుతుంది; ఇందులో కొంత భోగట్టా ముడిరూపంలో లభిస్తే, మరికొన్ని సమగ్రమైన వాస్తవాలుంటాయి. వాటిద్వారా విస్తృతమైన సమస్యలను లేవనెత్తి పరిష్కారాలు సూచించవచ్చు. సామాజిక ఆచరణలో ప్రగతి వల్ల యోచనా ప్రక్రియలు పరిపక్వం కావడం, యోచనలు మళ్ళీ ఆచరణను ప్రభావితం చెయ్యడం వీలైంది. అరిస్టాటిల్ లెక్కన 'జీవితావసరాలన్నీ లభ్యం అయిన తరవాతనే మనిషికి తాత్త్వికచింతన మొదలవుతుంది'.[8] అరిస్టాటిల్ కాలంలో తీరుబడిగా సౌఖ్య జీవనం గడిపే కొద్దిమంది సంపన్నులకూ, బానిసల యజమానులకూ, వారి పరివారానికీ మాత్రమే తత్వశాస్త్ర అధ్యయనం వంటిది చేసేందుకు వీలుండేది. అయితే కడుపు ఖాళీ అయినంత మాత్రాన బుద్ధి శూన్యమౌతుందనడానికీ లేదు. అంతేకాదు; సమస్యలకు పూర్తి పరిష్కారాన్ని వెతికి, కనిపెట్టి, ఉపయోగించేందుకుగాను తత్వశాస్త్రానికి తరుచుగా ప్రేరణ లభిస్తుంది; జీవితావసరాలు లోపించినంత మాత్రాన దానికేమీ భంగం కలగదు.

పూర్వ వైజ్ఞానిక దశలో తత్వశాస్త్రం సాధారణ సత్యాలూ, మూఢ నమ్మకాలతో కూడుకుని ఉండేది; ఇవన్నీ (మొదట్లో గారడీగానూ, ఆ తరవాత మతంగానూ) అసంపూర్ణమయిన భావాల తునకలుగా కలగలిసి ఉండేవి. ఆదిమానవులకు 'అతీంద్రియ హేతువులేవీ లేని వస్తుగత ప్రపంచం గురించిన అనుభవసిద్ధ చైతన్యం ఉండేది; వారు రోజువారీ సంఘటనలకు కాకుండా విపత్కర పరిస్థితుల్లో మాత్రమే' అతీంద్రియశక్తుల సహాయం కోరేవారు.[9] పూర్వవర్గ సమాజాల్లో మనుషులు గారడీ తమ శక్తులను పెంచుతుందనీ, దానివల్ల తమ సంకల్పాలకు ప్రకృతి మీదా, ఇతరుల మీదా ఆధిపత్యం కలుగుతుందనీ నమ్మేవారు. వర్గసమాజంలో పాలకవర్గాలు దోపిడీకి గురవుతున్న వర్గాలను భౌతికంగానేకాక, ఆధ్యాత్మికంగా కూడా మతం

అణుభౌతిక శాస్త్రవేత్త, పాపులర్ సైన్స్ రచయిత, సంగీతకారుడు, వక్త కొడవటిగంటి రోహిణీప్రసాద్ (1949-2012) మధుమేహ వ్యాధితో బాధపడుతూ మూత్రపిండాల ఇన్‌ఫెక్షన్‌కు చికిత్స పొందుతూ సెప్టెంబర్ 8న ముంబయి జస్లోక్ ఆసుపత్రిలో చనిపోయారు. ఎన్నో రాయాలని, ఇంకా ఎన్నో చెప్పాలని అనుకుంటూనే అకాలంగా మన మధ్య నుంచి వెళ్ళిపోయారు. అరుణతారకు ఆయన అందిస్తున్న గతితార్కిక భౌతికవాదం అనువాదం కూడా అర్థాంతరంగానే ఆగిపోనున్నది. కొడవటిగంటి రోహిణీప్రసాద్‌కు విరసం నివాళులు అర్పిస్తోంది... వచ్చే సంచికలో ఆయనపై సంస్మరణ వ్యాసం ఉంటుంది. - సం.

ద్వారా అణగదొక్కి ఉంచేందుకు నిత్యమూ ప్రయత్నిస్తూనే ఉంటాయి. గారడీలాగా కాకుండా మతంలో మనుషులు ప్రకృతిని శాసించరు. సర్వశక్తిమంతమైన అతీంద్రియశక్తి (లేదా శక్తుల) నుంచి వరాలు యాచించడానికి తమను తామే కించపరుచుకుంటారు. పార్శీ మతానికి దేవాదిదేవుడైన అహురమజ్దకు ఉన్న 72 పేర్లలో సృష్టికర్త, సంరక్షకుడు, పరిశుద్ధతముడు, సర్వజ్ఞుడు, స్వచ్ఛంద సర్వాధిపతి మొదలైనవి ఉన్నాయి.[10]

మతం ఒక ఆదిమ తత్వశాస్త్రం. 'ప్రపంచానికి వర్తించే సామాన్య సిద్ధాంతం'గా మతం మానవ జీవితాన్నంతటినీ పరిగణిస్తుంది.[11] '... భగవంతుడంటే ప్రకృతి యొక్క అతి సామాన్య లక్షణాలన్నిటి సమాహారమే...'[12] విజ్ఞానశాస్త్ర చరిత్రలో ఒక భాగమైన తాత్వికప్రగతి ఒక్కొక్కప్పుడు అర్థంలేని భావనలను తొలగిస్తుంది. లేదా వాటి స్థానే మరీ అసంగతం కావనిపించే భావనలను ప్రవేశపెడుతుంది.[13] పూర్వవర్గ తత్వవిచారం ఆదిమ సహజ భౌతికవాదంలోనూ, సహజ గతితర్కంలోనూ పరికాష్టకు చేరుకుంది.

ప్రాచీన కాలంలో ఏథెన్స్‌లో బానిస సమాజం బాగా భ్రష్టుపట్టిపోయిన దశలో వివేకవంతులను సోఫిస్టులనేవారు (సోఫిస్ట్రీజ్). వీరు పాలకవర్గాలకు జీవితంలో విజయమెలా సాధించాలో నేర్పే శిక్షకులుగా ఉండేవారు; పైకి సమంజసంగా కనిపించే తర్కాన్ని వంచనకు ఎలా ఉపయోగించాలో (సోఫిస్ట్రీ) కూడా వీరు నేర్పేవారు. గణితంలో అగ్రగామి అయిన పైథాగొరస్ తత్వవేత్త అనడానికి 'ఫిలాసఫర్' (వివేకాన్ని ప్రేమించేవాడు) అనే మాటను సృష్టించాడు; అది గంభీరమైన జ్ఞానాన్ని అన్వేషిస్తున్న సోఫిస్టులకు భిన్నంగా ఉండే పదం. ఈ అన్వేషణ ఇంకా పెద్ద ఎత్తున మొదలవని కాలమది.

తత్వశాస్త్రంలో రెండు ముఖ్యమైన అంశాలుంటాయి.

1. ప్రభావవంతమైన లక్ష్యాలు – తక్షణం, ప్రత్యక్ష పరిస్థితులకు పరిమితం కాకుండా విస్తృత పరిధి కలిగినటువంటి విలువల వ్యవస్థలు; తనకూ, ఇతరులకూ, సమాజ శ్రేయస్సుకూ అనుగుణమైన జీవితశైలికి వర్తించే నిబంధనలు. మనుషుల మధ్యనా, మనుషులకూ, ప్రపంచానికీ మధ్యనా ఉండే సంబంధాలతో వీటికి ప్రమేయం ఉంటుంది; వర్గ సంబంధాలతోనూ, వర్గరహిత సంబంధాలతోనూ కూడా అంతే.

2. మేధోపరమైన సాధనాలు – సమస్త విజ్ఞానం ద్వారా బాహ్యప్రపంచం గురించీ, తన గురించీ పొందినటువంటి ఖచ్చితమైన జ్ఞానం. గణితంలో యూక్లిడ్, పైథాగొరస్ కనిపెట్టిన విషయాలు దీని వికాసానికి చెప్పుకోదగ్గ ప్రేరణనిచ్చాయి. మొత్తం వ్యవస్థలో మనుషుల స్థానం ఎటువంటిదోననే జిజ్ఞాస కూడా ఈ శాస్త్రీయప్రగతిలోని భాగమే.

తత్వశాస్త్రంలోని సాధారణత్వంలో అనేక స్థాయిలుంటాయి. వీటిలో కొన్ని తత్వశాస్త్రరంగానికి పరిమితమైన అతి సామాన్యమైన స్థాయి ఒకటి. తక్కినవి అంత సామాన్యమైనవిగా అనిపించవు. అవి భౌతిక, రసాయన, ఆర్థిక, రాజకీయ, కళాశాస్త్రాలకూ, సాంకేతిక రంగాలకూ, వివిధ వృత్తులకూ సంబంధించిన తత్వ స్థాయిలు.

పూర్వవైజ్ఞానిక తత్వశాస్త్రం వివిధ విషయాల సామాన్య అంశాలను పరిగణిస్తుంది. ప్రతి విషయానికీ వర్తించే అతి సామాన్య అంశాలు కొన్నయితే, కొన్నిటికి మాత్రమే వర్తించే తక్కిన విషయాలు అంత సాధారణమైనవి కావు. పూర్వవైజ్ఞానిక తత్వశాస్త్రం విజ్ఞాన శాస్త్రాలు వికసించడానికి భూమికను సమకూర్చింది. 'అతి ప్రాచీన గ్రీక్ చింతకులెవరూ విజ్ఞానాన్నీ, తత్వశాస్త్రాన్నీ వేరువేరుగా పరిగణించలేదు'.[14] యాంత్రిక, గణిత, జీవశాస్త్రం వంటి ప్రత్యేక విషయాలను ప్రాథమిక, పూర్వవైజ్ఞానిక దశల్లో తత్వశాస్త్ర విభాగాలుగానే పరిగణించేవారు. 'సత్య విజ్ఞానమే తత్వశాస్త్రం' అన్నాడు అరిస్టాటిల్. ఐజాక్ న్యూటన్ తన ఉద్గ్రంథానికి ది మ్యాథమెటికల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ నేచురల్ ఫిలోసఫీ అని పేరు పెట్టుకున్నాడు. తత్వశాస్త్రానికీ, విజ్ఞాన శాస్త్రాలకూ మధ్యన ఇటువంటి బంధుత్వం పంతొమ్మిదో శతాబ్దం దాకా కొనసాగుతూనే వచ్చింది. జాన్ డాల్టన్ తన పథనిర్దేశక గ్రంథానికి న్యూ ప్రిన్సిపుల్స్ ఆఫ్ కెమికల్ ఫిలోసఫీ అని పేరు పెట్టాడు.

భూస్వామ్య విధానం పోయి పెట్టుబడిదారీ పద్ధతి వచ్చేదాకా విజ్ఞాన శాస్త్రాలకు ప్రత్యేకమైన గుర్తింపు రాలేదు. త్వరిత సాంకేతిక ప్రగతీ, సమాచారం క్రమబద్ధంగా పోగుపడడమూ అనేక రంగాల్లో వైజ్ఞానిక ఆవిష్కారాలను వేగవంతం చేశాయి. తత్వశాస్త్రమూ, సామాజిక శాస్త్రాలూ మాత్రం పూర్వవైజ్ఞానిక అపరిపక్వదశలోనే మిగిలిపోయాయి. అయినప్పటికీ ఈ ప్రత్యేక విజ్ఞానశాస్త్ర పరిశీలనల్లోని అనేక విషయాలూ, అంశాలూ అన్నీ కూడా కొంతవరకూ పోలికలు కలిగినవై ఉండేవి. ఇవన్నీ విశ్వవ్యాప్తంగా అన్ని విషయాలకూ, ప్రక్రియలకూ వర్తించే అతి సామాన్య లక్షణాలుగా అనిపిస్తాయి. వీటన్నిటి సమాహారమూ ఒక ప్రత్యేక శాస్త్రం అవుతుంది. తక్కిన విజ్ఞానశాస్త్రాలన్నీ పరిపక్వదశకు చేరుకున్నాక తత్వశాస్త్రంలో దిగబడిపోయిన విజ్ఞానం అదే.

References:

1. Hegel, *Logic*, p4
2. Hegel, *Lectures on the History of Philosophy*, Vol.2, p.135
3. Pisarev, "Popularizers of Negative Doctrines", *Selected Philosophical, Social and Political Essays*, p.561
4. Radin, *Primitive Man as Philosopher*, p.373
5. Ibid., pp.208-328, Srr also Chattopadhyaya, *Lokayata: A Studyin Ancient Indian Materialism*, Introduction
6. Engels, in Marx and Engels, *Selected Correspondence*, p.483
7. Hegel, *Lectures on the History of Philosophy*, Vol.3, p.552
8. Quoted in Hegel, ibid., Vol.l, p.51
9. Radian, *Primitive Man as Philosopher*, p.31
10. Tylor, *Religion in Primitive Culture*, p.441
11. Marx, in Marx and Engels, *On Religion, p.41*
12. Ludwig Feuerbach, quoted in Lenin, *Philosophical Notebooks*, p.81
13. Engels, in Marx and Engels, *Selected Correspondence*, p.482-83
14. Piaget, *Insights and Illusions of Philosophy, p.44*
15. Aristotle, *Metaphysics*, p.35
16. Quoted in Kaufman, *Hegel*, *pp.372, 374*

కరపత్రం

లక్షింపేట ప్రశ్నలకు సమాధానం ఎక్కడ?

లక్షింపేట దళిత మృతవీరులకు జోహార్లు!



నివర్తి సంగమేశ్ (40) చిత్తిరి అప్పడు (35) బూరాడ సుందరరావు (32) బొద్దూరు పాపయ్య (55) నివర్తి వెంకట్రావ్ (43)

ఉందర్రా మాలపేట
ఊరి చివర కష్టాలున్న చోటా..
ఊరి చివర కాష్టాలున్నచోటా..

దశాబ్దాల కిందటి పాట ఇది. ప్రపంచం అంతా మారిపోయిందని అంటారు. నిజమే చాలా మారింది. కానీ దళితులపై దాడులే ఆగిపోలేదు. కారంచేడులో ఎలా జరిగిందో, చుండూరులో ఎలా జరిగిందో, వేంపెంటలో ఎలా జరిగిందో సరిగ్గా అలాగే లక్షింపేటలో కూడా జరిగింది. పద్ధతుల్లో చిన్న తేడా ఉండొచ్చు. చంపిన తీరులో మరింత దుర్మార్గం ఉండొచ్చు. ఎక్కడైనా దళితల జీవితాలే గదా.. ఏం లెక్క ఉందీ కుల వ్యవస్థకి. ఆత్మగౌరవం కావాలన్నా చంపేయొచ్చు, సమానత్వం అడిగినా నరికేయవచ్చు, ఏకంగా భూమి అడిగారా .. వేంపెంటలోలాగే ఎక్కడైనా హత్యలు చేయవచ్చు.

అవును లక్షింపేటలో మాల కులస్తులు భూమి కావాలన్నారు. అందుకే ఈ నరమేధం. భారత సమాజంలోని నిచ్చెన మెట్ల కులవ్యవస్థ మారుతున్నట్లే ఉంటూ సజీవంగా ఉన్నదని చాటిచెప్తోంది లక్షింపేట. రాజ్యాంగం ప్రకటించిన.. ప్రతి మనిషికీ ఒకే విలువ అనే ఆధునిక సూత్రం అమలులోకి రాకుండా కులమనే సాంఘిక వ్యవస్థ అడ్డుకుంటోందని, దాన్ని ప్రశ్నిస్తే దారుణంగా కులం తిరగబడి మారణకాండ సృష్టిస్తోందని లక్షింపేట మరోసారి రుజువు చేస్తోంది.

కారంచేడు, చుండూరు, పదిరికుప్పం, వేంపెంట సంఘటనల వరుసలో ఇవాళ లక్ష్మింపేటలో దళితులపైన అమానుష దాడి జరిగింది. అయిదు నిండు ప్రాణాలను బలితీసుకొని 65 ఏండ్ల స్వతంత్ర భారత ప్రజాస్వామ్యం తన డొల్లతనాన్ని మనముందు ఉంచింది. ఈ హత్యల వెనక బూర్జువా, రాజకీయాలతోపాటు ఈ దేశంలోని ప్రధానమైన కుల, భూమి సమస్య ఉంది. దళితులు భూమి కావాలని అడిగితే ఈ కులవ్యవస్థ ఎట్లా స్పందిస్తుందో లక్షింపేటలో చూడవచ్చు. ఈ నేపథ్యంలో జూలై 16,17 తేదీలలో విరసం సభ్యులు మరికొందరు రచయితలతో కలిసి లక్షింపేట బాధితులతో మాట్లాడి కొన్ని వివరాలు తెలుసుకున్నారు.

ఈ ప్రాంతంలోని సువర్ణముఖి, వేగావతి నదీ సంగమ ప్రాంతం మడ్డువలస దగ్గర నిర్మించిన ప్రాజెక్టు కింద 14 గ్రామాల ప్రజలు వేల ఎకరాల భూములను పోగొట్టుకున్నారు. అరకొర ప్యాకేజీలతో ఎక్కువ మంది జనం పొట్టచేత పట్టుకొని చెట్టుకొకరు, పుట్టకొకరు వెళ్లిపోయారు. సంఘటన జరిగిన ప్రాంతంలో ప్రభుత్వమిచ్చిన నిర్వాసిత స్థలంలో ఇండ్లు నిర్మించుకొని ఉన్నవాళ్లలో కొట్టిశ, లక్ష్మింపేట గ్రామాల ప్రజలు ఉన్నారు. ప్రాజెక్టు కింద, ముంపు కింద పోయిన భూమిపోగా (ఎక్కువగా పాతకాపులు) మిగిలిన 250 ఎకరాలను లక్ష్మింపేట గ్రామస్థులు సాగు చేసుకుంటున్నారు. ఇందులో 190 ఎకరాలు బి.సి.లు, కాపులు, 60 ఎకరాలు మాల కులస్థులు సాగు చేసుకుంటున్నారు.

ఈ మొత్తం భూమికి ప్రభుత్వం ఎప్పుడో నష్టపరిహారం చెల్లించింది. దళితులు సాగు చేసుకుంటున్న భూమిలో 30 ఎకరాలు నష్టపరిహారం పొంది వదిలేసి వెళ్లిన దేవరకొండ గ్రామానికి చెందిన కాపు కులస్తులది. ఈ 30 ఎకరాల్లో 20 ఎకరాలు దళితులు కౌలుకు చేసుకుంటూ వస్తున్నారు. ఆ భూమికి సంబంధించిన పాత యజమానులు వెళ్లిపోయాక, తాము నష్టపరిహారం పొందిన భూమితోపాటు దీనికి కూడా లక్ష్మింపేట కాపువాళ్లు కౌలు వసూలు చేసుకుంటున్నారు. ఈ భూమి మొత్తం ప్రభుత్వపరమైందని ఆలస్యంగా తెలుసుకున్న దళితులు 2011 నుండి కౌలు చెల్లించడం మానేశారు. ఈ 60 ఎకరాలు ప్రభుత్వభూమి కాబట్టి తామే సాగుచేసుకుంటామని దళితులు నిర్ణయించుకోడంతో కాపులు ఆగ్రహించి దాడి చేశారు.

తాము సాగుచేస్తున్న 190 ఎకరాలతోపాటు ఈ 60 ఎకరాలు కూడా తమకే చెందాలని కాపు కులస్తులు దళితులపైన వొత్తిడి తెచ్చారు. దీంతో దళితులు ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నారు. ఈ భూమికి గవర్నమెంటు నష్టపరిహారం చెల్లించి ఉన్నందు వల్ల అది ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నట్లే. కానీ భూమి లేని దళితులు పదేళ్లుగా ఖాస్తులో ఉన్నారు కనుక ఆ భూమి మీద హక్కు దళితులకు దక్కడం న్యాయం. కాబట్టి దీనిని సరైన రీతిలో ఇరువర్గాలను కూర్చోబెట్టి ప్రభుత్వం పంపిణీ చేసిఉంటే అసలు ఈ రోజు ఇంత దారుణం జరిగి ఉండేది కాదు.

ఇరువర్గాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు స్టే ఆర్డర్

ఇస్తూ ఎవరూ సాగు చేయకుండా ఆదేశాలు జారీ చేసింది. దీంతో కాపుల ఆహం దెబ్బతిన్నది. బి.సిలను రెచ్చగొట్టింది. గతంలో తమసాగులో ఉన్న భూమిపై హక్కు దళితుల వల్లే కోల్పోయామని ఒకవైపు బిసిలు భావించారు. మరోవైపు సమస్యను తెగనివ్వకుండా అదే వర్గానికి చెందిన మాజీ ఎం.పి.పి, మంత్రి బొత్స సత్యనారాయణ బంధువు బొత్స వాసుదేవనాయుడు తన రాజకీయ ప్రాబల్యం కోసం ఎత్తుగడగా దాన్ని మరింత రాజేశాడు. దీనికి మంత్రులు బొత్స సత్యనారాయణ, కొండ్రు మురళి కొమ్ముకాశారు. దీంతో ఎన్నాళ్లుగానో రగులుతున్న పగను తీర్చుకొనేందుకు ఉప ఎన్నికల సమయం అంది వచ్చింది. గత ఆరునెలలుగా అక్కడ పోలీస్ పికెట్ కొనసాగుతోంది. బలగాలు ఎన్నికల డ్యూటీకి వెళ్లాక దళితులంతా ఆరోజు ఉదయం చద్దన్నం తినడానికి ఇంట్లో ఉన్న సమయంలో కాపువర్గానికి చెందిన సుమారు 200 మంది ఆడ, మగ, పిల్లలతో సహా కత్తులు, నాటుబాంబులు, రాళ్లతో వారిపై దాడి చేశారు. ఇంట్లోనుంచి ముంగిటకు లాక్కొనివచ్చి అతిదారుణంగా కొట్టిచంపారు. వృషణాలపై రాళ్లతో కొట్టి చంపి, కొనూపిరితో కొట్టుకుంటున్న వాళ్ల గుండెల్లో గునపాలు దించి హత్య చేశారు.

మహిళలను ఇళ్లలో నుండి లాక్కొని వచ్చి, 'మీకు భూమి కావల్సివచ్చిందా' అంటూ కులం పేరుతో దూషిస్తూ చెప్పుకోలేని చోట కర్రలతో, రాళ్లతో కొట్టారు. జూన్ 12న జరిగిన ఈ దాడిలో దళితులు బూరాడ సుందరరావు, చిత్రి అప్పుడు, నెవర్తి వెంకటి, నెవర్తి సంగమేసులు అక్కడికక్కడే చనిపోయారు. మరో ముప్పై మంది గాయపడ్డారు. వీరిలో కొందరు చావుబతుకుల్లో కెజిహెచ్‌లో చేరగా జూన్ 20న చికిత్స పొందుతూ బూరాడ పాపయ్య అనే మరో దళితుడు చనిపోయాడు. ఈయనసైతే కళ్లలో బల్లెంతో పొడిచారు. వారికి దళితుల పట్ల ఉన్న కసి, పగ ఈ హత్యాకాండ జరిపిన తీరు తెలియజేస్తోంది. దళితులపై జరిగే దాడుల తీవ్రత మామూలుగా కంటే భూమిపై హక్కు అడిగినప్పుడు మరింత దారుణంగా ఉంటుందనడానికి లక్షింపేట మారణకాండ కూడా తాజా ఉదాహరణ.

ఇంత దారుణం జరిగినా ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించలేదు. మరో వైపు పోలీసులు, అధికారులు ఇది ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ అని ప్రచారం చేశారు. దీనిని సమర్థించుకోవడానికి కాపు వర్గానికి చెందిన కొంతమందికి గాయాలైనట్లు డాక్టర్లచేత తప్పుడు సర్టిఫికెట్లు ఇప్పించారు.

నిజానికి గతంలోనే బూరాడ సుందరరావు, చిత్రి శ్రీదేవిలపై కాపు వర్గం వారు దాడి చేసినప్పుడే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏంచేసైనా దళితులను బెదరగొట్టి భూములు స్వాధీనం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న వారి వల్ల అక్కడ దళితులకు ఏమాత్రం భద్రత లేదని, ఏ క్షణంలోనైనా ఏమైనా జరగొచ్చనే ఆందోళన ఉంది. ప్రభుత్వ స్పందన ఇట్లా ఉండడంతో నిందితులు నిర్భయంగా, బాధితులు భయం భయంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జూన్ 12 మారణహోమంపై దళితులు కేసులు పెట్టారన్న కక్ష కూడా కాపులకు ఉంది. చివరికి అంతా జరిగాక ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా నష్టపరిహారం ప్రకటించింది. దానిపైన కూడా సరైన ఆదేశాలు రాలేదు. దీనితో దళిత, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల వారు చనిపోయిన మృతదేహాలను ఖననం చేయకుండా మూడు రోజులు పోరాటం చేయడంతో కదిలిన అధికార యంత్రాంగం చనిపోయినవారికి 5 లక్షల చొప్పున నష్టపరిహారం, కుటుంబసభ్యులలో ఒకరికి ఉద్యోగం, దళితులకు ఎకరా చొప్పున భూమి ఇవ్వడానికి, అలాగే దాడికి పాల్పడిన వారిపై చర్యలకు హామీ ఇవ్వడంతో 14వ తేదీ 2012 సాయంత్రం మృతదేహాలను ఖననం చేశారు. ఆ తర్వాత ఇద్దరు ముఖ్యులను అరెస్టు చేసినట్లు చూపించారు కూడ. అయినా ఈ హామీలకు, కేసులకు ఏగతి పడుతుందో ప్రజల అనుభవంలో ఉన్నదే. వీటి అమలుకు పోరాటం చేయాల్సిందే. అంత కంటే ముఖ్యంగా లక్షింపేట సంఘటన నుండి కొన్ని మౌలిక ప్రశ్నలు వేసుకోవలసి ఉంది.

గత సంఘటనల్లో దళితులపై దాడి చేసినవారు ప్రధానంగా రెడ్డి, కమ్మ వర్గానికి చెందినవారు. వీరికి భూమిపై, అధికార రాజకీయాలపై ఉన్న పట్టు తెలిసిందే. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో వాళ్లు భూమిపై అధికారం పొందుతూ ఎట్లా రాజకీయంగా ఎదిగి వచ్చారన్నది ఇటీవలి చరిత్రే. లక్షింపేటలో మాత్రం దాడి చేసిన కాపులు ప్రభుత్వ జాబితా ప్రకారం వెనకబడిన వర్గాలు. .కొన్ని బిసి కులాల్లో కొందరు మెల్లగా అధికారంలోకి ఎగబాకుతూ అగ్రకుల స్వభావాన్ని సంతరించుకోవడం గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఒక పరిణామం.

లక్షింపేటలో దళితులపై దాడి చేసిన కాపు కులస్తుల్లో ఒక సమూహం ప్రాబల్యం ఉత్తరాంధ్రలో ఎక్కువగా ఉంది. దళితులకంటే సాంఘికంగా పై స్థానంలో ఉన్నందు వల్ల వారి ప్రాబల్యం ఉన్నచోట రెండు గ్లాసుల పద్ధతి కూడా అమలువుతోందంటే పరిస్థితి ఎంత సంక్లిష్టమైందో అర్థం చేసుకోవచ్చు.

ఈ స్థితిని పాలకవర్గాలు తమ రాజకీయాల కోసం వాడుకోవడమేగాక, ప్రోత్సహిస్తూ కూడా వచ్చాయి. మాటల్లో దళితుల పక్షాన ఉన్నట్టు భ్రమింపజేస్తూ దళితుల ఓట్ల కోసం పైపై దళిత సంక్షేమాన్ని వల్లిస్తూ.. అన్నిటినీ ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం పార్లమెంటరీ రాజకీయాల్లో ఇటీవల మరీ ఎక్కువైపోయింది. పాలక రాజకీయాల్లోకి వెళ్లిన దళిత ప్రజా ప్రతినిధులు, మంత్రులు కూడా దీనికి అతీతంగా లేరని లక్షింపేట ఘటన చెప్తోంది.

లక్షింపేట దళితులు ఎన్నాళ్లుగానో సాగు చేస్తున్న భూములపై హక్కు కల్పించడానికి స్థానిక ఎం.ఎల్.ఎ, అధికార గణం కనీసంగా ప్రయత్నించలేదు. భూమి కోసం దళితులు పోరాటం చేసినా వాళ్ల న్యాయమైన హక్కును గుర్తించలేదు. పైగా దళితులకు అందుతున్న పింఛన్‌లు నిలిపేశారు. ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇవన్నీ ప్రభుత్వ దృష్టిలో ఉన్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. అధికారం, అగ్రకుల తత్వం, ఓట్ల రాజకీయాలు కలిసి దళితుల సమస్యను పరిష్కరించకపోగా మరింత తీవ్రం చేశాయి. అధికారులు స్వప్రయోజనాల కోసం పెత్తందారీ వర్గాల కాపు కాశారు.

స్థానిక ఎంఎల్ఎ, మంత్రి కొండ్రు మురళి దళితుడైనా అధికారవర్గంలో భాగమయ్యాడు. ఆయన ఎంఎల్ఎ, ఆ తర్వాత మంత్రి అయ్యాక ఇంక ఏ మాత్రం దళితుడిగా లేడు. అధికారపక్షంలో నిలబడి, ప్రశ్నించిన వారి అంతు తేలుస్తానంటున్నాడు. ఆ తర్వాత ఎన్ని మాయమాటలు చెప్పినా జరిగిన దారుణంలో ఆయన దళితుల పక్షాన లేడు. రాజకీయంగా, ఆర్థికంగానేగాక సాంఘికంగా కూడా ఆయన అధికారవర్గంలో చేరిపోయాడు. అందుకే ఆయనకు దళితులపై ప్రేమ లేకపోగా ఈ మొత్తం ఘటనకు బాధ్యుడయ్యాడు. ఈ మారణకాండ వెనుక ఆయన పాత్రను బాధితులు గట్టిగా నిలదీస్తున్నారు. అట్లాగే ఆ ప్రాంతంలోని ముఖ్య అధికారులు బాధితుల కులానికి చెందినవారే. అయినా దళితుల భూమి సమస్యను పరిష్కరించలేదు. పైగా ఇంత దారుణం జరిగాక కూడా వారు అన్యాయంగా వ్యవహరించారు.

ఇది స్పష్టంగా పార్లమెంటరీ రాజకీయాల స్వరూపాన్ని తెలియజేస్తుంది. రాజకీయాల కోసం కులాన్ని వాడుకోవడమేగాని, పీడిత కులాల మౌలిక సమస్యల పరిష్కారానికి ఆ రాజకీయ చట్రంలో చోటు లేదు. పార్లమెంటరీ రాజకీయాల్లోకి దళితులు వెళ్లినా పేద దళితులకు ఏమీ లాభం ఉండకపోగా వాళ్లు అగ్రకుల పాలక వర్గాల పక్షాన నిలబడి దళితులపై దాడులకు కారణమవుతారు. రాజకీయాల్లో దళితుల, బలహీనవర్గాల ప్రాతినిధ్యం కావాలనడం ప్రజాస్వామికమే కాని మొత్తంగా రాజ్యాంగయంత్రం మీద, ఉత్పత్తిసాధనాల మీద అధికారం పాలకవర్గం చెలాయిస్తోందని ఈ ఘటన నిరూపిస్తోంది. అందువల్ల పార్లమెంటరీ రాజకీయాల్లో దళితులకు ప్రాతినిధ్యం దొరికినా భూమి, సాంఘిక పీడనల వంటి ఏ మౌలిక సమస్యా పరిష్కారం కావడం లేదు.

అంత మాత్రాన ఇది కేవలం వర్గ సమస్య అనో లేదా రాజకీయ సమస్య అనో అనుకుంటే పొరబాటే. ఇది ప్రధానంగా కుల సమస్య. లక్షింపేటలో భూమి కావాలని అన్నది దళితులు కాకుండా మరో కులస్తులైతే ఈ సంఘర్షణ సరిగ్గా ఇట్లాగే ఉంటుందని చెప్పలేం. వాళ్లు సాంఘికంగా దళితులు కావడం, బతుకు తెరువు కోసం భూమి కావాలని కోరుకోవడం నేరమైపోయింది.

ఈ ఘటనకంటే బాధాకరమైన పరిణామాలు ఆ తర్వాత జరిగాయి. బాధితుల పట్ల దృఢంగా నిలబడి ఉద్యమించాల్సిన కొన్ని దళిత సంఘాల నాయకులు ఘటనను ఖండిస్తూనే ఎంఎల్ఎ మురళి పక్షాన నిలబడ్డారు. ఆయనపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టి, దళితుడు మంత్రి అయితే ఓర్వలేక ఈ విమర్శలు పెడుతున్నారని ప్రత్యారోపణ చేశారు. వాళ్లు ఈ వైఖరిని ఆదాటున తీసుకున్నారనడానికి లేదు. మౌలికంగా దళితుల సమస్యపట్ల అవగాహనా రాహిత్యాన్ని, అవకాశవాదాన్ని ఇది తెలియజేస్తోంది. ఇంత బాహాటంగా దాడికి కారణమైనవాడు దళితుడు కాబట్టి సమర్థిస్తామని తెగబడడం దేనికి సంకేతం? దళిత ఉద్యమ గమనానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలను లక్షింపేట ఘటన ఇట్లా విషాదంగా మన ముందుకు తెచ్చింది. ఈ బహిరంగ వైఖరి వెనుక మతలబు ఏమిటని ఎవరికైనా సందేహం ఎందుకు రాకూడదు?

దళిత ఉద్యమంలోని ఈ పెడ ధోరణి పార్లమెంటరీవాదం నుంచి పుట్టుకొచ్చిన రుగ్మత. సారాంశంలో ఇది బూర్జువా దళిత వాదం. ఈ మాట విప్లవకారులు, విప్లవ రచయితలు పదేళ్ల కిందే అంటే నానా రభసా చేశారు. కానీ కాలం ఇప్పుడు నిరూపించింది. ఇరవై ఏళ్ల కిందటే దళిత విముక్తి పేరుతో దళిత ఉద్యమంలో బూర్జువా ధోరణులు తలెత్తాయి. ఆ మాటకొస్తే మొదటి నుంచీ ఈ సమస్య ఉంది. ఇది దళితుల భూమి సమస్య, ఆత్మగౌరవం సమస్య.. అంతిమంగా దళితుల విముక్తికి మేలు చేయపోగా అవరోధంగా మారుతోంది. ఇప్పుడైతే నేరుగా దళితులను హత్య చేసినవాడి పంచన చేరి నేరస్తుడ్ని కాపాడాలని కొందరు చూస్తున్నారు.

ఈ దేశంలోని వివిధ సమూహాలుగా ఉన్న పీడిత కులాలు వ్యవస్థను మార్చే మౌలిక పోరాటాల ద్వారానే విముక్తిని సాధించగలరు. దళితుల ఆత్మగౌరవంలో భాగంగా దేవాలయాల ప్రవేశం, సమాన సాంఘిక హోదా కోసం పోరాడినప్పుడల్లా ఈ కనీస ఆకాంక్షను తొక్కివేయడానికి అగ్రకుల బ్రాహ్మణీయం ఎన్ని ప్రయత్నాలు చేస్తుందో నిత్యం చూస్తూనే ఉన్నాం. రిజర్వేషన్ల అమలు, రిజర్వేషన్ల వర్గీకరణ మొదలైన ప్రజాస్వామిక డిమాండ్లతోపాటు భూమి మీద హక్కు సాధించుకోడానికి దళితులు ఉద్యమించవలసి ఉంది. అంటరానితనానికి కారణమైన కుల సాంఘిక సంబంధాల రద్దు దిశగా ఉద్యమిస్తూనే ఉత్పత్తిసాధనాల మీది యాజమాన్యం కోసం పోరాడాల్సి ఉంది. లక్షింపేట దారుణఘటన ఈ సంక్లిష్ట విషయాలను మరోసారి ముందుకు తెచ్చింది.

ఎన్ని చేతులు కలిసినా బాధిత కుటుంబాల కన్నీరు తుడవలేవు. మన హృదయాలను వారి ముందు ఎంత పరిచినా వారి విషాదాన్ని రద్దు చేయలేవు. అయితే ఈ దుర్మార్గాలు ఈ నేల మీద పదే పదే ఎందుకు జరుగుతున్నాయి? ఎంత సుదీర్ఘకాలంపట్టినా సరే శాశ్వత పరిష్కారం ఎక్కడ ఉంది? దళితులు నిత్యం దోపిడీకి గురికాకుండా, ఆత్మగౌరవంతో జీవించగలిగే సమాజం ఎట్లా వస్తుంది? అనే ప్రశ్నలు చాలా విలువైనవి. ఇవి లక్షింపేట అమరుల నిండు జీవితాల అంత విలువైనవి.

పార్లమెంటరీ పంథాలో, రాజ్యాంగవాదంలో ఎంత వెతుక్కున్నా సమాధానాలు దొరకవు. రాజ్యాంగం హామీపడ్డవాటన్నిటి కోసం పోరాడాల్సిందే. అవి రాజ్యాంగంలోకి రావడానికి వెనుక దళితులు, ప్రజాస్వామిక శక్తులు చేసిన పోరాటాలు ఉన్నాయి. వాటిని పొందడం దళితుల హక్కు. వాటి కోసం పోరాడుతూనే లక్షింపేటలు పదేపదే వినిపిస్తున్న ప్రశ్నలకు సమాధానం వెతకాలి. వాటికి బూర్జువా పద్ధతిలో ఎన్నటికీ సమాధానం దొరకవు. విప్లవ మార్గంలోనే కుల వ్యవస్థకు పరిష్కారం దొరుకుతుందని విరసం భావిస్తోంది. మరో కారంచేడు, చుండూరు, వేంపెంట, లక్షింపేట జరగకుండా దళితుల విముక్తిబాటలో ప్రయాణించాల్సి ఉంది. లక్షింపేట అమరులకు నివాళి అంటే అట్లాంటి మార్గంలో పురోగమించడమే.

జూలై 18, 2012 విప్లవ రచయితల సంఘం

కరపత్రం

అమరుల బంధు మిత్రుల సంఘం దశాబ్ది మహా సభలు

18, 19 జూలై-2012, హైదరాబాదు

గ్రీన్‌హంట్ వ్యతిరేక చైతన్యంతో అమరులను స్మరించుకుందాం

18వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సుభాష్ నగర్ అమరుల స్థూపం దగ్గర సంస్మరణ సభ
19న ఉదయం 10 గంటల నుంచి రాత్రిదాకా బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో...

పది శిశిరాల మధ్యనే భవిష్యత్ వసంతం కోసం కంటున్న కల ఇది. అంతా కూలిపోయిన చోటనే ఒక నూతన నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నం ఇది. కాలిపోయిన కన్నపేగును తలచుకుంటూ కుంగిపోకుండా బిడ్డల ఆశయాలను, జీవిత సహచరుల చైతన్యాన్ని సొంతం చేసుకున్న సంఘం ఇది. పదిహేనేళ్ళ కింద ఎన్‌కౌంటర్ మృతదేహాల స్వాధీనం కోసం ప్రజాస్వామికవాదులు, రచయితలు, కళాకారులు చాలా ప్రయత్నాలు చేశారు. ఆ అనుభవం నుంచి, కుటుంబ సభ్యులను కోల్పోయిన వ్యథ నుంచి ఆంధ్రప్రదేశ్ అమరుల బంధు మిత్రుల సంఘం పుట్టింది. తెలుగు నేల మీద విప్లవోద్యమ అభివృద్ధి క్రమంలో ఆవిర్భవించిన సంఘం. అందుకే ఇవాళ అమరుల మృతదేహాలను స్వాధీనం చేసుకోవడం, అంత్యక్రియలు జరపడం, సంస్మరణ సభలు నిర్వహించండం అతి ముఖ్యమైన రాజ్యహింస వ్యతిరేక ఉద్యమమేగాక, ఒక గొప్ప విప్లవ సాంస్కృతిక ఉద్యమంగా కూడా ముందుకు వచ్చింది. అమరత్వమనే విషాద సందర్భంలో వేలాదిగా విప్లవ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని దాన్ని పోరాట రూపంగా మార్చారు.

తెలంగాణ సాయుధ పోరాటంలో, శ్రీకాకుళ ఉద్యమంలో వందలాదిగా ప్రాణత్యాగం చేసినా శవాలను స్వాధీనం చేసుకొని గౌరవంగా అంత్యక్రియలు జరపగలమనే ఆలోచనే లేదు. అది ఒక చారిత్రక పరిమితి. శవాల స్వాధీనం కూడా ఒక ఉద్యమమని 1990లలోగాని మనకు తెలిసిరాలేదు. తెలుగు సమాజంలోని పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమం వల్ల, ప్రజా సాంస్కృతికోద్యమ సంప్రదాయం వల్ల ఈ నూతన చైతన్యం, పోరాట రూపం ముందుకు వచ్చింది. అచ్చంగా పోరాటం నుంచేగాక దుఃఖం నుంచీ ఈ సంఘం పుట్టిందని గుర్తు పెట్టుకోకపోతే దీని శక్తి, ప్రత్యేకత, విశిష్టత తెలియదు. గుండెలవిసేలా ఏడ్చాక కండ్లు తుడుచుకొని లేచి నిలబడి లోకంలో ఈ దుఃఖమే ఉండొద్దని చేసే పోరాటం వంటిది ఈ సంఘం.

అమరుల కుటుంబ సభ్యులు కావడం అనేది కేవలం నైతిక శక్తి మాత్రమే అయితే బాధితుల సంఘంగా మిగిలిపోయేది. అప్పుడు బాధితుల సంక్షేమం మాత్రమే దాని ఏకైక కార్యక్రమం అయ్యేది. కానీ బంధుమిత్రుల సంఘం పోరాట సంఘం. రాజ్యహింసను వ్యతిరేకిస్తూ విప్లవోద్యమాన్ని హృదయానికి హత్తుకుంటున్న సంఘం. కోల్పోయిన బిడ్డల స్థానే వాళ్ళు నిర్మించిన ఉద్యమం, అందులో రహస్య విద్యుత్ తరంగంల్లా ప్రవహించే వాళ్ళ జ్ఞాపకాలు ఉన్నందున దాన్నే తల్లులు తమ గుండెలకు హత్తుకొని సంఘటితమయ్యారు.

అందువల్ల అమరుల బంధు మిత్రుల సంఘానికి దశాబ్ది సందర్భంగా పది వసంతాలనడానికి కన్నీళ్ళ అడ్డం వస్తున్నాయి. గుండె కోతకు వసంత ఆగమనం ఉంటుందా? నిత్య శిశిరాల మధ్యనే అమరుల స్వప్నం నిజమయ్యేరోజే నిండైన వసంతం అనుకోవాల్సిన సంఘం ఇది. అందువల్ల ఈ దశాబ్ది సభలను (రెండో రాష్ట్ర మహాసభలను) కూడా యుద్ధ వ్యతిరేక చైతన్యంతో జరుపుకోవాలని సంకల్పించాం.

2002 జూలై 18న అమరుల బంధుమిత్రుల సంఘం ఆవిర్భవించింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ఆ రోజును అమరుల సంస్మరణలో రాజ్యహింస వ్యతిరేక దినంగా నిర్వహిస్తున్నాం. అట్లా రాష్ట్ర వ్యాప్తంగా విప్లవోద్యమంలో అమరులైనవారందరినీ సంస్మరించుకొనే సంప్రదాయం ప్రారంభమైంది. 2008 జూలై 17, 18 తేదీల్లో మొదటి మహా సభలు జరిగాయి. ఇప్పుడు ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక చైతన్యంతో అమరులను స్మరించుకుందామని రెండో మహాసభలను తలపెట్టాం.

ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం మొదలైనప్పటి నుంచి వేల మంది విప్లవకారులను, విప్లవ సానుభూతిపరులను రాజ్యం హత్య చేసింది. విప్లవోద్యమ ఉధృతినిబట్టి నిర్బంధ రూపాలు మారుతూ వచ్చాయి. గత మూడేళ్ళలో రాజ్యహింస నేరుగా యుద్ధంగా మారిపోయింది. రాజ్యాంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకుంటున్న భారత ప్రభుత్వం దేశ ప్రజలపై యుద్ధం చేస్తోంది. మావోయిస్టులు దేశ అంతరంగిక భద్రతకు ముప్పుగా తయారయ్యారని మొదలుపెట్టిన ఈ యుద్ధం కేవలం మావోయిస్టుల మీదనే కాదు, దండకారణ్యంలోని ఆదివాసుల మీద మాత్రమే కాదు, ఏకంగా ఈ దేశ ప్రజలపై చేస్తున్న యుద్ధం. ప్రజాప్రాతినిధ్యం అనే ప్రక్రియ ద్వారా అధికారం పొందిన వర్గం ఈ దేశ ప్రజలందరిపైన, ఆదివాసులపైన, దళితులపైన, మహిళలపైన... మొత్తంగా ఉత్పత్తిదాయకమైన ప్రజలందరిపైన చేస్తున్న యుద్ధం ఇది.

ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తిరస్కరిస్తూ నిజమైన స్వాతంత్ర్యం కావాలని ప్రజలు పోరాడుతున్నారు. దండకారణ్య ఆదివాసులకు, దేశ ప్రజలకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు అమెరికా మార్గదర్శకంలో భారత ప్రభుత్వం ఆలౌట్ వార్ ప్రకటించింది. ఇది ఇప్పటికే మొదటి దశను దాటి రెండో దశలోకి చేరుకున్నది. ఈ యుద్ధం మొదలయ్యాక వందలాది మంది ఆదివాసీ విప్లవకారులు అమరులయ్యారు. వీరిలో మహిళలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ దారుణమైన మారణకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతున్నది. ప్రపంచంలోని మేధావులు, ప్రజాస్వామికవాదులు గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిస్తున్నారు.

ఈ ప్రజాస్వామిక ఆందోళనలో అమరుల బంధు మిత్రుల

కరపత్రం

చివరి ఊపిరిదాకా పోరాట ఎర్ర జెండాను దృఢంగా ఎత్తిపట్టిన కామ్రేడ్ గోరు మాధవరావుకు ఎర్రెర్రని జోహార్లు!

సంస్మరణ సభ

ఆగస్టు 10 శుక్రవారం, ఉదయం 10గంటలకు, స్థలం : అమరుల స్మారక భవనం, శ్రీకాకుళం జిల్లా, బొడ్డపాడు గ్రామం.

సంస్మరణ సభా కార్యక్రమం

అధ్యక్షత : బత్తుల జయంతి (అమరుడు మాధవరావు మనువరాలు) వక్తలు : వరవరరావు, రాజ్‌కిషోర్, మానస్‌కార్ చౌదరి - ఆర్.డి.ఎఫ్.; జి. కళ్యాణరావు, చలసాని ప్రసాద్ - విరసం; జయమ్మ, కోదండరావు, వెంపటావు భారతి, గంటి ప్రసాదం - ఏ.బి.ఎం.ఎస్.; వై. వెంకటేశ్వర్లు - పి.డి.ఎం.; దండపాణి మహంతి - ఒడిశా; పైల చంద్రమ్మ - సి.పి.ఐ.(ఎం.ఎల్) న్యూడెమోక్రసి; ఎం. మల్లేశ్వర రావు - సి.పి.ఐ. (ఎం.ఎల్) లిబరేషన్; తామాడ త్రిలోచన్, దాసరి శ్రీరాములు, పుచ్చ దుర్యోధన - మాధవరావు ఆప్తమిత్రులు; ప్రజా విప్లవ సాంస్కృతిక కార్యకర్తల ఆట, పాట కార్యక్రమాలు ఉంటాయి.

శ్రీకాకుళం జిల్లా సోంపేట సమీపం జింకిభద్ర గ్రామంలోని ఒక దిగువ మధ్యతరగతి చేనేత కార్మిక కుటుంబంలో పుట్టిన గోరుమాధవరావు పెరిగి పెద్దయి కమ్యూనిస్టయ్యాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలతో కూడిన మాధవరావు కుటుంబానికి అతడి తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన చిన్నపాటి కొంప తప్ప వేరే ఆస్తిపాస్తులేవీ లేవు. అయినా మాధవరావు నిత్యం కమ్యూనిస్టు పార్టీ పనుల్లో మునిగి తేలుతుంటే, కుటుంబ పోషణ బరువు, బాధ్యతలు అతడి భార్య ముత్యాలమ్మే మోసింది.

ఒకప్పటి అవిభక్త శ్రీకాకుళం జిల్లాలో గంటి రాజేశ్వరరావు, మార్పు పద్మనాభం నిర్మించిన నాటి అవిభక్త కమ్యూనిస్టు ఉద్యమకాలం

సంఘం మొదటి నుంచి పాలుపంచుకుంటున్నది. రాష్ట్రంలోనేగాక, ఇతర ప్రాంతాల్లో బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో అమరులైన విప్లవకారుల మృతదేహాలను తీసుకొని వచ్చి కుటుంబ సభ్యులకు అందించి విప్లవ సంప్రదాయంలో అంత్యక్రియలు జరపడంలో క్రియాశీలంగా పని చేస్తున్నది.

అమరుల బంధు మిత్రుల సంఘం ఏర్పడేనాటికి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నిర్బంధం, చత్తీస్‌గడ్‌లో సాల్వాజుడుం దాడుల రూపంలో రాజ్యహింస కొనసాగుతుండేది. ఎన్‌కౌంటర్లను వ్యతిరేకించినందుకు, శవాల స్వాధీనం కోసం వెళ్ళినందుకు, అమరులకు స్థూపాలు నిర్మించి, సంస్మరణ సభలు జరిపినందుకు మా సంఘ సభ్యులు అరెస్టులు, లాఠీ దెబ్బలు, కేసులు, వేధింపులు అనుభవించాల్సి వచ్చింది. కొడుకులను పోగొట్టుకున్న వృద్ధ తల్లిదండ్రులు, జీవన సహచరులను కోల్పోయిన మహిళలు పుట్టెడు దుఃఖంలో ఉంటూనే అమరుల ఆశయ సాధన కోసం నిలబడ్డందుకు మా సంస్థ సభ్యులు నిర్బంధం ఎదుర్కోవాల్సి వచ్చింది.

అయినా ఈ పరీక్షకు మా సంస్థ దృఢంగా నిలబడ్డది. ధ్వంసమైన జీవితాల నుంచి, కడుపుకోత నుంచి, ఎడబాటు నుంచి, నిర్బంధపు నిప్పుల గుండం నుంచి పుట్టిన సంఘం కాబట్టి అమరుల బంధు మిత్రుల సంఘం నిరాటంకంగా దశాబ్దాన్ని పూర్తి చేసుకుంది. మార్క్స్ కార్మికవర్గం గురించి సామాజికంగా పోయేదేమీ లేనివాళ్ళని అన్నట్లు మేం మా వ్యక్తిగత, కుటుంబ జీవితంలో ఇంతకంటే పోయేదేమీ లేనివాళ్ళం. ఇంతకంటే దుఃఖాన్ని ఏం అనుభవించగలం? అందుకే మా కుటుంబ సభ్యులైన అమరుల ఆశయాలను మేం స్వీకరించాం. పేగుబంధాన్ని, అది ముడివేసిన రాజకీయ బంధాన్ని ఎంత నిర్బంధమైనా ఏమీ చేయలేదని మా సంఘ సభ్యులు ఈ దశాబ్దంలో నిరూపించారు. నిర్బంధం మధ్యనే సరిహద్దు రాష్ట్రాలకు వెళ్ళి అక్కడ అమరులైన వీరుల మృతదేహాలను తీవ్ర నిర్బంధ పరిస్థితుల మధ్య తీసుకొని వచ్చాం. గుర్తు తెలియని మృతదేహాలను స్వాధీనం చేసుకోడానికి న్యాయ పోరాటం చేసి విజయం సాధించాం. ఖననం చేసిన శవాలను కూడా వెలికి తీయించి తల్లిదండ్రులకు అప్పగించాం. ఈ సమాజం మానవీయంగా మారాలని, కన్నీరు లేని జీవితం కావాలని, దోపిడీ లేని స్వేచ్ఛాయుతమైన బతుకు అందరికీ దక్కాలని, ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతికేరోజు ఈ నేల మీద సాధ్యమే అని చెప్పడానికి ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించడం మాకు స్ఫూర్తినిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఒక అక్రమ కేసులో బంధుమిత్రుల సంఘం వరంగల్ సభ్యురాలు కా. భారతిని అరెస్టు చేశారు. విరసం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులతో కలిపి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కా. గంటి ప్రసాదం మీద చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం తప్పుడు కేసు బనాయించారు.

ఈ దశాబ్ది సభలను ఈ తాజా నిర్బంధం సాక్షిగా, లక్షలాది సైనిక, అర్ధ సైనిక బలగాల దాడులను ఎదుర్కొంటూ ఆదివాసులు చేస్తున్న పోరాటం సాక్షిగా జరుపుకోవాలని తలపెట్టాం. ఈ యుద్ధ వ్యతిరేక ఆందోళనలో మాతోపాటు మీరంతా గొంతు కలపాలని కోరుతున్నాం. మేం ఈ దశాబ్దం పాటు అనేక ఆటుపోట్ల మధ్య పనిచేయగలిగామంటే అది మా కుటుంబాల సంసిద్ధత, ప్రయత్నం మాత్రమే కాదు. అమరుల స్ఫూర్తిని గౌరవించే అసంఖ్యాక మిత్రులు రకరకాల రూపాల్లో సాయం అందించి అండగా నిలవడం వల్లనే సాధ్యమైంది. ఎప్పటిలాగే ఈ సభలకు ఆర్థికంగా సాయం చేయాలని, నిర్వహణ పనుల్లో పాలుపంచుకోవాలని కోరుతున్నాం.

27, జూన్ 2012 అమరుల బంధు మిత్రుల సంఘం

నుండి ఇవ్వాళ ఆంధ్ర ఒడిశా సరిహద్దు జిల్లాల్లో మావోయిస్టు పార్టీ నాయకత్వాన సాగుతున్న విప్లవోద్యమం దాకా మాధవరావు దృఢంగా విప్లవ పంథానే అంటిపెట్టుకు వచ్చాడు. 1956 లోనే కమ్యూనిస్టు పార్టీ సంబంధాల్లోకి వెళ్లిన మాధవరావు నక్సల్బరీ వసంత మేఘగర్జనతో పెల్లుబికిన చారిత్రాత్మక శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటం వైపు సహజంగానే ఆకర్షితుడయ్యాడు. అజ్ఞాతంలోకి పోయాడు. అనారోగ్యానికి గురయ్యాడు. అయినా రహస్యంగానే ఉంటూ బెంగాల్ రాష్ట్రంలో జూట్‌మిల్ కార్మికునిగా గడుపుతూ పోలీసుల దృష్టిలోపడి అరెస్టయ్యాడు.

ఆసియా ఖండంలోనే అతి పెద్ద కుట్రకేసుగా చెప్పబడే పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిగా మాధవరావు ఏడు సంవత్సరాల కాలం విశాఖ సెంట్రల్ జైలు నిర్బంధంలో గడిపాడు. జైల్లోని విప్లవ శ్రేణుల్లో ప్రస్తుతం అవుతుండే మితవాద, అతివాద పెడధోరణులతో నిరంతరం రాజీలేని పోరాటం చేసేవాడు. జైలు నిర్బంధం నుండి బయటపడిన తరువాత బహిరంగ విప్లవోద్యమ ప్రచారకార్యక్రమాలలో అవిశ్రాంతంగా కృషి చేస్తూ వచ్చాడు. 1981లో నెల్లూరులో ఏర్పడిన 'ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం'కు గంజి రామారావు అధ్యక్షుడిగాను, మాధవరావు ఉపాధ్యక్షుడిగాను ఎన్నికయ్యారు 1992లో నాటి పీపుల్స్‌వార్ పార్టీతో పాటుగా నిషేధానికి గురయేంత దాకా. ఆ సంఘం ఉపాధ్యక్షుడిగా మాధవరావు కొనసాగాడు. 1996 మేలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ప్రతిఘటించడానికి ఏర్పడిన 'అఖిల భారత ప్రజాప్రతిఘటనా వేదిక' (ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్ - ఏఐపిఆర్ఎఫ్)కు మాదవరావు సహజంగానే వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఆ వేదిక మహాసభల కోసం అతడు నాలుగు నెలల పాటు కలకత్తాలో మకాం వేసి మరీ పనిచేసాడు. ఏఐపిఆర్ఎఫ్ అధ్వర్యంలోనే 1997లో ఢిల్లీలో జాతుల సమస్యపై చరిత్రాత్మకమైన అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఆ సదస్సును విజయవంతం చేయడంలో మాధవరావు కీలకపాత్ర పోషించాడు.

1997 తరువాత ఏడెనిమిది సంవత్సరాల కాలం మాధవరావు బొద్దపాడు గ్రామంలో ఉంటూ వివిధ ప్రజా సంఘాల కార్యక్రమాలను సమన్వయం చేస్తూ వచ్చాడు. విప్లవోద్యమం పట్ల గౌరవాభిమానాలతో ఉండే బొద్దపాడు ప్రజలు మాధవరావును ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. 'దిక్సూచి' ప్రచురణలకు చిరునామాగా ఉంటూ, విప్లవ సిద్ధాంత రాజకీయ ప్రచారానికి మాధవరావు చాలా కృషి చేసాడు. ఎవరూ మోయడానికి సాహసించని బరువు బాధ్యతలు కమ్యూనిస్టులే మోస్తారు అన్నట్లుగా విప్లవ ప్రజారంగ కార్యకలాపాలకు ఒక పెద్దదిక్కుగా ఉంటూ వచ్చాడు.

పెరుగుతున్న వయోభారంతో పాటు చిన్న చిన్నవే అయినా అనారోగ్య సమస్యలు కూడా తోడవడంతో చివరి సంవత్సరాలలో స్వగ్రామం జింకిభద్రలో ఉంటున్న చిన్న కూతురు క్రాంతి, మనుమరాలు జయంతిల సంరక్షణలో ఉంటూ వచ్చాడు. తాను పోయాక మామూలుగా తన శరీరం మట్టిపాలు కాకూడదనుకుంటూ, నలుగురికి ఉపయోగపడాలనుకుంటూ. తన మరణానంతర శరీరాన్ని ముందస్తుగానే వైద్యసంస్థకు దఖలుపరుస్తూ పోయాడు. గట్టిగా కదలాడలేని వార్ధక్య స్థితిలో కూడా మాధవరావు తన ఉద్యమకార్యాచరణను వదులుకోలేదు. జింకిభద్రలో చిన్నపాటి గ్రంథాలయ గదిని నిర్మింపజేశాడు. అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని నిర్మింపజేసి ఏటేటా మన్యెం పోరాట సంస్మరణ కార్యక్రమాలు నిర్వహింపజేశాడు. అలాగే ఆ గ్రామంలో ప్రతి సంవత్సరం మేడే కార్యక్రమాలు నిర్వహింపజేస్తూ వచ్చాడు.

మాధవరావు పెద్దగా చదువుకోలేదు అయితేనేమి, విప్లవ సిద్ధాంత రాజకీయాల అధ్యయనం, ఆచరణలందించిన జ్ఞానంతో రాణించాడు. ఏ విషయాన్నైనా సూటిగా, తేటగా, ధీటుగా మాట్లాడే మంచి వక్తగా అతడు ఎందరికో సుపరిచితుడు. తెలుగు, హిందీ, బెంగాలీ భాషల్లో సరళంగా, సూటిగా విప్లవ భావ ప్రచారం జేసేవాడు. సుదీర్ఘమైన అతని విప్లవ కార్యాచరణకు గౌరవసూచకంగా రివల్యూషనరీడెమోక్రాటిక్‌ఫ్రంట్-ఆర్.డి ఎఫ్ (విప్లవ ప్రజాస్వామ్య ఐక్య సంఘటన) తన మొదటి అఖిల భారత మహాసభలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించింది. గట్టిగా నాలుగడుగులు నడివలేని స్థితిలో సైతం ఆ మహాసభలకు అతడు పూనికతో హాజరయ్యాడు. మహాసభల ప్రారంభోపన్యాసంలో 'బహుశా ఇదే నా ఆఖరి ప్రసంగం కావొచ్చు' అన్నాడు. తనమాట తానే నిజం చేస్తూ, మరో వేదిక ఎక్కకుండానే మాధవరావు తన 85వ ఏట తుదిశ్వాస విడిచాడు.

1969 నాటి సోంపేట పోరాట కాలం (శ్రీకాకుళోద్యమం) నుండి నేటి సోంపేట థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల వ్యతిరేక పోరాటం దాకా మాధవరావు ఎప్పుడూ యువకులలో యువకుడిగా, యువతకే ఉత్తేజంగా ఉంటూ వచ్చాడు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని విప్లవోద్యమ అమరుల బంధుమిత్రుల కుటుంబాలవారందరికీ అతడు పెద్దదిక్కుగా ఉంటూ వచ్చాడు. రాష్ట్రంలో 'అమరుల బంధుమిత్రుల సంఘం (ఏబిఎంఎస్)' నిర్మాణంలో అతడు వ్యవస్థాపక పాత్ర పోషించాడు. గడిచిన 18, 19 జూలై 2012 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన దశాబ్ది మహాసభలకు హాజరు కాలేకపోతున్నందుకు మాధవరావు ఎంతో ఆవేదన పడ్డాడు. మహాసభల ప్రారంభ దినం 18వ తేదీ సాయంత్రమే అతడు అమరుడు కావడం అనేది కాకతాళీయమే అయినా గొప్ప ప్రాసంగిక ప్రాధాన్యతను సంతరించుకుంది. కనుక సహజంగానే మహాసభల రెండవ రోజైన 19వ తేదీ సభా వేదిక 'కామ్రేడ్ మాధవరావు స్మారకవేదిక' అయింది. నాటి సభాకార్యక్రమాలు మాధవరావు అమరత్వానికి ఘన నివాళుర్పిస్తూ చేసిన తీర్మానంతోనే ప్రారంభమయ్యాయి.

చివరి ఊపిరి దాకా పోరాడుతున్న ప్రజల పక్షానా, ప్రజా ప్రయోజనాల పక్షానా నిలబడుతూ, పోరాట ఎర్రజెండా ప్రతిష్టను కాపాడుకుంటూ వచ్చిన అమరుడు మాధవరావు విప్లవాశయం వృథా కారాదని ఆకాంక్షిస్తూ, వృథాకానివ్వబోమని హామీ పడుతూ అతడికి అశ్రు నివాళితో పాటు అమరుడికి జోహార్లర్పిద్దాం!

ఉద్యమాభినందనలతో
అమరుడు కామ్రేడ్ గోరుమాధవరావు
రక్తబంధువులు, ఆశయబంధువులు, ఆప్తమిత్రులు.

కరపత్రం

విప్లవోద్యమ అణచివేతలో భాగమే 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'లు!

అనువాదం - అమన్

(ఈ రోజు దేశవ్యాప్తంగా 'అభివృద్ధి' నమూనాపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. పాలక వర్గాలు 'అభివృద్ధి' అనే పేరుతో ప్రజలపై రుద్దాలని చూస్తున్న సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా దృఢంగా నిలబడ్డ ఉద్యమాల్లో ఒకటైన దండకారణ్య విప్లవోద్యమం అభివృద్ధికి సంబంధించిన ప్రజా ప్రత్యామ్నాయ నమూనాను కూడా ముందుకు తెస్తున్న వర్తమాన చరిత్ర మనలో చాలా మందికి తెలుసు. దండకారణ్య ఉద్యమాన్ని, మొత్తంగా మావోయిస్టు విప్లవోద్యమాన్ని అణచివెయ్యడానికి పాలకులు అనుసరిస్తున్న దమననీతిలో భాగమైన అనేక ఎత్తుగడల్లో 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం' ఒకటి. ముఖ్యంగా రాయ్‌పూర్, నాగ్‌పూర్‌ల నుండి వెలువడే హిందీ, మరాఠీ దినపత్రికల్లో, ప్రత్యేకించి జిల్లా ఎడిషన్‌లలో ప్రతి రోజూ ఈ కార్యక్రమం గురించిన ఫోటోలు, వార్తలు ఉండడం సర్వసాధారణంగా మారింది. మిలిటరీ ఫాటిగ్యూలలో సాయుధ బలగాల అధికారులు ముఖంపై పులుముకున్న చిరునవ్వుల్తో పేద ప్రజలకు ఏవేవో సామాన్లు ఇస్తున్న ఫోటోలను పత్రికలు ప్రముఖంగా ప్రచురిస్తున్నాయి. ప్రజలపై అమానుష అణచివేత దాడుల్ని కొనసాగిస్తూ, విచ్చలవిడి అరెస్టులు, చిత్రహింసలు, గృహదహనాలు, పంటల, ఆస్తుల విధ్వంసం, మహిళలపై లైంగిక అత్యాచారాలు వంటి ఆకృత్యాలన్నిటికీ పాల్పడుతూ, అదే సమయంలో ఈ దానధర్మాల కార్యక్రమాల్ని కూడా కొనసాగించడం ఈ రాజ్యం వంచనా శిల్పానికి చక్కని ఉదాహరణ. సామ్రాజ్యవాద ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా పాలకులు 'ప్రజల హృదయాల్నీ, మెదళ్ళనూ గెల్చుకోవడమ'నే ఎత్తుగడను తలకెత్తుకున్నారు. అణచివేత యుద్ధాల్లో 'మానసిక యుద్ధాని'కి వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉందని సామ్రాజ్యవాదులు పదే పదే ఉద్బోదిస్తున్నారు. అందులో భాగంగా వేల కోట్ల రూపాయలు నీళ్ళలా ఖర్చు చేస్తున్నారు. 'మానసిక యుద్ధం'లో భాగంగా ఇలాంటి పలు మోసపూరిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నేడు విప్లవోద్యమం సాయుధ అణచివేత దాడులతో పాటు 'మానసిక యుద్ధం'లో భాగమైన ఇలాంటి మోసకారి ఎత్తుగడలను కూడా ఎదుర్కొంటూ పురోగమిస్తోంది. వీటి గురించి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ చైతన్యవంతం చేస్తోంది. ఫిబ్రవరి 2012లో దండకారణ్యంలో హిందీ భాషలో ప్రచురించిన ఒక కరపత్రాన్ని ప్రజల్లో పెద్ద ఎత్తున పంచిపెట్టారు. దీన్ని చదవడం ద్వారా తెలుగు పాఠకలోకానికి దండకారణ్యంలో పాలకులు సాగిస్తున్న 'మానసిక యుద్ధం', దానికి జవాబుగా విప్లవకారులు చేస్తున్న 'విప్లవకర ప్రచార యుద్ధం' గురించి రేఖామాత్రంగా అర్థమవుతుంది. 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం' పచ్చి బూటకం! హంతక బలగాలు పంచే సామాన్లను విసిరికొట్టండి - అనే శీర్షికతో వెలువడ్డ ఈ కరపత్రం పూర్తి పాఠం ఇలా ఉంది. - **సంపాదకులు**)

అన్నలారా! అక్కలారా!

ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ సాయుధ బలగాలు నిర్వహించే 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'ల గురించి దిన పత్రికలన్నీ పతాక శీర్షికలతో వార్తలు రాస్తున్నాయి. వందలాది ఆదివాసుల రక్తంతో తడిచిన చేతులు పిల్లలు, వృద్ధులు, మహిళలు, పురుషులనే విచక్షణ లేకుండా విచ్చలవిడిగా లాఠీలు ఝుళిపించిన చేతులు, ఇటీవల ఎక్కడబడితే అక్కడ షామియానాలు వేసి, 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం' అనే బ్యానర్ తగిలించి, ప్రజలకు ఉచితంగా చిల్లర మల్లర సామాన్లు పంచుతున్నాయి. ఆదివాసుల ఇండ్లు తగులబెట్టడానికి, చేతికొచ్చిన పంటలను, ఇంట్లో, కళ్ళాల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని నాశనం చేయడానికి, మహిళలను అవమానించడానికి అలవాటైన చేతులిప్పుడు కంబళ్ళు, గిన్నెలు, సైకిళ్ళు, ఆట వస్తువులు, స్కూలు పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, పెన్సిళ్ళు వంటి సామాన్లు పంచుతున్నాయి. తమ చేతికి చిక్కిన వాళ్ళు అశక్తులా, అస్వస్థులా అని కూడా చూడకుండా లాఠీలు, తూటాలు ప్రయోగించే వాళ్ళు రోగగ్రస్తులకు వైద్యం, మందులు అందిస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారు. కూంబింగ్ ఆపరేషన్స్‌లో, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్‌లో భాగంగా గ్రామాల్లో దాడులు చేసి కనబడ్డ వాళ్ళపై గుళ్ళ వర్షం కురిపించి 'ఎన్‌కౌంటర్'గా చిత్రించి మృతులను 'ఇనామీ నక్సల్‌వాదీ'గా ప్రకటించే లైసెన్స్‌డ్ హంతకులు ఇప్పుడు 'సద్భావన' రాగం ఆలపిస్తున్నారు.

ఈ నాటకం అంతా ఎందుకు?

దండకారణ్యంలో, అంటే అవిభాజిత బస్తర్, గడ్చిరోలి ప్రాంతాల్లో గత 30 సంవత్సరాలుగా విప్లవోద్యమం కొనసాగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో, జల్-జంగల్-జమీన్‌పై ప్రజల హక్కు సహా దోపిడీ, పీడన, అణచివేతలన్నిటికీ వ్యతిరేకంగా ఈ ఉద్యమం మొదలైంది. ఈ పోరాట ఫలితంగా నేడు ప్రజలు గ్రామగ్రామాన తమదైన సర్కార్-క్రాంతికారీ జనతన సర్కార్ - ను నిర్మించుకొని తమ అభివృద్ధికి తామే బాటలు వేసుకుంటున్నారు. అటవీ శాఖ, రెవెన్యూ శాఖ, పేపర్‌మిల్ యాజమాన్యం, గ్రామాల్లో రాజ్యమేలే భూస్వామ్య శక్తులు సాగించే దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పలు పోరాటాలు చేపట్టి వాళ్ళ దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేశారు. వాళ్ళ విచ్చలవిడి దోపిడీని అదుపు చేశారు. అయితే తనను తాను 'ప్రజాస్వామ్యం'గా చెప్పుకునే రాజ్యం ఈ పోరాటాలపై ఎప్పుడూ పోలీసు, పారామిలిటరీ బలగాలతో

అణచివేతకే పాల్పడుతూ వచ్చింది. ఈ రోజున అది దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేసే పేరుతో యుద్ధాన్నే కొనసాగిస్తున్నది. దానినే 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'గా వ్యవహరిస్తున్నారు. ఇది వాస్తవానికి ప్రజలపై యుద్ధం. దేశంలోని సహజ సంపదలన్నిటినీ బడా, విదేశీ పెట్టుబడిదార్లకు కట్టబెట్టడం, ఈ దారిలో అడ్డంకిగా నిల్చిన వాళ్ళందరినీ ఏరిపారెయ్యడం ఈ యుద్ధం లక్ష్యం. ఈ అన్యాయ యుద్ధంలో భాగంగానే లోతట్టు ప్రాంతాల్లో సైతం కొత్త కొత్త క్యాంపుల్ని, పోలీసు స్టేషన్లను తెరుస్తున్నారు. దండకారణ్య వ్యాప్తంగా మోహరించిన పోలీసు, పారామిలిటరీ తదితర సాయుధ బలగాలన్నిటి సంఖ్య 60 వేలకు పైగా ఉంటుంది. రాష్ట్రాల పోలీసులు, ప్రత్యేక సాయుధ బలగాలతోపాటు సి-60 కమాండో, ఎస్‌టిఎఫ్, సిఆర్‌పిఎఫ్, కోబ్రా, బిఎస్ఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి, ఐఆర్‌బి వంటి అన్ని రకాల సాయుధ బలగాలనూ ఇక్కడ మోహరించారు. ఇప్పుడు 'శిక్షణ' పేరుతో భారత సైన్యానికి చెందిన ఒక బ్రిగేడ్‌ను కూడా మోహరించారు. దీనితో ఈ అన్యాయ యుద్ధంలో సైన్యం ప్రత్యక్షంగా పాలు పంచుకోగలదనే అనుమానం వాస్తవరూపం దాల్చబోతున్నట్టు స్పష్టమవుతుంది.

ఈ అన్యాయ యుద్ధంతో పాటుగానే దోపిడీ పీడకులు 'అభివృద్ధి' మంత్రాన్ని కూడా పదే పదే వల్లిస్తున్నారు. దీని పేరిట వేర్వేరు ప్యాకేజ్‌లు, పథకాలు ప్రకటించి వేల కోట్ల రూపాయల్ని కేటాయిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో 'అభివృద్ధి' పథకాల్ని అమలు చేయడం ద్వారా ఆదివాసులను మావోయిస్టు ఉద్యమంలో చేరకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న కుట్ర. ఈ విధంగా ప్రజల్లోంచి ఒక పెద్ద సెక్షన్‌ను బూటకపు అభివృద్ధి పథకాల చట్రంలో ఇరికించి ప్రజల్లో చీలికను తేవాలని దోపిడీ పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడి జల్-జంగల్-జమీన్‌ను చేజిక్కించుకొని బడా దళారీ పెట్టుబడిదార్లకు, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే తమ మౌలిక లక్ష్యం నెరవేరాలంటే ప్రజల సమైక్యతను దెబ్బతీయక తప్పదని వాళ్ళకు తెలుసు!

ప్రభుత్వాలు చేపడుతున్న బూటకపు సంస్కరణ పథకాలలో భాగంగానే పోలీసు, అర్ధసైనిక బలగాలు 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'ల పేరుతో కొంత డబ్బు ఖర్చు చేస్తూ ప్రజలకు సామాన్లు పంచుతున్నారు. వాస్తవంగా పంచుతున్న దానికంటే ఎన్నో రెట్ల ప్రచారం దిన పత్రికల ద్వారా సాగిస్తున్నారు. ఈ విధంగా ప్రజల్లోంచి కొందరిని వాళ్ళు తమ ఇన్‌ఫార్మర్స్‌గా లేదా ఏజెంట్లుగా తయారుచేసుకొని వాళ్ళ ద్వారా విప్లవోద్యమానికి, దాని సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన సమాచారం సేకరించాలని ప్రయత్నిస్తున్నారు. ఏ ఉద్యమాన్నైనా కేవలం లాఠీలతో, తూటాలతో అణచివెయ్యడం సాధ్యం కాదని పాలకులకు బాగానే తెలుసు. దౌర్జన్యపూరిత సల్వాజుడుం క్యాంపెయిన్‌కు ఏ గతి పట్టిందో వాళ్ళకు స్పష్టంగా తెలుసు. అందుకే వాళ్ళు తాము ప్రజల శ్రేయోభిలాషులుగా ఫోజు పెడుతూ ప్రజలను గందరగోళపర్చి కొందరిని తమవైపు తిప్పుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

ప్రియమైన ప్రజలారా!

దండకారణ్య చరిత్రను పరిశీలిస్తే తొలి నుండీ మన జీవితం పోరాటంతో లేదా తిరుగుబాటుతోనే ముడిపడిందనే విషయం అర్థమవుతుంది. దోపిడీ, పీడన, వివక్ష, అత్యాచారాలు, అవమానాలు వగైరా అన్నిటికి వ్యతిరేకంగా తిరుగుబాటు జెండానెత్తి మొదట ఇంగ్లిష్ వాళ్ళపై, 1947 బూటకపు స్వాతంత్ర్యం నుండి దేశీయ దోపిడీ పాలకులపై దండకారణ్య ప్రజలు ఎన్నో పోరాటాలు చేశారు. ఎంతో రక్తం చిందించారు. మన జీవితాల్లో ఏ మార్పయినా కేవలం పోరాటాల, త్యాగాల వల్లనే వచ్చింది. దోపిడీ ప్రభుత్వాల సంస్కరణ పథకాల వల్లగాని, వాళ్ళ కిరాయి సాయుధ బలగాల 'సివిక్ యాక్షన్ కార్యక్రమాల' వల్లగాని మన జీవితంలో మౌలిక మార్పు ఏనాడూ వచ్చింది లేదు, రాబోదు. మన మౌలిక సమస్యల పరిష్కారం ఈ వ్యవస్థను ఆమూలాగ్రంగా మార్చడంతో ముడిపడి ఉంది.

కాబట్టి పిడికెడు ఎంగిలి మెతుకులు విదిల్చి మనల్ని కొనివెయ్యగలమని దోపిడీ పాలకులు కంటున్న కలలను మనం భగ్నం చేయాలి. కిరాయి సాయుధ బలగాలు నిర్వహిస్తున్న 'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'లను మనం బహిష్కరించాలి. మనకు ఇవ్వ చూస్తున్న కంబళ్ళు, సైకిళ్ళు, గిన్నెలు మొదలైన సామాన్లను వాళ్ళ మొఖం మీదనే విసిరి కొట్టాలి. ఇదంతా మనల్ని శాశ్వతంగా బానిసలుగా కట్టి పడెయ్యడం కోసం జరుగుతున్న కుట్ర అని మనం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఇక్కడ లోహాండిగూడ, ధుర్లి-భాంసి, చార్‌గాం, బోధ్‌ఘాట్, రావ్‌ఘాట్, ఆమ్‌దాయిమెట్ట, కువ్వెమారి, బుధియారీమాడ్, సూర్జాగడ్ మొదలైన ప్రాంతాల్లో దోపిడీ కంపెనీలు నేటికీ మన జల్-జంగల్-జమీన్‌ను కొల్లగొట్టలేక పోతున్నాయంటే దానికి కారణం విప్లవోద్యమ నాయకత్వంలో సంఘటితమైన ప్రజలు సాగిస్తున్న పోరాటమే. ఈ రోజు మనకు కంబళ్ళు, గిన్నెలు, డబ్బాలు, బ్యాగులు పంచుతున్న వాళ్ళు నిజానికి ఇక్కడి భూములను, ఖనిజ సంపదల్ని కొల్లగొట్టడానికి వేగిర పడుతున్నారనే విషయం మనం మర్చిపోవద్దు. ఈ రోజు మనకు మందులు పంచిపెడుతున్న వాళ్ళు నిజానికి దళారీ పెట్టుబడిదార్లతో, విదేశీ కంపెనీలతో కుదుర్చుకున్న రకరకాల ఒప్పందాల కింద మనల్ని మన భూముల నుండి, అడవుల నుండి తరిమికొట్టడానికి త్వరపడుతున్నారని మరిచిపోవద్దు. వాళ్ళు పంచే సామాన్లు తీసుకోవడమంటే మన ఆత్మగౌరవానికి మనమే చేటు చేసుకున్నట్టు. వాళ్ళ ముందు చేతులు చాచడమంటే లక్షలాది ప్రజల వీరోచిత పోరాటాలను, ప్రేరణాస్పద త్యాగాలను అవమానించడమే.

కనుక రండి!

పాలకుల కుట్రలను ఓడిద్దాం!
వాళ్ళ ఎత్తుల్ని చిత్తు చేద్దాం!
'సివిక్ యాక్షన్ ప్రోగ్రాం'ల బహిష్కరణకై
గొంతెత్తి నినదిద్దాం!

విజ్ఞప్తి

యుద్ధ వ్యతిరేక స్వరాలు - ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా కొత్త శీర్షిక

ప్రియమైన మిత్రులారా,

గత మూడేళ్ళుగా ఆదివాసులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న యుద్ధం గురించి మీకు తెలిసిందే. ముఖ్యంగా చత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, బీహార్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలోని ఆదివాసీ ప్రాంతాల్లో లక్షలాది అర్ధ సైనిక బలగాలు మోహరించాయి. గ్రీన్‌హంట్ మొదటి దశ పూర్తయి, ఇప్పుడు రెండో దశ నడుస్తోందని కేంద్ర హోంశాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. ఆదివాసులపై దారుణమైన యుద్ధాన్ని తీవ్రం చేస్తూ ప్రభుత్వం నేరుగా సైనిక బలగాలను కూడా తరలిస్తోంది. మూడేళ్ళ కిందటే రాయపూర్‌లో సైనిక హెడ్‌క్వార్టర్లను, వాయుసేన హెడ్ క్వార్టర్లను ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో ఆదివాసులను అణచివేయడానికి యూనిఫైడ్ కమాండ్లను ఏర్పాటు చేసి వాటికి సైనిక అధికారులే నేరుగా నేతృత్వం వహిస్తున్నారు. ఈ అణచివేతను దీర్ఘకాలంపాటు కొనసాగించడానికి అనువుగా సైనిక శిక్షణ శిబిరాలను కూడా ఆదివాసీ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. గత మూడేళ్ళుగా ఆదివాసీ స్థావరాలపై దాడులు చేయడానికి మానవ రహిత విమానాలను ఉపయోగిస్తున్నారు. శత్రుదేశాలపై ప్రయోగించే వైమానిక దాడులనూ, సరిహద్దుల్లో యుద్ధం సందర్భంలోనూ వినియోగించే సైన్యాన్ని ఆదివాసులపై విచ్చలవిడిగా ప్రయోగిస్తున్నారు.

వీటన్నిటికి పరాకాష్టగా నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ (ఎన్‌సిటిసి) ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేవలం కాంగ్రేసేతర ముఖ్యమంత్రుల రాజకీయ స్వప్రయోజన వైఖరి వల్లనే తాత్కాలికంగా ఇది వాయిదా పడింది. అమెరికా ప్రత్యక్ష పర్యవేక్షణలో దేశంలోని ఇంటెలిజెన్స్ సంస్థలన్నీ ఎన్‌సిటిసి కిందికి తీసుకరావడానికి 2012 మే 5న కేంద్ర హోంశాఖ సమావేశం జరిపింది. దీని ప్రకారం కేవలం మావోయిస్టులను, ఆదివాసులనేగాక ముఖ్యంగా ముస్లింలను, ఇతర ప్రజాస్వామిక పోరాట శక్తులను టెర్రరిస్టులనే పేరుతో అణచివేస్తారు.

ఈ వర్తమాన చరిత్ర గురించీ, దీర్ఘకాల అణచివేత దృష్టితో పాలకులు చేస్తున్న ఈ సన్నాహాల గురించి సుప్రసిద్ధ మేధావి, రచయిత యాన్‌మిర్డాల్ మాటల్లో చెప్పాలంటే - భారతదేశంలో అంతర్యుద్ధం నడుస్తోంది. ఈ యుద్ధం ప్రజలపై పాలకులు చేస్తున్న యుద్ధమని ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్‌లాంటి వాళ్ళు ఎందరో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. అఖిల భారత స్థాయిలో ప్రజాస్వామికవాదులు ఈ యుద్ధం తగదని తమ నిరసన స్వరాన్ని వినిపిస్తున్నారు.

తాజాగా జూన్ 28న చత్తీస్‌గఢ్‌లోని బాసగూడాలో ఆదివాసుల సభపై వందలాది మంది సాయుధ సిఆర్‌పిఎఫ్ బలగాలు మూకుమ్మడిగా దాడిచేసి 17 మందిని హత్య చేశాయి. మావోయిస్టు రాజకీయాలపై మన మన వైఖరులతో సంబంధం లేకుండా ఆదివాసులపై జరుగుతున్న ఈ యుద్ధం రేపొద్దున తప్పక ప్రజలందరిపై యుద్ధంగా, ప్రజాస్వామిక ఉద్యమాలన్నిటిపై దాడిగా ముదిరిపోతుందనే ప్రజాస్వామిక అవగాహన తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలకు ఉంది.

గతంలో గుజరాత్‌లో ముస్లింలపై హిందుత్వశక్తులు జాతిహననానికి పాల్పడినప్పుడుగాని, ఆఫ్ఘన్, ఇరాక్‌లపై అమెరికా యుద్ధం చేసినప్పుడుగాని తెలుగు రచయితలు, కళాకారులు పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమం చేసిన చరిత్ర ఉంది. విప్లవ రచయితల సంఘాన్ని నిషేధించినప్పుడు కూడా తెలుగు రచయితలు విరసం భావజాలంతో ఉన్న భిన్నాభిప్రాయంతో నిమిత్తం లేకుండా ఒక సాహిత్య సంస్థను నిషేధించడం భావప్రకటనా స్వేచ్ఛకు తీవ్ర అవరోధమని భావించి ప్రజాస్వామికంగా స్పందించారు. ఇవి కొన్ని మాత్రమే. ఇప్పుడు తాజాగా విప్లవ ప్రజాస్వామిక సంఘటన అనే అఖిల భారత ప్రజాసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. రాజకీయ విశ్వాసాలను, రాజకీయ ప్రచార స్వేచ్ఛను, సంఘం పెట్టుకొనే స్వేచ్ఛను రాజ్యాంగం గౌరవిస్తున్నా పాలకులు తమ నిషేధ సంస్కృతిని విడనాడడం లేదు.

ఆదివాసులు ఈ దేశ ప్రాచీన సంస్కృతీ నిర్మాతలుగా, తరతరాలుగా ఆధిపత్యశక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న యోధులుగా, ముఖ్యంగా సామ్రాజ్యవాదానికి తలవంచని ధిక్కారపీఠులుగా ఈ వర్తమానంలో కూడా సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు ఈ దేశ సహజసంపదను కొల్లగొట్టుకపోకుండా తమ ప్రాణాలు ఒడ్డి పోరాడుతున్నారు. ఆదివాసులకు జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో పోరాడిన సుదీర్ఘ చరిత్ర ఉన్నది. బహుళజాతి కంపెనీలు సహజ వనరులను కొల్లగొట్టుకోడానికి చేస్తున్న ప్రయత్నాలను ఆదివాసులు తమ అకుంఠిత పోరాట దీక్షతో ఎదురిస్తున్నారు. తమ అభివృద్ధిని తామే నిర్వచించుకొని జనతన సర్కార్‌ను నిర్మించుకుంటున్నారు. ప్రజల క్రియాశీల భాగస్వామ్యం, ప్రజలకే రాజ్యాధికారం అనే ప్రజాస్వామిక, విప్లవ విలువను తమ స్థావరంలో నిజం చేస్తున్నారు. అందువల్లే ఈ యుద్ధం.

ఈ ప్రత్యేక యుద్ధ సమయంలో సాహిత్యకారులుగా మనం వ్యవస్థపట్ల, రాజ్యం పట్ల మన నిరసనను ఒక వేదిక మీద వినిపించడానికి అరుణతార ఈ శీర్షికను నిర్వహించాలనుకుంటుంది. మీరు కవిత్వం, పాట, వ్యాసం, వ్యాఖ్య, విశ్లేషణ.. ఏ రూపంలోనైనా రాసి పంపగలరని మనవి. ఈ శీర్షిక మన ధిక్కారానికి స్వరం కూర్చేదిగా ఉండాలని మా ఆకాంక్ష. ఇది మనందరి ఆకాంక్ష. మీ రచనలకు సాదర ఆహ్వానం.

డి.వి. రామకృష్ణారావు

- ఎడిటర్, సంపాదకవర్గం తరపున

అరుణతార

పి. వరలక్ష్మి,

విరసం రాష్ట్ర కార్యదర్శి

-: స్వీకారం :-

'వన' జనపథం
హక్కుల న్యాయవాది
ఎం.ఏ. వనజ స్మృతిలో

ప్రచురణ :
దిశ సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్

వెల : రు. 100/-

పేజీలు : 128



లక్ష్మింపేట
విరసం కవిత్వం, పాట

ప్రచురణ :
విరసం సిటీయూనిట్

వెల : రు. 25/-

పేజీలు : 48



లక్ష్మింపేటా..!
విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో
రచయితల నిజనిర్ధారణ బృందం నివేదిక

ప్రచురణ :
విరసం సిటీయూనిట్

వెల : రు. 25/-

పేజీలు : 56



ఆంధ్రప్రదేశ్‌లో
వ్యవసాయ ఉత్పత్తి
సంబంధాలు
సామాజిక పరిశోధన కోర్ గ్రూప్

ప్రచురణ :
విరసం

వెల : రు. 30/-

పేజీలు : 72



ఎస్సీ ఎస్టీ నిధులు:
విదిలింపు - మళ్లింపు

రచయిత :
బొజ్జా తారకం

ప్రచురణ :
రిపబ్లికన్ పబ్లికేషన్స్

వెల : రు. 40/-

పేజీలు : 88



ఎస్సీ ఎస్టీలపై అత్యాచారాలు
పోలీసు-కోర్టులు-ఎలా పనిచేస్తున్నాయి?

రచయిత :
బొజ్జా తారకం

ప్రచురణ :
రిపబ్లికన్ పబ్లికేషన్స్

వెల : రు. 50/-

పేజీలు : 118



ఉగ్గుపాలు
పిల్లల కథలు

రచయిత :
భూపాల్

ప్రచురణ :
వెన్నెల ప్రచురణలు

వెల : రు. 100/-

పేజీలు : 190



వస్తవా పోతవా చిలకల్ల కొలికి
పిల్లల పాటలు

రచయిత :
భూపాల్

ప్రచురణ :
వెన్నెల ప్రచురణలు

వెల : రు. 50/-

పేజీలు : 68

ఆదివాసీ వీరుడు
కొమురం భీమ్
పిల్లల నవల

రచయిత :
భూపాల్

ప్రచురణ :
వెన్నెల ప్రచురణలు

వెల : రు. 50/-

పేజీలు : 83

భూం పాప పాటలు

రచయిత :
భూపాల్

ప్రచురణ :
వెన్నెల ప్రచురణలు

వెల : రు. 30/-

పేజీలు : 32

మనసులోని చలి

రచయిత :
ముక్తవరం పార్థసారధి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 60/-

పేజీలు : 97



మీరే డిటెక్టివ్
కాలక్షేపానికి పొడుపు కథలు

రచయిత :
ముక్తవరం పార్థసారధి

ప్రచురణ :
వికాసం బుక్స్

వెల : రు. 80/-

పేజీలు : 121



నేలను కాపాడుకునే
విధానాలు

రచయిత :
డి.కె. దాసు

ప్రచురణ :
మంచి పుస్తకం
సెరెనా ఫౌండేషన్
ఎస్.సి.ఎస్.టి.సి.

పేజీలు : 160

మన అమూల్య వారసత్వం
జీవ వైవిధ్యం

రచయిత :
డా. ఎం. ఎ. హక్

ప్రచురణ :
మంచి పుస్తకం
సెరెనా ఫౌండేషన్
ఎస్.సి.ఎస్.టి.సి.

పేజీలు : 107



పెట్టుబడిదారీ విధానం
ఒక ప్రేతాత్మకథ

రచయిత :
అరుంధతీ రాయ్

ప్రచురణ :
మలుపు బుక్స్

వెల : రు. 25/-

పేజీలు : 44

KLVA101M161 BC

...Literary and Cultural Telugu Monthly
● RNI Regn.No.21152/72

Journal of Revolutionary Writers' Association (VIRASAM)
● Published on 17/10/2012 293 - July - August, 2012

గ్రీన్‌హంట్‌ను వ్యతిరేకిద్దాం!

జనతన సర్కారుకు అండగా నిలబడదాం!

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M161
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Brahmanuthe
స్కాన్ చేసినది	TPSCH
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.